వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 16 సంచిక : 2 హైదరాబాద్ 199 ఫిబ్రవరి 2018 పేజీలు : 68 రు. 25

* న్యాయవ్యవస్థ సంక్షోభం - పూర్వాపరాలు
* తెలంగాణలో పౌరహక్కులు - బహిరంగ లేఖ
* కోరేగావ్ పోరాటం చెపుతున్నదేమిటి?
* ముస్లిం మహిళలపై ప్రభుత్వ కపట ప్రేమ
* ప్రజల సొమ్ము లూటీ చేసే ఎఫ్ఆర్‌డిఐ
* శ్రామిక అర్థశాస్త్రం ప్రథమ పాఠాలు
* జెరూసలేం, కొరియా - ఐరాస వైఫల్యం

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్‌లో వీక్షణం విడి(ప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ	హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్ స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
పస్ట్ లక్కీ పాన్ షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్ స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్ స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్ స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్ స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్ స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
రెడ్డి బుక్‌స్టాల్	అశోక్‌నగర్, హైదరాబాద్	
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమాండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహిదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలెబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
(శ్రీలక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
లక్ష్మణ్	చిక్కడపల్లి, హైదరాబాద్	93910 12051
మల్లిఖార్జున్ బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
బాల్‌రెడ్డి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	98660 18829
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
సాయిగణేష్ బుక్‌స్టాల్	టు టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, కరీంనగర్	93979 94268
మహాలక్ష్మి బుక్‌స్టాల్	సిటీ బస్‌స్టాండ్, హన్మకొండ చౌరస్తా, వరంగల్	99893 30297
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్ స్టాల్, కూల్ (డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్ స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
గణేష్ పుస్తక (ప్రదర్శన	గాంధీ రోడ్, (ప్రొద్దటూరు	
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మై(త్రీ బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్ సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేం(ద బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీసత్యసాయి బుక్‌స్టాల్	ఆర్‌టిసి కాంప్లెక్స్, రాజమం(డి	73860 66226, 94419 07321

199 ISSN 2231-6892

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఫిబ్రవరి 2018
సంపుటి : 16
సంచిక : 2

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై 'VEEKSHANAM' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2018 జనవరి నెలలో వచ్చిన విరాళాలు - హైదరాబాద్‌లో శ్రేయోభిలాషుల నుంచి సేకరించినవి - రు. 10,000; శ్రేయోభిలాషి, - రు. 50,000; ఎ. నర్సింహారెడ్డి, జనగాం - రు. 5000; ఎ. రాజేంద్రబాబు, మహబూబ్‌నగర్ - రు. 5,000; బి.ఎస్. రాజు, హైదరాబాద్ - రు. 5,000; శ్రేయోభిలాషి - రు. 6000; గుర్రం ప్రదీప్తి, కరీంనగర్ - రు. 2,000; కడియాల సుబ్బనాచారి, నెల్లూరు - రు. 2,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

జనవరి 2018 సంచికలో 'కా.కె ఎస్.తో అనుభవాలు' బీవీ సుబ్బారావు రచన బాగుంది. ఇలాంటి అనుభవాలు పొందిన వారు చాలా మంది ఉన్నారు. ఇలానే తమ అనుభాలను రచించాలని కోరుతున్నాను. ఒక మంచి చారిత్రక సంఘటనలను అందరికీ పంచిన రచయిత సుబ్బారావు గారికి అభినందనలు. ఇటు వంటివి ప్రస్తుతం సమాజానికి చాలా అవసరం.

- ఎస్.కె. అబ్దుల్ కరీం,
టిపిఎఫ్, సూర్యాపేట

వీక్షణం పదహారో జన్మదిన ప్రత్యేక సంచిక ఆద్యంతం ఆకట్టుకుంది. సామరస్య పరిష్కారం దిశగా ఆదివాసి – లంబాడీ వివాదం, ప్రజల సొమ్ము ప్రజలకివ్వడం ఎవరి పేరుమీద? ఆకట్టుకున్నాయి. సంపాదకీయ వ్యాఖ్యలు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నేతలకు చెంపపెట్టులా ఉంది. 'ప్రపంచ వ్యాపార ఔత్సాహిక సదస్సు' వాస్తవికతకు అద్దం పట్టింది. ఆర్భాటం జాస్తి ఆచరణ నాస్తిలా ఉంది ప్రభుత్వంతీరు. అంపశయ్య ఆర్‌టిసి వ్యాసం కుండ బద్దలు కొట్టింది.

- బిక్కునూరి రాజేశ్వర్
పొన్కల్, నిర్మల్

వీక్షణం జనవరి 2018 ప్రత్యేక సంచికలో 'గుజరాత్ బిజెపీ గెలుపూ ఓటమీ' వ్యాసం వాస్తవాలను చిత్రించి ఆలోచింపజేసేదిగా ఉంది. బిజెపి గెలుపు కోసం ప్రధాని నరేంద్ర మోడీ చేయని ప్రయత్నమంటూ లేదు. అధికారం కోసం తప్ప ప్రజాభివృద్ధికి చేసిందేమీ లేదనే విషయం తేటతెల్లమైంది. వీక్షణం మాసపత్రిక తెలుగు సమాజంలో పదహారు సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా శుభాకాంక్షలు.

- కిరణ్
కోదాడ

26వ జాతీయ నాస్తిక మేళా

ఫిబ్రవరి 10, 11 తేదీలలో గుంటూరు జిల్లా, మంగళగిరి సమీపంలోని చార్వాకాశ్రమంలో 26వ జాతీయ నాస్తిక మేళా జరుగనుంది.

10-2-2018, శనివారం, ఉదయం 9 గంటలకు ప్రారంభం

స్వాగతం : **జి.డి. సారయ్య,** ప్రజా నాస్తిక సమాజం
ప్రారంభకులు : **ఈడ్పుగంటి నాగేశ్వరరావు,**
భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు
అంశం : **జాతీయత – సామాజిక న్యాయం**
అధ్యక్షులు : **షేక్ జిలానీ బేగం,** నాస్తిక సమాజం
అంశం : **మహిళా విముక్తికై హేతువాదం**
వక్త : **సి. విజయ,** స్త్రీ విముక్తి సంఘటన
అంశం : **మూఢ విశ్వాసాల వ్యాప్తిలో మత ప్రవచనకర్తలు**
వక్త : **పి. సుబ్బరాజు,**
కన్వీనర్, మూఢ నమ్మకాల నిరోధక చట్ట సాధన సమితి.

భోజన విరామం

అధ్యక్షులు : **కె. అయ్యన్న,** నాస్తిక సమాజం
అంశం : **భారతీయ సమాజం – కుల ప్రభావం**
వక్త : **డా. బి.వి. రాఘవులు,**
అధ్యక్షులు, మార్క్స్–అంబేద్కర్ అధ్యయన వేదిక
అంశం : **నేటి రాజ్యంలో మతోన్మాద ప్రభావం**
వక్త : **డా. కత్తి పద్మారావు**
ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం పూర్వ కార్యదర్శి
అంశం : **బాల బాలికలు – హేతువాదం**
వక్త : **సిపోర,** చైతన్య మహిళా సంఘం

ఊరేగింపు సాయంత్రం 4 గంటలకు

11-2-2018, ఆదివారం, ఉదయం 9 గంటలకు ప్రారంభం

స్వాగతం : **ఆరుకట్ల ఆంజనేయులు,** నాస్తిక సమాజం
అధ్యక్షులు : **సి.ఎచ్. శివారెడ్డి,** నాస్తిక సమాజం
అంశం : **శ్రామిక ఉద్యమాలు – భౌతిక దృక్కోణం**
వక్త : **జె. కిషోర్‌బాబు,** రాష్ట్ర కార్యదర్శి, ఎఐఎఫ్‌టియు. (న్యూ)
అంశం : **జాషువా సాహిత్యం – హేతువాద భావజాలం**
వక్త : **కోయి కోటేశ్వరరావు,** లెక్చరర్

భోజన విరామం

అధ్యక్షులు : **డా. భానుప్రసాద్,** తెలంగాణ హేతువాద సంఘం
అంశం : **దేశభక్తి – జాతీయవాదం**
వక్త : **సి. కాశీం,** విప్లవ రచయితల సంఘం
అంశం : **నాస్తికత్వం – ఆచరణ**
వక్త : **ఎం.ఎన్. బుద్ధ,** నాస్తిక సమాజం
అంశం : **దళిత ఉద్యమాలకు అండగా హేతువాదం**
వక్త : **ఎస్.వి. రమణ,** కన్వీనర్, దళిత విముక్తి

కార్యదర్శి నివేదిక : **మోతుకూరి అరుణకుమార్**
వందన సమర్పణ : **సత్య నిర్ధారణ్**

నాస్తిక సమాజం

వివరాలకు : **బి. సుధాకర్,** చార్వాకాశ్రమం, నిడమర్రు పోస్ట్, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా. సెల్: 9290619550

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

హిందూత్వ దుర్మార్గానికి ప్రతీక భీమా కోరేగావ్

జనవరి 1కి ముందూ, ఆరోజూ, ఆ తర్వాతా మహారాష్ట్ర లోని భీమా కోరేగావ్ లోనూ, పుణె, ముంబైలతో సహా ఇతర నగరాల్లోనూ సాగిన ఆందోళనలు, విధ్వంసకాండ హిందూత్వ శక్తుల విచ్చలవిడి విద్వేష హింసా రాజకీయాలకు మరొక నిదర్శనంగా నిలుస్తాయి. భీమా కోరేగావ్ చరిత్ర గురించి ఎవరికి ఏ అభిప్రాయాలైనా ఉండవచ్చు. రెండు వందల సంవత్సరాల కింద ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాలకూ, రెండవ బాజీరావు పీష్వా మరాఠా సైన్యాలకూ జరిగిన ఆ యుద్ధంలో పీష్వా సైన్యాల ఓటమి మహర్ల (దళితుల) విజయమని అనుకునేవాళ్లు ఉండవచ్చు. అది స్థానిక ప్రభువు మీద వలసవాద సైన్యాల విజయమని, తద్వారా దేశంలో బ్రిటిష్ పాలన సుగమం కావడానికి ఒక మెట్టు అని అనుకునేవాళ్లూ ఉండవచ్చు. గతం వర్తమానంతో జరిపే నిరంతర సంభాషణే చరిత్ర గనుక ఆ సంభాషణను ఎవరైనా ఎట్లాగైనా అక్షరీకరించవచ్చు, వ్యాఖ్యానించవచ్చు. అటు బ్రిటిష్ సైన్యంలో మహర్లతో పాటు ఇతర కులాల సైనికులు కూడ ఉన్నప్పుడు, భీమా కోరేగావ్ కేవలం మహర్ల విజయమే ఎలా అవుతుందనీ, ఇటు పీష్వా సైన్యంలో బ్రాహ్మణులు అల్పసంఖ్యాకులే అయినప్పుడు, ఇతర కులాల వారు, బహుశా దళితులు కూడ ఉండే అవకాశం ఉన్నప్పుడు ఆ యుద్ధాన్ని కుల సమీకరణాల్లోకి కుదించవచ్చునా అనీ ప్రశ్నించవచ్చు. చరిత్ర పొడవునా ఎప్పుడైనా పాలకులు తమ యుద్ధాలకు ముడిసరుకులుగా, బలిపశువులుగా వాడుకున్నది పీడితులనే కదా, పీడితులలో బతుకు దుర్భరమైనవాళ్లే ప్రాణాలు పోగొట్టుకోవడానికి సిద్ధపడే సైనికులుగా మారుతారు గదా, పీడితులు ఎప్పుడైనా తమకోసం తాము యుద్ధం చేసుకున్నారా వంటి ప్రశ్నలూ వేయవచ్చు.

కాని భీమా కోరేగావ్ ఇవాళ ఒక చారిత్రక దస్తావేజు మాత్రమే కాదు. ఉన్నది ఉన్నట్టు మాత్రమే చదవడానికి అవకాశం లేదు. ఉండవలసిందంతా రాసిపెట్టే అవకాశం ఉన్నదనుకోవడానికీ లేదు. ఉన్నదంతా అక్షరాలా నిజమే అనుకోవడానికీ లేదు. భీమా కోరేగావ్ ఇవాళ ఒక ప్రతీక. అన్ని ప్రతీకల విషయంలో జరిగినట్టుగానే దాని విషయంలోనూ కాలం ఎంతో జల్లెడపట్టి ఉంటుంది. ఎన్నో ఉద్వేగ అంశాలు చేర్చి ఉంటుంది. ఎన్నో అంశాలను తొలగించి ఉంటుంది. ఇవాళ దాన్ని ప్రజల్లో ప్రచలితంగా ఉన్న ప్రతీకగా మాత్రమే స్వీకరించడం సముచితం. అంతకన్న ముఖ్యంగా ఇవాళ ఆ ప్రతీకకు ఎదురుగా ఎవరు మోహరించి ఉన్నారో, దాన్ని సమర్థిస్తున్నవాళ్లు దాని నుంచి ఏ అర్థాలు గ్రహిస్తున్నారో అవే ప్రధానం అవుతాయి. చరిత్రలో వాస్తవంగా జరిగిన ఒక అంశానికే భిన్నమైన పఠనాలతో, వివరణలతో, వ్యాఖ్యానాలతో దాని వాస్తవికత మీద, దాని అర్థాల మీద ప్రశ్నలు ఉత్పన్నమయే స్థితి ఏ సమాజంలోనైనా ఉంటుంది. భీమా కోరేగావ్‌లో 1818 జనవరి 1న ఏమి జరిగింది, ఏమి జరిగే అవకాశం ఉండింది, ఏమి జరిగిందని ఏయే వ్యాఖ్యాతలు తమ తమ దృక్కోణాల నుంచి ఏమి రాశారు అనేవి ఒక సంక్లిష్టమైన వివరణా, విశ్లేషణా చట్రంలోకి వస్తాయి. అందువల్ల ఆ ఘటనల నిజానిజాల కన్న ఎక్కువగా ఆ గత ఘటనల గురించి వర్తమానంలో ఏ వ్యాఖ్యానానికి ప్రాసంగికత ఉంది, ఆ ఘటనల కొనసాగింపు ఎలా సాగుతున్నది, ఆ ఘటనల పర్యవసానాలు ఇవాళ ఎట్లా వ్యక్తమవుతున్నాయి అనేవే కీలకమైన ప్రశ్నలు అవుతాయి.

బ్రిటిష్ సైన్యంలో సైనికులుగా ఉన్నప్పుడు, పీష్వా సైన్యాలను ఓడిస్తున్నప్పుడు, ఆ మహర్ సైనికులకు తాము వలసవాదుల ప్రయోజనాలను నెరవేరుస్తున్నామని తెలిసి ఉండకపోవచ్చు. పీష్వాల హిందూ బ్రాహ్మణీయ పాలన దుర్భరత్వాన్ని అనుభవిస్తుండడం వల్ల రాజును ఎదిరించడానికి బందిపోటుతో చేరినా సరే అనిపించి ఉండవచ్చు. అసలు అది కూడ అనిపించకుండా కేవలం భుక్తి కోసమే సైనికులుగా మారి కూడ ఉండవచ్చు. కాని ఆ తర్వాత ఆ బ్రిటిష్ పాలకులే మహర్లను సైన్యంలోకి తీసుకోవడానికి నిరాకరించినప్పుడు, మహర్ లు యుద్ధజాతి కాదని ప్రకటించినప్పుడు, భీమా కోరేగావ్ స్థూపం మీది మహర్ల పేర్లు కొత్త అర్థం సంతరించుకున్నాయి. ఆ యుద్ధానికి, విజయానికి ఒక కొత్త పఠనం, ఒక కొత్త వ్యాఖ్యానం మొదలయ్యాయి. డా. అంబేద్కర్ మహర్ల ఔన్నత్యాన్ని చెప్పడానికి, వారిలో పోరాట స్ఫూర్తి రగుల్కొల్పడానికి ఈ ప్రతీకను వాడుకున్నారు. అలా తొంభై సంవత్సరాలుగా ఆ ప్రతీక కొత్త అర్థంలో కొనసాగుతున్నది. ఈ సంవత్సరం భీమా కోరేగావ్ యుద్ధానికి రెండువందల సంవత్సరాలు నిండిన సందర్భంగా సంస్మరణ పెద్ద ఎత్తున జరపాలని దళిత సంస్థలు నిర్ణయించాయి.

నానాటికీ పెచ్చరిల్లుతున్న సంఘ్ పరివార్ హిందూ బ్రాహ్మణీయ మతోన్మాద, మత విద్వేష రాజకీయాల సందర్భంలో ఆ ప్రతీక మరొకసారి కొత్తగా ఆవిష్కృతమవుతున్నది. మహారాష్ట్ర సమాజంలో ఒకవైపు సంఘపరివార్ భావజాలం, మరొకవైపు మరాఠా జాతీయోన్మాదం చెలరేగుతున్న సమయంలో దళితుల పోరాట చైతన్యాన్ని సమీకరించడానికి భీమా కోరేగావ్ ఒక చిహ్నంగా మారింది. రాష్ట్రమంతటి నుంచీ భీమా కోరేగావ్‌కు యాత్రలు, గ్రామాలలో దళిత, బహుజన, విప్లవ, ప్రగతిశీల భావాలు ప్రచారం చేస్తూ అంతిమంగా కోరేగావ్‌కు చేరే పది రోజుల, పదిహేను రోజుల యాత్రలు ప్రారంభమయ్యాయి. ఈ విస్తరిస్తున్న దళిత చైతన్యాన్ని అడ్డుకోవడానికి, భీమా కోరేగావ్ సంస్మరణను అడ్డుకోవడానికి హిందూత్వ సంస్థలు కుట్రలు ప్రారంభించాయి. శివ్ ప్రతిష్ఠాన్ హిందుస్తాన్ నాయకుడు శంభాజీ భిడె, హిందూ జనజాగృతి సమితి నాయకుడు మిలింద్ ఎక్బోటె యువకులను దళితులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టారని, హింసకు ప్రేరేపించారని ఆధారాలున్నాయి. భీమా కోరేగావ్ సంస్మరణకు అడ్డంకులు కల్పించడంలో భాగంగా ఈ సంస్థలు సమీపంలోని వధు బుద్రుక్ అనే గ్రామంలో మూడు వందల సంవత్సరాల నాటి సమాధిని తవ్వేసి, విధ్వంసం సృష్టించాయి. ఆ సమాధి గోవింద్ గైక్వాడ్ అనే మహర్‌ది. శివాజి పెద్ద కొడుకు శంభాజీని 1689లో ఔరంగజేబు హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుముక్కలుగా నరికి, నదిలోకి విసిరినప్పుడు, ఆ మృతదేహానికి అంత్యక్రియలు జరపడానికి కూడ భయంతో ఎవరూ ముందుకు రానప్పుడు గోవింద్ గైక్వాడ్ ఆ మృతదేహపు ముక్కలన్నిటినీ ఒక్కదగ్గరికి చేర్చి అంత్యక్రియలు జరిపించాడని స్థానిక గాథలు చెపుతాయి. ఆ స్థలంలో స్థానిక మహర్ లే శంభాజీకి ఒక స్మారక చిహ్నం నిర్మించారు. గోవింద్ గైక్వాడ్ మరణించిన తర్వాత ఆయనకు కూడ సమాధి నిర్మించారు. ప్రస్తుతం భీమా కోరేగావ్ సంస్మరణకు కొద్ది రోజుల ముందు హిందూత్వ మూకలు ఆ సమాధిని ధ్వంసం చేశాయి. ఆ సమాధి దగ్గర రాసి పెట్టి ఉన్న గైక్వాడ్ చరిత్ర ఫలకాన్ని తొలగించమని స్థానిక దళితులను కొంతకాలంగా కోరుతున్న మరాఠాలు ఇప్పుడు ఆ సమాధినే తొలగించారు.

ఈ నేపథ్యంలో దళిత బహుజనుల సంయుక్త నాయకత్వంలో భీమా కోరేగావ్ సంస్మరణ ప్రత్యేకతను సంతరించుకుంది. ఆ సంస్మరణ మీద హిందూత్వవాదులు చేసిన దాడిలో ఒకరు మరణించగా, ఆ తర్వాత వారం రోజులపాటు మహారాష్ట్ర అంతా దళిత బహుజనుల నిరసనలతో అట్టుడికిపోయింది. భీమా కోరేగావ్ సంస్మరణలోనూ, నిరసన ప్రదర్శనల్లోను ప్రకాశ్ అంబేద్కర్, జిగ్నేష్ మేవాని వంటి దళిత పార్లమెంటరీ రాజకీయాల ప్రతినిధులే నాయకత్వం వహించినప్పటికీ, ఇది కొత్త పీష్వాలకు, సంఘ్ పరివార్ విద్వేష రాజకీయాలకు సవాల్ గా జరిగినందువల్ల దీని ప్రాధాన్యతను గుర్తించవలసి ఉంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

"పరుష పదాల విమర్శ" అంటే ఏమిటి?

ప్రచార సాధనాలన్నిటినీ నయానో, భయానో లొంగదీసుకుని, వందిమాగధ భజన ఘోషలో ప్రత్యర్థి గళాలు వినబడకుండా కట్టుదిట్టం చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వానికి గొంతులో సోషల్ మీడియా అనే పచ్చి వెలక్కాయ ఇరుక్కున్నది. ఈ వెలక్కాయను కొనివేసే మార్గాలూ భయపెట్టే దారులూ కనబడడం లేదు. ఎదురుగా తానే ఒక పెద్ద సోషల్ మీడియా బృందాన్ని తయారు చేసి ప్రత్యర్థుల స్వరాలు వినిపించనంత పెద్ద ఎత్తున బాజా భజంత్రీలు మోగిద్దామని ప్రయత్నాలు జరిగాయి గాని అవీ ఫలితాన్ని ఇచ్చినట్టు లేదు. ఇప్పుడిక సామ, దాన, భేద ఉపాయాలు అయిపోయి, దండోపాయపు ప్రయత్నాలు మొదలయ్యాయి. భారత శిక్షా స్మృతి లోని సెక్షన్ 506 (నేరపూరిత బెదిరింపు), 507 (అజ్ఞాతంగా చేసే నేరపూరిత బెదిరింపు) అనే రెండు నేరాలను తవ్వితీసి, అవసరమైన సవరణలు చేసి సోషల్ మీడియాలోని ప్రత్యర్థులను బెదిరించడానికి తెలంగాణ ప్రభుత్వం కొత్త సన్నాహాలు మొదలుపెట్టింది. ఐపిసి లోని ఆ రెండు నేరాలు ఇప్పటివరకూ న్యాయస్థానపు అనుమతితో మాత్రమే నమోదు చేయవలసిన నేరాలుగా ఉండగా, అటువంటి అనుమతి అవసరం లేకుండానే పోలీసులు తమంత తాముగా కేసు నమోదు చేసి, అరెస్టు చేయదగిన నేరాలుగా మార్చడానికి ఒక బిల్లును రాష్ట్రప్రభుత్వం తయారు చేసింది. ఈ బిల్లు తయారీకి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి సంతకం చేశారని, బిల్లు తయారై, శాసనసభలో చట్టం కావడమే మిగిలి ఉందని పత్రికలు రాస్తున్నాయి. యూట్యూబ్, వాట్సప్, ఫేస్ బుక్ వంటి సోషల్ మీడియాలో ప్రభుత్వ నేతలపై వస్తున్న విమర్శలను, దూషణలను ఏమీ చేయలేమా అని ముఖ్యమంత్రి సీనియర్ పోలీసు అధికారులను అడిగారని, వారు ఐపిసి 506, 507 సెక్షన్ల పరిమితులు వివరించినప్పుడు, ఆ పరిమితులను తొలగించే చట్టం తీసుకురావాలని ఆలోచించారని పత్రికలు రాశాయి. పరుష పదజాలంతో దూషించడం, బెదిరించడం, తిట్టడం, కించపరచడం వంటి చర్యలను ఈ పరిధిలోకి తీసుకువస్తారని, రెండు సంవత్సరాల నుంచి ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా వంటి శిక్షలు ఉంటాయని వార్తలు వచ్చాయి. అసలింతకీ "పరుష పదజాలం" అంటే ఏమిటనే నిర్వచనం లేదు. ఉద్యమకాలంలో స్వయంగా తెరాస అధ్యక్షుడితో సహా ఎందరో నాయకులు వాడిన మాటలు, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడ ముఖ్యమంత్రి ప్రత్యర్థుల గురించి వాడుతున్న మాటలు "పరుష పదజాలం" పరిధిలోకి వస్తాయో రావో తెలియదు. నిజానికి ప్రస్తుతం ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు, వ్యక్తులు, చివరికి సోషల్ మీడియాలో కూడ ముఖ్యమంత్రి వాడుతున్న పదజాలం కన్న చాల తక్కువ పరుషత్వం ఉన్న పదజాలాన్నే వాడుతున్నారు. కాని ఏలినవారు నేను మాట్లాడేదంతా మర్యాదకరమైన భాష, ప్రత్యర్థులు మాట్లాడేదంతా పరుషమైన భాష అని అనుకోవడానికే ఎక్కువ అవకాశం ఉంది. అంటే, ప్రభుత్వ విధానాలపై. పనితీరుపై ఉండే హేతుబద్ధమైన విమర్శలను కూడ పరుష పదజాలంగా ప్రకటించి, ఆ వ్యక్తులను వేధించడానికి పోలీసులకు మితిమీరిన అధికారాలు ఇవ్వడానికే ఈ కొత్త చట్టం తయారవుతున్నది. తమ మీద రానున్న, వస్తున్న విమర్శలను అడ్డుకోవడానికి, విమర్శకులను బెదిరించడానికి, శిక్షా భయం చూపి సమాజాన్ని ప్రశ్నలు లేని శ్మశాన సమాజంగా మార్చడానికి తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనడానికి ఇది సూచన. ప్రశ్నలకు, భిన్నాభిప్రాయాలకు, అతి మౌలిక హక్కు అయిన భావప్రకటనా స్వేచ్ఛకు అవకాశం లేని తెలంగాణ సృష్టించదలచుకున్నవారు ఒక్కసారి ఇటువంటి ప్రయత్నాలు చేసినవారికి ఏం జరిగిందో చరిత్ర చదువుకుంటే మంచిది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

దళితులపై, ముస్లింలపై పెరుగుతున్న దాడులు


ఆంధ్రప్రదేశ్ నానాటికీ దళితులపై, ముస్లింలపై, స్త్రీలపై దాడులకు వేదికగా మారుతుండగా, బాధితులకు రక్షణగా నిలిచి, నేరస్తులపై కేసులు నమోదు చేసి, విచారణ జరిపి శిక్షించవలసిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది, నేరస్తుల కొమ్ము కాస్తున్నది. బాధితులనే వేధింపులకు గురిచేస్తున్నది. దాదాపు ప్రతి రోజూ జరుగుతున్న చిన్నా చితకా సంఘటనలను వదిలేసినా దళితులపై, ముస్లింలపై, స్త్రీలపై దాడుల పెద్ద సంఘటనలే గత నెల రోజులలో ఐదారు ఉన్నాయి. దాదాపు అన్ని ఘటనలలోను అధికారవర్గానికి చెందినవారో, వారి ఆశ్రితులో, ఆధిపత్య కులాల వారో నేరస్తులు కావడం వారి మీద ప్రభుత్వం, పోలీసులు ఏ చర్యా తీసుకోకపోవడానికి కారణమనిపిస్తున్నది. రాజమండ్రిలో మస్జిద్ ఎ నూరాని అనే మసీదులోకి గుర్తు తెలియని దుండగులు జొరబడి, ప్రార్థనలు చదివే మౌజన్ ను దారుణంగా హతమార్చి, ఖురాన్ ను చింపివేశారు. గుంటూరు జిల్లా వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామంలో పదహారు సంవత్సరాల షేక్ సుభాన్ బీని గ్రామానికే చెందిన ఒక హిందూ యువకుడు ప్రేమ పేరుతో వంచించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, హత్య చేసి, రహస్యంగా దహనం చేయడానికి ప్రయత్నిస్తుండగా బైటపడినా ఏ చర్యలూ లేవు. అదే గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని జానపాడులో ముస్లిం బస్తీ మీద అధికారపార్టీ కార్యకర్తలు దాడి చేసి చాల మందిని తీవ్రంగా గాయపరిచారు. ఇవన్నీ ఒక ఎత్తు కాగా గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో ఆధిపత్య కమ్మ కులస్తులు దళితుల మీద దాడులకు, అవమానాలకు దిగారు. డిసెంబర్ 31 రాత్రి ఇద్దరు దళిత యువకులు బైక్ మీద వస్తూ ఒక చాకలివాళ్ల ఇంటి ముందు ముగ్గుపై జారిపడి, అక్కడి మహిళలు వారిని కోప్పడితే క్షమాపణలు చెప్పడంతో ముగిసిపోవలసిన సంఘటన, కమ్మవారి జోక్యంతో దళితుల మీద దాడిగా మారింది. కొంతకాలంగా దళితులు పొలం పనులను కాదని పట్టణానికి పోయి పనులు చేసుకుంటున్నారని, గ్రామ పంచాయితీ అభివృద్ధి పనుల్లో దళితవాడకు కేటాయించవలసిన వాటా అడుగుతున్నారనీ కోపం పెట్టుకున్న గ్రామ పెద్దలైన కమ్మలు ట్రాక్టరులో ఆయుధాలతో వచ్చి చర్చిలో ప్రార్థనలు చేసుకుంటున్న దళితులపై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు దళితులకు గాయాలయ్యాయి. పోలీసులు ఘర్షణను అదుపుచేసి ఇరువైపులా కేసులు పెట్టినట్టు చూపారు గాని తర్వాతి చర్యలేవీ తీసుకోలేదు. గ్రామంలో దళితులమీద సంఘ బహిష్కారం అమలవుతుంటే చర్యలు తీసుకోలేదు. బైటి ప్రజాసంఘాలు, పార్టీలు జనవరి 24న చలో పెదగొట్టిపాడు పిలుపు ఇస్తే, జిల్లా వ్యాప్తంగా వందలాది మందిని అరెస్టు చేసి గ్రామంలోకి ఎవరినీ రానివ్వలేదు. ఈ ఘటనలన్నీ కూడ దళితుల మీద, ముస్లింల మీద, స్త్రీల మీద ఆధిపత్య వర్గాల దాడుల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలా నిర్లక్ష్యం వహిస్తున్నదో, నేరస్తుల కొమ్ము కాస్తున్నదో రుజువు చేస్తున్నాయి. ఒకవైపు రాష్ట్రంలో ఇంత బీభత్సమైన పాలన సాగుతుంటే ముఖ్యమంత్రి, ఆయన కొడుకు దావోస్ లో ప్రపంచ దొంగల మహాసభకు వెళ్లి, మాదగ్గరకి వచ్చి దోచుకోండి, మంచి తరుణం మించిన దొరకదు అని బహుళజాతి దొంగలకు ఎర్రతివాచీలు పరవడంలో మునిగిపోయి ఉన్నారు. వీ


సిరియా కుర్దులపై టర్కీ దాడి

- బైరెడ్డి సతీష్


సిరియా-టర్కీ సరిహద్దుల్లో కుర్దుల అధీనంలో ఉన్న అఫ్రిన్ పట్టణంపై టర్కీ సైన్యం దాడిచేయడం 7 సంవత్సరాలుగా కొనసాగుతున్న సిరియా అంతర్యుద్ధపు సంక్లిష్టతను, భవిష్యత్ ప్రమాదాన్ని సూచిస్తున్నది. అమెరికా వైమానిక దాడుల మద్దతుతో కుర్దిష్ పీపుల్స్ ప్రొటెక్షన్ యూనిట్స్ (వై.పి.జి.) సిరియా తూర్పు ప్రాంతంలో ఉన్న ఐసిస్‌పై క్షేత్రస్థాయిలో సులభంగా దాడులు చేసి ఆ ప్రాంతం నుండి ఐసిస్‌ను ఖాళీ చేయించ గలిగారు. ఐసిస్ టర్కీకి, అమెరికాకు, సిరియాకు ఇటు కుర్దులకు కూడా ఉమ్మడి శత్రువు. టర్కీ నుండి విడిపడి ప్రత్యేక కుర్దు రాజ్యాన్ని కోరుకుంటున్న కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ (పి.కె.కె.) కి అనుబంధ సంస్థగా వై.పి.జి. ని గుర్తిస్తున్న టర్కీ దానిపై దాడులు మొదలుపెట్టింది. ఐసిస్‌పై పోరాటంలో వై.పి.జి.ని వాడుకున్న అమెరికా ఈ దాడుల నేపథ్యంలో పక్కకు తప్పుకున్నది. రష్యా ప్రత్యక్ష పాత్రను పోషించడం లేదు. సిరియా అధ్యక్షుడు బసర్ అసద్‌ని పదవీచ్యుతున్ని చేసే తిరుగుబాటు దాడుల్లో వై.పి.జి. కూడా ఉన్నది. రష్యా అసద్ ప్రయోజనాలను పరిరక్షిస్తున్నది. టర్కీ నాటో కూటమిలో భాగస్వామ్య దేశం. ఎవరి ప్రయోజనాల మేరకు వారు తక్షణ పొత్తులను పెట్టుకొని సమస్యను మరింత సంక్లిష్టం చేస్తున్నారు. సిరియాలో అసద్ వ్యతిరేక కూటమి కట్టిన పరిస్థితుల్లో మధ్యలో వచ్చిన ఐసిస్‌ను ఎదుర్కోవడం అమెరికాకు తక్షణ అవసరమైంది. భవిష్యత్ ప్రయోజనాల రీత్యా వై.పి.జి. అమెరికా పూర్తి సహాయ సహకారాలను పొందింది. ఐసిస్‌ను అంతమొందించే లక్ష్య సాధనలో అమెరికా చేత అందించబడిన ఆయుధాలు, అందివచ్చిన అనుభవంతో ఎక్కడ పి.కె.కె.తో జతకట్టి తమపైకి దాడికి దిగుతుందో అని సిరియా 'సార్వభౌమాధికారం' ను కూడా లెక్కచేయకుండా ఆ దేశ భూభాగంలోకి చొచ్చుకువచ్చి మరీ దాడులు చేసినా సిరియా మౌనం వెనక కారణం వై.పి.జి. అసద్‌పై తిరుగుబాటు శిబిరంలో ఉండడమే. మరోవైపు సిరియాతో కలిసి రష్యా ఇడ్లిబ్ లాంటి తిరుగుబాటుదారుల స్థావరాలపై బాంబులను కురిపిస్తూనే ఉన్నది. ప్రస్తుతానికి టర్కీది పైచేయి అనిపించినప్పటికి కుర్దుల ఉద్యమానికి స్థానిక ప్రజలలో ఉన్న మద్దతు రీత్యా దీర్ఘ కాలం ఈ దాడులను కొనసాగించడం కష్టమైనదే. వై.పి.జి. కి ఉన్న క్షేత్రస్థాయి యుద్ధ అనుభవాల రీత్యా కూడా టర్కీ భవిష్యత్తులో అననుకూలతను ఎదుర్కోవచ్చు. ఒకవేళ సిరియాలోకి మరింతగా టర్కీ దూసుకొని వచ్చినా అది మరింత రక్తపాతాన్ని, విధ్వంసాన్నే సృష్టిస్తుంది. దాని ఫలితంగా సిరియా అంతర్యుద్ధానికి పరిష్కారం మరింత దూరం నెట్టివేయబడుతుంది. ఇప్పుడు టర్కీ చేయాల్సిందల్లా తక్షణమే మిలిటరీ చర్యలను నిలిపివేసి తన సరిహద్దుల్లోకి పరిమితం కావడం. ప్రత్యేకించి అమెరికా పోషిస్తున్న పచ్చి అవకాశవాద విధానాలను నిలిపివేయాలి. రష్యా దన్నుతో సిరియా మిలటరీ సాగిస్తున్న దాడులను కూడా నిలిపివేయాలి. రష్యా సిరియాలో తన మిలటరీ బేస్‌ను కాపాడుకోవడం కోసమే అసద్ వైపు నిలవడం కాకుండా సిరియా సంకీర్ణ సమాజంలోని అన్ని సమూహాల న్యాయబద్ధమైన ఆకాంక్షలు నెరవేరేలా అంతర్జాతీయ సమాజంతో కలిసి కృషి చేయడం మంచిది. టర్కీ ఇవాళ ముస్లిం దేశాలలో అమెరికా జెరూసలెం చర్య నేపథ్యంలో పొందిన 'నాయకత్వ' పాత్రను, దూకుడుగా వ్యవహరించి మరింత సంక్షోభాన్ని సృష్టించే బదులు అమెరికా ఆధిపత్యాన్ని అడ్డుకొనేలా, ఇస్లాం దేశాల ఐక్యత పెరిగేలా వ్యవహరిస్తే ప్రయోజనకరం.

వీ







❖ **యుద్ధం నాకు ఆయుధాన్ని బాకీపడింది** – నజీర్ జైలు కవిత్వం – తెలంగాణ విద్యార్థి వేదిక – 24 పేజీలు, 1/10 డెమీ, వెల రు. 20, ప్రతులకు: నజీర్, రూం. నెం. 232, న్యూ గోదావరి హాస్టల్, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ – 500 007. ఫోన్: 9849573546



❖ **రాహేఁ** – ఇక్బాల్ కవిత్వం – పాలమూరు అధ్యయన వేదిక – 104 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 80, ప్రతులకు: ఇక్బాల్, ఇక్బాల్ మంజిల్, ఇ.నెం.6–29, జి.వి. ఎన్‌క్లేవ్, కెకె గార్డెన్స్ పక్కన, గద్వాల్–509125, మహబూబ్‌నగర్ జిల్లా; ఫోన్: 9440775732 email:eqbalpasha9@gmail.com




❖ **భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి** – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు–12 – పోరు నేల ప్రచురణ – 148 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 100




❖ **వెట్టిచాకిరి సమస్య** – హైదరాబాదీ సంస్థానంలో వెట్టిచాకిరి – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు– 13 – దేవులపల్లి వెంకటేశ్వరరావు రీసెర్చ్ సెంటర్ – 32 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 15


పై రెండు ప్రతులకు: రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు



❖ **పిల్లలూ.. కమ్యూనిజాన్ని తెలుసుకుందామా...** జర్మన్: బిని అడమ్‌జాక్, తెలుగు: ముక్తవరం పార్థసారథి – ప్రజాశక్తి బుక్‌హౌస్ – 80 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 40,




❖ **స్వేచ్ఛకు సంకెళ్లు** – వ్యాస సంకలనం – ప్రజాశక్తి బుక్‌హౌస్ – 104 పేజీలు, 1/10 డెమీ, వెల రు. 70,




❖ **ఏడుపదుల స్వాతంత్ర్యం (1947–2017)** – వ్యాస సంకలనం – ప్రజాశక్తి బుక్‌హౌస్ – 88 పేజీలు, 1/10 డెమీ, వెల రు. 60


పై మూడు ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 27–1–54, కారల్ మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ – 2; ఫోన్: 0866–2577533; అన్ని బ్రాంచీలు



❖ **వదరుఁబోతు** (వందేళ్ల కానుక–1917) – వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం – 136 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 50, ప్రతులకు: వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం, తల్లకల్వ గ్రా, గండ్లపెంట మం, అనంతపురం – 515 521, ఫోన్: 9963917187




❖ **నా మాస్కో యాత్ర** – శ్రీశ్రీ – శ్రీశ్రీ సాహిత్య నిధి – 72 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 60




❖ **చైనా యానం** – శ్రీశ్రీ – శ్రీశ్రీ సాహిత్య నిధి – 80, పేజీలు, 1/8 డెమీ, వెల రు. 70


పై రెండు పుస్తక ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతినగర్, విజయవాడ. ఫోన్:0866 6617375, 9848504649, 9246277375; email:srisri_sahityanidhi@yahoo.com



❖ **భారత వ్యవసాయంలో సమకాలీన సంక్షోభం** – వేములపల్లి వెంకట్రామయ్య – అఖిల భారత రైతు–కూలీ సంఘం – 84 పేజీలు, 1/8 డెమీ, వెల రు.50, ప్రతులకు: వాయిస్ ఆఫ్ న్యూ డెమోక్రసీ, మార్క్స్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ – 44. అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **దేవుడు తప్పిపోయాడు** – కవిత్వం – విల్సన్‌రావు కొమ్మవరపు – పాలపిట్ట బుక్స్ – 204 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 120




❖ **అరతెరతీసిన రంగస్థలం** – ఏనుగు నరసింహారెడ్డి సృజనపై స్పందన – పాలపిట్ట బుక్స్ – 224 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 150

పై రెండు పుస్తక ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036



❖ **కరుణశ్రీ సాహిత్యం – 5** – వ్యాస వేదిక – డా. జంధ్యాల పాపయ్య శాస్త్రి – నవచేతన పబ్లిషింగ్ హౌస్ – 302 పేజీలు, 1/8 డెమీ, వెల రు.200, ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. (పోస్ట్), హైదరాబాద్ – 068. ఫోన్: 24224453 / 54 email:navachethanaph@gmail.com,



❖ **నిషేధాక్షర స్వప్నం** – సూర్యచంద్ర కవిత్వం – విరసం ప్రచురణ – 62 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 40, ప్రతులకు: డి.వి. రామకృష్ణారావు, ఎం.ఐ.జి. – 14, ఎపిఐఐసి కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ – 500040. అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **కలత నిద్దురలో** – క్రాంతి కవిత్వం – విరసం ప్రచురణ – 64 పేజీలు, 1/8 డెమీ, వెల రు.30, ప్రతులకు: email:vidhyarthi7@gmail.com, సెల్: 7702741570; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

న్యాయవ్యవస్థ సంక్షోభం - పూర్వాపరాలు

నలుగురు సీనియర్ న్యాయమూర్తుల పత్రికాసమావేశంతో బహిరంగమైన భారత న్యాయవ్యవస్థ అస్తవ్యస్త పనితీరు గురించీ, ఏర్పడిన సంక్షోభపు పూర్వరంగం గురించీ వివరిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గోగోయి, జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ జనవరి 12న ఒక పత్రికా సమావేశం ఏర్పాటు చేసి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ప్రవర్తనా సరళి మీద విమర్శనాస్త్రాలు సంధించారు. తాము ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖను ప్రచారసాధనాలకు విడుదల చేశారు. ఈ పరిణామం దేశవ్యాప్తంగా పెద్ద సంచలనానికి దారితీసింది. భారత న్యాయవ్యవస్థలోని అత్యున్నత స్థాయి న్యాయమూర్తులు ఇలా తమ అభిప్రాయాలను బహిరంగంగా ప్రకటించడం కనీవినీ ఎరగని అసాధారణమైన ఘటనగా ఆలోచనాపరులను ఒక కుదుపు కుదిపింది.

ఆ సంచలనాత్మకతను అలా ఉంచి వారు చేసిన విమర్శల అంతరార్థాలు, పర్యవసానాలు మరింత తీవ్రమైనవి. అందువల్లనే ఈ ఉదంతాన్ని చాలమంది పరిశీలకులు భారత న్యాయవ్యవస్థ సంక్షోభంగా అభివర్ణిస్తున్నారు. నిజానికి ఈ స్థాయి న్యాయమూర్తులు ఇలా బైటికి రావడం ఇది మొదటిసారి కావచ్చు గాని సాధారణ ప్రజానీకానికీ, ఎంతోమంది న్యాయవాదులకూ, న్యాయమూర్తులకూ, న్యాయవ్యవస్థ పరిశీలకులకూ ఇటువంటి అభిప్రాయాలు ఎప్పటినుంచో ఉన్నాయి. అవి ఎన్నోసార్లు వ్యక్తమయ్యాయి కూడ. అంటే భారత న్యాయవ్యవస్థ ఎప్పటి నుంచో సంక్షోభంలో ఉన్నది. కాకపోతే ఈసారి ఆ అభిప్రాయాలను ప్రకటించినవారి స్థాయి వల్ల, భారతీయ జనతా పార్టీ పాలనా సందర్భం వల్ల అవి మరింత ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ విమర్శల గురించి, ప్రస్తుత వివాదం గురించి మాత్రమే కాక అసలు మన సమాజంలో న్యాయవ్యవస్థ స్వభావం గురించి, పనితీరు గురించి కూడ వివరంగానే చర్చించుకోవలసి ఉంది.

చాలమంది ప్రగతిశీలవాదులలో కూడ న్యాయవ్యవస్థకు ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. మిగిలిన అన్ని వ్యవస్థలను విమర్శించేవారు కూడ న్యాయవ్యవస్థకు ఒక రకమైన "పవిత్రత" ఆపాదిస్తుంటారు. ఆ ఒక్క వ్యవస్థ అయినా సక్రమంగా పనిచేస్తే బాగుండునని కోరుకుంటారు. అన్ని వ్యవస్థలూ ప్రజలను వంచిస్తున్నప్పుడు న్యాయవ్యవస్థ ఒక్కటైనా ప్రజల రక్షణ కోసం నిలబడాలని అనుకుంటారు. న్యాయవ్యవస్థను మిగిలిన వ్యవస్థలకన్న భిన్నమైనదిగా, ఉత్తమమైనదిగా, కాస్త పైస్థాయిదిగా భావిస్తుంటారు. దాని నుంచి నిజాయితీని, నిజమైన తటస్థతను ఆశిస్తుంటారు. అందువల్లనే న్యాయవ్యవస్థ లోపాలు బైటపడినప్పుడు, అది దారుణమైన తీర్పులు వెలువరించినప్పుడు ఆశ్చర్యపోతుంటారు. ప్రస్తుత న్యాయమూర్తుల పత్రికా సమావేశం తర్వాత వెలువడుతున్న ప్రతిస్పందనలలో కొంత భాగం ఇటువంటి ఆశ్చర్యం నుంచి వెలువడుతున్నవే. ఇవి కాక మరికొన్ని స్పందనలు కూడ ఉన్నాయి. ఆ న్యాయమూర్తుల బహిరంగ ప్రకటనలను తప్పు పడుతూ, వ్యవస్థ యథాతథ స్థితిని సమర్థిస్తున్న ప్రతిస్పందనలు, ప్రధాన న్యాయమూర్తి పనితీరునూ, ప్రభుత్వ పనితీరునూ సమర్థిస్తున్న ప్రతిస్పందనలు ఒక కొసన ఉన్నాయి. ఆ పత్రికా సమావేశానికి, ఈ నలుగురు న్యాయమూర్తుల ప్రకటనలకు ఏమాత్రం విలువ ఇవ్వకుండా, ఆ న్యాయమూర్తులను కుల, భావజాల తదితర కారణాల కోసం తప్పు పడుతూ, ఇటువంటి ఇతర ఘటనలను పోటీ పెడుతూ అంతిమంగా పరోక్షంగా వ్యవస్థను సమర్థిస్తున్న ప్రతిస్పందనలు మరొక కొసన ఉన్నాయి. ఇన్ని రకాల ప్రతిస్పందనల మధ్య నుంచి మొత్తంగా న్యాయవ్యవస్థ గురించి, ప్రస్తుత సంక్షోభం గురించి, దాని పూర్వాపరాల గురించి వివరంగా, సమ్యగ్ దృక్పథంతో ఆలోచించవలసి ఉంది.

న్యాయవ్యవస్థ అనేది ఏ సమాజంలోనైనా రాజ్యాంగయంత్రంలో భాగమైన ఒకానొక అంగమే తప్ప స్వతంత్ర ప్రతిపత్తి కలిగినదో, సంపూర్ణంగా స్వతంత్రంగా వ్యవహరించగలిగినదో కాదనే విషయాన్ని కచ్చితంగా గుర్తు పెట్టుకోవడం ప్రస్తుత సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి అవసరం. రాజ్యపు అంగాలుగా రాజనీతిశాస్త్రం వివరించే శాసననిర్మాణ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ ఎటువంటి అంగాలో న్యాయవ్యవస్థ కూడ అటువంటి అంగమే. నిజానికి రాజ్యంలో భాగంగా రాజనీతి శాస్త్రం నిర్వచించని పత్రికా వ్యవస్థ కూడ ఇవాళ రాజ్యాంగ యంత్ర బాధ్యతలను ఎక్కువగానే నిర్వర్తిస్తున్నదని గమనించవచ్చు. రాజ్యానికి ఈ శాసననిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటే భావజాల సాధనాలు కూడ ఉంటాయని, భావజాల సాధనాల ద్వారా కూడ రాజ్యం ప్రజల మనసుల మీద రాజ్యం చేస్తుందని విశ్లేషించిన మేధావులు కూడ ఉన్నారు. రాజ్యం అనేదాన్ని వర్గ పీడన సాధనంగా చూసిన మార్క్స్ ఎంగెల్స్‌లు చట్టాన్ని, న్యాయవ్యవస్థను కూడ భావజాల వ్యక్తీకరణలుగానే చూశారు. న్యాయవ్యవస్థ ప్రాథమిక లక్ష్యం సొంత ఆస్తి పరిరక్షణకు అనువైన, సమర్థించే భావజాలాన్ని, చట్టాలను తయారు చేయడమేనని అన్నారు. ఉత్పత్తి సాధనాల యజమానులకూ, ఆ ఉత్పత్తి సాధనాల మీద పనిచేసే శ్రామికులకూ మధ్య ఉన్న దుర్భరమైన ఆధిపత్య సంబంధం మీద మాయపొర కప్పి, దాన్ని కనబడకుండా చేసి, లేని తటస్థత నటించడమే న్యాయవ్యవస్థ పని అని వాళ్లు అన్నారు. ఒక వర్గపు ఆర్థిక స్థితే దాన్ని ఆధిపత్య స్థానంలో కూచోబెట్టిందని, మరొక వర్గపు ఆర్థిక స్థితే దాన్ని అనాదృత స్థానంలో కూచోబెట్టిందని గుర్తించడానికి, మనుషుల మధ్య ఇటువంటి ఆర్థిక అసమానత ఉందని గుర్తించడానికి చట్టం, న్యాయవ్యవస్థ నిరాకరిస్తాయి. గుడ్డిగా చట్టం ఎదుట అందరూ సమానమే అని ఆదర్శాన్ని ప్రకటిస్తూ వాస్తవంగా అసమానతను పునరుత్పత్తి చేస్తాయి. చట్టం ఎదుట అందరూ సమానులే అని గంభీరంగా ప్రకటిస్తూ,

తద్వారా అది ఉన్న స్థితికి సమర్థనగానూ, మాయ చేసేదిగానూ పనిచేస్తుంది అని ఎంగెల్స్ అన్నాడు.

న్యాయవ్యవస్థకు సంబంధించిన ఈ మౌలిక మార్క్సిస్టు అవగాహన తోనే భారత న్యాయవ్యవస్థను కూడ అర్థం చేసుకోవలసి ఉంది. భారత న్యాయవ్యవస్థ పాలకవర్గాల ప్రయోజనాల కోసం, పాలకవర్గాలు రూపొందించిన, పాలకవర్గాల చట్టాలను వ్యాఖ్యానించే, సమీక్షించే, అన్వయించే సంస్థే తప్ప ప్రజల కోసం పని చేసే సంస్థ కాదు. అయితే రెండు ఎదురుబొదురు వర్గాల వ్యవస్థ కూడ తన మనుగడ కోసం, పీడిత వర్గాన్ని నమ్మించడం కోసం న్యాయవ్యవస్థ తటస్థంగా నడుస్తున్న ఆభాస కల్పిస్తుంది. భారతదేశం వంటి భిన్న వర్గాల, బహుళ సమాజంలో, పాలకవర్గంలోనే భిన్నముఠాల బేరసారాల వల్ల, ప్రజలను భ్రమల్లో ముంచడానికి న్యాయవ్యవస్థ ఇంకా ఎక్కువ తటస్థతను నటించవలసి వస్తుంది. ఆ తటస్థతను ఎంతగా నటించినా, ఎప్పుడో ఒకసారి ప్రజానుకూలమైన తీర్పులు, వ్యాఖ్యలు ప్రకటించినా, ప్రజానుకూల చట్టాల అమలు గురించి తీవ్రంగా మాట్లాడినా భారత న్యాయవ్యవస్థ అసలు స్వభావం ఆస్తికి, పాలకవర్గ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాలలో స్పష్టంగా బైటపడుతుంది. భూసంస్కరణలు, ఆదేశిక సూత్రాల అమలు, పరిశ్రమల పని పరిస్థితులు, ఆస్తి సంచయనం, అధికారవర్గాల అవినీతి, సామాజిక అణచివేత, చట్టం హామీ ఇచ్చిన హక్కులు కూడ అమలు కాకపోవడం వంటి ఎన్నెన్నో ఉదాహరణల్లో భారత న్యాయవ్యవస్థ మొత్తంగా ఎవరికోసం పనిచేస్తుందో ఇప్పటికే ఎన్నోసార్లు రుజువైంది. నూటికి నూరూ పాలకవర్గ అనుకూల తీర్పులే ఇస్తూ పోతే దాని విశ్వసనీయత దెబ్బతింటుంది, అది బైటపడిపోతుంది గనుక, ప్రదర్శనా వస్తువులుగా, ఉదాహరణ ప్రాయంగా ఎప్పుడో ఒకసారి ప్రజానుకూలమైనవిగా కనిపించే తీర్పులు ఇవ్వడం జరుగుతుంది. కాని వ్యవస్థ మౌలిక అంశాల విషయానికి, సొంత ఆస్తి విషయానికి వచ్చేసరికి న్యాయవ్యవస్థ ప్రజలవైపు, పీడితులవైపు, సమానతవైపు, కనీసం రాజ్యాంగ ప్రవేశికవైపు ఉన్న దాఖలా ఒక్కటి కూడ లేదు.

ఇటువంటి ఘన చరిత్ర ఉన్న భారత న్యాయవ్యవస్థలో న్యాయం సక్రమంగా జరగడం లేదని, న్యాయవితరణలో రాగద్వేషాలు, ఇష్టారాజ్యం అమలవుతున్నాయని స్వయంగా నలుగురు సీనియర్ న్యాయమూర్తులే ప్రకటించడం ప్రస్తుత వివాదంలోని కీలకాంశం. వాళ్లు చెప్పిన అంశం కొత్తది కాకపోయినా, చెప్పిన పద్ధతి కొత్తది. వారి స్థాయి వల్ల అది విస్తృత చర్చనీయాంశం కూడ అయింది.

“ఇది ఈ దేశ చరిత్రలో మాత్రమే కాదు, ఏ దేశ చరిత్రలోనైనా అసాధారణ సందర్భం. మేం ఈ సమావేశం సంతోషంగా ఏమీ ఏర్పాటు చేయడం కాదు. మేం ఇది ఏర్పాటు చేయక తప్పలేదు. కొంతకాలంగా సుప్రీం కోర్టు సరిగా పని చేయడం లేదు. కొన్ని నెలలుగా ఇది అపసవ్యంగా నడుస్తున్నది. ఆశించగూడని పనులు జరుగుతున్నాయి. సీనియర్ న్యాయమూర్తులుగా దీన్ని సరిచేయడం, వ్యవస్థపట్ల, దేశం పట్ల మేం వహించవలసిన బాధ్యత అని మేం అనుకున్నాం. ప్రధాన న్యాయమూర్తిని కలిసి ఈ సమస్యలు పరిష్కరించమని కోరాం. మా ప్రయత్నాలు విఫలం అయ్యాయి. ఈ వ్యవస్థను కాపాడకపోతే ప్రజాస్వామ్యం మనజాలదు. స్వతంత్ర, నిష్పాక్షిక న్యాయమూర్తులు లేకుండా ప్రజాస్వామ్యం మనజాలదు. ఈ రోజు ఉదయం కూడ మేం ప్రధాన న్యాయమూర్తిని కలిశాం. కాని ఆయనను ఒప్పించలేకపోయాం. అందువల్ల ప్రజల ముందుకు రావడం తప్ప మరొక మార్గం లేదని అనుకున్నాం. ఇప్పటికే ఎందరో విజ్ఞులు న్యాయవ్యవస్థ పనితీరు మీద మాట్లాడుతున్నారు. ఇరవై సంవత్సరాల తర్వాత ఎవరో విజ్ఞులు వచ్చి, ఈ నలుగురు న్యాయమూర్తులు సమయానికి స్పందించలేదని, ఆత్మలను అమ్ముకున్నారని, దేశ ప్రయోజనాలను రక్షించలేదని ఆరోపించవచ్చు. అందుకే మేం ప్రజల ముందుకు వస్తున్నాం” అని నలుగురు న్యాయమూర్తుల తరఫున జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. నలుగురు న్యాయమూర్తులు కలిసి ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖను ప్రచార సాధనాలకు ఇచ్చారు.

నిజానికి ఈ వివాదానికి మూలాలు గత కొన్ని సంవత్సరాల సుప్రీం కోర్టు పనితీరులో ఉన్నాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే సంఘ్ పరివార్, ప్రత్యేకించి ప్రధాని నరేంద్ర మోడీ, భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా ఉన్నత న్యాయస్థానాలను, న్యాయవ్యవస్థను తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఇష్టారాజ్యంగా మార్చుకోవడంలో, మార్చుకోవాలనుకోవడంలో ఉన్నాయి. మొత్తంగానే న్యాయవ్యవస్థ ఎప్పుడూ పాలకవర్గాలకు అనుగుణంగా మాత్రమే ప్రవర్తిస్తుందన్న అవగాహనతోపాటుగానే, గత ఏడు దశాబ్దాలలో ఎన్నోసార్లు అప్పటి అధికార పక్షాలు గీచిన గీట్లను న్యాయస్థానాలు, న్యాయమూర్తులు దాటలేదని గుర్తించవచ్చు. గత పాలకులు న్యాయస్థానాలను తమకు అనుకూలంగా నయానో భయానో ఉపయోగించుకున్నారనే వాస్తవాన్ని గుర్తిస్తూనే, సంఘ్ పరివార్ ఆ పనిని మరింత దూకుడుగా చేస్తున్నదని గుర్తించాలి. దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభం పెరుగుతున్నదనడానికి గుర్తుగా పాలకవర్గ ముఠాల మధ్య ఘర్షణ తీవ్రతరమవుతున్న నేపథ్యంలోనే న్యాయవ్యవస్థలో అవకాశాలు దక్కని, అవకాశాలు తగ్గిపోతున్న పాలకవర్గ ముఠాల అసంతృప్తికి ఒక ప్రతిఫలనంగానే ఈ న్యాయవ్యవస్థ సంక్షోభాన్ని గుర్తించాలి. ప్రజల ఆకాంక్షలు, ముఖ్యంగా అణగారినవర్గాల ఆకాంక్షలు పెల్లుబుకుతూ ఆందోళనారూపాలు ధరిస్తున్న నేపథ్యంలో కొందరు న్యాయమూర్తుల సున్నిత ప్రతిస్పందనగా ఈ సంక్షోభం తలెత్తిందని గుర్తించాలి.

ప్రస్తుత సంక్షోభానికి బీజాలు గత రెండు సంవత్సరాలల్లో జరిగిన మూడు, నాలుగు ఘటనల్లో ఉన్నాయి. అవి జస్టిస్ కర్ణన్ బహిరంగలేఖలో, అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కలిఖో పుల్ ఆత్మహత్యా లేఖలో న్యాయవ్యవస్థ మీద చేసిన ఆరోపణలు, న్యాయమూర్తుల నియామక ప్రక్రియపై, సుప్రీంకోర్టులో న్యాయమూర్తులకు వ్యాజ్యాల కేటాయింపులపై న్యాయమూర్తులలో, న్యాయవాదులలో వెల్లువెత్తుతున్న అసంతృప్తి, సిబిఐ న్యాయమూర్తి బి.ఎచ్. లోయా అనుమానాస్పద మృతి. సరిగ్గా ఈ సమయంలోనే ఎన్నో వివాదాస్పద, అభ్యంతరకర, చట్టవ్యతిరేకమైన తీర్పులు వెలువడ్డాయి. న్యాయమూర్తుల అవినీతి ఆరోపణలు బైటపడ్డాయి. న్యాయమూర్తుల నియామక ప్రక్రియ గురించి కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించి, భంగపడి నప్పటికీ, కొనసాగుతున్న కొలీజియం వ్యవస్థ కూడ ఎన్నో అక్రమాలకు, అవకతవకలకు, పారదర్శకత లేమికి ఆలవాలమని పేరు తెచ్చుకుంది. న్యాయమూర్తి జస్టిస్ జయంత్ పటేల్ బదిలీ, రాజీనామా జరిగాయి. జస్టిస్ లోయా అనుమానాస్పద మృతి కేసును విచారించడంలో సుప్రీం కోర్టు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి, సాచివేతకు, వక్రీకరణకు పాల్పడినట్టు కనబడింది.

జస్టిస్ చిన్నస్వామి స్వామినాథన్ కర్ణన్ (సి ఎస్ కర్ణన్) 2017 మే నాటికి మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. కర్ణన్ సు

న్యాయమూర్తిగా నియమించాలని 2009లో కొలీజియంకు అప్పటి మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎ కె గంగూలీ సిఫారసు చేశారు. కర్ణన్ అప్పటికి అంత ప్రసిద్ధుడు కానప్పటికీ "ఒక ప్రత్యేక సామాజిక వర్గపు ప్రతినిధిగా ఆయన న్యాయమూర్తిగా ఉండాలని" భావించి ఆయన పేరు సిఫారసు చేసినట్టు గంగూలీ అన్నారు. అయితే దళితుడు అయినందువల్లనే కర్ణన్ న్యాయమూర్తిగా కూడ మొదటినుంచీ అవమానాలను, వివక్షను ఎదుర్కొన్నారు. న్యాయమూర్తి పదవి చేపట్టిన రెండు సంవత్సరాలలోనే ఆయన జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ కు తాను మద్రాసు హైకోర్టు లోని ఇతర న్యాయమూర్తులనుంచి ఎదుర్కొంటున్న కుల ఆధారిత వేధింపుల గురించి ఫిర్యాదు చేశారు. తన చాంబర్ లోనే పత్రికా సమావేశం ఏర్పాటు చేసి తాను పదవిలోకి వచ్చినప్పటినుంచీ అవమానాలు, వేధింపులు ఎదుర్కొంటున్నానని ఆరోపించారు. ఒక సహ న్యాయమూర్తి తనను కాలుతో తాకాడని కూడ ఆరోపించారు. ఈ ఆరోపణలపై కోర్టు ఆవరణలో న్యాయవాదులు, దళితులు ఆందోళన జరిపారు. అప్పటి జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ అధ్యక్షుడు పి ఎల్ పునియా ఈ విషయమై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి కూడ తీసుకువచ్చారు.

ఈ పరిణామాలు సాగుతుండగానే, 2014లో మద్రాసు హైకోర్టులో న్యాయమూర్తుల నియామకం గురించి ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ జరుగుతుండగా కర్ణన్ ఆ హాలులోకి వెళ్లి న్యాయమూర్తుల ఎంపిక అక్రమంగా జరిగిందని, తాను తన పేరు మీద కూడ ఒక అఫిడవిట్ దాఖలు చేస్తానని అన్నారు. ఈ ప్రవర్తన అభ్యంతరకరమైనదని, న్యాయమూర్తి హోదాకు తగినది కాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సహా ఎందరో జస్టిస్ కర్ణన్ ను మందలించారు. అప్పటి మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆర్ కె అగ్రవాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి సదాశివం కు ఒక లేఖ రాస్తూ కర్ణన్ ను మరేదైనా హైకోర్టుకు బదిలీ చేయమని కోరారు. తాను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మీద, ఇతర న్యాయమూర్తుల మీద చేసిన ఆరోపణలు రుజువు చేసేందుకు మద్రాసు హైకోర్టులోనే కొనసాగుతానని కర్ణన్ లేఖ రాశారు. జిల్లా న్యాయమూర్తుల నియామకాలలో జరిగిన అక్రమాల గురించి రాష్ట్రపతికి ఫిర్యాదు చేసేందుకు సమాచారం సేకరించడం ప్రారంభించారు.

ఈలోగా మద్రాసు హైకోర్టుకు చెందిన ఇరవై మంది న్యాయమూర్తులు కర్ణన్ ను బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఆ ఇరవై మంది న్యాయమూర్తులకూ జస్టిస్ కర్ణన్ కూ మధ్య వివాదం ముదురుతూ వచ్చింది. తన దగ్గరికి పనికిరాని, వ్యర్థమైన వ్యాజ్యాలు విచారణకు పంపుతున్నారని, అందువల్ల తాను దీర్ఘకాలపు సెలవుపై వెళ్తానని కర్ణన్ 2015 చివరిలో ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. చివరికి 2016 ఫిబ్రవరిలో ఆయనను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేశారు. సుప్రీం కోర్టులోనూ, హైకోర్టులలోనూ పనిచేస్తున్న న్యాయమూర్తులలో ఇరవై మంది అవినీతిపరులున్నారని, ఇది తన తొలి జాబితా అని ప్రకటిస్తూ కర్ణన్ 2017 జనవరిలో ప్రధానమంత్రికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖకు ప్రతిగా ఆయన మీద కోర్టు ధిక్కార నేరం ఆరోపణపై విచారణ ప్రారంభించారు. ప్రధాన న్యాయమూర్తి జె ఎస్ ఖేహార్ సింగ్ తో సహా ఏడుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ కేసు విచారణ చేపట్టారు. ఆ ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు న్యాయమూర్తులు ఎస్ సి, ఎస్ టి అత్యాచారాల నిరోధ చట్టం కింద నేరం చేశారని, అందువల్ల వారికి తానే ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తున్నానని కర్ణన్ 2017 మే 8న ఒక సంచలనాత్మక తీర్పు ఇచ్చారు. ఆ మర్నాడే సుప్రీంకోర్టు కోర్టు ధిక్కార నేరం కింద కర్ణన్ కు ఆరునెలల జైలు శిక్ష విధించింది. ఆయన మానసిక స్థితిని పరీక్షించాలని ప్రకటించింది. కర్ణన్ విచారణనూ, శిక్షనూ తప్పించుకుని అజ్ఞాతవాసానికి వెళ్లారు. జూన్ 12న పదవీ విరమణ సమయం అయిన తర్వాత ఒక వారానికి ఆయనను కోయంబత్తూరులో కలకత్తా పోలీసులు అరెస్టు చేశారు. ఆరు నెలల శిక్షాకాలం పూర్తయ్యాక డిసెంబర్ 20న విడుదలై, ప్రస్తుతం చెన్నైలో ఉన్నారు. ఉన్నత న్యాయస్థానాలలో అమలవుతున్న కుల వివక్ష, దళితుల పట్ల అవమానాలు, న్యాయమూర్తుల అవినీతి వంటి ఆయన లేవనెత్తిన మౌలిక ప్రశ్నలకు మాత్రం ఇవాల్టికీ జవాబు లేదు.

భారత న్యాయవ్యవస్థ బోలుతనాన్ని, దివాళాకోరుతనాన్ని జస్టిస్ కర్ణన్ ఉదంతం కన్న ఎక్కువగా ప్రకటించినది అరుణాచల్ మాజీ ముఖ్యమంత్రి కలిఖో పుల్ రాసిన ఆత్మహత్య లేఖ. కాపలాదారుగా పనిచేస్తూ చదువుకున్న కలిఖో పుల్ తర్వాతి జీవితంలో చిన్న పాన్ షాప్ పెట్టుకుని, వెదురు కంచెలు అల్లుతూ, ఇళ్లకు వెదురు బద్దల కప్పులు నేస్తూ, నిర్మాణ కూలీగా జీవితం సాగించారు. తర్వాత రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్ నాయకుడిగా 1995 నుంచి 2014 వరకు వరుసగా ఐదుసార్లు ఒకే నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ కాలంలో ఎన్నో మంత్రివర్గాలలో మంత్రిగా పనిచేశారు. మంత్రివర్గంలో పొడసూపిన భిన్నాభిప్రాయాలతో ఆయనను 2014 డిసెంబర్ లో మంత్రివర్గం నుంచి, 2015 ఏప్రిల్ లో పార్టీ నుంచి తొలగించారు. కాంగ్రెస్ లోని తిరుగుబాటు శాసనసభ్యులతో కలిసి, భారతీయ జనతా పార్టీ మద్దతుతో 2016 ఫిబ్రవరిలో ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కాని ఐదు నెలలు తిరగకుండానే ఆయనకు తగిన మద్దతు లేదని, ఆయనను ప్రభుత్వం స్థాపించమని ఆహ్వానించిన గవర్నర్ నిర్ణయాన్ని తప్పు పడుతూ సుప్రీం కోర్టు ఆయన ముఖ్యమంత్రిత్వాన్ని రద్దు చేసింది. ఆ తర్వాత నెలకు ఆయన ఇటానగర్ లోని అధికారిక గృహంలో 2016 ఆగస్ట్ 9న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తన ఆత్మహత్యకు ఒకరోజు ముందు ఆయన హిందీలో రాసిన అరవై పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన కాంగ్రెస్ నాయకులతో పాటు సుప్రీం కోర్టు న్యాయమూర్తుల మీద కూడ ఆరోపణలు చెశారు. స్వయంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహార్ సింగ్ కొడుకు తన దగ్గరికి వచ్చి అనుకూలమైన సుప్రీం కోర్టు తీర్పు రావాలంటే రు. 49 కోట్లు లంచం ఇమ్మని అడిగాడని ఆయన ఆ లేఖలో ఆరోపించారు. ఈ లేఖపై, ఆత్మహత్యపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కలిఖో పుల్ కుటుంబ సభ్యులు, అనుచరులు చేసిన ఆందోళన, డిమాండ్ ల మీద ఇంతవరకూ ఏ చర్యా లేదు.

ఈ వ్యక్తిగత ఉదంతాల, ఆరోపణలను మించినది అసలు సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలు ఏ ప్రాతిపదిక మీద జరుగుతున్నాయనే ప్రశ్న. ఇప్పటివరకూ ఈ న్యాయమూర్తుల నియామకాలకు పారదర్శకమైన, హేతుబద్ధమైన విధానం లేదంటే చాలమందికి ఆశ్చర్యం కలగవచ్చు గాని అది వాస్తవం. ఈ న్యాయమూర్తులను భారత ప్రధాన న్యాయమూర్తి సలహాతో రాష్ట్రపతి నియమిస్తారు అనే అస్పష్టమైన ప్రకటన తప్ప రాజ్యాంగం నిర్దిష్టంగా ఈ నియామకాల ప్రక్రియను ప్రతిపాదించలేదు. అంటే ఒకరకంగా ప్రధాన న్యాయమూర్తుల ఇష్టాయిష్టాలకో, అంతకన్న ఎక్కువగా రాష్ట్రపతి

ఇష్టాయిష్టాలకో ఈ నియామకాలను వదిలేశారు. రాష్ట్రపతి అంటే కేంద్ర ప్రభుత్వపు రబ్బర్ స్టాంపే గనుక న్యాయమూర్తుల నియామకాలు ప్రభుత్వ ఇష్టాయిష్టాలకు పరిమితమైనవిగా ఉండేవి. కాని 1981, 1993, 1998లలో వచ్చిన మూడు సుప్రీం కోర్టు తీర్పులు ఈ ఏకవ్యక్తి అధికారాన్ని విస్తృతం, పారదర్శకం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పాయి. ఆ తీర్పుల ఆధారంగా దేశంలో కొలీజియం వ్యవస్థ ఏర్పడింది. ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం తమ ముందు ఉన్న జాబితాలోని న్యాయమూర్తుల పదవీకాలాన్ని, సామర్థ్యాన్ని పరిశీలించి నియామకాల జాబితా తయారు చేస్తే ఆ జాబితాను రాష్ట్రపతి ఆమోదించాలనే పద్ధతి మొదలైంది.

ఈ పద్ధతిలో కూడ కొట్టవచ్చినట్టుగా కనబడే లోపాలు ఉన్నాయి గాని, దీనిలో కనీసం న్యాయమూర్తుల నియామక ప్రక్రియమీద న్యాయవ్యవస్థలో ఉన్నవారికే అధికారం ఉండింది. ఆ అధికారాన్ని తొలగించాలని, దాన్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకోవాలని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. అధికారంలోకి వచ్చిన మూడు నాలుగు నెలల లోపలే జాతీయ న్యాయమూర్తుల నియామకాల కమిషన్ చట్టం (నేషనల్ జుడిషియల్ అపాయింట్ మెంట్స్ కమిషన్ – ఎన్‌జెఎసి – ఆక్ట్ 2014) తయారు చేసి లోకసభ, రాజ్యసభలలో, రాష్ట్ర శాసనసభలలో ఆమోదింపజేసుకుని 2014 డిసెంబర్ 31న రాష్ట్రపతి ఆమోదముద్ర వేయించుకుంది. ఈ ఎన్‌జెఎసి లో భారత ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులతో పాటు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఇద్దరు 'ప్రముఖ వ్యక్తులు' ఉంటారని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఆరుగురు సభ్యుల కమిషన్ లో ముగ్గురు ప్రత్యక్షంగానూ, ఒకరు పరోక్షంగానూ ప్రభుత్వ పక్షం వహించేవాళ్లే నన్నమాట. న్యాయవ్యవస్థ నుంచి ఉన్న సభ్యులకు వీటో అధికారం ఇచ్చారు గాని అది ఏదైనా ప్రతిపాదనను తిరస్కరించడానికి మాత్రమే ఉపయోగ పడుతుంది. అలా తన ఇష్టం వచ్చినవారికి న్యాయమూర్తుల పదవులు కట్టబెట్టవచ్చునని భారతీయ జనతా పార్టీ భావించింది. ఈ ఎన్‌జెఎసి ఏర్పాటు సరైనదేనా అని సుప్రీం కోర్టులో జరిగిన విచారణలో మిగిలిన నలుగురు న్యాయమూర్తులు దాన్ని కొట్టివేయగా, భిన్నస్వరం ప్రకటించిన జస్టిస్ చలమేశ్వర్ అటు కొలీజియం సక్రమంగా పనిచేయడం లేదని, కొన్ని కుటుంబాల పట్ల పక్షపాతం వహిస్తున్నదని, దాని స్థానంలో తేదలచుకున్న ఎన్‌జెఎసి కూడ సరైన పరిష్కార మార్గం కాదని తన తీర్పులో రాశారు. ఎన్‌జెఎసి నిర్మాణం న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యంలో ప్రభుత్వ జోక్యానికి, దురాక్రమణకు దారి తీస్తుందని ఆయన అన్నారు.

ఎన్‌జెఎసి ఏర్పాటు కన్న కొద్ది ముందే, భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రాగానే న్యాయవ్యవస్థతో ఘర్షణ ప్రారంభమయింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా నియమించమని కొలీజియం చేసిన సిఫారసులలో మాజీ సొలిసిటర్ జనరల్ గోపాల్ సుబ్రమణియం పేరుకు కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పింది. ఆయన గతంలో తన పదవి హోదాలో సుప్రీం కోర్టు సహాయకుడిగా అమిత్ షాకు వ్యతిరేకంగా నివేదికలు తయారు చేశాడని భారతీయ జనతా పార్టీకి ఆయన మీద కోపంగా ఉంది. అలాగే, సోహ్రాబుద్దీన్, తులసీరామ్ ప్రజాపతి బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో అమిత్ షాకు డిఫెన్స్ న్యాయవాదిగా పనిచేసిన ఉదయ్‌లలిత్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ప్రతిపాదించాలని కూడ కొలీజియం మీద ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది.

ఇక సిబిఐ న్యాయమూర్తి బి.ఎచ్. లోయా అనుమానాస్పద మృతి తర్వాత ఆ కేసు మీద స్వతంత్ర విచారణ జరిపించడంలో సుప్రీం కోర్టు విఫలమయింది. లోయా మృతి తర్వాత ఆ స్థానంలోకి వచ్చిన ఎం బి గోసావి అనే న్యాయమూర్తి అమిత్ షా మీద కేసు ఎత్తివేయడాన్ని సుప్రీం కోర్టులో సవాల్ చేసినప్పుడు, మాజీ ప్రధాన న్యాయమూర్తి పి సదాశివం ఆ సవాలును కొట్టివేసి, ఆ కేసును తిరగదోడనక్కరలేదని తీర్పు ఇచ్చారు. కొద్ది కాలంలోనే ఆయన పదవీ విరమణ పొందగా మోదీ ప్రభుత్వం ఆయనను కేరళ గవర్నర్ గా నియమించింది.

ఇలా నిత్య సంక్షోభంలో ఉన్న భారత న్యాయవ్యవస్థ ప్రస్తుత వివాదంతో మరొక సంక్షోభానికి చేరింది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రజలు, బుద్ధిజీవులు అర్థం చేసుకోవలసిన అంశం భారత న్యాయ వ్యవస్థకు జవాబుదారీతనం లేదని, అది పారదర్శకంగా పనిచేయడం లేదని, దానికి ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉండవలసిన సంపూర్ణ స్వాతంత్ర్యం లేదని విస్పష్టంగా చూపుతున్నాయనేదే. న్యాయవ్యవస్థ మొత్తం రాజ్యాంగ యంత్రంలో భాగమని, అది ప్రజానుకూలంగా ఉండజాలదని, పాలకవర్గాలకే ఊడిగం చేస్తుందని, పాలకవర్గ ముఠాలలో అధికారం నెరపుతున్న ముఠాకు మద్దతుగా నిలబడుతుందని ఈ ఉదంతాలు చూపుతున్నాయి. న్యాయవ్యవస్థ గురించి మార్క్సిస్టు అవగాహనను ఈ తాజా సంక్షోభం, అంతకు ముందరి అవకతవకలు మరొకసారి రుజువు చేస్తున్నాయి. వీ

న్యాయమూర్తుల లేఖ

ప్రియమైన ప్రధాన న్యాయమూర్తి గారూ,

ఈ న్యాయస్థానం వెలువరించిన కొన్ని చట్టపరమైన ఉత్తర్వులు మొత్తంగా న్యాయ వితరణ పద్ధతి మీద, హైకోర్టుల స్వాతంత్ర్యం మీద ప్రతికూల ప్రభావం వేశాయని, దానితోపాటుగా గౌరవనీయ భారత ప్రధాన న్యాయమూర్తి కార్యాలయపు అధికారిక పనితీరు మీద ప్రభావం వేశాయని ఎత్తి చూపడానికి తీవ్రమైన ఆందోళనతో, వ్యథతో మీకు ఈ లేఖ రాయడం సమంజసమేనని మేం భావిస్తున్నాం.

కలకత్తా, బొంబాయి, మద్రాసులలో మూడు అధికారిక హైకోర్టులు స్థాపించిన నాటి నుంచి, న్యాయవ్యవస్థా నిర్వహణలో కొన్ని సంప్రదాయాలు, పద్ధతులు నెలకొని స్థిరపడ్డాయి. ఆ మూడు అధికారిక హైకోర్టుల తర్వాత వంద సంవత్సరాలకు ఉనికిలోకి వచ్చిన ఈ న్యాయస్థానం కూడ ఆ సంప్రదాయాలనే స్వీకరించింది. ఆ సంప్రదాయాలకు ఆంగ్లో సాక్సన్ న్యాయశాస్త్రంలో, ఆచరణలో మూలాలున్నాయి.

ప్రధాన న్యాయమూర్తి మొత్తం న్యాయస్థానపు కర్తవ్యసూచికి అధిపతిగా ఉంటారని, ఆ సూచికను నిర్ణయించే అధికారం వారికే ఉంటుందని ఇప్పటికే నిర్ణయమైపోయిన సూత్రాలలో ఒకటి. న్యాయస్థానాల సంఖ్య పెరిగినప్పుడు వాటి కార్యనిర్వహణను పద్ధతి

ప్రకారం నడపడానికి, న్యాయమూర్తులలో ఎవరు ఏ వ్యవహారాన్ని, ఏ వ్యాజ్యాన్ని, ఏ వ్యాజ్యాలను విచారించడం సముచితమో ఏర్పాట్లు చేయడానికి అత్యవసరంగా తయారు చేయవలసినది ఈ కర్తవ్యసూచి. ఇలా కర్తవ్యసూచి తయారుచేయడం, వేరువేరు న్యాయమూర్తులకు, ధర్మాసనాలకు వ్యాజ్యాలను అప్పగించడం ప్రధాన న్యాయమూర్తి హక్కు అని గుర్తించే సంప్రదాయం, న్యాయస్థానపు కార్యనిర్వహణను క్రమశిక్షణతో, ప్రభావశీలంగా నిర్వహించడం కోసం తయారు చేసినదే తప్ప న్యాయపరంగా గాని, వాస్తవికంగా గాని ప్రధాన న్యాయమూర్తికి మిగిలిన సహచరులకన్న ఏదో ఉన్నతాధికారం ఉన్నదనే గుర్తింపు కాదు. ప్రధాన న్యాయమూర్తి సమానులైన న్యాయమూర్తులలో మొదటివారు మాత్రమే గాని ఎక్కువో తక్కువో కాదనేది స్థిరపడిన న్యాయశాస్త్ర సూత్రం.

కర్తవ్యసూచిని నిర్ధారించే విషయంలో ప్రధాన న్యాయమూర్తికి మార్గదర్శకంగా ఉండే స్థిరపడిన, కాలపరీక్షకు నిలబడిన సంప్రదాయా లున్నాయి. ఒక ప్రత్యేక వ్యాజ్యాన్ని విచారించడానికి ధర్మాసనంలో ఎంత మంది న్యాయమూర్తులు ఉండాలో, వారి కూర్పు ఎలా ఉండాలో కూడ సంప్రదాయాలున్నాయి.

పైన చెప్పిన సూత్రానికి తప్పనిసరిగా కలిసి ఉండే మరొక సూత్రం ఏమంటే ఈ న్యాయస్థానంతో సహా ఎక్కువమంది సభ్యులున్న ఏ న్యాయ బృందమైనా, ఇతర సముచిత ధర్మాసనాలు విచారించవలసిన వ్యవహారాలను తన అధీనంలోకి తీసుకోవడం, వాటి మీద తీర్పులు వెలువరించడం సమంజసం కాదు. ఆ సముచిత ధర్మాసనాలలో తగిన కూర్పులు, తగినంతమంది న్యాయమూర్తులు ఉండవచ్చు. కర్తవ్యసూచిని గౌరవిస్తూనే ఈ మాట చెప్పవలసి ఉంది.

ఈ రెండు సూత్రాల నుంచి వైదొలగడం వ్యవస్థ నిజాయితీ పట్ల సమాజంలో సందేహాలు సృష్టించే విచారకరమైన, అవాంఛనీయమైన పరిణామాలకు దారితీయడం మాత్రమే కాదు, దాని వల్ల గందరగోళం కూడ తలెత్తుతుంది.

పైన ప్రస్తావించిన రెండు సూత్రాలను ఇటీవలి కాలంలో కచ్చితంగా పాటించడం లేదని చెప్పడానికి మేం విచారిస్తున్నాం. దేశానికి, న్యాయవ్యవస్థకు విస్తారమైన పర్యవసానాలకు దారి తీయగల వ్యాజ్యాలను ఈ న్యాయస్థానపు ప్రధాన న్యాయమూర్తి ఎంపిక చేసిన ధర్మాసనాలకు అప్పగించిన ఉదాహరణలున్నాయి. అలా ప్రత్యేక ధర్మాసనాలకు అప్పగించడం ఎటువంటి హేతుబద్ధ పునాది లేకుండా "తమ ఇష్టం కొద్దీ" జరిగింది. ఎటువంటి పరిస్థితిలోనైనా ఇలా జరగకుండా చూడవలసి ఉంది.

ఈ వ్యవస్థను మరింత ఇబ్బంది పెట్టకుండా ఉండాలనే కారణంతోనే మేం ఇక్కడ ఆ వివరాలు ఇవ్వడం లేదు. కాని అటువంటి ఉదాహరణలు ఇప్పటికే ఈ న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కొంతవరకు దెబ్బతీశాయి.

ఈ నేపథ్యంలో, ప్రత్యేకంగా ఆర్ పి లూథ్రా వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా వ్యాజ్యంలో 27.10.2017న విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా న్యాయమూర్తుల నియామకాల ప్రక్రియను నిర్ధారించడంలో మరింత ఆలస్యం జరగగూడదని ఇచ్చిన ఉత్తర్వులను మీ దృష్టికి తేదలచుకున్నాం. ఈ న్యాయమూర్తుల నియామక ప్రక్రియ అనేది ఈ న్యాయస్థానపు రాజ్యాంగ ధర్మాసనపు పరిధిలోని అంశం అయినప్పుడు, సుప్రీం కోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్, తదితరులు వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే వ్యాజ్యాన్ని (2016)(5 ఎస్‌సిసి 1) ఆ ధర్మాసనం విచారించినప్పుడు, ఆ వ్యవహారంలోనే మరొక ధర్మాసనం ఎలా జోక్యం చేసుకుంటుందో అర్థం చేసుకోవడం కష్టంగా ఉంది.

అది అలా ఉంచి, రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయం తర్వాత, (మీతో సహా) ఐదుగురు న్యాయమూర్తుల కొలీజియం సవివరమైన చర్చ జరిపి న్యాయమూర్తుల నియామక ప్రక్రియను నిర్ధారించి, అప్పటి గౌరవ ప్రధాన న్యాయమూర్తి ద్వారా ప్రభుత్వానికి 2017 మార్చ్ లో పంపింది. ఆ లేఖకు భారత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ప్రతిస్పందన లేదు. ఈ ప్రభుత్వ మౌనాన్ని గమనంలో ఉంచుకుంటే, పైన ఉటంకించిన సుప్రీం కోర్ట్ అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ తీర్పు పునాదిగా కొలీజియం నిర్ధారించిన న్యాయమూర్తుల నియామక ప్రక్రియను ప్రభుత్వం ఆమోదించిందనే అనుకోవాలి. కనుక ఈ స్థితిలో మళ్లీ మరొక ధర్మాసనం న్యాయమూర్తుల నియామక ప్రక్రియను నిర్ధారించమని అడగవలసిన సందర్భమే ఉత్పన్నం కాదు. లేదా ఆ సమస్య ఇంత అనిశ్చిత కాలం కొనసాగవలసిన అవసరం లేదు.

ఈ న్యాయస్థానపు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2017 జూలై 4న గౌరవ శ్రీ జస్టిస్ సి ఎస్ కర్ణన్ (2017) (1 ఎస్ సి సి 1) వ్యాజ్యంలో తీర్పు ప్రకటించింది. మేం పైన ఉటంకించిన ఆర్ పి లూథ్రా తీర్పులో మాలో ఇద్దరు న్యాయమూర్తులం న్యాయమూర్తుల నియామకాల ప్రక్రియను పునరాలోచించవలసి ఉన్నదని, వెనక్కి పిలవడం (ఇంపీచ్ మెంట్) కాకుండా ఇతర సవరణా చర్యల యంత్రాంగాన్ని రూపొందించవలసి ఉన్నదని సూచించాం. ఈ ఏడుగురు విజ్ఞులైన న్యాయమూర్తుల తీర్పులో న్యాయమూర్తుల నియామక ప్రక్రియ గురించి ఏ సూచనా చేయలేదు.

న్యాయమూర్తుల నియామక ప్రక్రియ గురించిన ఏ విషయమైనా ప్రధాన న్యాయమూర్తుల సమావేశంలో గాని, పూర్తి న్యాయస్థానం గాని చర్చించాలి. అత్యంత ప్రాముఖ్యత గల ఆ విషయాన్ని న్యాయవ్యవస్థవైపు నుంచే తేల్చదలచుకుంటే అందుకు రాజ్యాంగ ధర్మాసనానికి తప్ప మరొకరికి ఆ బాధ్యత అప్పగించగూడదు.

ఈ పరిణామాన్ని గంభీరమైన శ్రద్ధతో పరిశీలించవలసి ఉంది. ఇతర కొలీజియం సభ్యులతో, అవసరమైతే, ఆ తర్వాత స్థాయిలో ఈ న్యాయస్థానానికి చెందిన న్యాయమూర్తులందరితో పూర్తిస్థాయి చర్చ తర్వాత ఈ పరిస్థితిని సరిదిద్దే, తగిన సవరణా చర్యలు తీసుకునే విధ్యుక్త ధర్మం గౌరవ ప్రధాన న్యాయమూర్తిదే.

ఆర్ పి లూథ్రా వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా వ్యాజ్యంలో 27.10.2017న వెలువడిన ఉత్తర్వుల వల్ల తలెత్తిన, పైన ప్రస్తావించిన ఈ సమస్య తగిన విధంగా మీరు పరిష్కరించిన తర్వాత, అవసరమైతే, అటువంటి చర్యలే తీసుకోవలసిన, ఈ న్యాయస్థానం వెలువరించిన ఇతర న్యాయపరమైన ఉత్తర్వుల గురించి మీకు ప్రత్యేకంగా తెలియజేస్తాము.

గౌరవంతో

జస్టిస్ జె చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గోగోయి,
జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్

ప్రజల ముందుకు న్యాయ వ్యవస్థ

న్యాయ వ్యవస్థ పాలకుల కనుసన్నల్లోనే నడుస్తుంది తప్ప ప్రజలకు ఎండమావేనని, ఆ వ్యవస్థలోని లోపాలను న్యాయమూర్తులు ఎత్తి చూపుతున్నారని, ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాల్లోనే సామాజిక న్యాయాన్ని వెతుక్కోవాలని అంటున్నారు షేక్ కరిముల్లా

దేశచరిత్రలో తొలిసారి న్యాయం ప్రజల ముందుకు వచ్చింది. చరిత్రలో ఎన్నడూలేని విధంగా నలుగురు న్యాయమూర్తులు బహిరంగంగా విలేకరుల సమావేశం పెట్టి మరీ అత్యున్నత న్యాయవ్యవస్థ పనితీరులోని లోపాలను బహిర్గత పరిచారు. అట్లాగే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పనితీరును తప్పుబడుతూ, ఆయన అభిశంసనపై జాతి నిర్ణయం తీసుకునేంత వరకు వెళ్లింది వారి ఆగ్రహం. దేశ న్యాయచరిత్రలో ఇదో అసాధారణ సందర్భం కావచ్చు. దీంతో ఇప్పుడు ఏం జరుగుతోంది? ఇది ఇప్పుడు దేశ ప్రజలందరిలో ఉత్కంఠ! ఈ వ్యాసం రాస్తున్న సమయానికి సమస్య యథాతథం. పరిస్థితిలో మార్పులేదు.

ప్రస్తుత తాజా పరిణామాలు చూస్తుంటే 'శకునం చెప్పే బల్లి కుడితిలో పడినట్లయింది' న్యాయ పాలిక వ్యవహారం. ప్రస్తుత ఈ న్యాయవ్యవస్థ సంక్షోభం మన ప్రజాస్వామిక వ్యవస్థలోని డొల్లతనాన్ని బహిర్గత పరిచింది. దీంతో అన్ని వ్యవస్థలు కూలిపోయాయని చెప్పవచ్చు.

భారత రాజ్యాంగం శాసన, కార్య నిర్వాహక శాఖలతో పాటు ఒక స్వతంత్ర న్యాయవ్యవస్థను ఏర్పాటు చేసింది. అదే సుప్రీంకోర్టు. దేశంలోని రాష్ట్ర స్థాయి, స్థానిక స్థాయి న్యాయస్థానాలన్నీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తాయి. కావున దీన్ని భారత సర్వోన్నత న్యాయస్థానం అంటారు. దేశంలో ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలో 1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా 1774లో కలకత్తాలోని ఫోర్టు విలియంలో మొదటిసారి సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు.

భారత ప్రభుత్వ చట్టం 1935 ద్వారా ఫెడరల్ కోర్టును ఏర్పాటు చేశారు. రాజ్యాంగ నిర్మాతలు బ్రిటన్, అమెరికాల్లో ఉన్న న్యాయవ్యవస్థలను దృష్టిలో పెట్టుకుని సుప్రీంకోర్టును రూపకల్పన చేశారు. బ్రిటన్ రాజ్యాంగం నుంచి ఏకీకృత, సమన్యాయ పాలనను, అమెరికా రాజ్యాంగం నుంచి న్యాయ సమీక్ష, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయవ్యవస్థను గ్రహించారు.

1950 జనవరి 28న మొదటి సుప్రీంకోర్టు సమావేశం పార్లమెంట్ భవనంలోని ప్రిన్సెస్ చాంబర్‌లో జరిగింది. రాజ్యాంగంలోని 5వ భాగం 4వ అధ్యాయంలోని 124 నుంచి 147 వరకు గల 24 ప్రకరణలు సుప్రీంకోర్టు నిర్మాణం, న్యాయమూర్తుల నియామకం, అర్హతలు, అధికారాలు విధుల గురించి పేర్కొన్నాయి. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు ప్రత్యేక అర్హతలను రాజ్యాంగం పేర్కొనలేదు. సాధారణంగా సీనియర్ న్యాయమూర్తిని నియమిస్తారు. 1950 నుంచి 1973 వరకు ఇదే నియమాన్ని పాటించారు.

1973లో కేశవానంద భారతి కేసులో ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉన్నదని ఆమోదిస్తూనే, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. తదుపరి 1975లో అలహాబాదు హైకోర్టు ఇందిరాగాంధీ ఎన్నికను రద్దు చేసింది. ఈ పరిణామాలు అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వానికి కోపం తెప్పించాయి. అప్పటి న్యాయ శాఖా మంత్రి ఎచ్.ఆర్. గోఖలే సుప్రీంకోర్టు పాత్రను నిశిత పదజాలంతో విమర్శించారు కూడా. అనంతరం ముగ్గురు సీనియర్ న్యాయమూర్తు (జ.ఎం. షేలట్, ఎ.ఎన్. గ్రోవర్, కె.ఎస్. హెగ్డే) లను కాదని జూనియర్ అయిన ఎ.ఎన్. రేను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.

1977లో కూడా సీనియర్ న్యాయమూర్తి అయిన ఎచ్.ఆర్. ఖన్నాను కాదని జూనియర్ అయిన ఎం.ఎచ్. బేగ్‌ను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఈ ఘటనలన్నీ న్యాయవ్యవస్థ రాజకీయాలకు అతీతం కాదని, స్వతంత్రం కాదని ఈ వ్యవస్థపై రాజకీయ ప్రభావం బలమైనదని అనేక సంఘటనలు రుజువు చేశాయి.

ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ పార్టీ పాలన ఏకఛత్రాధిపత్యంగా కొనసాగుతుండడంతో న్యాయవ్యవస్థపై రాజకీయ ఆధిపత్యానికి బీజం ఇక్కడే పడింది. బయటకు కనపడిన, కనబడక పోయిన న్యాయమూర్తుల నియామకాలన్నీ రాజకీయ నేపథ్యంలో జరిగేవే అన్నది స్పష్టం. ఈ పరంపర నేటికీ కొనసాగుతూ ఉంది. న్యాయవ్యవస్థపై అధికార రాజకీయ పార్టీల ప్రభావం బలంగా ఉంటూ ఉంది.

1982లో ఎస్‌పి. గుప్తా కేసు తీర్పుకు ముందు న్యాయమూర్తుల నియామకం, బదిలీలు అన్నీ అధికార పార్టీ నియంత్రణలో ఉండేవి. ఈ తీర్పుతో న్యాయమూర్తులే న్యాయమూర్తులను నియమించుకునే 'కొలీజియం' వ్యవస్థ ఏర్పడింది. ఇది రాజ్యాంగంలోని 124వ ప్రకరణ ద్వారా ఏర్పాటు చేశారు. దీని ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో సుప్రీంకోర్టుకు చెందిన ఐదుగురు న్యాయమూర్తుల సంఘం న్యాయమూర్తులను నియమిస్తుంది.

ఈ విధానాన్ని రద్దు చేయాలని 2003లో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ సఫలం కాలేకపోయింది. తిరిగి రాజకీయ గుత్తాధిపత్యం కోసం 99వ రాజ్యాంగ సవరణ చేస్తూ, న్యాయమూర్తుల నియామకాలలో రాజకీయ ఆధిపత్యానికి పదును పెడుతూ 124-ఎ, 124-బి, 124-సి అధికరణలు కొత్తగా చేర్చబడినాయి. ఇది 2015 ఏప్రిల్ 13 నుండి అమలులోకి వచ్చింది. దీంతో న్యాయమూర్తుల నియామక కొలీజియం వ్యవస్థ రద్దు చేస్తూ, మొత్తం నియామక ప్రక్రియను నిర్దేశిస్తూ సర్వాధికారాలను పార్లమెంట్‌కు సంక్రమింప చేశారు. అంటే ఇప్పటివరకు ఉన్న పరోక్ష రాజకీయ జోక్యాన్ని ప్రత్యక్షం చేశారు. అయితే కొద్దినెలల వ్యవధిలోనే 99వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగ విరుదమంటూ

సుప్రీంకోర్టు 2015 అక్టోబర్ 16న 1030 పేజీల సుదీర్ఘ తీర్పును ఇచ్చింది. దీంతో 99వ రాజ్యాంగ సవరణ రద్దు కాబడినది.

న్యాయ నియామకాల కమిషన్ పేరుతో న్యాయమూర్తుల నియామకాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, తమకు అనుకూలంగా ఉండే వారినే న్యాయమూర్తులుగా నియమించుకొని తమ పబ్బం గడుపు కోవాలన్న రాజకీయ నాయకుల ఆశకు బ్రేక్‌పడింది. దీంతో న్యాయవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థల మధ్య యుద్ధం పరాకాష్టకు చేరింది. న్యాయవ్యవస్థపై రాజకీయ నాయకులు విమర్శలు ఆరంభించారు.

ఈ విషయమై గత ఏడాది ఒక సమావేశంలో ప్రధాని మోడీ సమక్షంలో మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిఎస్. ఠాకూర్ రోధించడమే ఇందుకు నిదర్శనం.

ఇన్ని జరుగుతున్నా రాజకీయ ఆధిపత్యం న్యాయవ్యవస్థపై తిరుగులేనిదని నిరూపితమైనది. న్యాయమూర్తులను ప్రలోభపెట్టి, తమ పబ్బం గడుపుకోవడంలో ఇప్పుడున్న రాజకీయ వ్యవస్థ ఆరితేరింది. అంతేకాక దిగజారిన కొంతమంది న్యాయమూర్తులు పదవీ విరమణ అనంతరం పదవులతో ప్రయోజనం పొందాలని ఆరాటపడుతుండడం వల్ల న్యాయవ్యవస్థ ప్రతిష్ట దిగజారింది.

పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు కొందరు రాష్ట్ర గవర్నర్లు గాను, వివిధ ఉన్నత స్థాయి ప్రభుత్వ కమిటీల ఛైర్మన్స్ గాను, మరికొన్ని అత్యున్నత పదవుల్లో నియమితులవుతున్నారు. దీనివల్ల న్యాయమూర్తులను పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరించేలా ప్రభావితం చేయడానికి అవకాశం ఏర్పడింది. కాబట్టి పదవి విరమణ పొందిన న్యాయమూర్తులు ఎటువంటి పదవులు చేపట్టరాదని నిబంధనలు విధించాలి.

ఈ కోవలో చూస్తే 1993లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామస్వామిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2011లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. మన రాష్ట్రంలో గాలి జనార్దన్‌రెడ్డికి బెయిలిచ్చే విషయంలో న్యాయమూర్తి పాత్ర అందరికి తెలిసిందే. లక్నో మెడికల్ కాలేజీ అడ్మిషన్లు అనుమతించిన వ్యవహారంలో ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా పాత్రపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇలా న్యాయవ్యవస్థపై ఇప్పటికే మచ్చపడింది.

న్యాయవ్యవస్థలో కుల, మత తత్వాలను, అవినీతి అక్రమాలను న్యాయమూర్తులే బట్టబయలు చేయడం ఇది మొదటిసారి కాదు. ఇంతకు ముందు జస్టిస్ కన్నన్, జస్టిస్ మార్కండేయ ఖట్జూ వంటి న్యాయమూర్తులు కూడా వీటిని బహిర్గత పరిచారు.

తాజా సంక్షోభానికి గల కారణాలు పరిశీలిస్తే అత్యంత కీలకమైన, ముఖ్యమైన కేసులన్నింటిని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనమే విచారణ చేపడుతుందని, వీటిని తమ ధర్మాసనాలకు కేటాయించడం లేదని నలుగురు జడ్జీలు భావిస్తున్నారు. సంచలనం సృష్టించిన షాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో విచారణ జరిపిన సిబిఐ ప్రత్యేక జడ్జీ ఆర్.ఎం. లోయ అనుమానాస్పద మృతి కేసులో ప్రధాన ముద్దాయి అమిత్‌షా. అలాగే బాబ్రీమసీదు కేసు మొదలైనవి రాజకీయంగా సున్నితమైన కేసులు.

ఈ కేసుల్లో తీర్పులు పాలక పక్షానికి అనుకూలంగా ఉండేలా న్యాయవ్యవస్థను ప్రభావితం చేసి, రానున్న ఎన్నికలలో లబ్ధి పొందాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థపై ఒత్తిడి ఉండడం సహజం. దీని పర్యవసానమే ప్రస్తుత సంక్షోభం.

బెంచ్ కేటాయింపు, రోస్టర్, కేసుల్ని డీల్ చేస్తున్న విధానం. ఇవన్నీ విభేదాలకు కారణంగా పైకి కనిపిస్తున్నప్పటికీ, రాజకీయ అంతరాలే అసలు కారణం. బిజెపి, కాంగ్రెస్ అధికారంలో ఎవరున్నా ఆ నేతల ప్రమేయాలు చాలా కేసుల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. 'రాజకీయాల చేతుల్లో ఓ పావుగా న్యాయవ్యవస్థ ఎప్పుడో మారిందని, దాని విపరీత పరిణామాలే ఇప్పుడు చూస్తున్నామని' సీనియర్ లాయర్ దుష్యంత్‌దవే వ్యాఖ్యానించారు.

అయితే ఇంతటి కలుషిత వ్యవస్థలో కూడా ప్రజారంజక మంచి తీర్పులిచ్చి న్యాయవ్యవస్థకు వన్నెతెచ్చిన న్యాయమూర్తులూ ఉన్నారు. జస్టిస్ చిన్నప్పరెడ్డి, కృష్ణయ్యార్, భగవతీలు ఈ కోవకు చెందినవారు. వీరు ఎక్కడా లొంగకుండా రాజ్యాంగ మౌలిక తత్వం, ఆశయాలకు అనుగుణంగా నడుచుకున్నారు. న్యాయచరిత్రలో ధృవతారలుగా నిలిచి పోయారు. ఇలాంటి న్యాయమూర్తుల అవసరం నేడు ఎంతైనా ఉంది.

న్యాయవ్యవస్థ ప్రజలకు జవాబు దారిగా ఉంటూ, పారదర్శకంగా పనిచేస్తూ, న్యాయాన్ని రక్షిస్తూ రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి. కాని ఇలా జరగడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు దాటినా అందరికి అందుబాటులో న్యాయం లేదు.

సుప్రీంకోర్టు ఢిల్లీలో ఉంది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు చాలా దూరం. అందువలన సుప్రీంకోర్టు బెంచీలను వివిధ ప్రాంతాలలో బొంబాయి, కలకత్తా, మద్రాసులలో ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంతో కాలంగా మేధావులు, సామాజిక ఉద్యమకారులు ఆందోళన చేస్తున్నారు. కాని అటువంటి ప్రయత్నం ప్రభుత్వాలు కాని, సుప్రీంకోర్టు కాని చేయలేదు. 2015లో కూడా సుప్రీంకోర్టు ఈ అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో సుప్రీంకోర్టు సామాన్యునికి అందనంత దూరంలో ఉండిపోయింది

. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో 39 (ఎ) అధికరణ న్యాయం పొందడాన్ని అత్యంత ముఖ్యమైన మానవ హక్కుగా వ్యాఖ్యానిస్తోంది. దురదృష్టవశాత్తు ఢిల్లీ దాకా వెళ్లి ధన బలంగల వారికే దేశంలో ఇప్పుడు న్యాయం అందుబాటులో ఉంది. ఈ వాతావరణం బడుగు జీవులకు నిర్ద్వందంగా న్యాయాన్ని నిరాకరిస్తుంది. ఇది మానవ హక్కుల ఉల్లంఘన కాదా? అలాగే పౌరులకు సత్వర న్యాయం జరగాలని, ఆలస్యమైతే న్యాయాన్ని నిరాకరించినట్లేనని రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు వేదికలపై మాట్లాడుతారు. కానీ ఆచరణ శూన్యం.

చిన్న చిన్న కేసులకు కూడా ప్రజలు పనులు మానుకుని రోజుల తరబడి వాయిదాలకు తిరుగుతున్న దుస్థితి నేడు నెలకొని ఉంది. ఇది పౌరుల ప్రాథమిక హక్కులకు, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం కాదా? కాబట్టి న్యాయ స్థానాలు ప్రజలకు దూరంగా ఉండిపోతున్నాయి. ఇకనైనా బుద్ధిజీవులు, ప్రజాస్వామిక వాదులు, ప్రజలు మేల్కొని సామాన్య ప్రజలకు ఉపయోగపడే, వారి బాధలు తీర్చే ఒక అత్యున్నత ప్రత్యామ్నాయ రాజకీయాలతో ఒక మంచి సామాజిక వ్యవస్థను రూపొందించుకోవాలి. ఇదే నేడు ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

(రచయిత సామాజిక విశ్లేషకులు) వీ

కోడెవాగు ఎన్‌కౌంటర్ ప్రభుత్వ హత్య

పాలకులు ఎవరైనా ప్రజల పట్ల, ప్రత్యామ్నాయ రాజకీయాల పట్ల అణచివేత విధానాన్నే కొనసాగిస్తున్నారనీ, దానికి కోడెవాగు బూటకపు ఎన్‌కౌంటర్ తాజా ఉదాహరణ అని అంటున్నారు **ప్రొ. లక్ష్మణ్ గడ్డం**

స్వతంత్ర తెలంగాణ గడ్డ 2017, డిసెంబర్ 14 వేకువజామున మరోసారి విప్లవకారుల రక్తంతో తడిసింది. తెలంగాణలో ఇనుపబూట్ల చప్పుడులుండవని, తెలంగాణ గడ్డలో రక్తపు మరకలుండవని ముఖ్యమంత్రి చెప్పిన మాటలు ఉత్త గాలి మాటలయ్యాయి. నక్సలైట్ల ఎజెండాను అమలుపరుస్తామన్న తెలంగాణ ముఖ్యమంత్రి నక్సలైట్ల నిర్మూలన విధానంలో మార్పురాలేదు. ఇక నుంచి మా పోలీసులు ప్రజల పట్ల ఫ్రెండ్లీగా ఉంటారన్న ముఖ్యమంత్రి నక్సలైట్ల ఎడల ఎట్లుంటరో ప్రకటించలేదు. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాల పట్ల, ఉద్యమాల పట్ల తన పాలసీ విధానం ఏమిటనేది ఇప్పటివరకు స్పష్టంగా వివరించ లేదు. గ్రేహౌండ్స్ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతుంది కనుక సీమాంధ్ర పాలకులు అనుసరించిన హింసా, అణచివేత, నిర్మూలనా పాలసీనే కొనసాగుతుందని వెల్లడవుతుంది. వలస పాలకుల పాలసీలనే అమలు పరిస్తే అది తెలంగాణ పునర్నిర్మాణమెలా అవుతుంది? మాటల గారడి కొత్తగా ఉంది తప్ప ఆచరణలో అంతా పాత పద్ధతని ప్రజలకు అర్థమైంది.

తెలంగాణలో పోలీసుల హింస కొనసాగుతుంది, ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. లాకప్ మరణాలు జరుగుతున్నాయి. ప్రజా ఉద్యమాలకు తావివ్వడం లేదు. సభలు, సమావేశాలు, ధర్నాలు ఆందోళనలు, ర్యాలీలకు అనుమతివ్వడం లేదు. అడుగడుగునా పోలీసులే అగుపిస్తున్నారు. కాని బంగారు తెలంగాణ ఎక్కడా కనిపించడం లేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇప్పటివరకు జరిగిన ఏడు ఎన్‌కౌంటర్ ఘటనల్లో 21 మంది చనిపోయారు. లాకప్ హింసల వల్ల ఐదుగురు మరణించారు. పోలీసుల వేధింపులకు గురైన వారి సంఖ్యకు లెక్కలేదు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక ఐదుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

ఈ క్రమంలోనే కోడెవాగు ఎన్‌కౌంటర్ జరిగింది. గ్రేహౌండ్స్ పోలీసులు తొమ్మిది మంది నక్సలైట్లను బలిగొన్నారు. 2017, డిసెంబర్ 14 వేకువజామున తుపాకుల మోతతో కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి మండలం మేడమడుగు గ్రామం సమీపంలో చుట్టూ కొండలు, మధ్య పచ్చని పొలాలతో ప్రశాంతంగా పారే కోడెవాగు దద్దరిల్లింది. చెట్లు ఒక్కసారిగా తుళ్లిపడ్డాయి. పక్షులు చెల్లాచెదురై ఎగిరిపోయాయి. రాజ్యహింస వికృతంగా రాజ్యమేలింది.

2017, ఆగస్ట్ 1న జనశక్తి, ప్రతిఘటన పార్టీలలో గతంలో పనిచేసిన నాయకులు కొందరు కలిసి సిపిఐ ఎం.ఎల్. (చంద్రపుల్లా రెడ్డి బాట) నూతన పార్టీగా ఆవిర్భవించి సాయుధ దళాలను ప్రకటించారు. నిర్మాణపరంగా పార్టీ పటిష్టం కాకముందే దళాలను పోలీసులు కాల్చిచంపారు. ప్రత్యామ్నాయ రాజకీయాల మనుగడ సాగనివ్వకూడదనేది ప్రభుత్వ విధానం.

డిసెంబర్ 13న రాత్రి 9 గంటలకు ఓపెన్‌కాస్ట్ గని కాంట్రాక్టర్‌ను కలవడానికి వెళ్లిన దళాన్ని పక్కా సమాచారంతో చుట్టుముట్టిన పోలీసులు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. సమీప అడవిలోకి తీసుకెళ్లి రాత్రంతా చిత్రహింసలకు గురిచేశారు. నక్సలైట్లను అడవిలో చిత్రహింసలకు గురి చేయడం బహుశా రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. తెలంగాణ ఏర్పడ్డాక తెలంగాణ పోలీసులు ఈ విశేష ఘనతను కూడా దక్కించుకుని దేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు.

అడవిలో ఎక్కడో చిత్రహింసలకు గురిచేసి కొనవూపిరితో ఉండగా స్పృహకోల్పోయిన నక్సలైట్లను ట్రాక్టర్‌లో తీసుకుని వచ్చి కోడెవాగులో పడేశారు. ఒక్కొక్క శవానికి మధ్య ఫర్లాంగు, రెండు ఫర్లాంగుల దూరం ఉంటుంది. ఒక్కొక్క శవాన్ని ఒక్కోచోట, మరోచోట రెండు శవాలను పడేశారు. 14న శవాలను బయటపెట్టి ఎనిమిది మంది నక్సలైట్లు చనిపోయారని ప్రకటించారు. మరుసటి రోజు చెట్ల పొదల్లోంచి మరో శవాన్ని బయటికి తీసి మొత్తం తొమ్మిది మంది చనిపోయినట్లుగా ప్రకటించి నిజమైన ఎన్‌కౌంటర్ అని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. కోడెవాగు నుంచి శవాలను ఆసుపత్రికి తరలించడానికి తెచ్చిన ట్రాక్టరుకు ముందే రక్తపు మరకలుండడం ప్రజలు గమనించారు. పత్రికలు ఇదే కథనాన్ని ప్రధానంగా ప్రచురించాయి. అంటే ఇదే వాహనాన్ని చిత్రహింసల స్థలం దగ్గర నుంచి స్పృహ కోల్పోయి, గాయాలై, రక్తం కారుతున్న వారిని కోడెవాగు వరకు తీసుకురావడానికి కూడ ఉపయోగించారని అర్థమవుతుంది. శవాలు పడి ఉన్న చోట ఒకచోట ముద్దగా రక్తం కారి ఉంది. స్పృహలో ఉన్న మనిషిని కాల్చితే ఇటు అటు కదులుతాడు కనుక రక్తం చిందరవందరగా పడుతుంది. అదేమీ లేకుండా ఒకేచోట రక్తం తుప్పగా కారి ఉంది.

పౌరహక్కుల సంఘాలు చెట్లకు తూటాలు తగిలిన గుర్తులు లేవని చాలా ఎన్‌కౌంటర్ ఘటనలలో లేవదీసి పోలీసులను ఇరకాటంలో పెట్టినందుకు కాబోలు ఈ ఎన్‌కౌంటర్‌లో చెట్లకు తూటాలు తగిలిన గుర్తులున్నాయి. అది కూడా నక్సలైట్లు పడి ఉన్న చెట్లకే ఉన్నాయి.

నక్సలైట్ల శవాలు పడిఉన్న వైపు వాగు, దట్టమైన చెట్లు, అడవి ఉంది. కాని పోలీసులు కాల్పులు జరిపిన వైపు అడవి ఉండదు. అది పలుచగా చెట్లు ఉండే మైదాన ప్రాంతం. పంటలతో ఉన్న ప్రాంతం. పోలీసులు పొజిషన్ తీసుకుని కాల్చడానికి రక్షణగా ఏమి లేదు. అక్కడక్కడ పల్చని చెట్లు తప్ప. నక్సలైట్లు కాల్పులు జరిపితే ఈ చెట్లకు తగిలిన గుర్తులుండాలి కాని అవి ఏమీ లేవు. చనిపోయిన వారు దట్టమైన అడవితో కూడుకున్న వాగు అంచున ఉన్నారు. చంపిన వాళ్లు మాత్రం

ఎంచక్కా చక్కని మైదానంలో ఉండి కాల్పులు జరిపారు. ఇది నిజమైన ఎన్‌కౌంటరట. నక్సలైట్లు అక్కడ మకాం వేసిన దాఖలాలు కూడా లేవు. టెంట్లు వేసుకో లేదు. సమావేశానికి కావల్సిన సామాగ్రి సమకూర్చుకోలేదు. వంటలు చేసుకున్న గుర్తులు కాని, సంచరించిన అడుగుజాడలు కాని లేవు.

అయినా కాని 'మేడ మడుగు అటవీ ప్రాంతంలో సిపిఐ ఎంఎల్ (చంద్రపుల్లా రెడ్డి బాట) దళం సమావేశమైందన్న సమాచారంతో బోడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ అనిల్ నేతృత్వంలో పోలీసులు డిసెంబర్ 14న ఉదయం 6.30 గంటలకు అక్కడికి వెళ్లారు. లొంగిపోవాలని హెచ్చరించారు. వారు వినకుండా కాల్పులకు దిగారు. పోలీసులు ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చింది. కాల్పులనంతరం పరిశీలించగా ఎనిమిది మంది అక్కడికక్కడ మృతి చెందారు. మరికొందరు పారిపోయారని కొత్తగూడెం జిల్లా ఎస్‌పి అంబర్ కిషోర్ ఝా ప్రకటించారు. మరుసటి రోజు మరో శవాన్ని బయటికి తీశారు. ఈ తొమ్మిది మందిలో అయిదుగురు మాత్రమే దళ సభ్యులు, మిగతా నలుగురు మాత్రం నిరాయుధులైన గ్రామీణ యువకులు.

దట్టమైన అడవి, పైగా వాగులో సమావేశమైన తొమ్మిది మందిని మైదానం నుండి కాల్పులు జరిపి హతమార్చి ఒక్క చిరుగాయం కూడా లేకుండా తప్పించుకోగలిగారు మన తెలంగాణ పోలీసులు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన నెంబర్ వన్ పోలీసులు గదా మరి! ఈ కథలు కల్పితాలని, వారు చేస్తున్నవి హత్యలని గత 45 ఏళ్లుగా పౌరహక్కుల సంఘం చెబుతూనే ఉంది. ఎన్‌కౌంటర్ అంటేనే బూటకమనే అభిప్రాయం ప్రజల్లో బలపడిపోయింది.

'మేము వాళ్లని లొంగిపొమ్మంటే వినకుండా మా మీద కాల్పులు జరిపితే ఆత్మరక్షణ కోసం మేము ఆ తరువాత కాల్పులు జరిపాం' అనే అబద్ధాన్ని పోలీసులు ఎన్‌కౌంటర్‌లు మొదలుపెట్టిన గత 45 ఏళ్లుగా వినిపిస్తున్నారు. ఆత్మరక్షణ పదమే ఇవాళ ఆత్మరక్షణలో పడిపోయింది. అర్థం వక్రీకరించబడింది. ఆత్మరక్షణలో కాల్పులు జరిపాం అనేది నిజమా అబద్ధమా అనేది కోర్టులో రుజువు కావాలి. పోలీసులే ఏకపక్షంగా ప్రకటించి మూసేయడానికి వీలులేదు. అయితే ఆత్మరక్షణలో ఎదుటివ్యక్తి ప్రాణం తీయడానికి, ఉద్దేశపూర్వకంగా తీయడానికి చాలా తేడా ఉంది.

ఆత్మరక్షణలో మాత్రమే హత్య జరిగిందని కోర్టు నమ్మితేనే పోలీసులకు హత్యానేరం నుండి విముక్తి లభిస్తుంది. కోర్టుకు ఆ నమ్మకం కలిగించే బాధ్యత పోలీసులపైనే ఉంటుంది. అందుకే కోడెవాగులో జరిగింది ఉద్దేశపూర్వక హత్య గనుక పోలీసులపైన హత్యానేరం మోపాలి. ఈ వాదనతో ఏకీభవించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా ఆదేశా లిచ్చింది. అయితే ఆదేశాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలు చేసింది. ఈ విచారణ పెండింగ్‌లో ఉండగానే తెలంగాణ ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలకు తెరలేపింది. అప్రతిహతంగా కొనసాగిస్తూనే ఉంది. ఎన్‌కౌంటర్లలో చంపేసి చనిపోయిన వారిపైన నేరాల చిట్టా ప్రకటించి కేసులను మూసేస్తున్నారు. దీన్ని నాగరిక సమాజం ఆమోదించాల్సిందేనా?

అసలు పోలీసులు నక్సలైట్లను చంపేసి ఎన్‌కౌంటర్ జరిగిపోయిందని సమర్థించుకునే ఓ చట్టం వస్తే ఎంత బాగుండుననుకుంటున్నారు. లేకపోతే హక్కుల సంఘాల నుండి మాకెందుకీ అపవాదు అనుకుంటున్నారు. అది అనాగరిక ఆలోచన. పోలీసులు ధరించిన తుపాకిపైన ఆధునిక సమాజంలో నియంత్రణ ఉండాలి. వారు అనుసరించే విధివిధానాలు చట్టాలకు లోబడి ఉండాలి.

ఎన్‌కౌంటర్లు జరగవన్న ముఖ్యమంత్రులు

1989 చివరిలో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి 'నా హయాంలో ఇక నుంచి ఎన్‌కౌంటర్లు జరగవ'న్నాడు. కొంతకాలం నిలిచిపోయి మళ్లీ మొదలైన గణనీయ పరిమాణంలో జరిగాయి. 1994 చివరిలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. వచ్చీరాగానే ఎన్‌టి రామారావు 'ఇక మీదట ఎన్‌కౌంటర్లు జరగవ'న్నాడు. ప్రకటన వచ్చిన రెండు రోజుల్లోనే ఎన్‌కౌంటర్లు మొదలయ్యాయి.

ఎన్‌టి రామారావును గద్దె దింపి అధికారానికి వచ్చిన చంద్రబాబు నాయుడు కూడా 'ఎన్‌కౌంటర్లు ఇక మీద ఉండవు' అన్నాడు. కాని ఆయన పాలనంతా తెలంగాణ రక్తపుటేరులై పారింది.

అధికారానికి రాకముందే చంద్రశేఖరరావు 'నేను అధికారానికి వస్తే ఎన్‌కౌంటర్లుడవు. ప్రజల హక్కులని గౌరవిస్తాన'ని అన్నాడు. కాని ఆచరణలో మాత్రం జైలు నుండి కోర్టుకు వాయిదాలకు తీసుకువస్తున్న ముద్దాయిలను సైతం కాల్చిపడేసి ఎన్‌కౌంటర్ కథ ఎప్పటి లాగానే ప్రకటించారు.

ప్రజలు ఎవరిని నమ్మాలి? అధికారం చిత్తశుద్ధి లేకుండా చేస్తుందా? లేక పోలీసుల మీద అజమాయిషీ లేకుండా చేస్తుందా? పాలకులే చెప్పాలి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి భారీ ఎన్‌కౌంటరిది. ఇది జరగడానికి తప్పనిసరిగా ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఉంటుంది. కాబట్టి దీనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇంత పెద్ద ఘటన జరిగినా కూడా మౌనం పాటించారంటే తప్పకుండా మతలబు ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మహాసభలకు వేంచేస్తున్న వారికి తానెంత సమర్థవంతమైన ముఖ్యమంత్రో తెలియ జేయడానికి డిసెంబర్ 15 నుంచి 19 వరకు జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు తొమ్మిది మంది రక్తంలో ముంచిన తోరణాలను కట్టాడు. చర్చల ప్రతినిధి రియాజ్ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మంత్రి పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నుండి వైదొలిగిన సంప్రదాయాన్ని నెలకొల్పిన వాళ్లే ఇప్పుడు ఎన్‌కౌంటర్లకు పాల్పడితే ప్రభుత్వంలో భాగమైన ఏ మేధావి నిరసన వ్యక్తపరచకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఈ ఘటనకు ముందు డిసెంబర్ 6న ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు దాని పరిధిలోని భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ బ్యారేజి, తుపాకుల గూడెం బ్యారేజి, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను సందర్శించారు. దీనికి ఒక్కరోజు ముందు మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిమాంచి ప్రాంతంలో అయిదుగురు మహిళలతో సహా ఏడుగురు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశారు. ఈ ఎన్‌కౌంటర్ వెనుక తెలంగాణ రాష్ట్ర పోలీసుల వ్యూహం, యాక్షన్ ఉంది. ఎందుకంటే రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి తమ సీనియర్ అధికారులతో కలిసి ఒక్కరోజు ముందు ఆ ప్రాంతానికి వెళ్లడమే గాక మహారాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులతో కూడా సమావేశమయ్యాడు.

ప్రతి ముఖ్యమంత్రి తమ ప్రతాపానికి సూచికగా ఎన్‌కౌంటర్లను ఎంచుకుంటున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక్క ఎన్‌కౌంటర్‌లో ఏడు

నుంచి తొమ్మిది మందిని చంపి శక్తి సామర్థ్యాలను చాటుకుంటున్నాడు. కోడెవాగు ఘటనలో అంతకు ముందే లొంగిపోయిన వారిచ్చిన సమాచారంతో ఓపెన్ కాస్ట్ కాంట్రాక్టర్ దగ్గర దొరికిన వారిని కోర్టులో ప్రవేశపెట్టేంత వరకే పోలీసుల డ్యూటీ. కాని చంపే అధికారం ఏ చట్టం ఇవ్వలేదు. తప్పు చేస్తే జైల్లో పెట్టాలి కాని చంపేసుడేందని మృతుల కుటుంబీకులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులే అన్ని అయితే ఇక న్యాయవ్యవస్థ ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారిలో బిసిలు, దళితులు, ఆదివాసులు ఉన్నారు. అందరు కూడా 39 సంవత్సరాలలోపు వారే. వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

1) ఎట్టికుమార్ (39), దళ కమాండర్, మద్రిగూడెం, లక్ష్మీదేవిపల్లి మం., కొత్తగూడెం.
2) జక్కెటి ప్రవీణ్‌కుమార్ (27), ధర్మారం కాళీపేట, మంచిర్యాల.
3) నూనావత్ (22), సారపాక గ్రా, బూర్గంపాడు మం, కొత్తగూడెం.
4) ఈసం నరేష్ (35), కొడవటంచ, గూండాల మం, కొత్తగూడెం.
5) తుర్కులి మధు (35), గూండాల మండల కేంద్రం, కొత్తగూడెం.
6) గాదుదల శ్రీనివాస్ (32), కుమగూడెం గ్రా, టేకులపల్లి మం, కొత్తగూడెం.
7) బోయిన ఓంప్రకాశ్ (22), పెద్ద ఎల్లాపురం గ్రా, కొత్తగూడ మం, మహబూబ్‌నగర్.
8) భట్టు ఆదినారాయణ (35), గట్టుమళ్ల గ్రా, లక్ష్మీదేవిపల్లి మం, కొత్తగూడెం.
9) కార్తీక్ (35), కంబాలపల్లి, మహబూబ్‌నగర్. (ఈయన శవాన్ని మరుసటి రోజు బయటపెట్టారు.)

ఎట్టికుమార్ అలియాస్ శ్రీను అలియాస్ రాఖీ సిపి బాట దళ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. దళంలోకి రాకముందు పోడు భూమిని సాగు చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య కౌశల్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గతంలో సిపిఐ తరఫున వార్డు మెంబరుగా పనిచేశాడు.

జక్కెటి ప్రవీణ్‌కుమార్ అలియాస్ ఆజాద్ తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి అన్నీ తానై పెంచింది. ఎంబిఎ వరకు చదివాడు. రెండేళ్లుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేస్తూ మధ్య మధ్యలో తల్లిని చూసిపోయేవాడు. అలాంటి నా కొడుకు నక్సలైట్ అని, పోలీసు కాల్పుల్లో చనిపోయాడని చెబుతున్నారు. ఇది అబద్ధం. నా కొడుకు నక్సలైటు కాదు, వారితో ఏ సంబంధాలు లేవని అతని తల్లి సువర్ణ గుండెలవిసెలా ఏడుస్తోంది.

నూనావత్ అర్జున్ అలియాస్ నవీన్ ఆటోడ్రైవర్‌గా పనిచేసేవాడు. కొంతకాలం అశ్వాపురం మండలం గొందిగూడెంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశాడు. అంతకు ముందు దళంలో పనిచేసి లొంగిపోయాడు. ఆరోజు అనారోగ్యంతో ఉన్న మామయ్యను చూడటానికి సారపాక నుంచి రోళ్లగడ్డ వచ్చాడని, పోలీసులు అందరు చూస్తుండగానే అదుపులోకి తీసుకుని, విద్యుత్ షాక్‌పెట్టి చంపేసి ఎదురు కాల్పుల్లో చనిపోయినట్లు ప్రకటించారని కుటుంబ సభ్యులు చెప్పారు.

బోయిన ఓంప్రకాశ్ అలియాస్ గణేశ్ స్థల వివాదాన్ని పోలీసులు పరిష్కరించకపోతే దళ సభ్యులను ఆశ్రయించాడని, టేకులపల్లిలో కొట్టి చంపి ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు సృష్టించారని అతని సోదరి తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రితం న్యూ డెమోక్రసి పార్టీలో పనిచేశాడు. తర్వాత ఆర్ఎంపి డాక్టర్‌గా పనిచేస్తూ టేకులపల్లి మండల కేంద్రంలో న్యూ డెమోక్రసి పార్టీకి చెందిన స్థలంలో ఇల్లు వేసుకోగా పార్టీతో విభేదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సిపి బాటలో చేరవచ్చని కూడ ప్రజలు అనుకుంటున్నారు.

భట్టు ఆదినారాయణ కూలీపని చేస్తూ కుటుంబ పోషన చేసేవాడు. న్యూ డెమోక్రసి సానుభూతిపరుడు. పదిరోజుల క్రితమే దళంలో చేరి ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు.

తుర్కులి మధుది సాతాని కులం. భార్య రాధిక, పాప సౌమ్య(2), బాబు సాత్విక్ (10) ఉన్నారు. వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సరిగ్గా 26 రోజులు సిపి బాటలో పనిచేసి ఎన్‌కౌంట రయ్యాడు. ఇతని శరీరంలో బుల్లెట్ గాయాలు లేవు. చిత్రహింసలు పెట్టి చంపేశారు. తల వెనుక భాగం ఛిద్రమయ్యింది. ఎడమ చెయ్యి విరగ్గొట్టారు. చెస్టు నుండి కడుపు వరకు కోశారు. అరచేయి కండరాలు ఊడిపోయాయి. కుడిచెంప కూడ మాంసం ఊడిపడింది. ఎడమ మోచేయి కూడా విరిచేశారు. చిత్రహింసలు పెట్టి చంపేబదులు ఒక్క తూటాతో చంపినా బాగుండును కదా అని అతని భార్య రాధిక భోరున ఏడుస్తూ వివరించింది. నేరం చేస్తే జైల్లో పెట్టాలి గాని చంపుడేందని ప్రశ్నించింది. నా పిల్లలకు ఇప్పుడు దిక్కెవరని వాపోతుంది. మా ఉసురు ఈ ప్రభుత్వాలను చుట్టుకుంటుందని శాపనార్థాలు పెడుతుంది. గతంలో సిపిఎం (ఎస్ఇ)లో చేసి లొంగిపోయాడు.

ఈసం నరేష్ అలియాస్ సుదర్శన్ కోయజాతికి చెందిన ఆదివాసి. రమాదేవితో ఈ మధ్యనే పెళ్లైంది. గతంలో సిపిఐ (ఎస్ఇ)లో చేసాడు. ఆగస్ట్ 1న ఏర్పడిన సిపి బాటాలో చేరాడు. ఇతని దేహంలో కూడా తూటాలు దిగిన గాయాలు లేవు. చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. ఛాతిలో తుపాకి మడిచి గుద్దినారు. పక్కటెముకలు విరిగిపోయి ఉన్నాయి. ఇతను, ఇతని తాత న్యూ డెమోక్రసిలో అజ్ఞాత సభ్యుడుగా చేసి లొంగిపోయి జడ్‌పిటిసిగా పనిచేసిన ఈసం బాటన్న మనుమడు.

గాడిదల శ్రీను యాదవ కులస్థుడు. గొర్రెలు కాచుకుని జీవనం వెళ్లదీస్తున్నాడు. నక్సలైట్లకు ఈయనకు ఎలాంటి సంబంధం లేదు. భార్య, కొడుకు, కూతురు ఉంది. కొడుకు ఐటిఐ చేస్తుండగా, కూతురు బికాం చదువుతోంది. ఎన్‌కౌంటర్‌కు ముందురోజు సాయంత్రం 6 గంటలకు గొర్రెలను దొడ్లోకి తోలి, ఇంకో గొర్రెపిల్ల కనబడడం లేదు, వెతుకుతానని చెప్పి మోటారు సైకిల్‌పై వెళ్లి తిరిగి రాలేదు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని వార్త విని హతాశులైనారు. ఇతనికి గవర్నమెంట్ 20 గొర్రెలను ఇచ్చింది. గవర్నమెంట్ కట్టిచ్చిన ఇంట్లో బతుకుతున్నాడు. చీకట్లో ఎక్కడ పట్టుకు న్నారో పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపేశారు. ఇతను యాదవ సంఘానికి మండలాధ్యక్షునిగా పనిచేస్తున్నాడు. నా భర్త అమాయకుడు. గొర్రెలను మేపుకు రావడం తప్ప ఇంకో విషయం తెలియదు. ఆయన్ను చంపి మమ్మల్ని ఆగంచేశారు. నా పిల్లలు అనాథలయ్యారని భార్య అన్నది.

జాతీయ మానవహక్కుల సంఘం ఆదేశాల ప్రకారం సాయంత్రం 5 గంటలు దాటితే పోస్టుమార్టం చేయకూడదు. ఫోరెన్సిక్ డాక్టర్లు నిపుణులైన బృందంతో పోస్టుమార్టం చేయాలి. పోస్టుమార్టం వద్దకు కుటుంబ సభ్యులను అనుమతించాలి. అలాంటిది ఏ ఒక్కదాన్ని పోలీసులు

తెలంగాణలో పౌరహక్కులు - బహిరంగ లేఖ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎన్నో వాగ్దానాలు చేసి, తీరా అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడమే కాక మరింత విధ్వంసకాభివృద్ధి, హక్కుల హననం జరగడాన్ని ప్రశ్నిస్తూ **మానవ హక్కుల వేదిక** *ముఖ్యమంత్రికి రాసిన బహిరంగలేఖ*

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి...

చాలా రోజుల నుంచి మీకు ఈ ఉత్తరం రాయాలనుకుంటున్నాం. 2014 చివర్లోనే మొదటిసారి అనుకున్నాం. కాని మీరు అధికారంలోకి వచ్చి ఆరు నెలలే అయింది... తొందరపడినట్లయితదని సందేహించినం. 2015 లోనూ అనుకున్నాం. కాని ఇంకా కుదురుకున్నట్టు లేరు ఆగుదామనుకున్నాం. 2016లో ఇక తప్పదు రాద్దామనుకున్నాం. కాని ఎన్నో ఏండ్ల పోరాటం తర్వాత అధికారంలోకి వచ్చిన తొలి తెలంగాణ పార్టీ కనుక ఇంకొక్క సంవత్సరం కూడా ఆగి చూద్దామనుకున్నాం. ఆగినం. చూసినం. ఏ మాత్రం మార్పు లేదు. మిగతా మీ పాలన సంగతెలా ఉన్నా సమాజంలో జరుగుతున్న రకరకాల విషయాల పట్ల తమ అసంతృప్తినో, నిరసననో వ్యక్తం చేయాలనుకునే వారి పట్ల మీ ప్రభుత్వ, పోలీసుల వైఖరి మమ్మల్ని దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది. ఏ వర్గం ప్రజలనూ రోడ్డు మీదికి రాకుండా, తమ అభిప్రాయాలను నోరు తెరిచి చెప్పనీయకుండా మీరు తీసుకుంటున్న 'జాగ్రత్తలు' ఒక ప్రజాస్వామ్య దేశంలో కనీ వినీ ఎరగనివని చెప్పక తప్పదు.

మా సంస్థ (మానవ హక్కుల వేదిక) గత 20 ఏళ్లుగా ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న సంస్థ అని మీకు తెలుసు. మరీ ముఖ్యంగా తెలంగాణలో జరిగిన అన్ని రకాల అణచివేతలకు, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ వచ్చినమని మీకు తెలుసు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో మీరూ మేమూ వేదికలు పంచుకున్న విషయం కూడా మీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది.

మీరు బంగారు తెలంగాణను నిర్మిస్తానని వాగ్దానం చేశారు. అందులో భాగంగా కె.జి నుంచి పి.జి వరకు ఉచిత విద్య అందిస్తామన్నారు. దళితుడ్ని తొలి ముఖ్యమంత్రిని చేస్తానన్నారు. భూమి లేని ప్రతి దళిత కుటుంబానికీ మూడు ఎకరాల భూమి ఇస్తానన్నారు. ముస్లింలకు, ఆదివాసులకు రిజర్వేషన్స్ పెంచుతామన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ ఉండవు అన్నారు. ఇంటికొక ఉద్యోగం వాగ్దానం చేశారు. ప్రతి ఎకరాకూ సాగునీరు ఇస్తామన్నారు. బలహీన వర్గాలకు రెండు బెడ్ రూముల ఇళ్లు కట్టిస్తామన్నారు. నిరంతరం కరెంటు సరఫరా ఉండేలా చూస్తానన్నారు. ఇంకా చాలా అన్నారు. వాటిలో కొన్ని మొదలు పెట్టి ఉండవచ్చు. కొన్ని పూర్తిగా మరిచిపోయి ఉండవచ్చు – మిగతా అందరి పాలకుల లాగానే. కాని ఒక విషయంలో మాత్రం మీ ప్రభుత్వం ఇతర ప్రభుత్వాల కంటే పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోందని చెప్పక తప్పదు. దాని గురించే ఇప్పుడీ బహిరంగ లేఖ.

ఉద్యమ పార్టీగా ఉండి అధికారంలోకి వచ్చినందువల్ల మీ పార్టీ ప్రజల ఆకాంక్షలను మరింత గౌరవిస్తుందని చాలామంది లాగే మేము కూడా ఆశించినం. కాని మీరు వాగ్దానం చేసిన ఫ్రెండ్లీ పోలీసింగ్ పూర్తి రివర్స్‌లో పని చేస్తుండటం చూసి విస్తుపోయినం. తమ సమస్యలను పాటించలేదు. అప్రజాస్వామికంగా వ్యవహరించారు. పైగా సాయంత్రం 6 గంటలకు పోస్టుమార్టం మొదలుపెట్టి ఒంటి గంట వరకు చేశారు.

ఎన్‌కౌంటర్ ఎందుకు జరిగినట్టు?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాజ్యాంగం ఆర్టికల్ 19 అమలు కావడం లేదు. పౌర ప్రజాస్వామిక హక్కుల వాతావరణం కుదించబడుతుంది. ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమాల పట్ల అణచివేత ధోరణులను ప్రభుత్వం అనుసరిస్తోంది. 2015, సెప్టెంబర్ 21న ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక తలపెట్టిన సభను భగ్నంచేసి వేలాది మందిని అరెస్టు చేసిన దగ్గర మొదలై 20 ఏళ్ల వరంగల్ డిక్లరేషన్ సభ నిరాకరణ వరకూ కొనసాగుతోంది.

1997 డిసెంబర్ 28, 29న వరంగల్‌లో ప్రకటించిన 'వరంగల్ డిక్లరేషన్' డాక్యుమెంట్‌ను సమీక్షించుకునే సభకు వరంగల్ పోలీసులు అనుమతి నిరాకరించారు. బహిరంగ సభను హాలుకు పరిమితం చేసే ప్రయత్నం చేశారు. ఈ పాలసీ విధానంలో భాగంగానే నక్సలైట్ ఉద్యమాన్ని ఆదిలోనే అణచివేయాలనే ఉద్దేశంతో సిపి బాటను పురిట్లోనే చిదిమివేశారు. ఇంకా బలమైన నక్సలైట్ పార్టీలకు హెచ్చరిక చేయాలనుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆదివాసులను చంపేసి పోడు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న ఆదివాసులకు హెచ్చరిక చేయాలనుకున్నారు. పూర్వపు ఖమ్మం జిల్లా ప్రజలు అత్యధికం ఎర్రజెండా నీడలో కదిలే సమూహాలకు ఏ గతి పడుతుందో నిరూపించాలనుకున్నారు.

ఖమ్మం జిల్లా ఆదివాసీల గూడేల కింద 41 రకాల విలువైన ఖనిజ సంపద నిక్షిప్తమై ఉంది. దీనిని బహుళజాతి సంస్థలకు అప్పజెప్పే మార్గం ఎన్‌కౌంటర్ల ద్వారా సులభమవుతుందని ప్రభుత్వాలు కలలు గంటున్నాయి.

ఇచ్చిన మాటకు కట్టుబడని పాలకులు పరిపాలిస్తున్నప్పుడు, రాజ్యాంగ బాధ్యతల నుండి వైదొలగే పాలకులున్నప్పుడు, చట్టాలకు బెదరకుండా దర్జాగా నేరాలకు ఒడిగట్టడానికి బెరకనేది ఏ మాత్రం లేని పోలీసులున్నప్పుడు ప్రజాస్వామ్య శక్తులు మరింత సృజనాత్మకంగా, క్రియాశీలకంగా ఉద్యమించాల్సి ఉంది.

(రచయిత పౌరహక్కుల సంఘం అధ్యక్షులు) వీ

ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి ప్రజలకు ప్రజాస్వామ్యం కొన్ని అవకాశాలు కల్పించిందనే విషయాన్నే మీరు పూర్తిగా మరిచిపోయి నట్టున్నారు. మీ వైఖరి చూస్తే మీరూ, మీ ప్రభుత్వమూ, మీ పోలీసులూ ఏమి చేసినా ప్రజలకు 'ఎస్' తప్ప 'నో' చెప్పే హక్కు లేదనుకుంటున్నట్టు కనిపిస్తున్నది. లేకుంటే ఎవరికీ ధర్నాలకు, ఊరేగింపులకు ఎందుకు అనుమతియ్యరు? సభలకు, సమావేశాలకు ఎందుకు అనుమతి ఇయ్యరు? సంస్మరణ సభలు సైతం ఎందుకు జరుపుకోనివ్వరు? ప్రాజెక్టుల కొరకు నిర్వహించే పబ్లిక్ హియరింగులకు బాధిత ప్రజానీకాన్ని ఎందుకు పోనివ్వరు? హాల్ మీటింగుల మీద కూడా ఎందుకు ఆంక్షలు పెడతారు?

ఈ విషయంలో మీరెంత నిష్పక్షపాతులంటే సభలు పెట్టుకోవాలను కుంటున్న వారు విద్యార్థులా, నిరుద్యోగులా, లెఫ్టిస్టులా, కాంగ్రెస్ వాళ్లా, తెలుగుదేశం వాళ్లా; నిరసన తెలుపుతున్న వారు విత్తనాలు మొలకెత్తలేదన్న ఆవేదనతో రోడ్డెక్కిన రైతులా, గిట్టుబాటు ధరలు అడగడానికి గుమిగూడిన రైతులా, భూములు ఇవ్వడానికి ఇష్టపడని రైతులా; ధర్నా చేస్తున్న వారు హైకోర్టు విభజనను కోరుతున్న న్యాయవాదులా, నేరెళ్ల లాంటి దాడులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న దళితులా, వర్గీకరణ కోరుతున్న మాదిగలా అనే 'తేడా' కూడా చూడరు మీరు. ఏ వర్గమూ మీ పాలసీలను వ్యతిరేకించడానికి వీల్లేదు. మీ పాలన మీద గాని, ఇప్పుడున్న వ్యవస్థ మీద గాని ఎటువంటి నిరసన తెలపడానికి వీల్లేదు. మీ ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టి దేన్నయినా తొందరగా సాధించుకోవాలని అనుకోవ డానికి వీల్లేదు. అలాంటి ప్రయత్నం ఎవరు చేసినా వెంటనే నిషేధాజ్ఞలు, అరెస్టులు, చిత్రహింసలు, కేసులు పెట్టడానికి పోలీసులు సిద్ధంగా ఉంటున్నారు.

ఏ రకమైన ప్రజాస్వామ్యం ఇది? ప్రజాస్వామ్యం ఇచ్చే అన్ని సదుపాయాలనూ ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన పార్టీ చేయాల్సిన పనులేనా ఇవి?

అందరు ముఖ్యమంత్రులూ శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవాలకు పోతుంటారు. సభలు, సమావేశాలలో పాల్గొనడానికి జిల్లాలు తిరుగుతుంటారు. కాని తెలంగాణలో మునుపెన్నడూ లేని విధంగా మీ పోలీసులు మీరు ఎక్కడికి వెళుతున్నా ఎందుకు ముందస్తుగా వందల మందిని నిర్బంధంలోకి తీసుకుంటున్నారు? మిమ్మల్ని ఏ రూపంలో విమర్శించినా కేసులు పెట్టడమో, బెదిరించడమో చేస్తున్నారు? ప్రజలకు సమస్యలు ఉండవా? తమ డిమాండ్లు నెరవేర్చుడానికి ధర్నాలో, ఊరేగింపులో చేయరా? మీకో, మీ మంత్రులకో వినతిపత్రాలు ఇవ్వాలనుకోరా?

ప్రజలు ఇవన్నీ చేయకుండానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందా? ఇవన్నీ చేయకుండానే తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నారా? ఎవరిదాకనో ఎందుకు... ఉద్యమ పార్టీ నాయకుడిగా మీరెన్ని ఆందోళనలు చేయలేదు? మరి ఇప్పుడెందుకు మీ పోలీసులు మాటిమాటికి సెక్షన్ 30లు, సెక్షన్ 144లు, సెక్షన్ 151లు పెడుతున్నట్టు? ఐదుగురు ఒక చోట కలిస్తేనే మీ ప్రభుత్వం కూలిపోతుందని భయపడుతున్నారా? పదిమంది కలిసి ఒక మీటింగ్ పెట్టుకుంటేనే మీ అధికారానికి ముప్పు ఏర్పడుతుంది అనుకుంటున్నారా?

ఇటీవలి కాలంలో తెలంగాణలో పోలీసులు ఎందర్ని ముందస్తు అరెస్టులు చేశారో ఒకసారి గుర్తు చేస్తాం... వింటారా!

– మూడు నెలల కిందట అక్టోబర్ 10న మీరు సిద్ధిపేట కలెక్టర్ కార్యాలయానికి శంకుస్థాపన చేయడానికి వెళ్లినప్పుడు 170 మందిని ముందస్తుగా అరెస్టు చేసి కార్యక్రమం అయిపోయేదాకా విడుదల చేయలేదు. అక్టోబర్ 22న మీరు కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కుకు భూమి పూజ నిర్వహించడానికి వరంగల్ వెళ్లినప్పుడు ముందురోజే 200 మందిని అరెస్టు చేసి కార్యక్రమం అయిపోయినంక గాని వదిలిపెట్టలేదు.

– మరీ అన్యాయమేమిటంటే కొన్ని ప్రజా సంఘాలు (తెలంగాణ జెఎసి, తెలంగాణ విద్యార్థి వేదిక, తెలంగాణ డెమోక్రాటిక్ ఫ్రంట్) ఏ కార్యక్రమం తలపెట్టినా ఆ సంస్థ నాయకులను, కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారు. వారి కార్యక్రమాలను భగ్నం చేస్తున్నారు. వారి ఇంటి తలుపులు పగలగొట్టి మరీ అరెస్టులు చేస్తున్నారు. ఈ జాబితాలో మూడేళ్ల కిందటి వరకు మీతో కలిసి పని చేసిన తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ కోదండరామ్ ఇల్లు కూడా ఉన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీసులు సైతం చేయడానికి సాహసించని పనిని మీ పోలీసులు చేసారంటే ఏమనుకోవాలి? అలాగే ఒక పోలీసు స్టేషన్ వాళ్లు 'ముందస్తు' అరెస్టు (12.08.2017) చేసి వదిలిపెట్టిన వ్యక్తిని మరికాసేపటికే మరో పోలీసు స్టేషన్ వాళ్లు మరోసారి 'ముందస్తు'గా అరెస్టు చేయడం ఏమిటి? (కొన్నాళ్లకు ముందస్తు శిక్షలు విధించినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదేమో!) కోదండరాంను మెదక్ జిల్లాలో రెండు గంటల వ్యవధిలో, రెండు పోలీసు స్టేషన్ల పరిధిలో, రెండు సార్లు అరెస్టు చేసి బలవంతంగా పోలీసు జీపులో ఎక్కించి హైదరాబాద్కి తరలించారు.

వీటి గురించి పోలీసులను అడిగితే ఎస్.ఐ నుండి డి.ఐ.జి వరకూ అందరిదీ ఒకటే సమాధానం – "మాకు పై నుంచి ఆదేశాలు ఉన్నాయి". ఈ ఆదేశాలు ఇస్తున్న ఆ పై వారు ఎవరో మాత్రం వెల్లడించరు. ఇటువంటి మౌఖిక ఆదేశాలకు చట్టబద్ధత లేదనే విషయం మేము మీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటా. ఒకవేళ మీ ప్రభుత్వానికి తెలియకుండా పోలీసులు ఈ పనులు చేస్తుంటే (అలా అని నమ్మేంత అమాయకులు ఎవరూ లేరనుకోండి) మీరు ఈ పాటికి వాళ్ల మీద చర్య తీసుకోవాల్సింది. మీరు తీసుకోలేదంటే అర్థం మీ ప్రభుత్వమే వాళ్ల చేత ఈ ముందస్తు అరెస్టులు చేయిస్తుందనుకోవాలి.

ఈ తరహా 'ఫ్రెండ్లీ' పోలీసింగ్కి ఎక్కువగా బలైనవారు విద్యార్థులు. అన్ని ఘటనల గురించీ రాసేంత చోటు లేదు కాబట్టి కొన్ని ముఖ్యమైన ఘటనలను ఉదహరిస్తాం.

– గత మూడున్నరేళ్లలో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు తలపెట్టిన ప్రతి కార్యక్రమానికీ పోలీసులు అడ్డంకులు కల్పిస్తూనే ఉన్నారు. తమ ఆహారపు అలవాట్లను ఇతరులు చిన్నబుచ్చడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు రెండేళ్లలో రెండుసార్లు బీఫ్ ఫెస్టివల్స్ జరుపుకోవాలని ప్రయత్నిస్తే మీ పోలీసులు జరగనివ్వలేదు (10.12.2015, 10.12.2016). ఆ కార్యక్రమాన్ని తలపెట్టిన దళిత, బహుజన విద్యార్థులను ముందురోజు రాత్రే అరెస్టు చేసి తీసుకెళ్లారు. నిరుద్యోగ జె.ఎ.సి. ర్యాలీ తీద్దామనుకున్నపుడు కాకతీయ యూనివర్సిటీ హాస్టల్స్లోని విద్యార్థులను ముందురోజు అర్ధరాత్రే (డిసెంబర్ 2016) అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఉస్మానియా విద్యార్థులు, నిరుద్యోగులు కలిసి

ర్యాలీ తీద్దామనుకున్నపుడు కూడా అదే పని చేశారు (22.02.2017). ఎక్కడికక్కడ జిల్లాలలోనే అడ్డుకుని రాజకీయ నాయకులతో సహా మొత్తం 750 మందిని ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు.

– భారతదేశ వ్యాప్తంగా రోహిత్ వేముల ఆత్మహత్యపై నిరసన సభలు, ఊరేగింపులు జరిగాయి కాని హైదరాబాద్‌లోని మాత్రం మీరు జరగనివ్వలేదు. తొలి వర్ధంతి సందర్భంగా ఉస్మానియాలో ర్యాలీ తీయడానికి ప్రయత్నిస్తే పర్మిషన్ ఇవ్వలేదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గేటు బయట పెట్టుకున్న మీటింగ్‌ను సైతం భగ్నం చేశారు. విద్యార్థులను బయటికి రాకుండా అడ్డుకోవడమే కాక మీటింగ్‌లో మాట్లాడడానికి వచ్చిన రోహిత్ తల్లి రాధిక వేములను కూడా అరెస్టు చేసి తీసుకపోయారు (07.01.2017). పి.హెచ్.డి. కామన్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తూ ముఖ్యమంత్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ దిష్టిబొమ్మలు తగలబెట్టినందుకు కాకతీయ విద్యార్థులపై కేసులు పెడతామని బెదిరించారు. మురళి అనే పీజీ విద్యార్థి ఆత్మహత్యపై ఆందోళన చేసినందున ఉస్మానియా విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జి చేసి పలువురిని అరెస్టు చేశారు (04.12.2017) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కూడా ఉస్మానియా విద్యార్థులను ముందస్తు అరెస్టు చేశారు (26.04.2017).

తెలంగాణ రాక ముందు ఉస్మానియాలో కనీసం ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్.సి.సి గేటు వరకు అయినా ఊరేగింపు తీయడానికి అభ్యంతర పెట్టేవారు కాదు. ఇప్పుడదీ లేదు. ఆర్ట్స్ కాలేజీ దగ్గరే అరెస్టు చేస్తున్నారు. చాలాసార్లు హాస్టల్స్ మీద దాడి చేసి ముందుగానే అరెస్టులు చేస్తున్నారు.

రైతుల పట్ల కూడా మీ వైఖరి ఇంతకంటే మెరుగ్గా ఏమీ లేదు.

– మెదక్ జిల్లా చేగుంటలో నిరంతర కరెంటు సరఫరా కోరుతూ ధర్నా చేస్తున్న రైతులను పోలీసులు విచక్షణా రహితంగా కొట్టారు. పాలేరులో గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేస్తుంటే బేడీలు వేసి మరీ అరెస్టు చేశారు. వాళ్లను పరామర్శించడానికి వెళుతున్న కోదండరాంను ముందుగానే అరెస్టు చేశారు. భూ సేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వేములఘాట్ రైతులపై లాఠీ చార్జియే కాక బాష్పవాయు ప్రయోగం కూడా చేసి 25 మందిని గాయపరిచారు.

రాజీకయ పార్టీల పట్ల కూడా మీరు ఇదే ధోరణిలో ప్రవర్తిస్తున్నారు.

– మావోయిస్టు పార్టీకి పదేళ్లు పూర్తయిన సందర్భంగా 'ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక' మీటింగ్ జరుపుకోవాలని ప్రయత్నిస్తే అడ్డుకోవడమే కాదు, వరవరరావుతో సహా చాలామందిని అరెస్టు చేశారు (21.09.2014). శ్రుతి, సాగర్‌ల బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ప్రజాసంఘాలు ర్యాలీ, బహిరంగ సభ తలపెడితే అనేక మందిని ముందస్తు అరెస్టులు చేశారు. వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా ఉన్నారు (30.09.2017). తెలంగాణ డెమొక్రాటిక్ ఫోరం 24.05.2016 న వరంగల్‌లో ర్యాలీ, బహిరంగ సభ తలపెడితే పర్మిషన్ ఇచ్చినట్టే ఇచ్చి మూడురోజుల ముందు రద్దు చేశారు. నాయకులను యధావిధిగా అరెస్టు చేశారు.

– ఇప్పుడు కాంగ్రెస్‌లోకి మారిన ఒకప్పటి తెలుగుదేశం నాయకుడు రేవంత్‌రెడ్డి మీటింగ్‌లకు కూడా చాలాసార్లు పర్మిషన్ నిరాకరించారు. జైలు నుండి విడుదల అయిన సందర్భంలోనూ, ఇటీవల జలవిహార్‌లో మీటింగ్ పెట్టాలనుకున్నప్పుడు (30.10.2017) కూడా రేవంత్‌రెడ్డికి అనుమతి ఇవ్వలేదు. పర్మిషన్ లేకుండా ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన జనజాతర సభలో (02.06.2016) పాల్గొన్నాడని కేసు కూడా పెట్టారు. కాంగ్రెస్ వాళ్లనైతే మీటింగ్‌కి రాక ముందే ముందస్తు అరెస్టులు చేశారు. నేరెళ్ల దళితుల మీద పోలీసుల అమానుష దాడికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ పెట్టాలని ప్రయత్నిస్తే పర్మిషన్ ఇవ్వలేదు (03.07.2017). వక్తలలో పార్లమెంట్ మాజీ స్పీకర్ మీరా కుమార్ ఉన్నప్పటికీ పోలీసులు ఖాతరు చేయలేదు.

– మునిసిపల్ కార్మికుల సమ్మె గురించి మీతో మాట్లాడడానికి ప్రయత్నించినపుడు కూడా చాడ వెంకటరెడ్డిని, తమ్మినేని వీరభద్రంను పోలీసులు అరెస్టు చేశారు (06.08.2015). సిపిఎం అనుబంధ రైతు సంఘం పంటలకు గిట్టుబాటు ధరల కోసం కేంద్రం ఒక చట్టం చేయాలని కోరుతూ మీటింగ్ పెట్టుకుంటే దానికీ అనుమతి నిరాకరించారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దును కోరుతూ వివిధ టీచర్ల సంఘాలు రాష్ట్ర స్థాయి మీటింగ్ పెట్టుకుంటే హైదరాబాద్‌కి బయలుదేరక ముందే వారిని నల్గొండ, కోదాడ, సూర్యాపేటలలో అరెస్టు చేశారు (24.11.2017).

– మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు మంద కృష్ణమాదిగ చేపట్టే ఏ నిరసన కార్యక్రమాన్నీ మీ ప్రభుత్వం అనుమతించడం లేదు. తాజాగా 'చలో ట్యాంక్‌బండ్' పేరుతో ర్యాలీ తీసినందుకూ అరెస్టు చేశారు, తన ఆఫీసులో నిరాహారదీక్షకు కూర్చున్నందుకూ అరెస్టు చేసి జైలుకు పంపించారు.

ఇక హైదరాబాద్‌లో ధర్నా చౌక్ ఎత్తేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికి నిరసనగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరా పార్క్ దగ్గరికి 2 కె రన్ జరపాలని ప్రయత్నిస్తే 50 మందిని ముందస్తుగా అరెస్టు చేశారు. అన్ని ప్రజాసంఘాలూ కలిసి మగ్దూం భవన్‌లో నెలరోజులు నిరసన దీక్షలు చేసినా మీ ప్రభుత్వం కించిత్ కూడా వెనక్కి తగ్గలేదు. జిల్లాలలోనూ ఎక్కడా ధర్నాలు చేయనివ్వడం లేదు. ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కూడా గతంలోలా ఎక్కువసేపు నిరసన తెలపడానికి అనుమతించడం లేదు. పది నిమిషాలు దాటితే అరెస్టు చేస్తున్నారు.

పోలీసులకు అరెస్టు చేసే అధికారం ఉండడం, ఆ అరెస్టు సమర్థనీయమైనది అయి ఉండడం రెండూ వేరువేరు విషయాలు. దేశంలో చేస్తున్న అంరెస్టులలో అనవసరపు అరెస్టులే ఎక్కువ అని నేషనల్ పోలీసు కమీషనే ఉన్నది. నేర విచారణలో భాగంగా చేసే అరెస్టులలోనే అనవసరపు అరెస్టులు ఎక్కువ అంటే ఇక ముందస్తు అరెస్టుల సంగతి చెప్పాల్నా! అన్నీ దాదాపుగా అనవసరపు అరెస్టులే. ఏదైనా నేరం జరగబోతుందనే అనుమానంతో ముందస్తు అరెస్టులకు అవకాశం యిస్తున్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 151. దీన్ని పోలీసులు రాజకీయ కారణాలతో విపరీతంగా దుర్వినియోగం చేస్తున్నారు.

సెక్షన్ 151ను దుర్వినియోగం చెయ్యడం ఒక ఎత్తైతే అసలు సభలు, సమావేశాలు జరుపుకోనీయకపోవడం మరో ఎత్తు. దీనికి సెక్షన్ 30ను వాడుకొంటున్నారు. ఇది బ్రిటిష్ వాళ్లు వాళ్ల సామ్రాజ్య రక్షణ కోసం, వారి దుర్మార్గపు పాలనను ఎవరూ విమర్శించకుండా, ప్రశ్నించకుండా ఉండేందుకు తయారు చేసుకున్న 1861 నాటి పోలీసు చట్టంలోని

సెక్షన్. సెక్షన్ 30 అసలు ఉద్దేశం సభలూ, సమావేశాలూ అడ్డుకోవడం కాదు, వాటిని నియంత్రించడం మాత్రమే. ఈ సెక్షన్ ప్రకారం ఒక ఊరేగింపు జరపాలన్నా, సభ నిర్వహించాలనుకొన్నా ఆ విషయాన్ని సంబంధిత పోలీసు అధికారులకు తెలియచేస్తే సరిపోతుంది. అంతేగానీ అనుమతి కోసం ముందే దరఖాస్తు పెట్టుకోవాలని గానీ, ఆ దరఖాస్తుని పోలీసులు తిరస్కరించవచ్చని గానీ ఈ చట్టం చెప్పదు. మీటింగులనూ, ఊరేగింపులనూ నియంత్రించడం అంలే వాటిని నిషేధించడం కాదని సుప్రీంకోర్టు 1973లో హిమత్‌లాల్ కేసులో తీర్పు చెప్పింది. అయినా ఈ సెక్షన్‌ను వాడుకొని సభలనూ సమావేశాలనూ నిషేధిస్తూనే ఉన్నారు.

ఇప్పుడు తెలంగాణలో సభలు, సమావేశాలు జరుపుకోవాలంటే కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకోవడం తప్ప ఇంకో మార్గం లేకుండా పోయింది. కోర్టు నుంచి అనుమతి తెచ్చుకోవడం అందరికీ సాధ్యమవుతుందా? సాధ్యం కాని వాళ్లకు వాక్ స్వాతంత్ర్య హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండి ప్రయోజనమేమిటి? తెలంగాణ పోలీసులు ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడం కోసమే ఈ సెక్షన్‌ను వాడుతున్నారనేది ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

అలాగే పోలీసులు ఎక్కువగా దుర్వినియోగం చేస్తున్న ఇంకొక సెక్షన్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 144 సెక్షన్. మనుషుల ప్రాణాలకూ, ఆరోగ్యానికీ లేదా భద్రతకు ప్రమాదం జరగబోతుం దనుకుంటే, శాంతి భద్రతలకు విఘాతం కలగబోతుందనుకకుంటే, లేదా దొమ్మీలు జరిగే ప్రమాదం ఉందనుకుంటే మాత్రమే వాటిని నివారించడానికి మేజిస్ట్రేట్ ముందస్తుగా సెక్షన్ 144 విధించవచ్చు. విధించడానికి కారణాలను ఆ ఉత్తర్వులలోనే పేర్కొనాలి. కాని తెలంగాణ పోలీసులు ఈ నియమాన్ని ఎన్నడూ పాటించలేదు. నిజానికి ఎటువంటి ప్రమాదం జరిగే పరిస్థితి లేకపోయినా ఆ పదాలను ఉపయోగించి ఉత్తర్వులను పొందుతున్నారు. ఈ సెక్షన్ దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో తెలియాలంటే ఒక్క అసెంబ్లీ ఉదాహరణ చెబితే చాలు. అసెంబ్లీ చుట్టుపక్కల గత ముప్పై సంవత్సరాలుగా 144 సెక్షన్ అమలులో ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా దాన్ని ఎత్తేయలేదు. ఇటీవలి ఉదాహరణ చెప్పాలంటే వేములఘాట్‌లో గత ఏడాది జూలై 28 నుండి వరసగా 60 రోజులు 144 సెక్షన్ అమల్లో ఉంది. హైకోర్టు ఉత్తర్వుల తర్వాతే 27.09.206న దాన్ని తొలగించారు. పాత బస్తీలో ప్రతి ముస్లిం పండగకి రెండు రోజుల ముందు నుండే ఈ సెక్షన్ అమల్లోకి వస్తుంది.

పోలీసుల అత్యుత్సాహమో, తాము ఎవరికీ జవాబుదారులం కాము అనే నిర్భీతో గానీ సాధారణ పాలనలో సహితం వారి జోక్యం బాగా పెరిగిపోయింది. మీరు, మీ మంత్రులు జిల్లాలకు వెళ్లినప్పుడు ప్రజలు మీకు అర్జీలు ఇవ్వడానికి గానీ, తమ ఇబ్బందులను చెప్పుకోవడానికి గానీ వాళ్లు ఏ మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. ఎవరైనా పట్టుదలతో ప్రయత్నిస్తే వారిని అదుపులోకి తీసుకొని అక్రమ కేసులు పెడుతున్నారు. మీరు రెండేండ్ల క్రితం వరంగల్‌లో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుంటై కింద రోడ్డు మీద ట్రాఫిక్ ఆపేశారు.... గుర్తుందా! పాదచారులను కూడా నడవనీయలేదు. హన్మకొండ హంటర్ రోడ్డులోని ఒక ప్రజాప్రతినిధి ఇంటికి మీరు భోజనానికి వెళితే ఆ ఇంటి పక్కనే ఉన్న స్కూల్ పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించడానికి వెళ్లిన తల్లిదండ్రులను సుమారు రెండు గంటల పాటు, అంటే మీ భోజనం అయ్యేంత వరకు, స్కూల్లోకి అనుమతించలేదు.

రెండేండ్ల క్రితం కార్మిక మంత్రిని కలవడానికి బయలుదేరిన అప్పటి వరంగల్ జిల్లా కమలాపూర్‌లోని బిల్ట్ కర్మాగారానికి చెందిన కార్మికులను పోలీసులు జనగామలోనే ఆవేసి వెనక్కి పంపారు. కార్మిక నాయకులనేమో పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. పెద్దపల్లి జిల్లా సిరిపురం గ్రామంలో సుందిళ్ల ఆనకట్ట నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకున్న తన భూమికి మిడ్ మానేరు నిర్వాసితులకు ఇచ్చినట్లుగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసినందుకు చంద్రమోహన్ అనే యువ రైతును పోలీసులు మూడు రోజులపాటు అక్రమ నిర్బంధంలో ఉంచి నాలుగు కేసులు పెట్టి జైలుకు పంపారు. వేములవాడలో చాయ్ అమ్ముకునే ఒక వ్యక్తిని తీసుకుపోయి చిత్రహింసలు పెట్టారు. ఎందుకు? 'పోలీసులు కొన్ని నేరాలలో చూసీచూడనట్లు ఉదాసీనంగా ఉంటున్నారు' అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టడమే అతను చేసిన నేరం. అక్రమ ఇసుక తవ్వకాలను ప్రశ్నించిన నేరెళ్ల దళితులను పోలీసులు పెట్టిన చిత్రహింసల గురించి ఇప్పుడందరికీ తెలుసు. ఆ సందర్భంగా మీరు పోలీసులను సమర్థించిన తీరు ఏ నాగరికుడికైనా ఏవగింపు కలిగిస్తుంది. అధికారులు లంచం అడిగారని ఫిర్యాదు చేసిన వారిని కూడా పోలీసులు చిత్రహింసలు పెడుతున్నారంటే ఏమనుకోవాలి? డబుల్ బెడ్‌రూమ్ పథకానికి తన అసైన్మెంట్ భూమి ఇవ్వనని నిరాకరించినందుకూ, తన భూమికి మెరుగైన నష్ట పరిహారం అడిగినందుకూ కూడా పోలీసులు చిత్రహింసలు పెట్టిన సంఘటనలు మా దృష్టికి వచ్చాయి. ప్రతి సమస్యలోనూ పోలీసులు జోక్యం చేసుకుని తమదైన పద్ధతిలో వాటిని 'పరిష్కరిస్తూ' పోతే అది చివరికి పోలీసు పాలన అవుతుందే గాని ప్రజాస్వామిక పాలన కాదు. పోలీసులను ఉపయోగించుకుని ఎల్లకాలం ఎవరూ అధికారంలో కొనసాగలేరనేది మీకు తెలియంది కాదు.

కొద్ది రోజుల క్రితం అప్పటి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అనురాగ్ శర్మ తన పదవీ విరమణ సందర్భంగా పత్రికల వాళ్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి అభీష్టం మేరకు పనిచేయడం తనకు చాలా సంతృప్తిగా ఉందని అన్నారు. అంటే చట్టాల సక్రమంగా అమలు చేసినందుకో, రాజ్యాంగబద్ధంగా పోలీసుశాఖను నడిపించినందుకో కాదు ఆయనకు సంతృప్తి. మీరు కోరుకున్నట్టు పని చేసినందుకట! పోలీసులు ఎవరినో సంతృప్తి పరచడం కోసం కాదు పని చేయాల్సింది, చట్టబద్ధంగా నడుచుకుని ప్రజల హక్కుల్ని కాపాడాలని వారికి ఎవరు చెప్పాలి? హక్కుల సంఘాలుగా మేము చాలా కాలంగా ఈ విషయం చెపుతూనే ఉన్నాం. ఈ తరహా పాలనా సంస్కృతికి ప్రజాస్వామ్యంలో చోటు ఉండకూడదని, ఈ ధోరణి ప్రజల హక్కుల్ని దారుణంగా హరిస్తుందని గత పాలకులందరికీ చెప్పినట్టే ఇప్పుడు మీకూ చెపుతున్నాం.

ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమంటే అన్నిటి కంటే ముఖ్యంగా ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను గౌరవించడం, ఆ అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం కల్పించే పద్ధతులను గౌరవించడం. అణచివేత వల్ల సమస్యలు పరిష్కారం కావని మీకు తెలియంది కాదు. ఇకనైనా మీరు దిద్దుబాటు చర్యలు చేపట్టి పోలీసుమయమైన నేటి తెలంగాణ ప్రభుత్వ పాలనా సంస్కృతిలో మార్పులు తీసుకురావాలని కోరుతున్నాం. నూతన సంవత్సరం సందర్భంగా మీ పోలీసు శాఖ విడుదల చేసిన 'తెలంగాణ కాప్ యాప్'లో ప్రజలకు అవసరమైన 350 సేవలున్నాయని చెప్పారు. ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను గౌరవించడం కూడా వాటిల్లో ఒకటిగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. వీ

24 గంటల విద్యుత్తు ప్రచారాలు - వాస్తవాలు

***తమ ప్రభుత్వం వచ్చాక 24 గంటల విద్యుత్తు ఇవ్వడం అసాధారణ అద్భుతం అని తెలంగాణ ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారం లోగుట్టును విప్పిచెపుతున్నది* తెలంగాణ జెఎసి**

ఈ రోజు పత్రికలు చూస్తే కోట్ల రూపాయల ప్రజా ధనం వృధా చేస్తూ వ్యవసాయానికి 24 గంటల సరఫరాపై ప్రకటనలు.

చేసిన వాగ్దానాలనన్నింటినీ గాలికి వదిలేసి (నిరుద్యోగ సమస్య, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ, ఫీజు రీయింబర్స్మెంట్, చెప్పాలంటే లిస్టు పెద్దదే.), హాస్టళ్లలో చలికి గజగజ వణుకుతున్న పిల్లలకు కనీసం దుప్పట్లు ఇవ్వకుండా, అమ్మాయిలకు స్కూళ్లలో, హాస్టళ్లలో టాయిలెట్లను కట్టివ్వలేని ఈ ప్రభుత్వం, రైతులకు 24గంటల విద్యుత్తుపై అంత ఆసక్తి ఎందుకు? అసలు ఎలా ఇవ్వగలుగుతున్నది? ఇదంతా మన ముఖ్యమంత్రి దీక్షా దక్షతనేనా?

అన్నింటిలో విఫలమైన ప్రభుత్వం ఈ ఒక్క విద్యుత్ సరఫరా అంశంలో సఫలమైందంటే నమ్మశక్యం కాదు. ఇందులో అసలు మతలబు తెలుసుకోవాల్సిందే.

రాష్ట్రంలో అధికారంలోకి రాగానే విద్యుత్ సమస్య పరిష్కరించామనీ, అదంతా తమ గొప్పేనని మన రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. ఇదంతా ప్రభుత్వం సాధించిన విజయమని కొందరు ఊదర గొడుతున్నారు. వాస్తవాలు తెలియకుంటే ఈ ప్రచారం నిజమని నమ్మే ప్రమాదం ఉంది.

నిజానికి ప్రస్తుతం దేశం మొత్తం అనేక రాష్ట్రాల్లో మిగులు విద్యుత్తు పరిస్థితులు నెలకొన్నాయి. అమ్ముదామన్నా కొనే నాధుడు లేడు. గతంలో మొదలు పెట్టిన వేల మెగావాట్ల ప్రాజెక్టులు 2015 నుండి ఉత్పత్తి మొదలు పెట్టడం ఇందుకు ప్రధానమైన కారణం. ఈ వివరాలన్నీ కేంద్ర ప్రభుత్వ సంస్థ సిఈఏ 2017-18 నివేదికలో స్పష్టంగా ఇవ్వబడ్డాయి.

కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారిటీ (సిఇఎ) 2017-18 వార్షిక నివేదిక ప్రకారం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితి చూస్తే, 2016-17లో కోతలు లేకుండా మిగులు విద్యుత్తు ఉన్న రాష్ట్రాలు- చండీఘర్, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, గుజరాత్, గోవా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ఘర్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, పాండిచేరి, కేరళ, సిక్కిం, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, మేఘాలయ. మొత్తం 19 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో అసలు విద్యుత్ కోతలు లేవు. ఇంకా రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, బీహార్ రాష్ట్రాల్లో కేవలం 1 నుండి 2 శాతం లోటు ఉంది.

అలాగే 2017-18 లో 27 రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల్లో విద్యుత్ కొరత ఉండదని, మిగిలిన రాష్ట్రాల్లో కూడా అతితక్కువ కొరత ఉంటుందనీ, ఒకవేళ ఉన్నా వాళ్లు బహిరంగ మార్కెట్లో విద్యుత్తును కొనుక్కోవడం ద్వారా కోతను అధిగమించడం సాధ్యమవుతుందనీ రిపోర్టులో పేర్కొన్నారు.

2017-18లో దేశంలో అవసరమైన విద్యుత్తు 12,29,661 మిలియన్ యూనిట్లు కాగా, లభ్యత 13,37,828 మిలియన్ యూనిట్లు. మిగులు 108167 మిలియన్ యూనిట్లు. అంటే అవసరమైన విద్యుత్తు కన్నా లభ్యత ఎక్కువగా ఉందన్నమాట.

తెలంగాణ వచ్చిన తరువాత మొదలు పెట్టిన ఒక్క ప్రాజెక్టూ ఇప్పటివరకూ ఉత్పత్తి మొదలు పెట్టలేదు. ఉత్పత్తి చేస్తున్నవన్నీ గతంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులే. రైతులు కూడా 9 గంటల విద్యుత్తును సక్రమంగా సరఫరా చేయమని అడుగుతున్నారు తప్ప 24 గంటల విద్యుత్తును కోరడంలేదు. భూగర్భజలాలు పెరిగిన తరువాత 24 గంటల సరఫరా చేయొచ్చని రైతులు మొత్తుకుంటున్నా వినడంలేదు.

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరాకు సుమారు రు. 10,000 కోట్ల భారం విద్యుత్ సంస్థలపై పడుతుంది. ప్రభుత్వం మాత్రం కేవలం రు. 5,500 కోట్ల మేరకే భారాన్ని భరిస్తానంటున్నది. ఇప్పటికే విద్యుత్ సంస్థలు చేస్తున్న అదనపు విద్యుత్ కొనుగోళ్ల ఖర్చులకు ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడంతో విద్యుత్ సంస్థలు ఆర్థికంగా నష్టాల బాట పట్టాయి.

ఇటు రైతులకు గిట్టుబాటుధర లేదు. దొరికేవన్నీ నకిలీ విత్తనాలే. పంటల బీమా లేదు, రుణ మాఫీ అరకొరే. కొత్తగా రుణాలు దొరకడం కష్టమైపోయింది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోని దేశంలో అత్యధిక రైతు ఆత్మహత్యలు రికార్డు అయితే పట్టించుకునే నాధుడులేడు.

తెలంగాణ వచ్చిన తరువాత విద్యుత్ షాకుల ద్వారా మరణించిన వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 2014లో 400 చనిపోతే, 2017 నాటికి మరణాల సంఖ్య 600 దాటింది. సరఫరాలో నాణ్యత పెరుగుతే, కరెంటు షాకుతో మరణాలు ఎందుకు పెరుగుతున్నట్లు? ఇలాంటి అంశాలపై దృష్టి పెట్టకుండా, 24 గంటల సరఫరా అంటూ ఊదర గొట్టడం దేనికి?

వ్యవసాయానికి 24గంటల కరెంటు...

కాంట్రాక్టర్ల మీదనో, కమీషన్ల మీదనో ఉండే ప్రేమ, ఒకేసారి రైతులపై ఎందుకొచ్చిందో అర్థం కాక అందరికీ అనుమానం. దేశంలో బహిరంగ మార్కెట్లో మిగిలిన విద్యుత్తును కొని సరఫరా చేసి మొత్తం తమ ఘనతే అని 24గంటల ప్రచారం చేసుకోవాలనే పన్నాగం బెడిసి కొట్టేటట్టుంది.

కోరేగావ్ పోరాటం దళితుల విముక్తికి మలుపు

***కోరేగావ్‌లో పీష్వాలకు వ్యతిరేకంగా పోరాడి మరణించిన వీరులను దళితులు స్మరించుకోవడం, దీన్ని జీర్ణించుకోలేని హిందుత్వ శక్తుల దాడులను ప్రతిఘటిస్తూ దళిత ఉద్యమం ఎగిసిపడడం గొప్ప మలుపు అంటున్నారు* డా. కత్తి పద్మారావు**

ఈనాడు సామాజిక సాంస్కృతిక విప్లవభేరి పూణె నుండి ముంబాయి వరకు లౌకికవాద శక్తులన్ని మోగించడం ఒక చారిత్రక పరిణామం. చరిత్రలో దళితులు బ్రాహ్మణవాదం మీద చేస్తున్న పోరాటం ఈనాటిది కాదని తరతరాలుగా యుగయుగాలుగా అది నడుస్తుందని ఈ భీమ్ కోరేగావ్ పోరాటం మన కళ్లముందుకు తీసుకొస్తుంది. దళితులు సైనికులు. దళితులు చరిత్ర నిర్మాతలు. దళితులు భూమి పుత్రులు. దళితులు భారతీయ సంస్కృతీ నిర్మాతలని మళ్లీ పునరుజ్జీవన ఉద్యమంలో తమ చరిత్రను పునర్వివేచించుకుంటున్నారు. ఈ పోరాటంలో ప్రాధానమైన అంశం అంబేడ్కర్ వారసుడు మనవడు ప్రకాష్ అంబేడ్కర్ నాయకత్వం వహించడం 200 సంఘాలు వీరితో కొనసాగడం, ముఖ్యంగా వామపక్షాలు చేయికలపడం ఈ పోరాటానికి ఒక ఐక్యతా సంకేతం.

విశ్వహిందూ పరిషత్, ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. దుర్వ్యూహంతో నూతన సంవత్సర వేడుకలు మిన్నుమిడుతున్న సందర్భంగా దళితులు తమ పోరాట చిహ్నమైన భీమ్ కోరేగావ్‌లో నివాళులు అర్పించడానికి వచ్చిన సందర్భంగా కాషాయ వస్త్రాలు ధరించిన ఆర్.ఎస్.ఎస్. మూకలు భీమ్ కోరేగావ్‌లో దళిత ప్రదర్శకులపై రాళ్లదాడి చేయడం సాయుధ దాడికి తెగబడటం, ఈ దాడిలో దళిత వీరులు రాహుల్, బతంగ్‌లే ఇద్దరు తీవ్రగాయాలతో మరణించడం మోడీ రాజ్య హిందుత్వ ఫాసిజానికి ఇది మరొక నిదర్శనంగా ముందుకు వచ్చింది. అంతేగాక దీనికి ముందే డిసెంబర్ 29న భద్రుకు గ్రామంలో దళితులు నిర్మించుకున్న ఒక అమరవీర స్థూపంపై కూడా ఆర్.ఎస్.ఎస్. శక్తులు దాడిచేశాయి. నిజానికి డా. బి.ఆర్.అంబేడ్కర్‌కు జన్మనిచ్చిన మహర్‌జాతి భారతదేశ నిర్మాణంలో అత్యంత కీలకపాత్ర వహించింది. సింధూ నాగరికతను నిర్మించిన జాతుల్లో వీరు ప్రధానమైన వారు. అంబేడ్కర్ 1927లో దళిత వర్గాల విముక్తి పోరాట దాతలు మహర్ సైనికులకు గుర్తుగా మహారాష్ట్రలోని పూణె దగ్గర కోరేగావ్‌లో తమ వర్గానికి చెందిన వందలాది మంది బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఎలా పోరాడారో, వారికి మిలిటరీయేతర వర్గంగా బ్రిటిష్ ఎలా ముద్రవేసిందో భీమ్ కోరేగావ్ సంస్మరణ సభలో ప్రపంచానికి విన్నవించారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ 1927లో దళిత మృతవీరుల సభ ద్వారా ప్రపంచానికి వారి శక్తి సామర్థ్యాలు, సైనిక ప్రతిభను వెలుగెత్తి చాటారు. నిజానికి అగ్రవర్ణ హిందువులు మహర్లను అస్పృశ్యులుగా ముద్రవేసి, నీచంగా చూడడం వల్ల జీవనోపాధి కరువై వీరు బ్రిటిష్ మిలటరీలో చేరారని అంబేడ్కర్ ఆనాడు ఈ మహర్ సైనిక కథను వివరించారు. మహర్లు యుద్ధవీరులు. భీమ్ కోరేగావ్ పోరాటంలో వారి యుద్ధ సైనిక శక్తి సామర్థ్యాలను బట్టి భారతదేశ రక్షణకు సైనిక శిబిరం ఎప్పటికీ అవసరమని ఆయన చెప్పారు.

నిజానికి గతంలో బ్రిటిష్ సైన్యంలోకి అస్పృశ్యులు ప్రవేశించడంతో (ముఖ్యంగా బాంబే సైన్యం) దేశంలోనూ, సరిహద్దుల ఆవల కూడా తమ సాహసాన్ని రుజువు చేసుకునే అవకాశం వారికి కలిగింది. బ్రిటిష్ అధికారులు వారి సాహసానికి మెచ్చి ప్రశంసల వర్షం కురిపించారు. బాంబే అధికారులు, సిపాయిల విశ్వసనీయతను జనరల్ మాల్కమ్ ప్రశంసించారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల కార్యదర్శికి 1816లో రాసిన లేఖలో బాంబే సైన్యం అన్ని వర్గాల, హిందు, ముస్లిం, యూదు, క్రైస్తవం వంటి అన్ని మతాల వ్యక్తులతో కూడివున్నారని జనరల్ మాల్కమ్ నిర్ధారించారు. మహారాష్ట్రకు చెందిన హిందువులలో రాజపుట్లు, ఇతర అగ్రవర్ణాల కన్నా పర్వారీలు (మహర్లు) ఎక్కువ సంఖ్యలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ పర్వారీలు బాంబే దక్షిణ కోస్తాకు చెందినవారు. రేషన్లు కొరతపడి, మనుషులు, జంతువులు కూడా వ్యాధుల బారినపడిన సందర్భంలో బాంబే సైన్యానికి

ఒకే రోజు పేపర్లలో ప్రకటనలకు రు. 50 కోట్లు ఖర్చు. దేశం మొత్తం అన్ని రాష్ట్రాల్లో కోట్లు గుమ్మరించి పేపర్లలో ప్రకటనలు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరే విధంగా ఉంది. భూగర్భ జలాల స్థాయి పడిపోయి, సరైన సమయానికి నీళ్లు రావేమోనన్న బెంగ రైతుల్లో. పగటి పూట 9 గంటలిస్తే చాలు మొర్రో అని రైతులు రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితులు. 24గంటల సరఫరా చేయాలంటే భూగర్భ జలాలు పుష్కలంగా ఉండాలి. రైతుకు ప్రాణాంతకంగా మారుతున్న వేలాడే కరెంటు లైన్లను సరిచేయాలి. కరెంటు స్తంభాల సరఫరా లేక కర్రలపై వైర్లను తీసుకుపోయే పరిస్థితి ఉండొద్దు. ట్రాన్స్ఫార్మర్ పాడైతే వేల రూపాయల సొంత ఖర్చులు పెట్టి ట్రాక్టర్ పై కిలోమీటర్ల దూరం తరలించి రోజుల తరబడి వేచిఉండే గతి పెట్టకూడదు.

కేవలం చర్చను పక్కదోవ పట్టించడానికి, పత్రికలలో కోట్ల రూపాయలు ప్రకటనలు ఇచ్చి పత్రికలను మరింత చెప్పు చేతల్లో ఉంచుకోవడానికి, అన్ని రంగాల్లో తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోడానికి ముందుకు తెచ్చిందే 24గంటల విద్యుత్తు పేరుతో జరుగుతున్న 24 గంటల ప్రచారం.

వాస్తవం ఇదైతే మనోళ్లు ఇదంతా తమ ఘనతే అని వందల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా చేస్తూ ప్రచారం. కేవలం పత్రికలలో ప్రకటనలకే ఈ మూడేళ్లలో ప్రభుత్వం 500 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసింది.

ఇకనైనా ఈ ప్రచారాలు ఆపుతారా? వీ

చెందిన మహర్ సిపాయిలు క్లిష్టమైన మార్చ్‌లను తట్టుకొని నిలబడి నందుకు ఎన్నో ప్రశంసలను అందుకున్నారు. వారు యుద్ధానికి ముందుకు వెడుతున్నా, యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డా, కోటలపై దాడులు చేస్తున్నా, వ్యూహాత్మకంగా వెనక్కి తగ్గుతున్నా వారు ఎప్పుడూ తమ ఆఫీసర్లకు, సహచరులకు బాసటగా నిలబడ్డారు అని బ్రిటిష్ అధికారులు, వీరు కేవలం సైన్యమే కాకుండా సాంఘిక సేవా తత్పరులని కొనియాడారు.

నిజానికి భీమా నది ఒడ్డున ఉన్న బీడు వారిన కోరేగావ్ 1818 నూతన సంవత్సరం తొలి రోజున మహర్లు సాధించిన విజయం చెప్పుకోదగ్గది. బాంబే నేటివ్ ఇన్‌ఫాంట్రీ (బాంబే దేశీయ పదాతి దళం) 1వ రెజిమెంట్, 2వ బెటాలియన్‌కు చెందిన 500 మందితో కూడిన చిన్న దళం, మద్రాస్ ఆర్టిలరీకి చెందిన 24 యూరోపియన్ సాయుధ దారులు, పూణే ఇర్రెగ్యులర్ హార్స్‌కు చెందిన 250 మంది, రెండు ఆరుపౌండర్ల తుపాకులతో కెప్టెన్ ఎఫ్.ఎఫ్.స్టాంటన్ నాయకత్వంలో విరామం, విశ్రాంతి, ఆహారం, నీరు లేకుండా ఆపకుండా 12 గంటల పాటు 20 వేల గుర్రాలు, 8 వేల పదాతిదళం కలిగిన పీష్వా బాజీరావ్ దళాలతో పోరాడారు. పూణేలోకి కిర్కీ వద్ద గల బ్రిటిష్ సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్న పీష్వా దానికి ముప్పుగా పరిణమించాడు.

పూణె సైనిక స్థావరాన్ని కాపాడేందుకు కెప్టెన్ స్టాంటన్ దళాలను సిరూర్ నుంచి డిసెంబర్ 31 సాయంత్రం రప్పించారు. రాత్రంతా మార్చ్ చేస్తూ 27 మైళ్ల దూరాన ఉన్న కోరేగావ్‌కు 1818, జనవరి 1న ఉదయాన దళం ఆ ప్రాంతానికి చేరుకుని ప్రముఖ మరాఠా హార్స్ భీకర్ విన్యాసాన్ని తిలకించింది. పీష్వా పదాతిదళంలోని 600 మంది సైన్యంతో కూడిన మూడు డిటాచ్‌మెంట్లు మూడు దిక్కుల నుంచి మూకుమ్మడిగా ముందుకు చొచ్చుకు వస్తున్న సమయానికి కెప్టెన్ స్టాంటన్ తన దళాలను సిద్ధం కూడా చేయలేదు. వారి వద్ద కేవలం రెండు తుపాకులు మాత్రమే ఉన్నాయి. పీష్వా దళాలను నియంత్రించేందుకు ఆపకుండా తుపాకులు పేలుస్తునే ఉన్నారు. పూణె ఇర్రెగ్యులర్ హార్స్ ఎంత సాహసాన్ని ప్రదర్శించినప్పటికీ కోరేగావ్ వద్దఉన్న మొత్తం బ్రిటిష్ దళాలను మరాఠా అశ్వికదళం, పదాతిదళం చుట్టుముట్టాయి. నది వద్దకు వెళ్లేందుకు ఉన్న మార్గాలన్నింటినీ మూసివేశాయి. దాడి చేసిన బృందాలు బలవంతంగా గ్రామం నడిబొడ్డుకు దూసుకు రావడమే గాకుండా, కీలకమైన, బలమైన స్థానాలను వశం చేసుకున్నాయి. ప్రతి ఇల్లు, గుడిసె, వీధిలో ప్రతి ఒక్కరూ తీవ్రంగా పోరాటంలో పాల్గొన్నారు. బ్రిటిష్ సైన్యం భారీగా నష్టపోతున్నది. అయినప్పటికీ వారు పట్టువిడవకుండా పోరాటం చేశాయి. చివరి వ్యక్తి, చివరి బుల్లెట్ వరకూ పోరాటం చేయమని కెప్టెన్ స్టాంటన్ తన వారికి పిలుపు ఇచ్చాడు. అవతల ఉన్నది బలమైన శక్తి అయినప్పటికీ నిర్భయంగా, అత్యంత సాహసంతో మహర్లు యుద్ధాన్ని కొనసాగించారు. సూర్యుడు అస్తమించే సమయానికి బ్రిటిష్ సేనలు తాము అత్యంత విషమ స్థితిలో ఉన్నట్టు గమనించాయి.

మరాఠా సైన్యం అత్యంత సమర్ధుడైన జనరల్ గోఖలే నేతృత్వంలో బ్రిటిషర్లపై అన్ని వైపుల నుంచి ముట్టడించి ఆధిపత్యం సంపాదించింది. అదృష్టవశాత్తు రాత్రి సమయం బ్రిటిష్ సేనలకు కొంత ఊరట కలిగించింది. మరాఠా దళాలు తమ దూకుడును తగ్గించాయి. అప్పుడే, యుద్ధంలో అనుకోని అవకాశం ఘటనల దిశను మార్చివేసింది. విజయం వారి ముంగిట ఉన్నప్పటికీ పీష్వా సేనలు రాత్రి 9 గంటల సమయానికి కాల్పులను నిలిపివేసి, కోరేగావ్ నుంచి వెనక్కి మళ్లారు.

మద్రాస్ శతఘ్ని దళానికి చెందిన పన్నెండు మంది, బాంబే నేటీవ్ ఇన్‌ఫాంత్రీకి చెందిన 2/1 రెజిమెంట్‌లో 50 మంది, ముగ్గురు బ్రిటిష్ ఆఫీసర్లు యుద్ధంలో మరణించారు. ఇద్దరు బ్రిటిష్ ఆఫీసర్లు, 113 మంది సిపాయిలు గాయపడ్డారు. యుద్ధంలో మరణించిన బాంబే నేటీవ్ ఇన్‌ఫాంత్రీకి చెందిన 2/1 రెజిమెంట్ సిపాయిలలో 22 మంది మహర్లు లేక పర్వారీలు (పేరు చివర 'నాక్' అన్న పదం వచ్చే వారిని గుర్తించారు). మిగిలిన వారిలో 16 మంది మరాఠాలు, 8 మంది రాజ్‌పుట్లు, 2 ముస్లింలు, ఒకరు లేక ఇద్దరు భారతీయ యూదులు ఉన్నారు.

క్రమశిక్షణతో కూడిన నిర్భయత్వాన్ని ప్రదర్శిస్తూ వీరోచితమైన సాహసాన్ని, మొక్కవోని నిబ్బరాన్ని, ధైర్యాన్ని, కొనియాడదగిన నిశ్చితత్వాన్ని ప్రదర్శించి వారు మహర్ సైనికులకి శాశ్వతమైన గుర్తింపును తెచ్చారు. ఇద్దరిలో ఎవరి కీర్తి గొప్పదో చెప్పడం కష్టం. అది భారతీయ సైనికులదా లేక అంతటి విధేయతను, విశ్వాసాన్ని పొందేలా వ్యవహరించిన బ్రిటిష్ ఆఫీసర్లదా?' (భారతీయ సైనికులలో అధికులు మహర్లు) అంటూ మేజర్ జె.టి. గోర్మన్ తన హిస్టారికల్ రికార్డ్ ఆఫ్ ది సెకెండ్ బెటాలియన్ ఫోర్త్ బాంబే గ్రెనేడీర్స్, 1796–1933లో పేర్కొన్నారు.

అనతికాలంలోనే కోరేగావ్ చర్యకున్న ప్రాముఖ్యతను గుర్తించారు. కోరేగావ్‌ల మొదటి తూటా పేలిన స్థలంలో 65 అడుగులు ఎత్తు, 32 చదరపు అడుగుల వెడల్పు ఉన్న స్మృతిచిహ్నాన్ని నిర్మించాలని తలపెట్టారు. దీనికి 1821 మార్చి 26న పునాది రాయి వేశారు. ఈ దళం సాహసానికి స్మృతిగా ఈ స్థూపాన్ని నిర్మించారు. ఈ సాహసాన్ని కొనసాగించే ఉద్దేశంతో దీనిని నెలకొల్పారు. ఈ చిహ్నంపై యుద్ధక్షేత్రంలో మరణించిన, గాయపడినవారి పేర్లను చెక్కాలని నిర్ణయించారు.

'భారతీయ సైన్యానికి' అని చెక్కిన ప్రత్యేక మెడల్ 1851లో జారీ అయింది. 'కిర్కీ', 'కోరేగావ్' జ్ఞాపకార్థం ఆ మెడల్ రెండు వైపులా వాటి పేర్లు చెక్కారు. నిజానికి మహర్ సైన్యం క్రమశిక్షణతో కూడిన నిర్భయత్వాన్ని ప్రదర్శిస్తూ, వీరోచితమైన సాహసాన్ని మొక్కవోని నిబ్బరాన్ని, ధైర్యాన్ని, చారిత్రాత్మకమైన నిశ్చితత్వాన్ని ప్రదర్శించి తమ సైనిక శక్తిని చాటుకున్నారు.

ఈ పీష్వాల మీద మహర్లు పోరాడడానికి కారణం, అస్పృశ్యులపై పీష్వాల, మరాఠాల పై దారుణమైన అణచివేత. మూతికిముంత మొలకు తాటి ఆకులు కట్టి వారి వీధుల్లో కూడా తిరగడానికి వీలులేకుండా హింసించిన ఘట్టాలు మహర్ల కళ్లముందు కదిలాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ ఎందుకు మహర్ సైన్యాలు పీష్వా మరాఠాల సైనికులను ఊచకోత కోసారు. మహర్లను వేదించి, బాధించి వారి గుండెల్లో గుణపాలు దించి, వారిని ఊరినుండి వెళ్లగొట్టి దుర్భరమైన అణచివేతను కొనసాగించినందుకు ప్రతిగానే 25వేల మంది బ్రాహ్మణ, మరాఠా అగ్రవర్ణ సైన్యాల తలలు నరికి, తమ పోరాట పటిమను చాటుకున్నారు మహర్లు. మహర్ల తిరుగుబాటుకు మూలమైన అస్పృశ్యతా మారణహోమాన్ని దృశ్యీకరిస్తూ అంబేద్కర్ పీష్వాల పాలనా కాలంలో అస్పృశ్యులు తమ నీడతో హిందువును మలినం చేస్తారనే భావనతో

ఎవరైనా హిందువు రోడ్డుపై వెడుతుంటే అస్పృశ్యులు ఆ వీధిని ఉపయోగించుకునేందుకు అంగీకరించేవారు కారు. పొరపాటున ఒక హిందువును అస్పృశ్యులు తాకితే వారు మలినం కాకుండా ఉండేందుకు తన మెడలో కానీ ముంజేతికి కానీ నల్లటి దారాన్ని అస్పృశ్యులు కట్టుకోవలసి వచ్చేది. పీష్వాల రాజధాని అయిన పూణేలో అస్పృశ్యులు తమ మొలకి ఒక చీపురును కట్టుకొని నడవవలసి ఉండేది. తద్వారా వారు నడిచిన దారి శుభ్రం చేసి హిందువులు మలినం కాకుండా నడిచేందుకు వీలు కల్పించేవారు. అలాగే పూణేలో అస్పృశ్యులు ఎక్కడికి వెళ్లినా మెడకు ఒక మట్టి కుండను తగిలించుకొని వెళ్లవలసి ఉండేది. అతడు ఉమ్మి వేయవలసి వస్తే అందులోనే వేయడం ద్వారా హిందువులు పొరపాటున దానిపై నడిచి మలినం కాకుండా కాపాడేవారని పీష్వాల పాలనలో 1818కి ముందు మహర్ల సామాజిక హోదా గురించి వివరిస్తూ డా.బి.ఆర్.అంబేద్కర్ అభివర్ణించారు.

కోరేగావ్ పోరాటం వెనుక తరతరాల చారిత్రక పోరాట గాథ వుంది. ఈ గాథలనుండే అంబేద్కర్ ఆవిర్భవించాడు. ఆయన శూద్రులను, అతి శూద్రులను చరిత్ర మూలాల నుండి చూశారు. ఆనాడు వచ్చిన పోరాటం తరతరాల అణిచివేయబడ్డ దళితుల గుండెల నుండి రగులుతున్న అగ్ని తరంగం ఆర్.ఎస్.ఎస్. విశ్వహిందూ పరిషత్, బి.జె.పి.ని ఎదిరించే శక్తులుగా నీలి లాల్ జెండాలు ఏకమై ఆకాశాన్ని, భూమిని ఏకం చేసి అంబేద్కర్ నినదించిన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ పొలికేక ఇది. నిజానికి ఇప్పుడు బి.జె.పి. పాలనలో ఉన్న రాష్ట్రాల్లో అందరూ అగ్రవర్ణ ముఖ్యమంత్రులే ఉన్నారు. అందునా మహారాష్ట్రను ఒక బ్రాహ్మణుడు పాలించడం ఉత్తరప్రదేశ్‌ను ఒక ఠాగూర్ కులస్తుడు పాలించడం, వీరంతా మనుస్మృతి భావజాలంతో దళితులను అణచివేయాలని చూడడం, ఇవన్నీ దళితుల తిరుగుబాటుకు మూలకారణాలు. మైనార్టీలు, దళితులు, గిరిజనుల నుంచి ఏ ఒక్కరు ఇప్పటి కేంద్ర క్యాబినెట్లో కీలక పదవుల్లో లేరు. బి.జె.పికి ఇంకా కొందరు దళిత నాయకులు మద్దతు ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

కోరేగావ్ పోరాటం తప్పక బహుజన రాజకీయ చైతన్యంగా ముందుకు రావాల్సిన చారిత్రక అవసరం ఉంది. దేశ ఓటర్లలో 16.6 శాతం దళితులు వున్నారు. ముస్లింలు 12 శాతం ఉన్నారు. యస్.టి.లు 8 శాతం ఉన్నారు. వీరిలో కొంత శాతం మంది బి.జె.పి. కి ఓటు వేస్తున్న మాట నిజం. అయితే ఇప్పుడు బి.జె.పి., ఆర్.ఎస్.ఎస్., విశ్వ హిందూ పరిషత్‌లు దళితులపై చేస్తున్న దాడుల తరువాత తెలుసుకోవాల్సిన ప్రధానాంశం రాజ్యాధికారం లేనిదే దళిత బహుజనులకు విముక్తి లేదు అనే విషయం. ఈనాడు సామాజిక సాంస్కృతిక ఉద్యమాలు రాజకీయంగా మలుపు తిరగవలసిన అవసరం వుంది. రాజ్యాధికారం ఉన్నందువల్లే హిందుత్వ శక్తులు దళితుల పైన, స్త్రీల పైన, పాత్రికేయుల పైన, మైనార్టీలపైన దాడులు చేసి కేసుల్ని సమర్థించుకో గలుగుతున్నారు. వందకి 80 శాతం దాడుల్లో ఎఫ్ఐఆర్ ఫైల్ కావడం లేదు.

నిరంతరం దళితులపై దాడులు చేస్తూనే మోడీ అంబేద్కర్ జపం చేస్తున్నారు. ఇది ద్వంద్వ వైఖరి. రాజ్యాధికార చైతన్యాన్ని ఆర్.ఎస్.ఎస్. వాళ్లు రెండు దశాబ్దాలుగా ముమ్మరం చేశారు. దళిత బహుజన మైనార్టీలు కూడా పార్టీలు మార్చడం కాకుండా దళిత బహుజన రాజకీయ చైతన్యాన్ని పెంచుకోవడం చారిత్రక అవసరం. ఈ సందర్భంగా జగ్నేష్ మెవాని చైతాన్యాన్ని మెచ్చుకోవాల్సి ఉంది. మెవాని తన వాక్ పటిమతో మీడియాను ఉపయోగించుకోగలిగిన చాతుర్యంతో తన రాజకీయ భావాలను ముందుకు తీసుకెళ్తూ ఉన్నారు.

కోరేగావ్ విషయంలో తన గొంతు వినిపించాడు. మాయావతి కూడా బౌద్ధస్వీకారోత్సవానికి అక్టోబర్‌లో స్వీకారం చుట్టింది. నిజానికి బౌద్ధ స్వీకారం కూడా హిందూవాదానికి ప్రత్యామ్నాయ రాజకీయ నినాదమే. బౌద్ధులతో పాటు మైనార్టీలందర్నీ కూడా ఏకం చేసుకోవాల్సిన చారిత్రక సందర్భం ఇది. ముఖ్యంగా ముస్లింలు ఎంతో సాంస్కృతిక వారసత్వాన్ని భారతదేశానికి ఇచ్చారు. వారు దళితులతో ఏకం కావడం అనే ఒక ఐక్యత రాజకీయోద్యమానికి పెట్టని కోట అవుతుంది. అందుకే 2019లో ఎన్నికల్లో దళిత బహుజన మైనార్టీల రాజకీయ ఐక్యత వర్ధిల్లాల్సిన అవసరం ఉంది. హిందూ సామ్రాజ్యవాదానికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైంది.

అంబేద్కర్ పుట్టిన రాష్ట్రంలో బ్రాహ్మణుడు ముఖ్యమంత్రి అవ్వడం ఆర్ఎస్ఎస్ ప్రోద్బలం వల్లనే అనేది అర్థం అవుతుంది. హింసను విడనాడి అంబేద్కర్, బుద్ధుడు చెప్పిన మార్గంలో సముద్రాలు ఉప్పొంగించడం వల్ల సంఘ శక్తిని పటిష్టం చేయడం వల్ల, సైనిక శక్తిగా మార్చిడం వల్ల భీమ్ కోరేగావ్ పోరాటంలో అమరవీరులైన మహర్ సైనికులకు ఇచ్చే నివాళి కొనసాగి తీరుతుంది. మృతవీరులందరూ సైనికులే. అందుకే మేము కారంచేడులో మృతవీరుల స్మారక చిహ్నానికి రుధిరక్షేత్రమని, చుండూరులో రక్తక్షేత్రమని పేరు పెట్టడం జరిగింది. ఈ క్షేత్రాలే రాబోయే మరో స్వతంత్ర పోరాట చిహ్నాలు. ఆ స్ఫూర్తితో ముందుకు వెళ్దాం.

(రచయిత సామాజిక తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ) వీ

కోరేగావ్ పోరాటం చెపుతున్నదేమిటి?

***కోరేగావ్‌లో హిందుత్వ శక్తులు తమ బ్రాహ్మణీయ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తున్న దళితులపై రాజ్యం అండతో దాడులకు పాల్పడి అభద్రతా భావాన్ని సృష్టిస్తున్నారని అంటున్నారు* బి. రామకృష్ణ**

1818 జనవరి 1న భీమ కోరేగావ్ వద్ద పీష్వా సైన్యంపై ఈస్టిండియా కంపెనీలోని మహర్ సైనికులు పోరాడి విజయం సాధించి పీష్వాల పాలనను అంతం చేశారనడానికి విజయ చిహ్నంగా ప్రతి సంవత్సరం పూణేకు సమీపంలో ఉన్న కోరేగావ్ వద్ద ప్రజలు సమావేశం కావడం, ఆ యుద్ధంలో మరణించిన మహర్ సైనికులను తలచుకోవడం, నివాళులు అర్పించడం జరుగుతున్నది. భీమ కోరేగావ్ యుద్ధం జరిగి 200 ఏళ్లు కావస్తున్న సందర్భంలో అప్పటి పీష్వాల పాలనకు కేంద్రంగా ఉన్న పూణేలోని శనివార్ వాడలో 'ఎల్గార్ పరిషత్' పేరుతో భారీ సభను నిర్వహించడానికి భీమ కోరేగావ్ శౌర్య దివస్ ప్రేరణ అభియాన్ పూనుకున్నది. అప్పటి పీష్వాల పాలనైతే ముగిసిందేమో గాని వారు ఎత్తి పట్టిన మనువాద బ్రాహ్మణీయత మాత్రం అలాగే కొనసాగుతున్నదని దేశ వ్యాప్తంగా అనేక సంఘటనలు రుజువు చేస్తున్న సందర్భంలో నయా పీష్వాయికి వ్యతిరేకంగా మాట్లాడండి అనే నినాదంతో ఈ సమావేశం 2017 డిసెంబర్ 31న జరిగింది.

ఈ సమావేశంలో అంబేద్కర్ మనుమడు బహుజన్ మహా సంఘ్ (బిబిఎం) జాతీయ నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్, గుజరాత్‌లో ఉనా సంఘటన తర్వాత బిజెపికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తూ మొన్నటి ఎన్నికల్లో ఎంఎల్ఏగా గెలిచిన యువకుడు జిగ్నేష్ మేవాని, ఆదివాసి పోరాట కార్యకర్త సోనీసోరీ, జెఎన్‌యు విద్యార్థిగా బిజెపి దాని అనుంగు సంస్థలచే జాతి వ్యతిరేక శక్తిగా ముద్రవేయబడిన ఒమర్ ఖలీద్, రోహిత్ వేముల తల్లి రాధిక వేముల తదితరులు ముఖ్య వక్తలుగా ఉన్నారు. వీరందరూ కూడా మనువాద బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులకు – రాజ్యానికి వ్యతిరేకంగా తమ బలమైన గొంతులను వినిపించడాన్ని హిందుత్వ ఫాసిస్టు శక్తులు జీర్ణించుకోలేక పోయాయి.

ఈ సమావేశ నిర్వహణకు అనుమతిని ఇవ్వవద్దని, ఇచ్చిన అనుమతిని రద్దు చేయమని అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘ్, హిందూ ఏక్తా అఘడి, శివ ప్రస్థాన్, రాష్ట్రీయ ఏకత్ మాత రాష్ట్ర అభియాన్ తదితర సంస్థలతో పాటు పీష్వా సంతతి వారసుడు ఉదయ్ సింగ్ పీష్వా పోలీసులను కోరారు. దేశం కోసం ఆంగ్లేయులతో పోరాడిన భాజీరావు పీష్వాను అవమానిస్తూ, ఆంగ్లేయుల విజయాన్ని ఉత్సవంగా జరపడం జాతి వ్యతిరేక చర్య అని ప్రకటించారు. ఈ సమావేశానికి ఎన్నో రోజుల ముందు నుండే సామాజిక మాధ్యమాల్లో తమ ప్రచారాన్ని కొనసాగిస్తూ వచ్చారు. కోరేగావ్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వరుబద్రుక్ గ్రామంలోని గోవింద్ గణపత్ గైక్వాడ్ అనే మహర్ సమాధిని కూల్చేయడంతో వారి విధ్వంసక దాడి పథకాన్ని అమల్లో పెట్టారు. శివాజీ కుమారుడైన శంభాజీని చంపించి అతని శవానికి అంత్యక్రియలు నిర్వహించవద్దన్న ఔరంగజేబు ఆజ్ఞలను ఉల్లంఘించి అంత్యక్రియలను గోవింద్ గణపత్ గైక్వాడ్ అనే మహర్ కులస్థుడు నిర్వహించాడు. ఇతన్ని స్మరించుకోవడాన్ని ఇష్టపడని హిందుత్వ శక్తులు అతని గురించి తెలిపే స్మారక బోర్డును ధ్వంసం చేశారు. ఈ సంఘటనలకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయబడడాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించారు. తదనంతర పరిణామాలుగా పూణేలో జరిగే సమావేశానికి కోరేగావ్‌కు తరలివస్తున్న ప్రజలపై రాళ్లతో దాడులు జరిగాయి. వాహనాలను ధ్వంసం చేశారు. కొన్నింటిని కాల్చేశారు. ఒకరు మరణించారు. ఎంతో మందికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ దాడులు పథకం ప్రకారం జరిగాయని రిపోర్ట్ అయ్యాయి. దూకుడుగా ముందుకు వస్తున్న హిందూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జరుగుతున్న సమావేశాన్ని సహించలేక కేంద్రం, రాష్ట్రంలో హిందుత్వ శక్తులు అధికారంలో ఉన్నాయన్న అండతో, ధీమాతో దాడులకు పాల్పడ్డారని స్పష్టం అవుతున్నది. ఈ దాడులకు ప్రధాన పాత్రదారులుగా శంభాజీ భిడీ (85), మిలింద్ ఎక్బోటే (60) లను గుర్తించారు. 85 ఏళ్ల శంభాజీ భిడీ భౌతిక శాస్త్ర ఆచార్యుడిగా పనిచేసి ఆర్ఎస్ఎస్ లోకి పూర్తి స్థాయి కార్యకర్తగా మారాడు. 1980లో శివ ప్రస్థాన్ అనే సంస్థను స్థాపించాడు. మహారాష్ట్రలోని సతారా, సాంగ్లీ, కొల్హాపూర్ ప్రాంతాలలో ఇతనికి వేల మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తల ఆదరాభిమానాలు ఉన్నాయి. 2014 అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధానమంత్రి మోడీ మాట్లాడుతూ భిడీ గురూజీ నన్ను ఆహ్వానించలేదు. ఆయన ఆదేశాలపై వచ్చానని చెప్పాడు. 60 ఏళ్ల ఎక్బోటే పూణేలో బిజెపి మాజీ కార్పొరేటర్. గోరక్షణ అభియాన్ సంస్థకు ప్రతినిధి. వీరిద్దరు కూడా ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నిలబెట్టడానికి మనువాద బ్రాహ్మణీయ హిందూ మతత్వాన్ని బలంగా ముందుకు తీసుకుపోవడంలో కీలక పాత్రను నిర్వహిస్తున్నారు.

'శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు', 'అంతా దైవభీష్టం', 'ఎంత రాసిపెట్టి ఉంటే అంతే జరుగుతుంది' అనే వాటిని వందల ఏండ్లుగా ప్రచారంలో పెట్టి సామాన్య ప్రజానీకం మెదళ్లలో చొప్పించగలిగారు. జరుగుతున్న అన్యాయాలను, మోసాలను ప్రశ్నించనీయకుండా ఆధిపత్య శక్తులు సాగిస్తున్న కుటిల కుతంత్రాలను, దోపిడీ పీడనలను వీటి వెనుక మరుగుపరచ గలిగారు. కర్మ సిద్ధాంతం అట్టడుగు వర్గాల, కులాల వారిని భావ దాస్యంలోకి నెట్టివేయ గలిగింది. తమకు తామే పై వర్గాల వారికంటే తక్కువ వారమని, హీనులమని, మాకిదే రాసిపెట్టి ఉందని, కర్మ ఫలితాన్ని అనుభవించవల్సిందేనని, దీనికి మరెవరినో

నిందించాల్సిందేమి లేదనే ధోరణులను ప్రబలంగా వ్యాపింపచేయ గలిగారు. బానిసత్వాన్ని ఆమోదింపజేయడంలో ఈ భావజాలం చాలా మేరకు సఫలీకృతం కాగలిగింది. విద్యకు, ఉత్పత్తి సాధనాలకు దూరం చేయబడి భూమిపై హక్కులు లేకపోవడం, వేరొకరికి ఊడిగం చేయడంలోనే వారి జీవితాలు తరతారలుగా మగ్గిపోతూ వచ్చాయి. దేవుని పేరుమీద, మతం పేరుమీద అత్యధికులైన శ్రామిక కులాలను అనేక కట్టుబాట్లకు, ఆంక్షలకు గురిచేశారు. గుళ్ల గోపురాలు, కోటలు, గడీలు, రాజ భవనాలు, ఆహారోత్పత్తికి సంబంధించిన వ్యవసాయ పనులు తదితర అనేక ఉత్పత్తులకు సంబంధించిన శ్రమలు చేయడానికి అనేక శ్రామిక కులాల అవసరం ఏర్పడింది. వీరి శ్రమను అలవోకగా దోపిడీ చేయడానికి, కిక్కురుమనకుండా ఏది చెపితే అది చేయడానికి పై భావజాలం పెత్తందారీ శక్తులకు బాగా కలిసి వచ్చింది. కలిసి వచ్చిందే అనేకంటే అటువంటి భావజాలాన్ని పెంచి పోషించారంటే సరిపోతుంది. అందులో భాగంగా మరాఠా సామ్రాజ్యంలో ప్రాబల్యం సంపాదించిన పీష్వాల పాలనలో అంటరాని వారు, సాదాసీదా జనం అనేక రకాల హింసలకు, దోపిడీ పీడనలకు గురయ్యారనీ జోతిరావ్ ఫూలే (1827-1890) ఆ తర్వాత అంబేద్కర్ (1891-1956) లు విస్తృతంగా వెలుగులోకి తెచ్చారు. మరాఠా ప్రాంతం పీష్వాల కాలంలో తీవ్రమైన బ్రాహ్మణిజానికి లోనైంది. శూద్రకులం నుండి వచ్చిన శివాజీ ఛత్రపతిగా (1674-1680) ఎదిగాడు. పీష్వాలను మంత్రులుగా నియమించుకున్నప్పటికీ మహార్‌లను సాంఘిక వివక్షకు గురిచేయలేదు. వారిని సైన్యంలో చేర్చుకున్నాడు. మరాఠా సామ్రాజ్యంలో ప్రధాన మంత్రులు (దివాన్) గా ఉన్న బ్రాహ్మణులే పీష్వాలు. 1680లో శివాజీ మరణానంతరం జరిగిన వారసత్వ యుద్ధాల కాలంలో పీష్వాలు రాజ్యాధికారాన్ని తమ చెప్పు చేతుల్లోకి తెచ్చుకున్నారు. రాజులుగా శివాజీ వారసులే ఉన్నప్పటికీ వారు నామమాత్రంగా మిగిలిపోయారు. పీష్వాల కాలంలో మరాఠా సమాజంలో సనాతన బ్రాహ్మణ ప్రియత్వం, బ్రాహ్మణాదరణ పెరిగిపోయింది. పాలనా, సామాజిక ఆర్థిక రంగాలలో బ్రాహ్మణుల పట్టు విపరీతంగా పెరుగుతూ వచ్చింది. అత్యున్నత రాజ్యాధికారి నుండి గ్రామాధికారి వరకు బ్రాహ్మణ కులస్థుల అధికారమే కొనసాగింది. పురోహితుల నుండి వ్యాపారం చేసే దాకా బ్రాహ్మణులు విస్తరించారు. ఈ విషయాలను ఫూలే తన రచనల్లో వివరించారు.

సంపద కలిగిన ఈ నేలపై విదేశీయులనేకులు దండయాత్రలు జరిపారు. కాని శూద్రాతి శూద్రుల సుఖ సంతోషాలను కాపాడడానికి ఈ ఆక్రమణ దారులు చేసిందేమీ లేదు. మొదట ఈ దేశంపై దండెత్తింది ఇరానీయులు. ఈ రోజు వాళ్లను భారత దేశమంతటా ఆర్యులనీ, బ్రాహ్మణులనీ పిలుస్తున్నారు. ఈ ఆక్రమణ తర్వాత ఆర్యులు అనైతికంగా దుర్మార్గమైన చట్టాలను మనుసంహిత అనే పేర ఒక చోటుకు చేర్చారు. ఇందులోని న్యాయ సూత్రాలన్నీ ఏక పక్షంగా బ్రాహ్మల స్వప్రయోజనాల కోసం రూపొందించారు. ఈ న్యాయ సూత్రాలకు మత సంబంధిత పవిత్రను ఆపాదించారు. ఈ సూత్రాలను ధిక్కరిస్తే మతాన్ని ధిక్కరించి నట్లేనని ప్రచారం చేశారు. ఇదంతా బ్రాహ్మలు తమని తాము గౌరవ ప్రదమైన ఉన్నత స్థానాల్లో ఉంచుకునేందుకు పన్నిన పన్నాగం అని హెచ్చరిక (చేతావని) అనే వ్యాసంలో జ్యోతిరావు ఫూలే స్పష్టం చేశాడు.

విదేశీ పాలకుల్లో ఆర్యులు, ముస్లింలు మాత్రమే ఇక్కడి ప్రజా జీవితంపై ప్రభావం చూపారు. శూద్రాతి శూద్ర పాలితులను దారుణంగా హింసించారు. ఈ దురాక్రమ దారులు ద్రోహం, ఈర్ష్య, క్రూరత్వం, స్వార్థాలకు ప్రతిరూపాలుగా నిలిచారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం పాలితులను పాలనాధికార కొరడాతో హింసించారు. వారిపట్ల నిర్ధయగా ప్రవర్తించారు. గడిచిన కాలంలో పాలిత ప్రజలను అతి దారుణంగా హింసించిన వారిలో వీరిని మించినవారు లేరని ఫూలే వివరించాడు.

పేద సాదలకు విధించిన శిక్షలు అత్యంత దారుణంగా, అమానుషంగా ఉండేవి. ఈ శిక్షల గురించి వింటేనే మనసంతా భయంతో కూడి జుగుప్సతో నిండిపోతుంది. శిక్షల వర్ణన వింటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. శూలం మీద మనిషిని కూర్చోబెట్టడం, కొరడాలతో తోళ్లూడగొడుతూ ఆ గాయాల మీద ఉప్పు నీళ్లు చల్లేవారు. దుర్భరమైన బాధలు అనుభవించలేక చచ్చిపోయేలా చేసి పైశాచిక ఆనందం పొందేవారు. కోట గోడల మీద నుండి కందకాలలోకి దొర్లించడం, మదించిన ఏనుగులతో తొక్కించడం చేసేవారు. ఇలా చిత్రహింసలకు గురిచేస్తూ సామాన్య జనాన్ని మానసికంగా, శారీరకంగా భయ భ్రాంతులకు గురి చేసేవారు. బ్రాహ్మణ ఉద్యోగులకు సామాన్య ప్రజల బాధ చెప్పలేని ఆనందాన్ని ఇచ్చేది. ఈ తక్కువ రకం మనుషులు బ్రాహ్మణ పీష్వాలకు సేవ చేసేందుకు భగవంతుని ద్వారా సృష్టించినబడిన వారని వాళ్ల విశ్వాసం. ఈ బానిసలు పొలాల్లో పనిచేసి పంటలు పండించాలి. బట్టలు నేయాలి. ఎండనకా, వాననకా సకల చాకిరీలు చేయాలి. భట్ బ్రాహ్మణులకు సర్వ రకాల విలాసాలను అందించేందుకు ఈ శ్రామికులు, వారి ఆడవాళ్లు పిల్లలు ఒళ్లు దాచుకోకుండా శ్రమించాలి. ఇదీ బ్రాహ్మణుల కోరిక అని హెచ్చరిక అనే వ్యాసంలో వివరించాడు.

ఒక శతాబ్దం పైగా పీష్వా పాలకులు ప్రజలను పీడించి వసూలు చేసిన పన్నులను ఏనాడూ ప్రజల ప్రయోజనాల కొరకు ఖర్చు చేయలేదు. కోట్ల రూపాయలను స్వంత భోగ విలాసాలకు లెక్కలేని దుర్వినియోగానికి వాడుకున్నారు. ప్రజల కొరకు వాడాల్సిన సొత్తు దేవాలయ భవనాల నిర్మాణానికి వెచ్చించారీ దుర్మార్గులు. ఇవన్నీ తమ స్వంత బ్రాహ్మణ కులస్తుల బాగుకోసమే. ఖజానాలో కోట్ల రూపాయల పన్ను జమ కాగానే రెండు లక్షలు ఒక గుడికి, యాభై వేలు మరో గుడికి ఇలా ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసేవారు. పూనాలో నిర్మించిన పార్వతీ మందిరం అలా నిర్మించిందే. రైతులు ఆరుగాలం ఆకలి చంపుకుని, రెక్కలు ముక్కలు చేసుకుని చెమటోడ్చి సంపద సృష్టించి కట్టిన పన్నును పీష్వా పాలకులు తమ తోటి కులస్థులైన బ్రాహ్మణులకు భూరి దక్షిణలు, సంతర్పణల కోసం దుర్వినియోగం చేశారు. పీష్వాల కాలంలో రైతును గోళ్లూడగొట్టి దరిద్రుడుగా మార్చేందుకు కోర్టులు, చట్టాల అవసరమే వచ్చేది కాదు. బ్రాహ్మణుడే వడ్డీ వ్యాపారి, అధికారి అయిన కాలంలో ఇంక చెప్పేదేముంది. అతనికి ఎదురేముంది. ఆడింది ఆట పాడింది పాట అని పీష్వాల పాలనా దుర్మార్గాలను 1885 జూన్ 15న రాసిన హెచ్చరిక వ్యాసంలో ఫూలే వివరించాడు.

శూద్ర కులానికి చెందిన శివాజీ (1627/30-1680) ఔరంగజేబుకు వ్యతిరేకంగా స్వతంత్ర రాజ్యంగా ఎదగడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాడు. చిన్నపాటి యుద్ధాలు చేశాడు. అటు ఇటుగా గెలుపు ఓటములు

జరిగినప్పటికీ చివరకు ఔరంగజేబు ఆధిపత్యం కిందనే పాలన జరుగుతూ వచ్చింది. శివాజీ పాలన (1674-80) తర్వాత అతని కొడుకు శంభాజీ పాలన (1680-89) చేశాడు. చివరకు 1689లో ఔరంగజేబు (1618-1707) అతన్ని ముక్కలు ముక్కలుగా నరికి చంపాడు. శంభాజీ తరువాత పీష్వాల పాలన సాగుతూ వచ్చింది. ఈ పాలన కూడా మొగలుల ఆ తర్వాత ఈస్టిండియా కంపెనీ ఆధిపత్యం కింద మనుగడ కొనసాగించింది. పీష్వాల పాలనలో ఆంగ్లో మరాఠా యుద్ధాలుగా 1775-1782, 1803-1805, 1817-1818 సంవత్సరాల్లో మూడు సార్లు జరిగాయి. 1818 జనవరి 1న కోరేగావ్ వద్ద జరిగిన చివరి యుద్ధంలో చివరి పీష్వా భాజీరావు-2 ఓడిపోయాడు. అంతటితో పీష్వాల పాలన అంతం అయింది. భాజీరావు-2 ఈస్టిండియా కంపెనీ ఇచ్చే పెన్షన్‌తో 1851లో చనిపోయే వరకూ జీవితాన్ని నెట్టుకొచ్చాడు.

భీమ నదికి సమీపంలో పూనాకు దగ్గరలో ఉన్న కోరేగావ్ వద్ద పీష్వా సైన్యాన్ని ఈస్టిండియా కంపెనీ సైన్యం తరిమికొట్టింది. ఈ సైన్యంలో ప్రధానంగా మహర్‌లు పాల్గొన్నారు. ఈస్టిండియా, బ్రిటిష్ వారి విజయానికి చిహ్నంగా 1851లో కోరేగావ్ వద్ద స్థూపాన్ని నిర్మించారు. దానిపై ఈస్టిండియా కంపెనీ తరపున పోరాడి ప్రాణాలు కోల్పోయిన 49 మంది పేర్లు రాయబడ్డాయి. అందులో 22 మంది మహర్‌లు, 16 మంది మరాఠాలు, 8 మంది రాజ్ పుత్‌లు, ఇద్దరు ముస్లింలు, ఒక యూదు ఉన్నారు. పీష్వాలను ఓడించి వారి పాలనను అంతం చేయడంలో మహర్ సైనికుల పాత్ర గొప్పదని, అది పీష్వాలపై మహర్‌ల విజయంగా, దళిత విముక్తి పోరుగా అంబేద్కర్ అభిప్రాయపడ్డాడు. 1927లో కోరేగావ్‌లోని విజయ స్థంభాన్ని సందర్శించాడు. ఆ తర్వాత ఎన్నో సార్లు ఆ ప్రాంతానికి వెళ్లడం, ఆ సంఘటనను హిందూమత బ్రాహ్మణీయ అణచివేతపై తీవ్రమైన ప్రతిఘటనగా, విజయంగా అంబేద్కర్ ప్రకటించాడు.

మొఘలులు, డచ్, పోర్చుగీసు, ఈస్టిండియా కంపెనీ/బ్రిటిష్ పాలకులు ఎవరైనా గాని ఇక్కడి సంపదను కొల్లగొట్టడానికి, వారివారి వ్యాపార ప్రయోజనాలు, ఇతరేతర స్వలాభాల నేపథ్యంలో ఆనాటి వేటికవిగా ముక్కలు ముక్కలుగా ఉన్న అనేక చిన్న రాజ్యాలు, సంస్థానాలపై దాడులు చేశారు. ఇక్కడి సంపన్నమైన వనరులను కొల్లగొట్టేందుకు బలమైన ప్రయత్నాలు చేయడంలో భాగంగా ఎక్కడికక్కడ రాజ్యాలను, రాజులను, అనేక ప్రాంతాలను లోబర్చుకోవడం, ఒప్పందాలు, బెదిరించడం, దురాక్రమణ దాడులు, యుద్ధాలు చేయడం వంటి అనేక యుక్తులు, కుయుక్తులతో స్థానిక పాలకులను తమ పాదాక్రాంతం చేసుకోగలిగింది ఈస్టిండియా కంపెనీ. అంతిమంగా బ్రిటిష్ వలసవాద శక్తులు ఇక్కడి రాజ్యాలపై ఆధిపత్యాన్ని, సార్వభౌమత్వాన్ని సాధించి బ్రిటిష్ ప్రభుత్వం ప్రత్యక్షంగా పాలన చేస్తూ వచ్చింది. వీరి పాలన కిందనే అనేక రకాల లొంగుబాట్లతో స్థానిక సంస్థానాలు గాని, రాజ్యాలు గాని నామమాత్రపు స్వతంత్ర అధికారాలతో పాలిస్తూ వచ్చాయి. బ్రిటిష్ పాలన కంటే ముందు మరాఠా ప్రాంతంలో పీష్వాల పాలనలో దళితులు, శూద్రాతి శూద్రులు పడిన కష్టాలు అంతా ఇంతా కావు. అవి ఇంతకు ముందే పూలే మాటల్లో ప్రస్తావించడం జరిగింది. ఆ నేపథ్యం నుండి చూసినపుడు కోరేగావ్ వద్ద పీష్వా సైన్యంపై జరిగిన దాడిలో ఈస్టిండియా కంపెనీ తరపున పాల్గొన్న సైన్యంలో అధిక సంఖ్యలో ఉన్న మహర్‌లు కలిసి పోరాడి ఉంటారు. పీష్వాల దురహంకారానికి, మహర్‌లను, ఇతర అంటరాని వారి, కర్కష, అణచివేతలకు, దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా, హింసించిన దురాగతాలను మనసులో పెట్టుకుని దూకుడుగా, దీక్షగా పీష్వా సైన్యంపై విరుచుకుపడి వారిని మట్టికరిపిస్తూ యుద్ధంలో పోరాడి ఉండే అవకాశాన్ని కాదనలేం. అయితే ఇది సంఘటితంగా, దళిత విముక్తి లక్ష్యంతో సామూహిక ప్రజా చైతన్యంతో ఉద్యమ స్ఫూర్తితో జరిగిందని అనుకోవచ్చా?

బ్రిటిష్‌వారు దళిత విముక్తి కోసం ఈ యుద్ధం చేయలేదన్నది స్పష్టమే కదా! ఇక్కడి అణచివేతలకు, దోపిడీ పీడనలకు గురవుతున్న అట్టడుగు వర్గాల, శ్రామిక కులాల ఆత్మగౌరవం నిలబెట్టే విధానం వారికెన్నడూ లేదు. దురాక్రమణ సమయంలో ఈ ఆలోచనలుండే అవకాశమేలేదు. పోనీ ప్రత్యక్ష పాలనను సుస్థిరం చేసుకున్నాక కూడా అటువంటి విధానమేది వారు చేపట్టలేదు. ఆంగ్లేయుల పాలనలో అంటరాని వారికి జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ బ్రిటిష్‌వారి ఆక్రమణకు అలాగే వారి పాలన సుస్థిరం కావడానికి అంటరాని వారు చేసిన సహాయ సహకారాలను బ్రిటిష్‌వారు విస్మరించడాన్ని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆంగ్లేయులపై 1857 తిరుగుబాటు తర్వాత మహర్‌లను తమ సైన్యంలో చేర్చుకోవడాన్ని తగ్గించేశారు. 1890 నుండి సైన్యంలో అంటరాని వాళ్ల నియామకాలపై నిషేధం విధించారు. అంతకు ముందే నియమించబడిన వారిని కొనసాగనిచ్చారు. 1910 కల్లా సైన్యం నుండి అంటరాని వారు పూర్తిగా కనుమరుగయ్యారు. సైన్యంలో వీరిని చేర్చుకోకపోవడాన్ని అంబేద్కర్ వ్యతిరేకిస్తూ బ్రిటిష్ వారికి వీరు ఎలా సహాయపడ్డారో వివరించాడు.

బ్రిటిష్‌వారు 1757-1818ల మధ్య కాలంలో భారతదేశంపై ఆక్రమణలు చేశారు. 1757లో ఈస్టిండియా కంపెనీ దళాలకు బెంగాల్ నవాబు సిరాజ్-ఉద్-దౌలా సైన్యాలకు మధ్య జరిగిన ప్లాసీ యుద్ధంతో బ్రిటిష్‌వారు మొదటి సారిగా భారతదేశంలో ఒక ప్రదేశాన్ని ఆక్రమించుకున్నారు. అలా ఆక్రమిస్తూ ఎన్నో రాజ్యాలను, ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకుంటూ చివరగా 1818లో పూణే దగ్గర్లోని కోరేగావ్ వద్ద జరిగిన యుద్ధంలో పీష్వాలపై విజయాన్ని సాధించి ఈస్టిండియా కంపెనీ మొత్తం భారతదేశాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకుని సంపూర్ణ అధికారాన్ని చెలాయించడం జరిగింది. బ్రిటిష్‌వారు ఈ దేశాన్ని ఆక్రమించుకోవడాన్ని సులభతరం చేసిన శక్తులు ఎవరంటే అంటరాని వారేనని అంబేద్కర్ స్పష్టం చేశాడు. ఈస్టిండియా కంపెనీ సైన్యంలో చేరి ప్లాసీ యుద్ధంలో పోరాడినవాళ్లు దుసద్‌లు. దుసద్‌లు అంటరానివాళ్లే. కోరేగావ్ యుద్ధంలో పోరాడిన మహర్‌లు అంటరానివాళ్లేనని ఈ విధంగా మొదటి, చివరి యుద్ధాల్లో బ్రిటిష్‌వారి పక్షాన పోరాడి భారతదేశాన్ని ఆక్రమించుకోవడానికి బ్రిటిష్ వారికి సహాయపడింది అంటరానివాళ్లేనని అంబేద్కర్ స్పష్టం చేశాడు. బ్రిటిష్ సైన్యంలో చేరడం ఒక దేశ ద్రోహంగా భావించి అంటరానివాళ్ల శీలాన్ని శంకించేవాళ్లు చాలా మంది ఉన్నారు. దేశద్రోహులవునో కాదో కాని అంటరానివాళ్లు ఇలా చేయడం సహజం. ఒక దేశంలో ఒక వర్గం ప్రజలు తమ దేశీయులు సాగించే అణచివేతల

నుండి తమను విముక్తులను చేస్తారనే ఆశతో మాతృ భూమిపై దండెత్తి వచ్చే వాళ్ల పట్ల సానుభూతి చూపిన ఉదాహరణలు కోకొల్లలని అంబేద్కర్ తన రాతలలో వివరించాడు.

బ్రిటిష్ వాళ్లు భారతదేశాన్ని ఆక్రమించుకోవడాన్ని మాత్రమే కాదు అది చేజారిపోకుండా ఉండడాన్ని కూడా అంటరానివాళ్లు సులభతరం చేశారు. 1857లో జరిగిన తిరుగుబాటు బ్రిటిష్ పాలనను ధ్వంసం చేయడానికి, ఇంగ్లిష్‌వారి నుండి తిరిగి స్వాధీనం చేసుకోవడానికి జరిగిన తొలి ప్రయత్నం. సైన్యానికి సంబంధించినంత వరకు ఈ తిరుగుబాటుకు నేతృత్వం వహించింది బెంగాల్ సైన్యం. బాంబె సైన్యం, మద్రాసు సైన్యం విదేశీయులకు విశ్వాసపాత్రులుగా ఉన్నాయి. వీటి సహాయంతోనే 1857 తిరుగుబాటును అణచివేశారు. ఈ సైన్యంలోని చాలా మంది బాంబెలోని మహర్‌లు, మద్రాస్‌లోని పరియలైన అంటారినివాళ్లే. కాబట్టి భారతదేశాన్ని ఆక్రమించుకోవడానికి మాత్రమే కాదు, బ్రిటిష్ వారి నుండి ఈ దేశం చేజారి పోకుండా కాపాడడానికి సహాయపడింది అంటరానివాళ్లేనని చెప్పడం సరైందేనని అంబేద్కర్ స్పష్టం చేశాడు. అలాంటి విశ్వాస పాత్రులైన అంటరాని వాళ్లను సైన్యంలో చేర్చుకోవడంపై నిషేధం విధించడం, భారత సైన్యానికి వెన్నెముకగా నిలిచిన అంటరాని వాళ్లను పోరాటేతర జాతులుగా వర్గీకరించడంలో ఏం న్యాయం ఉందని అంబేద్కర్ ప్రశ్నించాడు.

పీష్వా ప్రభుత్వ హయంలో అణగారిన వర్గాలకు విద్య వాసన కూడా తెలియదు. మనుధర్మాన్ని ఆధారంగా చేసుకుని మత నిరంకుశ స్వభావం కలిగిన పీష్వా ప్రభుత్వం సహజంగానే విద్యను అందించే ఆలోచన చేయలేదు. ఈ మత భావన కారణంగానే శూద్రులకు, అతి శూద్రులకు జీవించే హక్కు, స్వేచ్ఛ, ఆస్తి, ఒకవేళ ఉన్నా చదువుకునే హక్కు మాత్రం వాళ్లకు ఖచ్చితంగా లేదు. ఇలాంటి లోపాలతో బాధలు పడుతున్న అణగారిన వర్గాలు ద్వేషపూరితమైన ఈ మత నిరంకుశత్వం పతనమైనప్పుడు సహజంగానే ఊపిరి పీల్చుకున్నారు. బ్రిటిష్ వాళ్లది ప్రజాస్వామ్యమని, గొప్పవాడైనా మామూలు వాడైన ఒక మనిషి – ఒకే విలువ అనే సూత్రంలో నమ్మకం ఉండడం, ఈ దేశాన్ని ఆక్రమించుకోవడంలో అణగారిన వర్గాలు సహాయపడినందుకు బదులుగా బ్రిటిష్ వాళ్లు తమకు సహాయం చేస్తారని, ప్రత్యేకించి గొప్పగా ఏమి చేయకపోయినా కనీసం మిగతా వాళ్లతోనైనా సమానంగా చూస్తారనే నమ్మకంతో బ్రిటిష్ పాలన రావడంతో అణగారిన వర్గాల్లో ఆశలు రేకెత్తాయని అంబేద్కర్ 'ఆంగ్లేయ పాలకులు అంటరానివాళ్లు' అని రాసిన దాంట్లో ఈ విషయాలను వివరించాడు. పూలే, నారాయణగురు, పెరియార్, అంబేద్కర్ తదితరుల రాతల్లో మనువాద బ్రాహ్మణీయ మతతత్వం ఎంతగా శూద్రులను, శూద్రాతి శూద్రులను పీడించుకు తిన్నాయో స్పష్టంగా అర్థమవుతుంది. ఈ భావజాలం ఈ ప్రాంతాన్ని ఆంగ్లేయులు పాలించినప్పుడూ, నేటికీ కూడా అలాగే స్థిరపడి కొనసాగుతూనే ఉన్నది. నేడది ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, ఇతరత్రా మనువాద బ్రాహ్మణీయ హిందుత్వ రూపంలో పెచ్చరిల్లుతున్నది. నేడు అనేక రాష్ట్రాల్లో, కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడంతో ఈ శక్తులకు అడ్డూ అదుపూ లేకుండా పోతున్నది. నరేంద్రమోడీ పాలనలో దేశ వ్యాప్తంగా హిందూ ఫాసిస్టు శక్తులు మరింత శక్తివంతం అవుతున్నాయి. మనుస్మృతిని విస్మృతి గాకుండా పలు రూపాల్లో ముందుకు తెస్తున్నాయి. రకరకాల పేర్లతో సమూహాలతో ప్రగతిశీల శక్తులు, దళితులు, ఆదివాసులు, మహిళలు, మైనారిటీలపై విరుచుకుపడుతున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు ఒకటేమిటి అందరిపైనా భౌతిక, మానసిక దాడులు జరుగుతున్నాయి. తప్పుడు కేసులు పెట్టడం, హత్యలు చేయడం, బట్టలూడదీసి కొడుతూ బహిరంగంగా ఊరేగించడం వంటి ఎన్నో అరాచకాలకు పాల్పడుతున్నారు.

తినే తిండిపై, కట్టే బట్టపై, ఆలోచనలపై, రాతలపై, మాటలపై నియంత్రణలు, ఆంక్షలు, కట్టడులు అసహనం ఎటు చూసినా ఊపిరి సలపనీయని నిర్బంధ పూరిత వాతావరణం అలుముకుని ఉన్నది. అత్యున్నత విద్యా సంస్థల్లో నిర్ణాయక స్థానాలను హిందుత్వ శక్తులతో నింపి అక్కడి ప్రశ్నించే అధ్యాపకులను, విద్యార్థులను నిర్బంధాలకు గురిచేస్తున్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామిక హక్కుల గురించి నినదించే వారిని సునాయసంగా దేశ ద్రోహులని ముద్రలు వేస్తున్నారు. తప్పుడు కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూరివర్సిటీలో రోహిత్ వేముల ఘటన, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో కన్హయ్య కుమార్, ఒమర్ ఖలిద్‌లపై దేశద్రోహ చిత్రీకరణ, జాదవ్‌పూర్ యూనివర్సిటీలో నిర్బంధ వాతావరణం, బెనారస్ హిందూ యూనివర్సిటీలో అమ్మాయిలపై పితృస్వామ్య ఆంక్షలు, ఐఐటి చెన్నైలో అంబేద్కర్, పెరియార్ స్టడీ సర్కిల్‌పై నిర్బంధం, గుజరాత్‌లో దళితులను బట్టలూడదీసి బహిరంగంగా కొడుతూ ఊరేగించిన ఉనా సంఘటన, గొడ్డు మాంసం తిన్నాడని అఖ్లాక్ హత్య, గో సంరక్షణ పేరుతో దళితులు, మైనారిటీలపై దాడులు, ఘర్‌వాపసి పేరుతో నిర్బంధాలు, నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేశ్‌ల హత్యలు, భేలా భాటియా వంటి అనేక ఆదివాసి కార్యకర్తలపై దాడులు, జి.ఎన్. సాయిబాబా తదితరులపై జీవిత ఖైదు శిక్షలు, తెలంగాణలోని శాతవాహన యూనివర్శిటీలో మనుస్మృతి ప్రతులను దహనం చేసిన వారిపై దాడులు, దానికి పరోక్ష కారణమంటూ సూరేపల్లి సుజాతపై బెదిరింపులు, కంచ ఐలయ్యపై దాడులు, సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న జడ్జీ అనుమానాస్పద మృతి వంటి అనేక సంఘటనలతో ఇవ్వాళ దేశం మొత్తం మీద నాలుమూలలా హిందూ ఫాసిస్టు మూకలు, బ్రాహ్మణీయ మనువాద భావజాలం విస్తరించి, రాజ్యం దాని యంత్రాంగం అండతో విచ్చలవిడిగా దాడులకు పూనుకుంటున్నది. చాలా రాష్ట్రాల్లో, కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్న ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు తమ కార్యకలాపాలను సునాయసంగా కొనసాగిస్తున్నాయి. చట్ట సభల్లో ప్రవేశించిన కొందరు ఎంఎల్‌ఎలు, ఎంపిలు బహిరంగంగానే ఈ దేశం హిందువులదని, త్వరలోనే ఈ దేశం హిందూ దేశంగా మారుతుందని, హిందూ మతాన్ని అనుసరించేవారే ఈ దేశంలో ఉండాలని, ఇష్టం లేకుంటే మరెక్కడికైనా వెళ్లాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కోరేగావ్‌లో జరిగిన సభ సందర్భంగా మనువాద బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు చేసిన దాడులను ఈ నేపథ్యంలోనే చూడాల్సి ఉంది. హిందూ ఫాసిస్టు పాలనను అడ్డుకోవాల్సిన సందర్భమిది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

రాజకీయ చదరంగంలో దర్యాప్తులు - తీర్పులు

దక్షిణాదిలో బలపడడానికి, రానున్న ఎన్నికల్లో కేంద్రంలో మద్దతు కోసం ప్రాంతీయ పార్టీలను తన దారికి తెచ్చుకోవడానికి బిజెపి దర్యాప్తు సంస్థలను, కోర్టులను తనకు అనుకూలంగా మలుచుకుందని అందులో భాగమే 2-జి తీర్పు అంటున్నారు **ఎ. నర్సింహా రెడ్డి**

అవినీతి రాజకీయాస్త్రంగా మారినప్పుడు ప్రజాస్వామిక వ్యవస్థల విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతుంది. దేశంలో వెలుగులోకి వచ్చిన కుంభకోణాలు తమాషా అయిన మలుపు తిరగడం సమకాలీన ధోరణిగా మారింది. దేశంలో సంచలనం కలిగించి రాజకీయాల్లో పెనుమార్పులకు కారణమైన 2-జి కేసును పాటియాలా హౌస్ సి.బి.ఐ. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఓ.పి. సైనీ దూది పింజలా తేల్చిపారేశారు. 2017 డిసెంబర్ 21న అసలు నేరారోపణ రుజువుకు తగిన సాక్ష్యాలు ప్రవేశ పెట్టలేకపోయారని 2-జి స్పెక్ట్రం కేసును కొట్టివేస్తూ సి.బి.ఐ. కోర్టు 17 మంది నిందితులను నిర్దోషులుగా తీర్పిచ్చింది. పాటియాలా సి.బి.ఐ. ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పు 'గజం మిథ్య పలాయనం మిథ్య' అన్నట్టుంది. ఈ తీర్పు మన వ్యవస్థలోని లొసుగులను ఎత్తి చూపింది. సమాధానాల్లేని ఎన్నో ప్రశ్నలను మరెన్నో సందేహాలను రేకెత్తిస్తోంది.

యూనిఫైడ్ యాక్సెస్ సర్వీసెస్ లైసెన్సులతోపాటు 2-జి స్పెక్ట్రం కేటాయింపు క్రమంలో టెలికం డిపార్టుమెంట్ చట్టవిరుద్ధంగా వ్యవహరించినట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాల్సిందిగా కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి) 2009లో సి.బి.ఐ.ని కోరింది. 2009 అక్టోబర్ 21న సి.బి.ఐ. గుర్తు తెలియని డాట్ అధికారులు, వ్యక్తులు, కంపెనీలపై ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసింది. ఇదిలా ఉండగా, 2008లో టెలికం లైసెన్సుల మంజూరులో రు. 70 వేల కోట్ల కుంభకోణం జరిగిందని దాఖలైన మూడు విజ్ఞప్తులపై 10 రోజుల్లో సమాధానాలివ్వాల్సిందిగా సుప్రీంకోర్టు 2010 సెప్టెంబర్ 13న కేంద్ర ప్రభుత్వాన్ని, మంత్రి రాజాను కోరింది. మరోవైపు నాటి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వినోద్‌రాయ్ 2-జి స్పెక్ట్రమ్‌పై ప్రభుత్వానికి సమర్పించిన ఆడిట్ నివేదిక, ఖజానాకు రు. 1 లక్ష 76 వేల కోట్లు నష్టం వాటిల్లిందని వెల్లడించడం పెద్ద ఎత్తున రాజకీయ దుమారం లేపింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని సి.బి.ఐ.ని సివిసి అదేశించింది. ఇంతలో నీరా రాడియా టేపులు బహిర్గతం కావడంతో దర్యాప్తు మొదలైంది. మంత్రి పదవికి రాజా రాజీనామా సమర్పించాడు.

2-జి స్పెక్ట్రం కేసు విచారణలో ఒకరితో మరొకరికి పొంతన లేకుండా న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థలైన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్), కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి), కేంద్ర పరిశోధనా సంస్థ (సి.బి.ఐ.) లు పని చేశాయని పాటియాల కోర్టు తీర్పు స్పష్టీకరించింది. యుపిఏ-1 ప్రభుత్వంలో పురుడు పోసుకొని యుపిఏ-2 హయాంలో బయటికి పొక్కిన 2-జి కుంభకోణం రాజకీయ నాయకులు, కార్పొరేట్లు కలిసికట్టు అవినీతికి 'మచ్చుతునక'. దేశమంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్న మూడు 2-జి కేసులు. టెలికాం మాజీ మంత్రి ఎ. రాజా, డిఎంకె అధిపతి కరుణానిధి సతీమణి దయాళు అమ్మాల్, కుమార్తె కనిమొళి సహా 35 మంది ప్రముఖులు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసుల్లో ఏ ఒక్కరూ దోషులుగా నిర్ధారణ కాకపోవడం శోచనీయం. దీంతో కేసులు నమోదు చేసిన సి.బి.ఐ., ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు సమాజానికి జవాబు చెప్పుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ఇంత పెద్ద కుంభకోణంలో ఏడేళ్లు కొనసాగిన వ్యాజ్యం వీగిపోవడం విచారణ వ్యవస్థల డొల్లతనానికి నిదర్శనం. 2-జి కుంభకోణంలో పాటియాలా సి.బి.ఐ. ప్రత్యేక కోర్టులో సి.బి.ఐ., ఇడిలు ఎవరి మీద ఏ ఆరోపణనీ సమర్థంగా నిరూపించలేక పోవడంతో ముద్దాయిలందర్నీ న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటించడం సంచలనాత్మకమైంది. 2-జి కేసులో నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ 1,552 పేజీల తీర్పు వెలువరించిన న్యాయమూర్తి ఈ సందర్భంగా సి.బి.ఐ. పైనా, ప్రాసిక్యూషన్ పైనా చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరం. ఒక్కరూ ఒక్క ఆధారాన్నీ చూపలేక పోయారని, కోర్టుకు సమర్పించిన పత్రాల్లో సీనియర్ అధికారుల సంతకాల్లేవన్నారు. దర్యాప్తు తుది ప్రతిలో ఒక్క అధికారి కూడా సంతకం పెట్టకపోతే ఆ డాక్యుమెంట్‌కు విలువేం ఉంటుందంటూ జడ్జి తన అసంతృప్తిని వెలిబుచ్చారు.

మరైతే ఇంతకాలం నడిచిందంతా ప్రహసనమేనా? కాగ్ నివేదిక, సి.బి.ఐ. అభియోగపత్రం, సుప్రీంకోర్టు 122 లైసెన్స్‌లు రద్దు చేయడం, ఎన్‌ఫోర్స్‌మెంట్ స్వాధీనాలు ఇవన్నీ ఏమిటి? అన్న సందేహం సహజంగా కలుగుతుంది. విచారణ సంస్థల్లో నిబద్ధత, నిష్పాక్షికత, నైతికత లోపిస్తే ఫలితం ఇలాగే ఉంటుందనడానికి తార్కాణమిది. అంతేకాక విచారణ సంస్థలు రాజకీయ ప్రభావంతో వ్యవహరించడం వలన నేరారోపణల నిరూపణ పెద్ద అవరోధంగా మారుతోందని తాజాగా మరోసారి రుజువైంది. 2-జి కుంభకోణంలో తొలి అరెస్టు జరిగిన ఏడేళ్లకు వెలువడిన ప్రత్యేక కోర్టు తీర్పు ప్రాసిక్యూషన్ వైఫల్యంతో నిందితుల నెత్తిన పాలుపోసింది!

2-జి స్పెక్ట్రమ్

స్పెక్ట్రం కేటాయింపులను వేలం పద్ధతి ద్వారా కాకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం కేటాయించడం 1994లో పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడే మొదలైంది. అనంతరం దేవెగౌడ, ఐ.కె. గుజ్రాల్, ఆ తరవాత ఆరేళ్లపాటు అధికారంలో కొనసాగిన వాజ్‌పేయీ నాయకత్వంలోని భాజపా ప్రభుత్వం, తదుపరి మన్మోహన్

సింగ్ ప్రభుత్వం అదే విధానం కొనసాగించాయి. అతిపెద్ద టెలికాం కుంభకోణానికి పాల్పడ్డారంటూ రాజా బృందంపై తొలుత గళమెత్తింది ప్రస్తుత భాజపా ఎంపి సుబ్రమణ్యస్వామి. నేర తీవ్రత దృష్ట్యా భారత శిక్షా స్మృతిలోని 409 (విశ్వాస ఘాతుకం), 420 (వంచన), 463 (ఫోర్జరీ), 120 బి (నేరపూరిత కుట్ర) సెక్షన్లతో పాటు అవినీతి వ్యతిరేక చట్టం మనీలాండరింగ్ నిరోధక చట్టాల కింద కేసులు పెట్టాలని అప్పట్లో ఆయన పట్టుబట్టారు. 2008లో స్పెక్ట్రమ్ కేటాయింపులకు 2001 నాటి ధరల్ని ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారంటూ 'కాగ్' లేవనెత్తిన మౌలిక సందేహం రాజా ద్రోహం ఆనవాళ్లను పట్టిచ్చింది. రాజా కేటాయించిన లైసెన్సులను రద్దు చేసిన సుప్రీంకోర్టు 2013లో సహజ వనరులను వేలం పద్ధతిలోనే కేటాయించాలని నిర్దేశించింది.

బిజెపి ప్రభుత్వం 2-జి స్పెక్ట్రం కేసులో వ్యవహరించిన తీరు జుగుప్సాకరం. నిందితులను నిర్ధారించాల్సిన సి.బి.ఐ. కేంద్ర సర్కారు పరిధిలోనే ఉంది. సుమారు మూడున్నరేండ్ల నుంచి కేంద్రంలో బిజెపి అధికారంలో ఉంది. నిజంగా అవినీతిని అంతమొందించే ఉద్దేశమే ఉంటే 2-జి కేసులో సి.బి.ఐ. పక్కాగా దర్యాప్తు చేసేదే. సాక్ష్యాధారాలను సేకరించి నిందితులపై అవినీతిని నిరూపించేదే. రాజకీయ ప్రత్యర్థులను లోబరుచుకునేందుకు తన చేతిలోని సి.బి.ఐ.ని కేంద్ర ప్రభుత్వాలు తమకు అనుకూలంగా వాడుకుంటున్న ఆరోపణలు చాలా కాలం నుంచి వింటున్నాం. 2-జి దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వైఫల్యానికి ఏమిటి కారణం? అంటే 2-జి కేసులో పలు కార్పొరేట్ సంస్థలు ఇరుక్కున్నాయి. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు అరుణ్ శౌరి మంత్రిగా చేసిన రెండు కేటాయింపులు వివాదాస్పదమయ్యాయి. అది ఎన్‌డిఎ ప్రభుత్వం మెడకు చుట్టుకుంటుందన్న భయం కూడా ఉంది. మరోవైపు స్పెక్ట్రమ్ లైసెన్స్‌లు పొందిన కంపెనీల యాజమానులనే సాక్షులుగా పెట్టారు. 2-జి కేటాయింపుల సూత్రధారి అయిన వ్యక్తినే మోడీ ప్రభుత్వం కీలక స్థానంలో నియమించుకోవడం వంటివి మోడీ ప్రభుత్వం పాత్రను స్పష్టం చేస్తున్నాయి. కార్పొరేట్, స్వంత ప్రయోజనాలను ఆశించే 2-జి కేసులో సి.బి.ఐ. దర్యాప్తు విఫలమయ్యేలా మోడీ సర్కారు సహకరించిందని వస్తున్న వాదనలకు బలం చేకూరుతోంది.

2-జి స్పెక్ట్రమ్ లైసెన్స్‌ల కేటాయింపులో అక్రమాలు బాహాటంగానే జరిగాయి. కేవలం 60 నిమిషాల్లో 122 లైసెన్స్‌లు జారీ చేశాడు. ఇలా లైసెన్స్‌లు జారీ చేస్తారని అయిన వారికి తప్ప మరెవరికి తెలియదు. 'ఎవరు ముందు వస్తే వారికే కాంట్రాక్టులు' అన్న పద్ధతిని రాజా అనుసరించారు. కంపెనీల దగ్గర లంచాలు పట్టడానికే ఈ విధానం అనుసరించారన్న ఆరోపణలు ఆ రోజుల్లో గుప్పుమన్నాయి. 2008లో కేటాయించిన స్పెక్ట్రమ్ రేటు 2001 నాటి ధరల ప్రకారం నిర్ణయించేశారు. ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ ధర నిర్ణయానికి అభ్యంతరం పెట్టినా రాజా ఖాతరు చేయలేదు. దరఖాస్తు చేసుకోవడానికి గడువును ముందుకు జరిపి టెలికాం రంగంలో అనుభవం లేని కంపెనీలకు లైసెన్స్‌లు కట్టబెట్టారు. ఇలా దరఖాస్తు గడువును ముందుకు జరపడం చట్ట విరుద్ధం అని ఢిల్లీ హైకోర్టు ఆనాడే తప్పుపట్టింది! స్వాన్ టెలికాం కంపెనీకి లాభం చేకూర్చి రాజా రు. 200 కోట్లు తీసుకున్నారని ఆరోపణ, స్పెక్ట్రమ్ కేటాయింపులో దండుకున్న డబ్బును కలైగ్నర్ టివికి మళ్లించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించింది. కలైగ్నర్ టివిలో 80 శాతం పెట్టుబడులు కరుణానిధి భార్య దయాళు అమ్మాల్, కూతురు కనిమొళివే.

2011లో రాజా, కణిమొళి అరెస్టయ్యారు. అప్పటి నుంచి ఈ కేసును సి.బి.ఐ. ప్రత్యేక న్యాయస్థానం విచారిస్తూ వచ్చింది. ఈ లోగా సి.బి.ఐ. అధినేతలు, సహాయ అధినేతలు చాలామంది మారిపోయారు. సి.బి.ఐ. మాజీ అధినేత రంజిత్ సిన్హా నిందిత కంపెనీల ప్రతినిధులతో పదేపదే సమావేశాలు జరిపినట్టు ఆధారాలు వెల్లడి కావడంతో అరెస్టయ్యారు. సుమారు మూడేళ్ల క్రితం, ఇంకో పన్నెండు రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్న దశలో కేంద్ర దర్యాప్తు సంస్థ సంచాలకుడిగా రంజిత్ సిన్హా న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించారు. 2-జి కుంభకోణాసురులతో చేతులు కలిపి దర్యాప్తు, విచారణ ప్రక్రియల్ని గతి తప్పించబోయి ధర్మాసనం చేత తలంటించుకున్న ఆయన వ్యవహారసరళి యావత్ దేశాన్నీ నిర్ఘాంతపరచింది. అంతకు మునుపు నేరుగా సుప్రీంకోర్టుకే అందించాల్సిన స్థాయీ నివేదికను అప్పటి యుపిఎ న్యాయ సచివుడికి సమర్పించి, 'అవసరమైన మార్పులు' చేసి న్యాయమూర్తుల చేత ఛీకొట్టించుకున్నదీ ఆయనే. నాటి ఆ వక్రబుద్ధుల నిర్వాకాలు సి.బి.ఐ.ని నేడు నిస్సహాయ స్థితిలోకి నెట్టేశాయా? అన్న అనుమానం కలుగడం సహజమే. ప్రస్తుతం రంజిత్ సిన్హా మోడీ ప్రభుత్వంలో పలు కమిటీలకు ప్రముఖ సలహాదారునిగా ఉన్నాడు.

దర్యాప్తు, నిఘా సంస్థలపై ప్రభుత్వ ప్రభావం

2014 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో మోడీ కాంగ్రెస్ పాలన కుంభకోణాల మయమని, అవినీతిని చీల్చి చెండాడతామని అధికారంలోకొచ్చాడు. మోడీ మంత్రివర్గంలోని 45 మందిలో 13 మంది పైన రేప్, హత్యాయత్నం తదితర తీవ్రమైన నేరాలతో కూడిన కేసులు కోర్టుల్లో ఉన్నాయి. మోడీ ఎన్నికల హామీకి విరుద్ధంగా వీరంతా మంత్రులుగా కొనసాగుతున్నారు. ఇలా కోర్టు తీర్పులు, జైలు తలుపులు మోడీ వేళ్ల కదలిక ప్రకారం పనిచేస్తున్న దాఖలాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మోడీ ప్రధాని అయ్యాక ఏకంగా న్యాయదేవత తక్కెడను తన చేతుల్లోకి తీసుకొని కోర్టు తీర్పులతో రాజకీయ ప్రయోజనం పొందే పనిలో పడ్డారు. సి.బి.ఐ. స్పెషల్ కోర్టులు ఇస్తున్న తీర్పుల్లో, తిరగతోడుతున్న కేసుల్లో మోడీ మార్క్ స్పష్టంగా విధితమవుతుంది.

ప్రధాని పీఠం ఎక్కగానే మోడీ ముందుగా తమ చేతులకంటిన మకిలిని కడిగేసుకునే ప్రయత్నం చేశారు. 28 ఫిబ్రవరి, 2002 నాడు అహ్మదాబాద్‌లోని గుల్‌బర్గ్ సొసైటీలో జరిగిన నరమేధానికి సూత్రదారుల్లో ఒకరిగా నరేంద్రమోడీ సి.బి.ఐ. కేసులో ఉన్నారు. ఈ సంఘటనలో మాజీ కాంగ్రెస్ ఎంపి ఎహసాన్ జాఫ్రితో పాటు 35 మంది మంటల్లో కాలిపోయారు. డిసెంబర్ 2014లో అంటే మోడీ పీఠమెక్కిన ఏడునెలల్లోనే సి.బి.ఐ.కి సరైన సాక్ష్యాలు దొరకలేదన్న సాకుతో ఈ కేసును కొట్టివేసింది. నవంబర్ 2005లో సొహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసర్‌బి గుజరాత్ పోలీసుల చేతుల్లో హైదరాబాద్‌లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. డిసెంబర్ 2006లో ఆ సంఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన తులసి ప్రజాపతి కూడా చంపబడ్డారు. ఆ సమయంలో గుజరాత్

హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా పాలరాయి వ్యాపారులను సొహ్రాబుద్దీన్ అక్రమ వసూళ్ల నుండి రక్షించేందుకు ఈ ఎన్‌కౌంటర్ చేయించాడన్న ఆరోపణ దాకా కేసు పోయింది. ఈ కేసులో అమిత్‌షా జూలై 25, 2010 నాడు అరెస్టు అయ్యాడు. కండిషనల్ బెయిల్‌పై అక్టోబర్ 20, 2010 నాడు బయటికొచ్చాడు. ఈ కేసును కూడా సిబిఐ రాజకీయ దురుద్దేశపూర్వకమైనదని డిసెంబర్ 2014లో కొట్టివేసింది.

దక్షిణ భారతంలో పాగా వేయాలనేది మోడీ-అమిత్ షాల ప్రగాఢ వాంఛ. దానిని నెరవేర్చే దిశగా కదిపేందుకు పావులకోసం వెతుకులాట ప్రారంభమైంది. మోడీ పాలన మొదలయ్యేనాటికి జయలలిత జైల్లో ఉన్నారు. 1991-1996 ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టుకుందన్న అభియోగంపై 18 ఏళ్ల తర్వాత 27 సెప్టెంబర్, 2014 నాడు తీర్పు వచ్చింది. జయలలిత, శశికళ, ఇలవరసి, సుధాకరన్‌లకు నాలుగు ఏళ్ల జైలుశిక్ష పడింది. జయలలితకు జైలు శిక్షతో పాటు రు. 100 కోట్ల జరిమానా కూడా కట్టాలని తీర్పులో ఉంది. కొద్దికాలం గడిచాక మే 2015లో కర్ణాటక కోర్టు ఆస్తుల లెక్కల్ని తప్పుగా చూయించారని, అంత ఆస్తులు జయలలితకు లేవని తేల్చి కేసును కొట్టివేసి అందరినీ విడుదల చేసింది. ఆ మేలును దృష్టిలో ఉంచుకొని జయలలిత తమకు సహకరిస్తుందని మోడీ-షా ద్వయం ఆశపడుతుండగా అనూహ్యంగా ఆమె చనిపోయారు. శశికళ ముఖ్యమంత్రి కావడం బిజెపికి ఇష్టంలేని కారణంగా ఆదాయం మించిన ఆస్తి కేసు తిరిగి కళ్లు తెరిచింది. ఫిబ్రవరి 14, 2017 నాడు ఈ కేసులో కర్ణాటక కోర్టు తీర్పు తప్పుపడుతూ సుప్రీంకోర్టు శిక్షను అనుభవించవలసిందే అంది. ఆ దెబ్బకు శశికళ బెంగుళూరు పరప్పన జైలుకు తరలిపోయింది.

దేశ రాజకీయాలనూ, న్యాయస్థానాలు వెలువరిస్తున్న తీర్పులనూ, వాటిపైన వివిధ రాజకీయ పార్టీలు చెబుతున్న భాష్యాలనూ గమనించినవారు 'ఇదేమీ రాజ్యం'? అంటూ విస్తుపోతారు. రాజకీయ పార్టీల తీరు పట్ల దిగ్భ్రాంతి చెందుతారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సి.బి.ఐ.) నిర్వాకం చూసి నివ్వెరపోతారు. సిబిఐ దర్యాప్తు పేరు మీద రాజకీయ పోరాటాలు చాలా కాలంగా సాగుతున్నాయి. ఆరోపణలు చేసినవారికి వాటిని నిరూపించవలసిన బాధ్యత లేదు. ఆరోపణల స్థాయి దాటి సి.బి.ఐ. దర్యాప్తు మొదలైతే రాజకీయ క్రీడ ఆరంభం అవుతుంది. సి.బి.ఐ. పెట్టిన కేసులలో న్యాయస్థానం ఎదుట పరీక్ష తట్టుకొని నిలిచినవి చాలా తక్కువ. సి.బి.ఐ.ని న్యాయస్థానాలు చీవాట్లు పెట్టని సందర్భాలు తక్కువ. రాజకీయ సమీకరణల నేపథ్యంలో కుంభకోణాల దోషులకు శిక్షలు పడడం లేదా తప్పించుకోవడం అనే అసాధారణ సంఘటనలు దేశ రాజకీయ యవనికపై సమకాలీన దృశ్యాలుగా మారాయి.

దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా దిగజార్చిన కుంభ కోణాల విచారణ చివర తీర్పు ఘట్టంలో ఎవరికీ శిక్షలు పడకుండా వీగి పోవడం కొత్తేమీ కాదు. వీగిపోతున్న కేసుల వెనుక రాజకీయ ప్రభావం ఉందన్నది యథార్థం. 2017 నవంబర్‌లో ప్రధాని మోడీ చెన్నై వెళ్లి డిఎంకె అధ్యక్షుడు కరుణానిధిని కలుసుకోవడంతో మొదటిసారి ఈ కేసు గురించిన పునరాలోచన మొదలైంది. కురువృద్ధనేతను మర్యాదగా కలుసుకున్నట్టు చెబుతున్నా తమతో నేస్తం లేని రాజకీయ నేతను అది కూడా 2-జి నిందిత పార్టీ నేతను కలుసుకున్నారంటే కేంద్రానికి ఏవో సానుకూల సంకేతాలు వచ్చి ఉంటాయి. ప్రధాని మోడీ కరుణానిధిని పరామర్శించిన తర్వాత ఈ పరిణామం సంభవించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆ తర్వాత శశికళ బంధువర్గంతో పాటు జయలలిత నివాస గృహమైన పోయెస్ గార్డెన్‌పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు చేయడం జరిగింది. ఇలా ప్రతి ప్రధాన కేసు కదలికల్లో కేంద్ర రాజకీయ ప్రయోజనం కనబడుతోంది.

2-జి స్పెక్ట్రమ్ నిందితులను నిర్ధారించాల్సిన సి.బి.ఐ. కేంద్ర సర్కారు పరిధిలోనే ఉన్నప్పటికీ, నిందితులకు సంబంధించిన సరైన సాక్ష్యాధారాలను సి.బి.ఐ. కోర్టుకు కీలకు విచారణ సమయంలో అందించకుండా చేయడంలో మోడీ ప్రభుత్వ హస్తముందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కేసును నిర్వీర్య పరచడం ద్వారా డిఎంకె రాజకీయ పక్షాన్ని తనవైపు తిప్పుకొని, రాబోయే సాధారణ ఎన్నికల్లో దక్షిణాదిలో పాగావేయాలని బిజెపి ఆశిస్తోంది. రాజకీయ ప్రయోజనాల కోసం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా సి.బి.ఐ. దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వైఫల్యానికి పాల్పడడం చారిత్రక తప్పిదం. ప్రపంచీకరణ యుగంలో రాజకీయ వ్యవస్థ అవినీతి మయంగా తయారవడంతో ప్రజాధనాన్ని దిగమింగే, ఖజానాకు గండిపడే పెద్ద పెద్ద కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. యుపిఏ, ఎన్‌డిఏ కూటములు రెండూ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం దేశ భవిష్యత్‌ను పణంగా పెడుతున్నాయి. దీన్నిబట్టి అవినీతి నిరోధంపై బిజెపి పైకి చెప్తున్నవన్నీ అబద్ధాలేనని అర్థమవుతోంది.

2-జి కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (కేదస) విచారణ కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదన్న స్థాయిలోనే జరిగిందని ప్రత్యేక కోర్టు తీర్పు వల్ల తేలిపోయింది. ఇవాళ 2-జి కుంభకోణంలో రాజా అవినీతి రుజువై ఉండకపోవచ్చు. అంతమాత్రానికి 2-జి కుంభకోణం మీద రేగిన దుమారం దేనికి దారి తీసిందో, దోషులనుకున్న వారు నిర్దోషులుగా ఎలా నిలిచారో ప్రజలు అర్థం చేసుకోలేనంత అమాయకులు కారు. ఈ కుంభకోణంలో నిజానికి ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా నిందితుడు కారు. ప్రధాన నిందితులిద్దరూ డిఎంకె వారే, కేదస ప్రత్యేక కోర్టు రాజా తదితరులను నిర్దోషులుగా తేల్చినా, గతంలో సుప్రీంకోర్టు 122 లైసెన్సులను రద్దు చేసిన నిర్ణయంలో మార్పులేదు. కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు సుప్రీంకోర్టు నిర్ణయాన్ని పునస్సమీక్షించాలంటున్నారు, తప్పుపడుతున్నారు. సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో తన తీర్పులను తిరగదోడిన ఉదంతాలు కూడా ఉన్నాయి.

లాలూ ప్రసాద్ ప్రారబ్ధం

అక్రమాస్తుల కేసులో ఏఐడిఎంకె నేత శశికళకు శిక్షపడడం, 2జీ కుంభకోణం కేసులో డిఎంకె నేతలు ఎ.రాజా, కనిమొళి, పళని అమ్మాళ్ నిర్దోషులుగా బయటపడడం. ఆ తర్వాత లాలూ ప్రసాద్ యాదవ్‌కు గడ్డి కుంభకోణంలో శిక్ష పడడం చూస్తుంటే రాజ్యాంగ యంత్రంలోని శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలను పాలకులు అత్యంత నైపుణ్యంతో సమన్వయిస్తున్నట్లు కనిపిస్తోంది. రెండు దశాబ్దాలుగా పలు కోర్టుల్లో మగ్గుతున్న దాణా కుంభకోణం కేసులో డిసెంబర్ 23న

సంచలనాత్మక తీర్పు వెల్లడైంది. దియోగఢ్ ఖజానా నుంచి 1994-96 మధ్యకాలంలో రు. 84.50 లక్షలు అక్రమంగా తీసుకున్న కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ సహా 16 మందిని పాట్నాలోని సి.బి.ఐ. ప్రత్యేక న్యాయస్థానం దోషులుగా తీర్మానించింది. అదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా సహా ఆరుగురిని కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఇలాంటి శిక్ష అవినీతికి పాల్పడిన అందరి నాయకులకూ పడుతున్నదా? అన్నదే ప్రశ్న.

దాణా కేసులో 38 మందిపై 1997లో చార్జిషీటు దాఖలు కాగా, వారిలో 11 మంది చనిపోయారు. ఇద్దరు అప్రూవర్లుగా మారారు. మరో ఇద్దరు నేరాన్ని అంగీకరించారు. ఆయనపై నమోదైన మొత్తం ఐదు కేసుల్లో ఇంకా మూడు కేసుల విచారణ సాగుతోంది. దీంతో లాలూప్రసాద్ రాజకీయ జీవితం పూర్తిగా అంధకారంలోకి కూరుకు పోయింది. లాలూ రైల్వే మంత్రిగా పనిచేసిన కాలంలో రెండు రైల్వే హోటళ్ల కాంట్రాక్టులు కేటాయించినందుకు ప్రతిఫలంగా (క్విడ్ ప్రో కో) ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్ పేరు మీద పాట్నాలో అతి ఖరీదైన ఆస్తులు పొందినట్లు సి.బి.ఐ. కేసు నమోదు చేసింది. 2015 బీహార్ శాసనసభ ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక శక్తులను ఏకంచేసే 'మహాగఠ్బంధన్' సృష్టికర్త, సారథి అయినందువల్లనే రైల్వే క్యాటరింగ్ కాంట్రాక్టుల కేసును కూడా కేంద్రం ఆయనపై రుద్దిందన్న వాదనలో నిజం లేకపోలేదు.

2-జి స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో సుప్రీంకోర్టుకు అక్రమం అనిపిస్తే, సి.బి.ఐ. కోర్టుకు ఏమీ జరగనట్టుగానే కనిపించింది. సి.బి.ఐ. కోర్టులు వేరు వేరు చోట్ల వెలువరించిన తీర్పులు దేశప్రజలను నిర్భాంతపరచి, ప్రభుత్వ ఏజెన్సీలపై అనుమానాలను పెంచాయి. ఒక పక్క దేశాన్ని కుదిపేసిన నరమేథాల కేసుల నుంచి కూడా స్వపక్షీయులు నిక్షేపంగా బయట పడుతుంటే, మరొకవైపు విపక్షీయులపై ఈ సంస్థలు విరుచుకు పడుతూ, కేసులు పెడుతూ వేటాడుతున్న పరిస్థితి నేడున్నది. పాలకులకు నిందితులకు డీల్ కుదిరితే దర్యాప్తు ఒకలా, డీల్ కుదరకపోతే మరొకలా ఉంటే అవినీతి గురించి మాట్లాడే నైతికత మోడీకీ ఉండదు. పాలకులు తమకు గిట్టనివారి విషయంలో సకల వ్యవస్థలనూ ఎంతో సమన్వయంతో, నైపుణ్యంతో పనిచేయిస్తున్నారని ప్రజలకు అనిపించడం వ్యవస్థలపై వారికున్న విశ్వాసాన్ని దిగజార్చుతుంది.

దేశాన్ని విస్తుపరిచిన 2-జి కుంభకోణం జరిగినట్టా? లేనట్టా? సంశయం ఇంతటితో ఆగదు. ఏమైనా, అప్పీళ్లు సుప్రీంకోర్టు దాకా వెళతాయి. ఆ అంతిమ తీర్పు వరకు రాజకీయ క్షేత్రంలో రగడ సద్దుమణగదు. కాగ్‌పై, బిజెపిపై ఎదురుదాడికి కాంగ్రెస్ ఈ తీర్పును వాడుకోవచ్చు. అయినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రాజకీయ నాయకుడిపైన ప్రత్యర్థి ఎవరో ఒకరు ఆరోపణ చేస్తారు. ప్రజా ప్రయోజనవ్యాజ్యం వేస్తారు. సి.బి.ఐ. దర్యాప్తు చేయాలని కోరుతారు. న్యాయస్థానాలు ఆదేశిస్తే సి.బి.ఐ. దర్యాప్తు ప్రారంభిస్తుంది. ఆర్థికాంశాలకు సంబంధించిన కేసులైతే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రంగంలో ప్రవేశిస్తుంది. పని ప్రారంభించి ఏళ్లు గడిచినప్పటికీ సి.బి.ఐ. చార్జిషీట్ దాఖలు చేయదు. విచారణ ప్రారంభించిన సి.బి.ఐ. న్యాయస్థానాలు సంవత్సరాలు గడిచినా ఎటూ తేల్చవు. వాయిదాలు వేస్తూపోతాయి. తీరా సి.బి.ఐ. కోర్టు ఇచ్చిన తీర్పును నిందితులు కానీ, ప్రభుత్వం కానీ హైకోర్టులో సవాలు చేయడం తప్పని సరి. హైకోర్టు నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం పరిశీలిస్తుంది. ఒక కేసును పరిష్కరించాలంటే దశాబ్దాల కాలం పడుతుంది. దిగువ న్యాయస్థానం నుంచి అత్యున్నత న్యాయస్థానం వరకూ కేసు వచ్చేసరికి నిందితులలో కొంతమంది మరణిస్తారు. నిజం నిగ్గు తేలుతుందన్న విశ్వాసం లేదు.

వ్యవస్థలోని లొసుగుల వలన నిందితులు తప్పించుకోవడం పెద్ద ఘోరం. తప్పు చేసిన వారికి శిక్షలు పడతాయన్న విశ్వాసానికి గొడ్డలిపెట్టు. ఎంత అవినీతి చేసినా వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటే సాక్ష్యాధారాలు మాయం చేస్తే సులభంగా తప్పించుకోవచ్చన్న సందేశం ప్రమాదకరం. ఈ దుష్పరిణామం అవినీతి పరులు, నేరస్తులు యథేచ్ఛగా రెచ్చిపోవ డానికి, క్విడ్‌ప్రోకో స్కామ్‌లకు ఆస్కారం కలుగుతుంది. మనదేశంలో కుంభకోణాల చరిత్రను పరిశీలిస్తే ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత అవినీతి బాగోతాలు రాశిలో వాసిలో పెరిగిపోయాయి. 2-జి కేసు ప్రజా వనరుల ప్రయివేటీకరణకు సంబంధించింది. పాత్రధారులు కార్పొరేట్లయితే పాలక పార్టీలు సూత్రధారులే. ప్రభుత్వాలు మారినా ఆ విధాన చట్రం మారలేదు. కార్పొరేట్లు అప్పుడూ ఇప్పుడూ చక్రం తిప్పుతున్నారు.

సందర్భాన్ని బట్టి ఏదో దుమారం వచ్చినా చేయిదాటి పోకుండా చూసుకుంటారు. ఆ పేరుతో పాలకపక్షాల నేతలను గుప్పిట్లో పెట్టుకుంటారు. తప్పు జరిగిందని సుప్రీంకోర్టు 2-జి లైసెన్సులు రద్దు చేసింది గాని, విధానాన్ని మార్చింది లేదు. తప్పు చేసిందెవరనేది తేల్చవలసింది న్యాయస్థానమైతే అందుకు దర్యాప్తు బాధ్యత సి.బి.ఐ.ది. వారు కావాలనే సాచివేత అనుసరించారు. బాధ్యత తీసుకోలేదు. వ్యవస్థ అవినీతిమయమై ఉన్నదని, చట్టబద్ధపాలన సాగడం లేదని, ప్రజాస్వామిక వ్యవస్థల పట్ల విశ్వసనీయతలేదని స్పష్టమైంది. వ్యవస్థలోని లొసుగుల వల్ల నిందితులు తప్పించుకోవడం దారుణం. వ్యవస్థలను మేనేజ్ చేస్తే ఎంతటి అవినీతి నుంచైనా సునాయసంగా బయట పడవచ్చనే భావన పెరిగింది. అవినీతిపరులు, నేరస్థులు యథేచ్ఛగా రెచ్చిపోవడానికి అవకాశాలు పెరిగాయి. ఇదంతా గమనిస్తే మన పార్లమెంటరీ వ్యవస్థ భ్రష్టు పట్టిందని విధితమవుతుంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

పాఠకులు ఫిర్యాదులు, సమాచారం కోసం వీక్షణం కార్యాలయానికి పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 6.00 గంటలలోగా స్వయంగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. మిగతా సమయాల్లో ఫోన్ చేస్తే అది ఫ్యాక్స్‌లోకి వెళ్లి మీకు జవాబు రాదు. అప్పుడు మీరు ఫోన్ ఎత్తికూడా మాట్లడడంలేదని అనుకునే అవకాశం ఉంది. ఇది గమనించగలరు. - సం.

ముస్లిం మహిళలపై ప్రభుత్వ కపట ప్రేమ

ముస్లిం సమాజంలో తలాక్ సంప్రదాయాల చరిత్రను వివరిస్తూ రాజకీయ పార్టీలు అవకాశవాదంగా ఈ అంశాన్ని ముందుకు తెచ్చి ఎలా వాడుకుంటున్నాయో వివరిస్తున్నారు **అహ్మద్ మొహియుద్దీన్ ఖాన్ యజ్దానీ (డానీ)**

ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన ప్రధాన విధాన నిర్ణయాల్లో పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టిలకన్నా ఎక్కువ వివాదాన్ని రేపుతున్న అంశం ముస్లిం మహిళల (వైవాహిక హక్కుల పరిరక్షణ) బిల్లు – 2017. తక్షణ ట్రిపుల్ తలాఖ్ (చిటికెలో విడాకులు / ఇన్‌స్టాంట్ త్రిపుల్ తలాఖ్) ను కఠినంగా శిక్షించదగ్గ నేరంగా పరిగణించడం ఈ బిల్లులో కీలక అంశం. ఈ బిల్లు లోక్‌సభ ఆమోదాన్ని పొంది రాజ్యసభలో ప్రవేశించింది. రాజ్యసభలో బిల్లు పాస్ కావడానికి అవసరమైన సంఖ్యాబలం ఎన్‌డిఏకు లేని కారణంగా ఇప్పటికి అక్కడ ఆగివుంది. రానున్న బడ్జెట్ సమావేశాల్లో, అవసరమైయితే, పార్లమెంట్ ఉభయ సభల్ని సమావేశపరచైనా సరే ఈ బిల్లును చట్టంగా మార్చితీరాలని కమలనాథులు గట్టిపట్టుదలతో ఉన్నారు.

నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పెద్ద నోట్ల రద్దు పథకం సామాన్య ప్రజల్ని ఇబ్బందుల పాలుచేసి సూపర్ కార్పొరేట్లు, బ్యాంకులకు దోచిపెట్టిందని తెలియనివాళ్లు ఇప్పుడు ఎవరూ లేరు. ఆయన ప్రవేశపెట్టిన మరో పథకం జిఎస్‌టి దక్షిణాది రాష్ట్రాల్ని దోచి ఉత్తరాది రాష్ట్రాలకు కట్టబెట్టడానికేనని ఇటీవలి గణాంకాలు చెపుతున్నాయి. భారత ముస్లిం సమాజాన్ని నయా బానిసగా మార్చి హిందూత్వ శక్తులకు ఊడిగం చేసేలా లొంగదీయడానికే ఇప్పుడు ముస్లిం మహిళల (వైవాహిక హక్కుల పరిరక్షణ) బిల్లును తెస్తున్నారని కొందరు వ్యక్తం చేస్తున్న ఆందోళన కొట్టిపడవేయ దగ్గదేమీకాదు.

దాదాపు 14 వందల సంవత్సరాలుగా కలిసి ఉంటున్నప్పటికీ ముస్లిం సమాజం గురించి సాటి సమాజాలకు తెలిసింది చాలా తక్కువ. కేవలం అపోహలే తప్ప ముస్లిం సమాజం గురించీ, వాళ్ల సాంస్కృతిక జీవనం గురించీ తెలుసుకోవాలనే ఆసక్తి కూడా ఎవరికీ లేదు. ఇక మిగిలింది అపోహలు మాత్రమే. మిగిలిన అంశాల విషయం ఎలావున్నా ముస్లిం వివాహ వ్యవస్థ గురించి ఇప్పుడయినా బయటి ప్రపంచం అర్థం చేసుకోవాల్సింది చాలా ఉంది.

ధార్మిక ప్రమాణాల ప్రకారం హిందూ వివాహం శాశ్వితమైనది. ఇంకాస్త స్పష్టంగా చెప్పాలంటే అది ఒక జీవితకాల బంధం మాత్రమే కాదు; ఏడు జన్మల అనుబంధం. ముస్లిం వివాహం దీనికి పూర్తిగా భిన్నమైనది. ఇస్లాం ధార్మిక ప్రమాణల ప్రకారం వివాహం అనేది ఒక పౌర ఒప్పందం. ఇది ఆధునిక అగ్రిమెంట్ మ్యారేజ్‌లను పోలి ఉంటుంది. అగ్రిమెంట్ అన్నాక ఒక అవసరం, ప్రతిపాదన, ఇష్టపూర్వక ఆమోదం, నోటరీ (ఖాజీ), సాక్షులు మాత్రమేగాక అగ్రిమెంటును రద్దు చేసుకోవడానికి ఇరుపక్షాలకు గల హక్కులు, దానికి షరతులు వగయిరా విధివిధానాలు ఉంటాయి. ఈ అంశాలన్నీ ముస్లిం పెళ్లిలో ఉంటాయి. ప్రతిపాదిత పెళ్లి తమకు "ఇష్టమే" (ఖుబూల్) అని వధువు మూడుసార్లు, వరుడు మూడుసార్లు సాక్షుల ముందు విడివిడిగా ప్రకటించిన తరువాత మాత్రమే పెళ్లి జరుగుతుంది. వివాహ బంధాన్ని తెంచుకుంటున్నపుడు కూడా విడిపోతున్నామన్న విషయాన్ని మూడుసార్లు ప్రకటించాల్సి ఉంటుంది. ఏ కారణం చేత అయినా వివాహ బంధం నుండి బయట పడాలనుకున్నప్పుడు విడాకులు కోరే హక్కు స్త్రీ పురుషులు ఇద్దరికీ సమానంగా ఉంటుంది.

ముస్లిం వివాహ వ్యవస్థలో పెళ్లి చేసుకోవడానికి మూడుసార్లు ఖుబూల్ చెప్పినట్టే, విడిపోవాల్సి వచ్చినపుడు కూడా మూడుసార్లు తలాఖ్ చెప్పాలి. ఈ ట్రిపుల్ ఖుబూల్, ట్రిపుల్ తలాఖ్ విధానం ముస్లిం సమాజంలో అనాదిగా ఉంది. ఇక భవిష్యత్తులోనూ ఉంటుంది. అదేమీ మారదు. అది వాళ్ల పౌరస్మృతి (షరియ).

ఇలాంటి హక్కులు భారత సమాజంలోని ఇతర సమూహాలకు దేశ స్వాతంత్ర్యం తరువాత మాత్రమే వచ్చాయి. విడాకుల హక్కును సాధించుకోవడానికి భారత మహిళలు వీధుల్లో నెలల తరబడి ఆందోళనలు చేశారు, బాబా సాహెబ్ అంబేద్కర్ పార్లమెంటులో భీకర పోరాటం చేశాడు. చాలా మందికి తెలియని విషయం ఏమంటే ముస్లిం సమాజంలో మహిళలకు ఆస్తి హక్కు, విడాకుల హక్కు మాత్రమేకాక విధవా స్త్రీ పునర్ వివాహ హక్కు కూడా ఏడవ శతాబ్దం నుండే ఉన్నాయి. మిగిలిన సమాజాల్లోని మహిళలు వీటిని సాధించడానికి దాదాపు 14 వందల సంవత్సరాలు పట్టింది. ముస్లిం సమాజానికి ప్రవక్త ముహమ్మద్ కేవలం దైవ సందేశహరుడు మాత్రమేకాదు వారే ఒక గొప్ప సంస్కర్త. వారు స్వయంగా విధవా స్త్రీని మాత్రమేగాక తన కన్నా వయసులో పెద్దవారైన మహిళను వివాహమాడి ఒక మహత్తర సాంప్రదాయానికి నాందీ పలికారు.

ఆధునిక ప్రమాణాల్లో విడిపోయే హక్కు ఏ రంగంలో అయినా ప్రజాస్వామికమైనదే. విడిపోయే హక్కు ఉన్నంత మాత్రాన ముస్లిం సమాజంలో విడాకుల శాతం ఎక్కువ అనిగానీ, ఇతర సమాజాల్లో విడాకుల శాతం తక్కువ అనిగానీ చెప్పడానికి లేదు. భారత దేశంలో బౌద్ధుల్లో విడాకుల శాతం అందరికన్నా ఎక్కువగా ఉందని ఇటీవలి జనాభా లెక్కలు చెపుతున్నాయి. విడాకుల్ని ఒక హక్కుగా గుర్తించిన సమాజం కనుక ముస్లింల విడాకుల కేసులు బాహాటంగా బయటి ప్రపంచానికి తెలుస్తున్నాయి. ఇతర సమాజాల్లో చట్టబద్ధంగా విడాకులు పొందిన వాళ్ల సంఖ్య మాత్రమే అధికారికంగా తెలుస్తోంది. నిజానికి విడాకులు పొందకుండానే విడిగా ఉంటున్నవాళ్లు, 'విడిచిపెట్టబడ్డ' వాళ్ల సంఖ్య ఇంతకన్నా తక్కువగా ఏమీలేదు.

అయితే, అందరూ గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమంటే దాంపత్యంలో ఆర్థిక స్వేచ్ఛగలవారే విడాకుల సౌకర్యాన్ని ఎక్కువగా వాడుకుంటారు. దీనికి ఆ మతం, ఈ మతం అని తేడా ఏమీలేదు. ఇదొక సార్వజనీన సూత్రం. ఇప్పటి వరకు భర్తలే ఈ సౌకర్యన్ని వాడుకునేవారు. ఇటీవలి కాలంలో ఉద్యోగాలు చేస్తున్న మహిళలు సహితం ఆర్థిక స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నారు. ఆ మేరకు వాళ్లు కూడా అవసరమైనప్పుడు విడాకుల సౌకర్యాన్ని బాగానే వాడుకుంటున్నారు.

ఆర్థికరంగంలో సరళీకరణ ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ప్రవేశించాక మనుషుల్లో ఆర్థిక అత్యాశ, వస్తు వ్యామోహం విపరీతంగా పెరిగి పోయాయని మనకందరికీ తెలుసు. అయితే, దాంపత్య జీవితం మీద కూడా దాని ప్రభావం బలంగా పడిందని మాత్రం మనం ఇంతకాలంగా గుర్తించలేదు. మన సమాజంలో దాంపత్య జీవితం ఎంత వేగంగా విచ్ఛిన్నం అయిపోతున్నదో చెప్పడానికి కుటుంబ న్యాయస్థానాల్లో నమోదు అవుతున్న విడాకుల కేసుల సంఖ్య ఒక కొలమానం. హైదరాబాద్ లో విడాకుల కేసుల్ని విచారించడానికి గతంలో ఫ్యామిలీ కోర్టులు ఒకటో రెండో ఉండేవి. ఇటీవల కేసుల సంఖ్య పెరగడంతో కోర్టుల సంఖ్య కూడా నాలుగైదు రెట్లు పెరిగింది. అంతేకాక ఐటి ఉద్యోగుల విడాకుల కేసుల్ని ప్రత్యేకంగా విచారించడానికి కొన్ని కోర్టులు వీకెండ్స్‌లో కూడా పనిచేస్తున్నాయి.

ఇక్కడొక విచిత్రాన్ని గమనించాలి. ముస్లిం సమాజంలో 'తాత్కాలికం' అనే ప్రాతిపదిక మీద వివాహ బంధంలో ప్రవేశించిన స్త్రీలు దాన్ని శాశ్వత బంధంగా మార్చాలని కోరుకుంటున్నారు. మరో వైపు, హిందూ సమాజంలో 'శాశ్వతం' అనే ప్రాతిపదిక మీద వివాహ బంధంలో ప్రవేశించిన స్త్రీలు తమకు విడాకుల హక్కు ఉండాలని, అంటే వివాహాన్ని తాత్కాలిక బంధంగా మార్చాలని కోరుకుంటున్నారు!.

ముస్లిం సమాజంలో భార్య విడాకులు కోరడాన్ని ఖులా అంటారు. భర్త విడాకులు కోరడాన్ని తలాఖ్ అంటారు. తలాఖ్ పొందడానికి సాంప్రదాయంగా రెండు విధానాలున్నాయి. తలాఖ్ – ఏ-హసన్, తలాఖ్ -ఏ- అహసాన్. ఈ రెండు పద్ధతుల్లో స్వల్ప బేధాలున్నప్పటికీ కొన్ని సారూప్య ప్రమాణాలున్నాయి. ఏ కారణం చేతనయినాసరే భార్య నుండి విడిపోవాలనుకున్న భర్త ఆ విషయాన్ని భార్యకు ముందుగా ప్రకటించాలి. అంటే మొదటిసారి తలాఖ్ చెప్పాలి. నెలకు ఒకసారి చొప్పున మూడు నెలల్లో మూడుసార్లు చెప్పాలి. మూడవసారి కూడా చెపితేనే విడాకులు పొందినట్టు. రెండుసార్లు తలాఖ్ చెప్పినా మూడోసారి చెప్పడానికి ముందు భర్త తన అభిప్రాయాన్ని మార్చుకునే అవకాశం ఉంది. అప్పుడు అంతకు ముందు రెండుసార్లు చెప్పిన తలాఖ్‌లు రద్దయిపోతాయి. భర్త తన ఆలోచనల్ని మార్చుకునే అవకాశం ఇవ్వడానికే ఈ మూడు నెలల సాగదీతను పెట్టారు. ఈ మూడు నెలల వ్యవధి ఇవ్వడానికి మరో ప్రధాన కారణం ఏమంటే భార్య గర్భవతి అయిందో? లేదో? తేల్చడం. ఆ కాలంలో భార్య గర్భవతి అయితే పుట్టబోయే శిశువు పోషణ బాధ్యత భర్తదే అవుతుంది. అప్పుడు తలాఖ్ వాయిదా పడుతుంది.

తలాఖ్ నిర్ణయానికి మూడు నెలల గడువు సరిపోదని ఖలీఫాలే బలంగా భావించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. తలాఖ్ గడువును తగ్గించాలని తన మీద వత్తిడి తెచ్చిన వారి మీద రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ ఫారూఖ్ తీవ్ర అసహనాన్ని ప్రదర్శించారు. "మీరు సహనంతో వ్యవహరించాల్సిన చోట తొందరపాటును ప్రదర్శిస్తున్నారు" అని హెచ్చరించినట్టు కూడా ఇస్లాం ధార్మిక గ్రంథాల్లో ఉంది.

ఈ సందర్భంగా సంభోగ నియమాలని కూడా ఒకసారి పరికించాలి. ముస్లిం సమాజంలో వివాహేతర సంభోగానికి ధార్మిక సమర్ధన లేదు. వివాహమాడిన స్త్రీలతో మాత్రమే పురుషుడు సంభోగంలో పాల్గొనాలనే కట్టుడి ఉంది. అనాధలు, పనివాళ్లు, బానిసలు, విధవాస్త్రీలు తదితరులకు యజమానులైన పురుషుల సంభోగ కోరిక ముప్పు (ససెప్టిబుల్, వల్నరెబుల్) ఎప్పుడూ ఉంటుంది. అలాంటి స్త్రీలను డబ్బు, అధికారం, కండ బలాలతో లొంగదీసుకోకుండా గౌరవప్రదంగా వివాహమాడాలనే నియమం ఒకటి ఉంది. అలా పుట్టిందే బహుభార్యత్వం. ముస్లిం సమాజంలో బహు భార్యత్వానికి ధార్మిక సమర్ధన ఉన్నప్పటికీ దానికి సంఖ్యాపరమైన పరిమితి, ఇతర బాధ్యతలకు సంబంధించిన ఆదేశాలు అనేకమున్నాయి. బహుభార్యత్వం అనేది ముస్లిం సమాజంలో అధికారికం గా కొనసాగితే ఇతర సమాజాల్లో అనధికారికంగా సాగుతోంది. ఇక్కడా ఒక విచిత్రం ఉంది. మనదేశంలో ధార్మిక సమర్ధన ఉన్న ముస్లింలకన్నా, ధార్మిక సమర్ధనలేని హిందూ సమాజంలోనే బహు భార్యత్వం అధికంగా ఉన్నట్టు అనేక సర్వేలు చెపుతున్నాయి. వివాహేతర సంబంధంగా స్త్రీలను 'ఉంచుకోవడం' అనేది గ్రామీణ ప్రాంతపు భూస్వామ్య కుటుంబాల్లో సర్వసాధారణ విషయంగా మనం ఇప్పటికీ గమనించవచ్చు.

అప్పటి అరబ్బు ముస్లిం రాజులు కొందరు బహు భార్యత్వపు పరిధిని మించి వివాహాలు చేసుకున్నారు. పాత భార్యల్ని వదిలిపెట్టి కొత్త స్త్రీలను పెళ్లి చేసుకోవడానికి వాళ్లు ఒక దుర్మార్గమైన, అమానవీయమైన విడాకుల విధానాన్ని కనుగొన్నారు. మూడు నెలల వ్యవధి విధానాన్ని పక్కన పెట్టి ఒక్క గుక్కలో ట్రిపుల్ తలాఖ్ చెప్పడం మొదలు పెట్టారు. దీనినే తలాఖ్ -ఏ - బిద్దత్ అంటారు. ముస్లిం సమాజంలో ఈ విధమైన విడాకులు మొదటి నుండీ వివాదాస్పదమైనవే. వీటికి ధార్మిక మద్దతు లేదు.

గతి తప్పిన దురాచారాన్ని ముస్లిం మతాచార్యులు మొగ్గలోనే తుంచే ప్రయత్నం చేశారో? లేదో? మనకు తెలీదు. బహుకొద్ది మందికితప్ప సాధారణంగా మతాచార్యులకు చక్రవర్తుల్ని ఎదిరించే సాహసం ఉండదు. పైగా వాళ్లు ప్రభువుల మెప్పు పొందడానికి అనుక్షణం ప్రయత్నిస్తుంటారు. ప్రభువులు చేసే అకృత్యాలను సహితం ధర్మ సమ్మతంగా చిత్రించడానికి తమ పాండిత్యాన్ని దుర్వినియోగం చేస్తుంటారు. అన్నింటికి మించి మతాచార్యుల్లో అత్యధికులు పురుషాహంకారులు. మత నిబంధనల్ని ఆధునిక పరిణామాలకు వర్తింపచేయాల్సి వచ్చినపుడు వాళ్లు పురుషుల పక్షం వహించి పరిష్కారాలు చేస్తుంటారు. ఆ మేరకు మహిళల హక్కుల్ని కాలరాస్తుంటారు. తరచుగా కాకపోయినా అరుదుగానయినా తలాఖ్ – ఏ – బిద్దత్ ముస్లిం సమాజంలో కొనసాగిందన్నది వాస్తవం.

ముస్లిం మతాచార్యుల పురుష అభిజాత్యం సమీప గతంలో 1986 నాటి షాబానో కేసులో బాహాటంగా బయటపడింది. మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన మొహమ్మద్ అహమ్మద్ ఖాన్ అనే వ్యాపారి ఐదుగురు పిల్లల తల్లి, 62 ఏళ్ల వృద్ధురాలైన తన భార్య షాబానోకు విడాకులిచ్చాడు. మాజీ భర్త నుండి తనకు జీవనాధారాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆ కేసును విచారించిన సుప్రీం కోర్టు 1986లో నెలకు 179 రూపాయల మనోవర్తిని ఇవ్వాల్సిందిగా షా బానో భర్తను ఆదేశించింది.

ఆనాటి జీవన ప్రమాణాల ప్రకారం చూసినా నెలకు 179 రూపాయలు అనేది చాలా చిన్న మొత్తం. షాబానో గౌరవప్రదంగా బతకడానికి సరిపడేలా మనోవర్తి మొత్తాన్ని పెంచేలా ఆమె మాజీ భర్తను సుప్రీంకోర్టు ఆదేశించాలని ముస్లిం సమాజం ఆందోళనచేసి ఉండాల్సింది. కానీ అలా జరగలేదు. భారత ముస్లిం సనాతనవర్గం రంగప్రవేశం చేసి విడాకులు పొందిన స్త్రీకి మనోవర్తి తీసుకునే హక్కేలేదని వాదించింది. విడాకులు ఇచ్చిన భర్త పరపురుషునితో సమానమనీ, పరపురుషుని నుండి జీవనాధారాన్ని పొందడం ఇస్లాం ధర్మానికి వ్యతిరేకమని విపరీత భాష్యాలు చెప్పింది. విడాకులు పొందిన స్త్రీల పోషణ భారాన్ని ఆమె రక్త సంబంధీకులు గానీ, వక్ఫ్ బోర్డుగానీ స్వీకరిస్తారని బూటకపు హామీలు గుప్పించింది. షాబానో మనోవర్తిని రద్దు చేయాలంటూ అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం మీద తీవ్ర వత్తిడి తెచ్చింది. అప్పట్లో, పంజాబ్‌లో అల్లకల్లోలం, అస్సాంలో విద్యార్థి ఉద్యమాలతో సతమతమవుతున్న రాజీవ్ గాంధీ చివరకు ముస్లీం సనాతనవర్గం వత్తిడికి లొంగిపోయారు. విడాకులు పొందిన ముస్లిం స్త్రీల మనోవర్తిని రద్దు చేస్తూ 'ముస్లిం మహిళ (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం–1986' తెచ్చారు. ఇది ముస్లిం మాతాచార్యులు, కేంద్ర ప్రభుత్వం కలిసి చేసిన ఒక చారిత్రక తప్పిదం, సాంఘీక మహా అపచారం.

ప్రపంచ మతాల్లో కొత్తది కావడం వల్ల కావచ్చు సామ్యవాదం తదితర ఆధునిక భావజాలాల మూలాలు అనేకం ఇస్లాంలో కనిపిస్తాయి. ఇస్లాం ఆర్థిక విధానం ధర్మకర్తృత్వం. దానాలు చేయడం ద్వార మనుషులు తమ తప్పుల్ని సరిదిద్దుకోవచ్చునేది దీనికి అంతస్సూత్రం. ఫిత్రా, జకాత్, ఖుర్బానీ, పాత వస్తువుల్ని పంచడం వగయిరా సాంప్రదాయాలన్నీ ధర్మకర్తృత్వ దృక్పథం నుండి పుట్టినవే. నిరుపేదలు, అనాధలు, విధవా స్త్రీలు, రోగులు, నిస్సహాయులు దానం పొందడానికి తొలి అర్హులు అంటూ అనేక సందర్భాల్లో ధార్మిక ఆదేశాలున్నాయి. అన్నార్తులకు దానాలు చేయాలని ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పుడు మాజీ భర్త నుండి మాజీ భార్య జీవనాధారాన్ని పొందడాన్ని ఈ మతాచార్యులు తప్పుబట్టడం ఒక వికారమే తప్ప మరేమీకాదు. లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అయిపోతున్నప్పటికీ నోరు మెదపలేని ఈ మతాచార్యులు విధవా స్త్రీల పోషణ బాధ్యతను వక్ఫ్ బోర్డులు స్వీకరిస్తాయని గొప్పలు చెప్పుకోవడం మరో బూటకం. సామాజిక దృక్పథంలో ఇస్లాం మతానికి అప్పటి వరకున్న గౌరవ స్థానాన్ని షాబానో కేసు మసకబార్చింది.

ఆ తరువాతి కాలంలో, సమాచార సాంకేతిక (ఐటి) విప్లవం తెచ్చిన అనర్థాలకు దాంపత్య జీవితం కూడా బలయిపోయింది. స్మార్ట్ ఫోన్లు, ఎస్ఎంఎస్, వాట్స్ అప్, ట్విట్టర్, ఇ–మెయిల్ వగయిరా అత్యాధునిక ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వార ఒక్క గుక్కలో ట్రిపుల్ తలాఖ్ చెప్పేసే తరం ఒకటి తయారైంది. ఇలాంటి సంఘటనలు వార్తల్లో వచ్చిన తొలి దశలోనే ముస్లిం పర్సనల్ లా బోర్డు వంటి ధార్మిక సంస్థలు మేల్కొని ఉండాల్సింది. ఐటి డివోర్సు, తలాఖ్–ఏ–బిద్దత్, ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ లు ఏ విధంగానూ చెల్లవని స్పష్టంగా ప్రకటించి ఉండాల్సింది. విగ్రహారాధన కిందకు వస్తుందేమోననే అనుమానంతో ముస్లింలు ఫొటోలు దిగడం మీద రోజుల తరబడి చర్చించే మతాచార్యు లకు స్మార్ట్ ఫోన్ తలాఖ్–ఏ–బిద్దత్ ధర్మ విరుద్ధం అని తోచకపోవడం దారుణం.

ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ బాధితురాలయిన షాయరా బాను అనే మహిళ గత ఏడాది న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరికొందరు ముస్లిం మహిళలు కూడా ఈ కేసులో చేరారు. ఈ కేసు ముస్లిం సమాజంలోనే కాక ముస్లిమేతర సమాజాల్లోనూ సంచలనం రేపింది. ఈ కేసులో సుప్రీం కోర్టు విచారణాంశం మీద కూడా అనేక అపోహలు ప్రచారం అయ్యాయి. ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ లేదా తలాఖ్–ఏ–బిద్దత్ ఇస్లాం మూల సూత్రాలకు అనుకూలమా, వ్యతిరేకమా అనే అంశాన్ని మాత్రమే సుప్రీంకోర్టు విస్తారంగా పరిశీలించింది.

షా బానో కేసు సమయంలో రాజీవ్ గాంధీ ఉన్నట్టే షాయరా బానో కేసు సమయంలో నరేంద్ర మోదీ కూడా రాజకీయ ఇరకాటంలో ఉన్నారు. బీహార్ ఎన్నికల్లో భారీగా దెబ్బతిన్న నరేంద్ర మోదీకి ఉత్తరప్రదేశ్ ఎన్నికలు మరో పెద్ద సవాలుగా మారాయి. సంక్షేమ పథకాల గురించి గొప్పగా చెప్పుకునే స్థితిలోనూ ఆయన లేరు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాలన్నీ కూలిపోయాయి. ఆ విఫల పథకాల గురించి చెప్పినా జనం నమ్మేస్థితిలో లేరు. మోదీ హయాంలో దేశ ఆర్థికవ్యవస్థ తిరోగమన బాటలో నడుస్తోంద ని ఆయన పార్టీ సీనియర్లే బయటపడి మాట్లాడడం మొదలు పెట్టారు.

ఆధునిక పనిముట్లు పనిచేయనపుడు వాడడానికి పాలకుల దగ్గర పురాతన ఆయుధాలు ఎలాగూ ఉంటాయి; అదే మతతత్త్వాన్ని రెచ్చ గొట్టడం. ప్రభుత్వం తమ మేలు కోసం ఏమీ చేయకపోయినా ముస్లింలను అణిచివేస్తే చాలని సంబరపడే ఓటర్లు మనకు తక్కువేం లేరు. అలాంటి వాళ్లు యుపిలో మరీ ఎక్కువ. వాళ్లను సంతృప్తి పరచడానికి నరేంద్ర మోదీజీ హఠాత్తుగా స్త్రీ జనోద్ధారకులు అయిపోయారు. అందులోనూ ముస్లిం మహిళా బాంధవులయిపోయారు. వారు పేదలకు ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్ననట్టు రూపొందించిన ప్రచార పోస్టర్‌లో ఇద్దరు మహిళలు బుర్ఖాలు వేసుకొని ఉంటారు. మహిళల ఆర్థిక వికాసం, దాంపత్య హక్కులు ముస్లింలతోనే ఆరంభం అన్న రీతిలో యుపి ఎన్నికల ప్రచారం సాగింది. ముస్లింలను సున్నీలుగా, షియాలుగా, తిరిగి వాళ్లను పురుషులుగా, స్త్రీలుగా చీల్చేస్తున్నట్టు సంకేతాలిస్తూ తన సాంప్రదాయ ఓట్ బ్యాంకును అలరించారు ప్రధాని.

ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ అనేది ఇస్లాం ఆదర్శాలకు విరుద్ధమంటూ, చట్టపరంగా అది చెల్లదంటూ ఈ ఏడాది ఆగస్టు 22న తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు తీర్పును ముస్లిం సమాజంలోని ప్రగతిశీలురే కాకుండా చాందసులు సహితం ఆహ్వానించారు. ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్‌ను ఇస్లాం సాంప్రదాయాలు, విలువలతో సంబంధంలేని భ్రష్టాచారంగా పేర్కొన్న సుప్రీం కోర్టు తన తీర్పులో ఇస్లాం ఆదర్శాలను కొనియాడడం ఆ సమూహాలకు ఆనందాన్నిచ్చింది.

సుప్రీంకోర్టు తీర్పులో కూడా ఒక విశేషముంది. ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తుల్లో 3:2 నిష్పత్తిలో భిన్నాభిప్రాయం వ్యక్తమైంది. తీర్పుకు ఒక్క ఓటుతో స్వల్ప ఆధిక్యత మాత్రమే ఉంది. ముగ్గురు న్యాయమూర్తులు ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ అనేది ఇస్లాం ధార్మిక ఆదర్శాలకు విరుద్ధమని చట్టపరంగా అది చెల్లదని మెజారిటీ తీర్పును ప్రకటించారు. నిజానికి దీన్ని న్యాయస్థానాల్లో ఇస్లాం ధార్మిక విలువలు సాధించిన విజయంగా భావించవచ్చు. ట్రిపుల్ తలాఖ్ నే కాదు ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్‌ను సహితం రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీం కోర్టు తీర్పు చెప్పలేదు. మిగిలిన ఇద్దరు న్యాయమూర్తులు ఆ తీర్పు మీద తమ అసమ్మతిని నమోదు చేశారు. ఆ ఇద్దరిలో ఒకరు సాక్షాత్తు భారత ప్రధాన న్యాయమూర్తి కావడం విశేషం. వాళ్లిద్దరి అసమ్మతికి

రాజ్యాంగపరమైన ధర్మసూక్ష్మాలు అనేకం ఉన్నాయి. మతవిశ్వాసాలు కలిగి ఉండడం, మతాచారాల్ని పాటించడం, మతాన్ని ప్రచారం చేసుకోవడం వంటి పౌరుల ప్రాథమిక హక్కుల జోలికి సుప్రీం కోర్టు పోదలచలేదు. ఒక పౌర సమూహపు వివాహం, విడాకులు, వారసత్వం వంటి సాంస్కృతిక అంశాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడాన్ని భారత రాజ్యాంగంలోని 25వ అధికరణ ఆమోదించదని అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జగదీష్ సింగ్ ఖేహార్ చాలా స్పష్టంగా వివరించారు.

అయితే సుప్రీం కోర్టు తీర్పును నరేంద్ర మోదీ అనుకూల మీడియా వక్రీకరించింది. ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్‌నే కాకుండా ఏకంగా సాంప్రదాయ ట్రిపుల్ తలాఖ్‌ను సహితం రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీం కోర్టు ప్రకటించినట్టు మీడియాలో కథనాలొచ్చాయి. ఇది ముస్లిం మహిళలకు మోదీ ప్రభుత్వం సాధించిపెట్టిన మేలు అన్నట్టు ఒక అబద్ధపు ప్రచారం పెద్ద ఎత్తున సాగింది.

నిజానికి సుప్రీం కోర్టు తీర్పు తరువాత ఈ వివాదం ముగిసిపోవాలి. ముస్లింలను ఎప్పుడూ ఏదో ఒక భావోద్వేగ ధార్మిక వివాదంలో ఉంచడమే కమలనాథుల ఎత్తుగడ. ఆ హోరులో తన పరిపాలనలోని లోపాలను, వైఫల్యాలను ప్రజలు మరిచిపోవాలనేదే మోదీ ప్రభుత్వ వ్యూహం. దానికోసం, ముస్లిం మహిళ (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు–2017ను రూపొందించి వివాదాన్ని కొత్త దశకు తీసుకొని వెళ్లింది మోదీ ప్రభుత్వం.

ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్‌ను శిక్షార్హమైన నేరంగా పరిగణించడం ఈ బిల్లులో కీలక అంశం. ఈ బిల్లు చట్టంగా మారితే ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్‌ను చెప్పిన భర్తకు భారీ జుర్మానాతోపాటూ మూడేళ్ల కఠిన కారాగార శిక్షను విధించవచ్చు. ఒక సమూహపు సాంస్కృతిక ఆచారాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించ వచ్చునా? అన్నది ఒక ప్రశ్న అయితే దేశద్రోహ నేరానికి పాల్పడ్డవారితో సమానంగా కఠిన కారాగార శిక్ష విధించవచ్చునా అన్నది అంతకన్నా కీలకమైన ప్రశ్న.

సుప్రీం కోర్టు తీర్పు తరువాత కూడా ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ కేసులు కొన్ని తమ దృష్టికి వచ్చిన కారణంగా కొత్త చట్టం చెయ్యాల్సిన అవసరం వచ్చిందని మోదీ ప్రభుత్వం అంటున్నది. సుప్రీం కోర్టు తీర్పుకూ కొత్త చట్టానికీ అసలు పొంతనేలేదు. ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ ఇస్లాం ధార్మిక ఆదర్శాలకు విరుద్ధమని చట్టపరంగా చెల్లదని సుప్రీం కోర్టు చెప్పింది. అంటే, ఒక ముస్లిం భర్త తన భార్యకు ఏదైనా ఆవేశంలో ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ చెప్పినా అది చెల్లదు. భార్యకు తన భర్త మీద, ఆమె పిల్లలకు తమ తండ్రి మీద గతంలో ఉన్న దాంపత్య, కుటుంబ, వారసత్వ హక్కులన్నీ యథాతథంగా కొనసాగుతాయి. సుప్రీం కోర్టు తీర్పు తుంటరులైన భర్తల్ని సరిదిద్దుతుంది; బాధితులైన భార్యల్ని పరిరక్షిస్తుంది. కొత్త చట్టం అలాకాదు. తుంటరులైన భర్తల్ని జైలుకు పంపుతుంది. భార్యనూ, ఆమె పిల్లల్నీ గాలికి వదిలేస్తుంది. ఇక్కడ ఇంకో తిరకాసుంది. భర్త చెప్పిన ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ చెల్లినట్టా? చెల్లనట్టా అనేది సమాధానంలేని ప్రశ్నగా మిగిలిపోతుంది. ఒకవేళ ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ చెల్లేదయిదే భర్తను జైలుకు పంపాల్సిన పనిలేదు. ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ చెల్లకుంటే ఆ మహిళ అతనికి భార్యగానే కొనసాగాల్సి ఉంటుంది. విడాకులు పొందలేదు గాబట్టి భర్త జైలు శిక్షాకాలం పూర్తిచేసే వరకు ఆమె మరో వివాహం చేసుకోవడానికి కూడా కుదరదు. భర్తను జైలుకు పంపిన కారణంగా అతని బంధువులు సహజంగానే ఆమెనూ, ఆమె పిల్లల్నీ దగ్గరకు రానివ్వరు. సారాంశంలో, ముస్లిం పురుషులతోపాటూ, ముస్లిం మహిళల్ని కూడా అణిచివేయడానికి ఈ చట్టాన్ని రూపొందించాడు అనవచ్చు. ఇంత అడ్డగోలు చట్టాన్ని భారత నేరస్మృతి చరిత్రలో ఇంతవరకు ఎవరూ చూసి ఉండరు.

ఈ చట్టంలో ఇంకో ప్రమాదం పొంచివుంది. భర్త ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ చెప్పినట్టు భార్య పిర్యాదు చేయకపోయినా పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తనంతట తాను (సుమోటో)గా కేసు నమోదు చేయవచ్చు. కేసు నమోదు చేయడం అంటే జైలుకు పంపడమే. అంటే, ముస్లిం పురుషుల మీద ఎప్పుడయినా సరే కేసులు పెట్టి జైళ్లకు పంపడానికి పోలీసులకు ఈ చట్టం అపార అధికారాల్ని ఇస్తుంది. తనతో విభేధించే రాజకీయ నాయకులు, వాణిజ్య వేత్తలపై మోదీ ప్రభుత్వం సిబిఐ, ఆర్‌బిఐ, ఇడి, ఐటి, ఇసి, చివరకు న్యాయస్థానాల్ని సహితం ఉపయోగించి దారికి తెచ్చుకోవడాన్ని మనం ఇప్పటికే చూస్తున్నాం. ఇక ముందు ముస్లిం సమాజాన్ని అణిచివేయడానికి పోలీసుల్ని, చట్టాల్ని ఉపయోగించడాన్ని మనం చూడబోతున్నాం.

కేంద్ర హోం, న్యాయశాఖలు సంయుక్తంగా రూపొందించిన ఈ బిల్లును డిసెంబర్ 15న కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇది డిసెంబర్ 29న ఈ బిల్లు లోక్ సభ ఆమోదాన్ని కూడా పొందింది. దీనికి కాంగ్రెస్ సహితం మద్దతివ్వడం విశేషం. 1986 నాటి షాబానో కేసులో మనవర్తిని రద్దుచేసి రాజీవ్ గాంధీ ఒక చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారు. మూడు దశాబ్దాల తరువాత ఆయన కుమారుడు రాహుల్ గాంధీ షయరా బానూ కేసులో కమలనాథులకు మద్దతు పలికి మరో చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారు.

ముస్లిం మహిళ (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు–2017ను తాము మత ప్రాతిపదికగా చూడడం లేదనీ మహిళల సమస్యల్ని మానవీయ కోణంలో చూస్తున్నామని కేంద్ర న్యాయశాఖామంత్రి రవిశంకర ప్రసాద్ అంటున్నారు. ప్రభుత్వం చెపుతున్న ఆదర్శాలకూ ఆచరణకూ పొంతన లేదు. మన దేశంలో ముస్లిం మహిళలు భర్తలవల్లనేగాక ప్రభుత్వాలవల్ల, వాళ్ల సైనికులవల్ల బాధపడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. మాలియాన, ముజఫర్‌నగర్ హత్యలు, అల్లర్ల సందర్భంగా ముస్లిం మహిళలు ఇంతకన్నా పెద్ద సంఖ్యలో, ఇంతకన్నా హృదయ విదారకంగా రోదించారు. అప్పటి ప్రభుత్వాల్లోగానీ, ఇప్పటి ప్రభుత్వంలోగానీ అప్పుడెప్పుడూ ఇలాంటి ముస్లిం మహిళా సానుభూతి కనిపించలేదు. ప్రభుత్వానికి మహిళల గౌరవ మర్యాదలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మీద అంతగా ప్రేమ ఉంటే దేశంలోని అన్ని మతసమూహాల్లోని మహిళలకు వర్తించేలా ఒక సమగ్ర చట్టాన్ని తెచ్చి ఉండాల్సింది. ప్రత్యేకంగా ముస్లిం మహిళ వైవాహిక హక్కుల పరిరక్షణ కోసమే కొత్త చట్టం తేవడం దేనికీ? ముస్లిం మహిళల మీద సానుభూతి ముసుగులో ముస్లిం స్త్రీ పురుషుల మీద ఒక అప్రకటిత దాడియే ఈ చట్టం.

సంజయ్ లీలా భన్సాలీ నిర్మించిన పద్మావత్ సినిమా తమ మహిళల గౌరవానికి భంగం కలిగిస్తున్నదంటూ ఆరోపిస్తూ ఆ సినిమా విడుదలను నిలిపివేయాలంటూ ఆందోళనకు దిగిన రాజపుత్ర సంఘాలు సుప్రీం కోర్టును ఆశ్యయించాయి. ఈ అంశాన్ని పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వం నిపుణుల బృందాన్ని నియమించడమేగాక, ఈ సమస్య పరిష్కారానికి ప్రముఖ చరిత్రకారుల అభిప్రాయాలు తెలుసుకోవాలని మానవ వనరుల అభివృద్ధి శాఖను కోరింది. దాదాపు 20 కోట్ల జనాభాకు దాదాపు జీవన్మరణ అంశంగా మారనున్న అంశం పై చట్టం చేసే సమయంలో

సమయాన్వేషణతో రజనీ రాజకీయం

తమిళనాడులో ఉన్న రాజకీయ అస్థిరతను అవకాశంగా తీసుకుని అభిమానాలే పెట్టుబడిగా వస్తున్న సినీ నటుడు రజనీకాంత్ రాజకీయ జీవితం ఎలా ఉండబోతున్నదో చూడాలని అంటున్నారు ఎస్. కిశోర్ కుమార్

ఒక సినిమా చిత్రీకరణలో ఉండగా ఆ చిత్ర యూనిట్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆ సినిమా గురించి వివరిస్తుంటారు. అలా వివరించే క్రమంలో సుమారు గత ఇరవై ఏళ్లుగా అనేక సినిమా మీడియా సమావేశాల్లో ఆనవాయితీగా చెపుతున్న ఒక మాట ఏమిటంటే, 'మా సినిమాలో ఒక వెరైటీ లవ్ స్టోరీ ఉంటుంది' అని. ఇలా వెరైటీ లవ్‌స్టోరీల నేపథ్యంతో ముఖ్యంగా గత ఇరవై ఏళ్లలో కొన్ని వందల సినిమాలు వచ్చే ఉంటాయి. ఇలాంటి 'వెరైటీ' ఆనవాయితీ ఇటీవల రాజకీయాల్లోకి కూడా వచ్చింది. గత కొన్నేళ్లుగా దేశంలో పుట్టుకొచ్చే రాజకీయ పార్టీలు ప్రధానంగా అవినీతిని నిర్మూలిస్తామని ప్రజల్లోకి అడుగిడుతున్నాయి. అవినీతి నిర్మూలనలో ఒక్కో పార్టీది ఒక్కో వెరైటీ అంతుచిక్కని ఆచరణ మార్గం. దేశంలో ఆ కోవలో పుట్టుకొస్తున్న మరో కొత్త రాజకీయ పార్టీ.. తమిళ సినిమా నటుడు రజనీకాంత్ స్థాపించబోయే పార్టీ. ఇది ఆధ్యాత్మిక రాజకీయ విధానం ద్వారా అవినీతిని నిర్మూలిస్తుందని స్వీయ ప్రచారం లోని సారాంశం. అవినీతిని నిర్మూలిస్తామంటూ ఎన్ని రాజకీయ పార్టీలు పుట్టుకొచ్చినప్పటికీ వాటి చిత్తశుద్ధిని ప్రజల ముందు బట్టబయలు చేయడానికేనన్నట్లు దేశంలో అవినీతి విభిన్న రూపాలలో అంతకంతకూ పెరిగిపోతూనే ఉంది. ఇది జగమెరిగిన వాస్తవం.

సినిమా రాజకీయాలకు నిలయమైన తమిళనాడులో గత రెండు దశాబ్దాలకు పైగా రజనీకాంత్ రాజకీయ రంగప్రవేశ అంశం చర్చల్లో ప్రధానంగా చోటు చేసుకుంటూ వస్తుంది. ముఖ్యంగా 2007లో ఆయన కథానాయకుడుగా అవినీతి కథాంశంతో విడుదలైన 'శివాజి-ది బాస్' చిత్రం అనంతర కాలం నుంచి ఈ అంశం మరింత ప్రచారంలో ఉంది. దేవుడు ఆదేశిస్తే తప్పక రాజకీయాల్లోకి వస్తానంటూ గత కొంతకాలంగా ఆయనే స్వయంగా చెప్తూ వస్తున్నాడు. ఆంగ్ల నూతన సంవత్సరం 2018లోకి అడుగుపెట్టేముందు అభిమానులకు తీపికబురు చెప్పమని ఆయనను ఏ ఆధ్యాత్మిక దేవుడు ఆదేశించాడో ఏమో కానీ 2017 డిసెంబర్ 31నాడు సుదీర్ఘకాలంగా అభిమానుల ఉత్కంఠతకు తెరదించుతూ తాను ఒక రాజకీయ పార్టీ ప్రారంభించబోతున్నట్లు

ఒక సినిమాకు చేసినంత కసరత్తు కూడా కేంద్ర ప్రభుత్వం చేయలేదు. ముస్లిం సమాజం రాజపుత్రుల మార్గంలో రోడ్ల మీదికి వచ్చి హింసాత్మక ఆందోళనలు చేయాలని నరేంద్ర మోది ప్రభుత్వం భావిస్తున్నట్టుంది.

ట్రిపుల్ తలాఖ్ కేసుకు భారీ ప్రచారం ఇచ్చే క్రమంలో మీడియా దాచిపెట్టిన పెద్ద కేసు ఇంకొకటుంది. భార్య ఇష్టం లేకుండా సాగించే సంభోగాన్ని అత్యాచార నేరంగా పరిగణించి భర్తల్ని శిక్షించేలా ఒక చట్టం చేయాలని సుప్రీం కోర్టు ఆ మధ్య కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వైవాహిక అత్యాచారం మీద ఢిల్లీ హై కోర్టులో ఇంకో ప్రజా ప్రయోజన వాజ్యం (పిల్) నడుస్తున్నది. పద్దెనిమిది సంవత్సరాల వయస్సు దాటని భార్యతో సంభోగం చేయడాన్ని అత్యాచార నేరంగా పరిగణించి భర్తను శిక్షించాలనేది దీని సారాంశం.

ఈ అంశం ఇప్పుడు సుప్రీం కోర్టు పరిధిలోవుంది. ఎలా లెక్క వేసినా ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాక్ బాధిత స్త్రీల కన్నా వైవాహిక అత్యాచార బాధిత స్త్రీల సంఖ్య నిస్సందేహంగా అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్తల్ని నేరస్తులుగా పరిగణించమని సుప్రీంకోర్టు చెప్పలేదు. కానీ, వైవాహిక అత్యాచార నిందితుల్ని నేరస్తులుగా పరిగణించమని స్పష్టంగా చెప్పింది. సుప్రీం కోర్టు నేరస్తులుగా పరిగణించిన కేసుని పక్కన పెట్టిన కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు నేరస్తులుగా పరిగణించని కేసుని మాత్రం తీవ్రంగా పట్టించుకుంది. సుప్రీం కోర్టుతో నరేంద్ర మోదీ ఆడుకుంటున్న తీరుకు కూడా ఈ చట్టం అద్దం పడుతుంది.

వైవాహిక అత్యాచారానికి పాల్పడే పురుషుల్ని శిక్షించే సాహసం కేంద్ర ప్రభుత్వానికి ఎలాగూలేదు. పైగా, ఆ కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ లో విచిత్ర వాదనలు చేశారు. "దాన్ని భార్య అత్యాచారంగా అనుకోవచ్చు. కానీ భర్తకు అది అత్యాచారంగా కనిపించకపోవచ్చు. ఇలాంటి చట్టాలను కనుక తీసుకుని వస్తే దేశంలో వివాహ వ్యవస్థే మొత్తంగా కూలిపోతుంది. భర్తల్ని వేధించడానికి భార్యల చేతికి ఆయుధాలను అందుబాటులో వుంచినట్టవుతుంది" అని అందులో పేర్కొన్నారు. ఇదే మాటను ముస్లిం సమాజం విషయంలో కేంద్రం చెప్పలేదు. కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలనే కాదు, మతపక్షపాతాన్ని కూడా పాటిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం మాత్రమే కాదు సమాజానికి ప్రమాదకరం కూడా.

భర్తల్ని హత్య చేసిన భార్యల కథనాలు ఇటీవలి కాలంలో ఒక పరంపరగా వెలుగులోనికి వస్తున్నాయి. మహబూబ్‌నగర్ స్వాతి, హైదరాబాద్ జ్యోతి, పద్మలు; గుంటూరు శ్రీవిద్య భర్తలను చంపిన భార్యలుగా మీడియాలో ప్రచారం పొందారు. తాము ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాఖ్ చెప్పనప్పటికీ బయటికి వెళ్లిపోయే ఉద్దేశ్యంతోనే తమ మీద భార్యలు నిందలు వేస్తున్నారని ఆవేదన పడే ముస్లిం భర్తలు కూడా ఇప్పుడు లేకపోలేదు. భవిష్యత్తులో అలాంటివాళ్ల సంఖ్య పెరగవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే ముస్లిం భర్తల్ని జైళ్లకు పంపడానికీ, ముస్లిం భార్యల్ని రోడ్డున పడేయడానికీ కొత్త చట్టం సిద్ధం అయింది. వీ

(రచయిత సీనియర్ పాత్రికేయులు)

రజనీకాంత్ సుమారు పావుగంటపాటు సాగిన తన ప్రసంగంలో ప్రకటించాడు. ఒకప్పుడు బస్ కండక్టర్‌గా టికెట్లు పంచిన రజనీకాంత్ ఇకనుంచి రాజకీయ నాయకుడిగా పార్టీ టికెట్లు పంచబోతున్నాడు.

డిఎంకె ప్రధాన నాయకుడు కరుణానిధి కురువృద్ధుడై ప్రస్తుత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించలేని పరిస్థితి, తిరుగులేని ప్రజానాయకురాలు జయలలిత మరణించడం, ఆమె స్థానంలో బలమైన రాజకీయాలు నెరపాలనుకున్న ఆమె నెచ్చెలి శశికళ జైలుపాలు కావటం, అధికార అన్నాడిఎంకె పార్టీ రెండు ప్రధాన వర్గాల కూటమిగా మారడం, డిసెంబర్ 24న వెలువడిన ఆర్‌కె నగర్ ఉపఎన్నిక ఫలితాల్లో అన్నాడిఎంకె పార్టీ అభ్యర్థి ఓటమి పాలవడం, గెలిచిన అభ్యర్థి అధికార అన్నాడిఎంకె బహిష్కృత నేత దినకరణ్ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కూలుతుందని సంచలన ప్రకటన చేయడం, అదే ఎన్నికల్లో ప్రతిపక్ష డిఎంకె అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం, తమిళనాడులో ప్రస్తుతం 117 ఎంఎల్‌ఏలున్న అధికార అన్నాడిఎంకెలో ఒక్క సభ్యుడు తక్కువైనా ప్రభుత్వం కూలిపోయేందుకు స్పష్టమైన అవకాశం ఉండడం తదితర ప్రధాన బలహీనతలు చోటుచేసుకున్న సందర్భాన్ని సదవకాశంగా మలుచుకొని సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న తన రాజకీయ రంగ ప్రవేశానికి, అదృష్ట పరీక్షకు ఇదే అత్యంత భద్రమైన సమయమని భావించిన రజనీకాంత్ 68 సంవత్సరాల వయసులో తన రాజకీయ అరంగేట్రం ప్రకటించాడు. భారతీయ సినిమారంగం చరిత్రలో ఇంత లేటు వయసులో రాజకీయాల్లోకి ప్రవేశించిన మరో నటుడు ఎవరూ ఉండకపోవచ్చేమో. ఎంగిలి విస్తరాకులమీద వీధి కుక్కలు ఎగబడ్డట్లు.. తమిళనాడులో కొత్త రాజకీయాలకు పరిస్థితులు కాస్త అనుకూలించడంతో రజనీకాంత్ దారిలో కొత్తగా మరికొన్ని పార్టీలు రాబోతున్నాయి. సహజంగా మే 2021 వరకు గడువు ఉన్న ప్రస్తుత ప్రభుత్వం ఇంకెప్పుడు కూలుతుందా అని గుంటనక్కల్లాగ ఎదురు చూడడమే వాటి తక్షణ చర్య. ప్రజాస్వామ్యానికి సేవ చేయడమంటే ఇదేనేమో!

1992లో జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చెన్నైలో ఆమె ప్రయాణిస్తున్న కాన్వాయ్ వస్తున్న సందర్భంగా అక్కడ కాసేపు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఆ ట్రాఫిక్‌లో రజనీకాంత్ ప్రయాణిస్తున్న కారు కూడా ఉంది. ఆయనకు కాస్త చిర్రెత్తుకొచ్చింది. వెంటనే తన కారు నుంచి కిందికి దిగి పక్కనే ఉన్న బడ్డీకొట్టు వద్దకెళ్లి సిగరెట్ తాగుతూ నిలుచు న్నాడు. అంతే, రోడ్డుమీద ఆయనను చూసిన సినీ అభిమానులు పెద్ద సంఖ్యలో ఒక్క ఉదుటున ఆయన చుట్టూ చేరారు. తద్వారా ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు గంటన్నర పాటు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించి రజనీకాంత్ తన కోపం చల్లార్చుకున్నాడు. ఇది బాధ్యతగల పౌరుడు చేయవల్సిన పనికాదు. అప్పటికి ఆయన వయస్సు 42 సంవత్సరాలు.

1995లో అంగరంగ వైభవంగా జరిగిన జయలలిత దత్తపుత్రుడి వివాహంలో అధికార దుర్వినియోగం మితిమీరింది. సహజంగానే జయ ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు గురైంది. ఆ తరువాత చెన్నైలో దర్శకుడు మణిరత్నంపై ఇంటిపై బాంబు దాడి కారణంగా.. 1996లో లోక్‌సభకు, తమిళనాడు శాసనసభకు జరిగిన ఎన్నికలలో 'రాష్ట్రంలో జయలలిత మళ్లీ అధికారంలోకి వస్తే దేవుడు కూడా ఈ రాష్ట్రాన్ని కాపాడలేడు' అంటూ రజనీకాంత్ చేసిన ఏకపంక్తి ప్రకటనతో జయలలిత పార్టీ అన్నాడిఎంకె కనీవినీ ఎరుగని ఘోర పరాజయాన్ని చవిచూసింది. రజనీకాంత్ రాజకీయాల్లోకి రాకుండానే సాధించిన రాజకీయ విజయం అది. (అయితే ఆనాటి ఆ ప్రకటనపట్ల రజనీకాంత్ ఇటీవల ఆత్మవిమర్శ చేసుకోవడం ఆశ్చర్యం.)

తమిళనాడు – కర్నాటక రాష్ట్రాల మధ్య నలుగుతున్న కావేరినది జలవివాదంలో రజనీకాంత్ తలదూర్చక తప్పలేదు. స్వతహాగా కన్నడిగుడైన రజనీకాంత్ 2002లో కావేరి జలవివాదం తీవ్రరూపం దాల్చినప్పుడు ఆయన మౌనాన్ని తమిళ సినీ పరిశ్రమలో జయలలిత వర్గానికి చెందిన భారతీరాజాతో సహా కొందరు ప్రముఖులు విమర్శించారు. (అప్పట్లో తమిళ సినీ పరిశ్రమలో కరుణానిధి వర్గం, జయలలిత వర్గం అని ప్రధానంగా రెండు ప్రచ్ఛన్న వర్గాలు ఉండేవి.) రజనీకాంత్‌ను ఈ వివాదంలోకి లాగడంలో జయలలిత పాత్ర ఉందని ప్రచారం కూడా ఉండేది. తన చిత్తశుద్ధిని చాటుకోవడానికి రజనీకాంత్ తొమ్మిది గంటల పాటు నిరాహారదీక్ష చేపట్టి.. కావేరి జలవివాదంలో సుప్రీంకోర్టు ఆదేశాలను కర్నాటక ప్రభుత్వం పాటించాలని, అందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలంటూ సమస్యను కేంద్రానికి ముడిపెట్టి దీక్షను ముగించాడు. తద్వారా కర్నాటక వైఖరికి వ్యతిరేకంగా తమిళనాడు ప్రజలు చేస్తున్న పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా ఆయన తప్పించుకున్నట్లయింది. నదీజలాల సమస్యకు దీర్ఘకాల పరిష్కారం కేవలం దేశంలోని ప్రధాన నదుల అనుసంధానం మాత్రమేనని అభిప్రాయ పడ్డాడు. అందుకు ఒక కోటి రూపాయల విరాళం కూడా ప్రకటించి తాత్కాలికంగా వివాదం నుంచి రజనీకాంత్ తప్పించుకున్నాడు. అయితే ఇప్పటివరకు దేశంలో నదుల అనుసంధాన ప్రక్రియ మొదలైంది లేదు, ఆయన ఆ కోటి రూపాయల విరాళం ఇచ్చిందీ లేదు. కావేరి నది జలాల వివాదంలో రజనీకాంత్ ఇప్పటికీ ముక్తసరి వైఖరి, దాటవేత ధోరణి అవలంబిస్తున్నాడు. అంతేకాకుండా, శ్రీలంకలో జరిగిన అంతర్యుద్ధంలో వేలకొద్దీ తమిళ ప్రజలు చనిపోయినప్పుడు, ఇటీవల కాలంలో జల్లికట్టు నిషేధంపై నిరసనలు వెల్లువెత్తినప్పుడు కూడా తమిళుడి రోదన, ఆందోళన రజనీకాంత్ వెలిబుచ్చలేదు. కేంద్రం ప్రభుత్వం తెచ్చిన వస్తు సేవల పన్ను వల్ల తీవ్ర ప్రభావం పడుతుందని మద్రాస్ సినీ పరిశ్రమ ఆందోళన చేస్తే రజినీకాంత్ స్పందించలేదు.

తమిళనాడులో గత యాభై ఏళ్లుగా డిఎంకె, అన్నాడిఎంకె పార్టీలే అధికారాన్ని అనుభవిస్తున్నాయి. సుమారు గత పాతిక సంవత్సరాలుగా రాష్ట్రంలో చోటుచేసుకున్న మితిమీరిన అవినీతి, బంధుప్రీతి, కుంభకోణాలు బహిరంగ రహస్యాలు. సాక్షాత్తు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత దీర్ఘకాల జైలు శిక్ష అనుభవించడం, ఆమె నెచ్చెలి శశికళ ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తుండడం అందుకు నిదర్శనం. తీవ్రతను సూచించే సిబిఐ దాడులు, సిబిఐ విచారణలు, కోర్టు విచారణలు ఎదుర్కొన్న నాయకులు కూడా అనేకం. కళ్లముందు జరిగిన వీటన్నింటినీ చూసుకుంటూ ఎన్నడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడని రజనీకాంత్ నేడు 'అవినీతి' అనే పదాన్ని తన పార్టీ ఏర్పాటుకు ప్రధాన కారణంగా వాడుకోవటం ముమ్మాటికీ స్వార్థమే. జయలలితతో రజనీకాంత్‌కు ఉన్నది పరిమిత వైరం. అది కూడా స్వల్ప కాలానికే పరిమితమైంది. ఆ తరువాత ఇద్దరి మధ్య గౌరవపూర్వక సంబంధాలు కొనసాగాయి. ఇక డిఎంకె పార్టీతో, రాష్ట్రంలో అనేకమార్లు ముఖ్యమంత్రిగా ఉన్న ఆ పార్టీ అధినేత కరుణానిధితో మొదటి నుంచీ రజనీకాంత్‌కు సత్సంబంధాలు ఉన్నాయి.

పైగా, డిఎంకె పార్టీకి ప్రత్యక్ష మద్దతు పలికిన సందర్భాలు కూడా ఉన్నాయి. బహిరంగ అవినీతి రాజ్యమేలుతున్న సమయంలో కూడా రాష్ట్రంలో ఉన్న రెండు పార్టీల ప్రభుత్వాలతో రజనీకాంత్ మెరుగైన సంబంధాలు కలిగి ఉండి, దొంగలు పడ్డ ఆర్నెళ్లకు కుక్కలు మొరిగిన చందాన.. రాష్ట్రంలో దశాబ్దాల వయసున్న అవినీతి గురించి రజనీకాంత్ ఇప్పుడు మాట్లాడటం సిగ్గుచేటు.

రజనీకాంత్ రాజకీయ ప్రవేశం విషయంలో ఆయన ప్రాంతీయత పెద్ద సమస్యగా మారింది. కర్నాటక రాష్ట్రానికి చెందిన రజనీకాంత్ తన జీవితంలో ఎక్కువ భాగం తమిళనాడులోనే నివసించాడు. రాజకీయ ప్రవేశ ప్రకటన సమావేశంలో.. తమిళ ప్రజలే తన జీవితమని రజనీకాంత్ అన్నాడు. తనను విశ్వసించాల్సిందిగా ఎంతో వేడుకొన్నాడు. ఇక ఆయనకున్న సమస్త అభిమాన సంఘాలను ఏకం చేస్తూ తన రాజకీయ జీవితానికి స్వేచ్ఛగా వాడుకోడానికి పూనుకున్నాడు. తన అభిమానులను ఒక పెద్ద ప్రైవేటు ఆర్మీగా తయారు చేయబోతున్నట్లు ఆయన ప్రసంగం ద్వారా తెలుస్తుంది. సినిమాలో రెండున్నర గంటలపాటు చూపించినట్లుగా రజనీకాంత్ తన రాజకీయ జీవితాన్ని ఊహించుకుంటున్నట్లు కనిపిస్తుంది. తమిళనాడులో కనీవినీ ఎరుగని మార్పును కేవలం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో సాధించాలనే తన సంకల్పాన్ని ప్రకటించాడు. సినిమాలోని ఆవేశం, సినిమా డైలాగులు ఆచరణాత్మక రాజకీయ జీవితంలో ఆమడ దూరమని రజనీకాంత్‌కు మూడేళ్ల తరువాత బోధపడవచ్చు. దేశంలో షార్ట్ టైమ్ రాజకీయ పార్టీలు ప్రజలపై చేసిన అనేక విఫల ప్రయోగాలలో ఇది కూడా ఒకటిగా చరిత్రలో నిలిచిపోతే ఆశ్చర్యం లేదు.

రజనీకాంత్‌కు భారతీయ జనతా పార్టీతో ఎన్‌డిఏ కూటమి ఆరంభ కాలం నుంచి ఇప్పటివరకు మంచి అనుబంధమే ఉంది. ముఖ్యంగా రజనీకాంత్ కోరుకునే నదుల అనుసంధానం విషయంలో నాటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయితో గౌరవ సంబంధాలు ఉండేవి. నదుల అనుసంధానానికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ కూటమి అనుకూలంగా ఉండడంతో 2004 ఎన్నికల ముందు రాష్ట్రంలో అన్నాడిఎంకె – బిజెపి కూటమికి మద్దతు కూడా పలికాడు. ఇప్పుడు కూడా కేంద్రంలో బిజెపి ప్రభుత్వమే ఉంది. నదుల అనుసంధానం అంశం ఇంకా కీలకంగానే ఉంది. ఈ అంశాన్ని అడ్డం పెట్టుకుని రజనీకాంత్ బిజెపితో తన రాజకీయ అనుబంధాన్ని మున్ముందు కలిగి ఉండవచ్చు. అంతేకాకుండా, గత నాలుగు సంవత్సరాలలో స్వయంగా నరేంద్రమోడి రజనీకాంత్‌ను కలిసిన సందర్భాలు కూడా ఉన్నాయి. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో సహా అనేక మంది బిజెపి సీనియర్ జాతీయ నాయకులు రజనీకాత్‌ను బిజెపిలో చేరాలని కోరుతూ వస్తున్నారు. తద్వారా తమిళనాడులో బిజెపి బలపడవచ్చు అనేది వారి అభిలాష. అయితే రజనీకాంత్ ఏ విషయమూ స్పష్టం చేయకుండా కాలయాపన చేశాడు. చివరకు తానే ఒక పార్టీని ప్రారంభించనున్నట్లు, పైగా రాష్ట్రంలో మొత్తం 234 స్థానాలలో పోటీ చేయనున్నట్లు పేర్కొన్నాడు. ఇది నిజంగా సాధ్యం అయితే ఇక బిజెపితో రజనీకాంత్ పార్టీ పొత్తు లేనట్లేననుకోవచ్చు. ఒకపక్క సుదీర్ఘకాలంగా బిజెపితో సన్నిహిత సంబంధాలు, మరొకపక్క ఆధ్యాత్మిక రాజకీయ నినాదం. ఏదో ఒక రూపంలో రజనీకాంత్ బిజెపితో రాజకీయ మైత్రీబంధం కొనసాగిస్తాడనే బలమైన అభిప్రాయం, అనుమానం అన్ని వర్గాల్లోనూ ఉంది. అయితే రజనీకాంత్ మాత్రం ఈ విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

సిగరెట్టును, బీడీని ఎగురవేసి దాన్ని పెదాలపై పడేసుకోవటంలో రజనీకాంత్ దిట్ట (ఎక్స్‌పర్ట్). 1975 నుంచి అనేక సినిమాల్లో ఆయన ప్రదర్శించిన ఇలాంటి అసాధారణ అద్భుత కళావిన్యాసాలకు, ప్రతిభాపాటవాలకు మంత్రముగ్ధులై పుట్టుకొచ్చిన తొలితరం అభిమానులు, ఆ వారస అభిమానులు కోకొల్లలు. అలాంటి బలమైన అభిమాన అనుచరులే ఆది నుంచీ సినీనటుడు రజనీకాంత్‌కు నిత్యజీవిత శక్తి. ఇకనుంచి అటువంటి అభిమానులే రజనీకాంత్ నడిపించే ఆధ్యాత్మిక, అవినీతిరహిత క్రొంగొత్త రాజకీయాలకు కాపలాదారులుగా ఉండ బోతున్నారన్నమాట. సైద్ధాంతికంగా ఆధ్యాత్మికం అనే పదంతో ముడిపడి ఉండే ఏ అంశము లేదా ఏ కార్యములోనైనా మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాలు తదితర వాటికి చోటుండకూడదు. మరి ఇవేవీ లేకుండా రజనీకాంత్ స్వచ్ఛమైన ఆధ్యాత్మిక రాజకీయాలు విజయవంతంగా నడిపించగలడా లేక వీటన్నింటికీ చోటిచ్చి ఆధ్యాత్మికానికి కొత్త నిర్వచనం ఇస్తాడా అనేది మున్ముందు కాలమే బోధిస్తుంది.

1994 నుంచి రజనీకాంత్‌కు రాజకీయాల్లోకి ఆహ్వానం ఉన్నప్పటికీ అప్పట్లో కరుణానిధి, జయలలిత, మూపనార్ తదితర హేమాహేమీ నాయకులను ఎదుర్కొని రాష్ట్రంలో సుదీర్ఘకాలంపాటు దిగ్విజయంగా రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే ఆలోచనతో వెనుకడుగు వేశాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు వెనుకడుగుకు ప్రతీసారి అలాంటి ఆలోచనే కారణం. ఇప్పుడున్న పరిస్థితి కాస్తంత ధైర్యాన్నిచ్చేదిగా ఉంది. తమిళనాడులో అధికారంలోకి రావటమే ప్రధాన లక్ష్యంగా రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆయన మాటల్లో స్పష్టంగా అర్ధమవుతుంది. గెలిస్తే విజయం లేకుంటే విరమణ అంటూ ఆయన ప్రసంగంలో అన్న మాటలు అందుకు ఉదాహరణ. ప్రతిపక్షంలో కూర్చుని ప్రజల పక్షాన పోరాడటానికి ఆయన సిద్ధంగా లేడని స్పష్టంగా అర్ధమవుతుంది. అధికారం ద్వారా చేసే సేవ మాత్రమే కాదు ప్రతిపక్షంలో ఉండి పోరాటం ద్వారా చేసే సేవ కూడా గొప్పదనే విషయం రజనీకాంత్ తెలుసుకోవాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సినీనటుడు చిరంజీవి కూడా సుదీర్ఘకాలంగా నాన్చుతూ నాన్చుతూ.. అధికారమే లక్ష్యంగా ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేసి రాజకీయాల్లోకి వచ్చాడు. శాసనసభకు, లోక్‌సభకు ఒకేసారి జరిగిన ఎన్నికల్లో పోటీచేసి ఘోర పరాజయం పాలై, చివరకు ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షాన పోరాడే ఓపిక లేక తన పార్టీని అధికార కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి ప్రజలకు ద్రోహం చేశాడు.

చిరంజీవికి, రజనీకాంత్‌కు కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి. 'ఠాగూర్' సినిమా ద్వారా చిరంజీవి తన రాజకీయ ప్రవేశం గురించి ప్రజలకు సంకేతం పంపించాడు. 'శివాజీ' చిత్రం ద్వారా రజనీకాంత్ తన రాజకీయ ప్రవేశం గురించి ప్రజలకు సంకేతం పంపించాడు. ఇద్దరూ అనుకూల పరిస్థితుల కోసం ఐదు, పది సంవత్సరాలు ఎదురు చూశారు. ఇద్దరూ అభిమానులే పెట్టుబడిగా, అధికారమే ధ్యేయంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఇద్దరూ పార్టీ ఏర్పాటుకు ముందుగానే రాజకీయ సమీకరణ సంబంధిత ఏర్పాట్లలో నిమగ్నమైనారు. చిరంజీవి రాజకీయ జీవితం 'ఠాగూర్' సినిమాకి పూర్తి భిన్నంగా ఉంది. ఇక అవినీతి నిర్మూలన అవసరమంటున్న రజనీకాంత్ తన రాజకీయ జీవితం 'శివాజీ' చిత్రానికి దగ్గరగా ఉంటుందా లేక భిన్నంగా ఉండబోతుందా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు) వీ

ప్రజల సొమ్ము లూటీచేసే ఎఫ్ఆర్‌డిఐ బిల్లు- 2017

ప్రైవేట్ సంస్థలు తీసుకున్న అప్పు బకాయిల వల్ల బ్యాంకులకు కలిగే నష్టాన్ని పూడ్చడానికి ఖాతాదారుల సొమ్ముతో భర్తీ చేసి ప్రజలను ముంచడానికే ఎఫ్‌డిఆర్ఐ బిల్లు తెస్తున్నారని అంటున్నారు **సంతోష్**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్(ఎఫ్ఆర్‌డిఐ)' బిల్లు బ్యాంక్ డిపాజిటర్ల సొమ్ముకు రక్షణ కల్పిస్తుందా? లేదా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుల్లో దాచుకున్న తమ డబ్బును ప్రభుత్వం చెప్పాపెట్టకుండా తీసేసుకుంటుందనీ, తమ సొమ్ముకు గ్యారంటీ లేదనీ, బ్యాంకు దివాళా తీస్తే నష్టపోవాల్సిందేననీ, ఇలా ఎన్నో భయాలతో తమ సొమ్మును విత్ డ్రా చేసేసి (ప్యానిక్ విత్‌డ్రాల్స్) ఇతర మార్గాల్లో ఇన్వెస్ట్ చేసుకొంటున్న వారూ ఉన్నారు.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లును 2017 జూన్ 14న కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఆగస్టు 10న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలనలో ఉంది. దాని సిఫారసుల ప్రాతిపదికగా ఈ శీతాకాల సమావేశంలోనే ప్రభుత్వం లోక్‌సభ ఆమోదం పొందాలని చూస్తున్నది. బ్యాంకులు, బీమా కంపెనీలు, బ్యాంకింగేతర ద్రవ్య కంపెనీలు, స్టాక్ ఎక్స్ఛేంజీల వంటివి దివాళా తీసిన సందర్భంలో వాటి అప్పులు – ఆస్తుల వ్యవహారాల నిర్వహణకై ఒక చట్రాన్ని ఏర్పాటు చేయాలని బిల్లు ప్రతిపాదిస్తున్నది. ఇందుకుగాను ఒక పరిష్కారాల రిజల్యూషన్ కార్పొరేషన్ నెలకొల్పనుంది.

కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా బ్యాంకుల ద్వారా ప్రజాధనం లూటీ ఓ తంతుగా మారిపోయింది. కాంగ్రెస్, బిజెపి.. ఈ రెండింటి పాలన లోనూ ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండి బకాయిల వ్యవహారం ఒకేరకంగా ఉంది. ఈ రెండు పార్టీలు ఒకదానిపై మరొకటి ఆరోపణలు చేసుకోవడం మినహా ప్రజలకు చేసిన మేలు శూన్యం. ప్రజల కష్టార్జితం బడాబాబుల పాల్జేస్తూ పన్నుల రూపంలో మళ్లీ జనంపైనే భారాలు మోపడం ఆనవాయితీగా మారింది.

నిజానికి కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అది దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులను, జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలి.

మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా పనిచేస్తూ, సామాన్య, మధ్య తరగతి వర్గాలను పట్టించుకోకపోగా, వారిని మరింత కుంగదీసే విధంగా చర్యలు తీసుకొంటోంది.

నేపథ్యం

2008లో అమెరికా, ఇతర దేశాలలో వెల్లువెత్తిన ఆర్థిక సంక్షోభం, ఆ సందర్భంలో ప్రజలు చెల్లించిన పన్నుల నుండి సంక్షోభంలో పడ్డ బ్యాంకులకు, ద్రవ్య సంస్థలకు 'బెయిల్ అవుట్' ప్యాకేజీలు అమలు పరచడం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో 2009లో జి–20 దేశాల ప్రతినిధులతో 'ఫైనాన్షియల్ స్టెబిలిటీ బోర్డు' ఏర్పాటు చేశారు.

బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు విఫలమై, సంక్షోభాలను ఎదుర్కొంటున్న సందర్భాలను అధిగమించడానికి అవసరమైన మార్గదర్శకాలను, విధివిధానాలను ఈ ఎఫ్ఎస్‌బి రూపొందిస్తుంది. దివాలతీసిన బ్యాంకుల, ద్రవ్య సంస్థలను ఆదుకోవడానికి ప్రభుత్వ నిధులను ఉపయోగించవద్దని నిర్ణయించింది.

జి–20లో భాగస్వామిగా భారతదేశం కూడా ఈ ఎఫ్ఎస్‌బిలో పాత్రధారిగా ఉంది. ఎఫ్ఎస్‌బి మార్గదర్శకాలకు అనుగుణంగా భారతదేశంలో ఒక ప్రత్యేక చట్టం తీసుకురావలసిన ఆవశ్యకత ఏర్పడింది.

2016–17 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మొదటిసారిగా ఈ ప్రస్తావన తీసుకువచ్చారు. కేంద్ర ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్న అజయ్ త్యాగి అధ్యక్షులుగా 2016 మార్చిలో ఒక కమిటీ ఏర్పాటు చేసి, 'ముసాయిదా బిల్లు'ను సమర్పించే బాధ్యత అప్పగించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ఎఫ్ఆర్‌డిఐ బిల్లు 2017 తయారు చేశారు. దీన్ని కొద్ది సవరణలతో కేంద్ర కెబినెట్ జూన్‌లో ఆమోదించింది.

ప్రస్తుతం అమలులో ఉన్న 'డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ చట్టం–1961' (డిఐసిజిసి) స్థానంలో 'ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డిఐ)' బిల్లును మోడీ ప్రభుత్వం ఎఫ్ఆర్‌డిఐ బిల్లును 2017 ఆగస్టు 15న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. దేశంలో ఉన్న బ్యాంకులు, బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలు నష్టాల్లో కూరుకుపోయినప్పుడు వాటిని ఆదుకునేందుకు ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతుంది.

ప్రస్తుతం ఈ బిల్లు పార్లమెంటు సంయుక్త కమిటీ పరిశీలనలో ఉంది. సారాంశంలో ఎఫ్ఆర్‌డిఐ బిల్లు దేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చడమే కాకుండా బ్యాంకుల్లో దాచుకున్న ప్రజల కష్టార్జిత సొమ్ముపై బ్యాంకుల పెత్తనానికి తెరలేపే దుష్ట చింతన ప్రభుత్వం చేస్తోంది.

ప్రజల సొమ్ము కార్పొరేట్ల పరం

ఇప్పటివరకు ఆర్థిక పరిష్కారాలు కనుగొనే వ్యవస్థ రుణగ్రస్తులను గట్టెక్కించడం, సంప్రదాయ పద్ధతుల్లో ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, బదిలీచేయడం చేస్తుంది. బ్యాంకులు విఫలం కాకూడదన్న సూత్రం ఆధారంగా 1961లో డిఐసిజిసి చట్టం తెచ్చారు. బలహీన పడిన ఆర్థిక

సంస్థలను ప్రభుత్వం ఆదుకోవడమే దీని లక్ష్యం. ఎఫ్ఆర్‌డిఐ బిల్లు ప్రకారం 'ఫైనాన్షియల్ రిజల్యూషన్ కార్పొరేషన్' అనే ఒక నూతన సంస్థ ఏర్పాటు అవుతుంది. బ్యాంకులు, భీమా కంపెనీలు ఇతర ఆర్థిక సంస్థల ఎత్తివేతకు సంబంధించిన విషయాలను ఈ కార్పొరేషన్ అజమాయిషి చేస్తుంది. ఈ అంశాలను ప్రస్తుతం అజమాయిషి చేస్తున్న రిజర్వు బ్యాంకు, ఇతర సంస్థల అధికారాలను ఎఫ్ఆర్‌డిఐ రద్దు చేస్తుంది.

ఇన్నాళ్లూ దివాళా తీసే బ్యాంకు ఆస్తులు, అప్పులు లెక్కగట్టి దామాషాలో పంచడం జరిగేది. కొత్త బిల్లు ద్వారా ప్రభుత్వమే ఓ కార్పొరేషన్‌ను స్థాపించి, నష్టాల పాలైన బ్యాంకు తాలూకు అన్ని ఆస్తిపాస్తులను కాపాడేందుకు పూనుకుంటుంది. నిజానికి బ్యాంకులకు నిరర్థక ఆస్తుల బెడద దాపురించక మునుపే ప్రభుత్వం జోక్యం చేసుకోవలసి ఉంటుంది. అలా జరిగినప్పుడు ప్రజాధనంతో బ్యాంకులను ఆదుకోవటమనే ప్రశ్న తలెత్తదు.

ఆర్థిక సుస్థిరత బోర్డులో సభ్యత్వం ఉన్న అనేక వర్థమాన దేశాలు ఇలా రుణ పరిష్కార వ్యవస్థలను ఏర్పాటు చేయడం లేదు. అలాంటివి ఏర్పాటు చేస్తే బ్యాంకులను నియంత్రించే రిజర్వు బ్యాంకు, బీమా నియంత్రణా వ్యవస్థ, సెబీ, పింఛన్ నిధి నియంత్రణ అభివృద్ధి సంస్థ లాంటివి ఎందుకూ కొరగాకుండా పోతాయి. ఆర్థిక సుస్థిరత కాపాడవలసిన చట్టబద్ధ బాధ్యత రిజర్వు బ్యాంకు మీద ఉంది. అందువల్ల రుణ పరిష్కార వ్యవస్థకు, రిజర్వు బ్యాంకుకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తే అవకాశమూ ఉంటుంది.

ప్రైవేట్ బ్యాంకులు మూసివేత పరిస్థితి వచ్చినప్పటికీ, ఏ ఒక్క బ్యాంకును మూసివేయలేదు. వాటిని ఇతర బ్యాంకులో విలీనం చేశారు. గత ఐదు దశాబ్దాల కాలంలో వైఫల్యం చెంది ఇతర బ్యాంకుల్లో విలీనం అయిన బ్యాంకులు – బ్యాంకు ఆఫ్ బీహార్, బెల్గామ్ బ్యాంకు, లక్ష్మీ కమర్షియల్ బ్యాంకు, మిరాజ్ స్టేట్ బ్యాంకు, హిందూస్థాన్ కమర్షియల్ బ్యాంకు, ట్రేడర్స్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ తమిళనాడు, బ్యాంకు ఆఫ్ తంజావూర్, పరూర్ సెంట్రల్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ కరాద్, కాశీనాథ్ స్టేట్ బ్యాంకు, బరేలి బ్యాంకు, సిక్కిం బ్యాంకు, బెనారస్ స్టేట్ బ్యాంకు, నెడుంగడి బ్యాంకు, గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు, యునైట్ వెస్ట్రన్ బ్యాంకు – తదితర బ్యాంకులు ఈ జాబితాలో కొన్ని ఈ బ్యాంకులన్నీ బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ కింద రక్షణ పొంది ఇతర బ్యాంకుల్లో విలీనం చేశారు.

రుణ బకాయిలు, నిరర్థక ఆస్తులు, రుణాలు, రద్దులు, రెవెన్యూ నష్టాలు, తద్వారా బ్యాంకులు నష్టాల్లోకి జారుకుంటున్న నేపథ్యంలో ప్రజలు అసలే తమ డిపాజిట్ల గురించి భయాందోళనలకు గురవుతున్న విపత్కర పరిస్థితుల్లో, ప్రజల సొమ్ము రక్షణకు భద్రత కల్పిస్తామని భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం ప్రజల పొదుపును కార్పొరేట్లకు కట్టబెట్టే నిర్ణయం, బ్యాంకుల మూసివేతకు అవకాశం కల్పించే ప్రస్తుత ఎఫ్ఆర్‌డిఐ బిల్లు తీసుకురావటానికి నిర్ణయించడం విచారకరం.

వాస్తవానికి ప్రజల సొమ్మును పాలకవర్గ తైనాతీలకు పెట్టుబడిగా సమకూర్చడమన్న కుట్ర 1969లోనే బ్యాంకుల జాతీయీకరణ పేరుతో మొదలైంది. ప్రపంచీకరణ సంస్కరణల ముసుగులో ఈ దేశం మీద రుద్దబడిన ఆర్థిక సరళీకరణ విధానాలతో అది విశ్వరూపం దాల్చింది.

బడా కార్పొరేట్ సంస్థల నుండి రావలసిన బాకీలను వసూలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. లక్షల కోట్ల రూపాయల రుణ ఎగవేతదార్లపై చర్యలు తీసుకొని, ఆ రుణాలను వసూలు చేసి బ్యాంకులను బలోపేతం చేయాల్సింది పోయి, ఐఎంఎఫ్ కోరికను తీర్చి సంతృప్తి పరచడానికి, 'ఫైనాన్షియల్ స్టెబిలిటి బోర్డ్' ఒత్తిడి నుండి బయటపడటానికి, ఈ బిల్లు తీసుకు వస్తున్నారు. వాస్తవానికి, బ్యాంకులు ప్రైవేటు పెట్టుబడిదార్ల చేతుల్లో ఉండి, క్రమబద్ధీకరణ విధి విధానాలు సరళీకరించబడి, ప్రభుత్వ అజమాయిషి ఏ మాత్రం లేని దేశాలలో తీసుకురావలసిన ఎఫ్ఆర్‌డిఐ వంటి బిల్లును బ్యాంకింగ్ వ్యవస్థ పునాదులు బలంగా గల భారతదేశంలో తీసుకురావటం అక్షేపణీయం. అమెరికా, పశ్చిమ దేశాలలో షేర్ హోల్డర్లు, పెట్టుబడిదార్ల సొమ్ముతో బ్యాంకులు నడుస్తున్నాయి. కాని భారతదేశంలో అలా కాక ప్రజలు కష్టార్జితం నుండి పొదుపు చేసుకున్న డిపాజిట్లతో బ్యాంకులు నడుస్తున్నాయి. కాబట్టి 'ప్రజాధనానికి రక్షణ' అన్నదే అత్యంత ప్రాధాన్యత గల అంశంగా ఉండాలి.

మొండి బకాయిలు పేరుకుపోవడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయి. ఈ అప్పులతో పెట్టుబడులు పెట్టి నడిపిన ప్రాజెక్టులు ముందు అనుకున్న విధంగా లాభాలు ఆర్జించలేకపోవడం మొదటి కారణం. అసలు ప్రాజెక్టు రూపకల్పన చేసినప్పుడే అది సవ్యమైంది కాదని, ఇచ్చిన అప్పు తిరిగి వచ్చే అవకాశాలు తక్కువ అని తెలిసినా వాటికి అప్పులివ్వడం రెండో కారణం. అలా అప్పులిచ్చేందుకు బ్యాంకులపై ప్రభుత్వాలు ఒత్తిడి తెస్తున్నాయి.

కొన్ని పెద్దపెద్ద ప్రైవేటు ఆర్థిక సంస్థల వంటివి తమకున్న రాజకీయ ప్రాబల్యాన్ని ఉపయోగించి బ్యాంకుల నుండి అప్పులు పొందుతాయి. వీటికి తీసుకున్న అప్పును తిరిగి చెల్లించాలనే ఉద్దేశం ముందు నుండే ఉండదు. మొండి బకాయిలు పేరుకుపోవడానికి మూడో కారణం. ప్రభుత్వరంగ బ్యాంకుల మీద రాజకీయ ఒత్తిడి ప్రయోగించి ప్రయివేటు కార్పొరేట్లు ఈ విధంగా అప్పుల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయి.

మన దేశ స్థూల దేశీయోత్పత్తిలో పొదుపు శాతం 1969లో 16 శాతం ఉండగా 1991 నాటికి అది 24 శాతానికి చేరింది. అలా క్రమక్రమంగా పెరుగుతూ ఒక దశలో 38 శాతానికి పెరిగినా గత ఆరు సంవత్సరాలుగా కొంత తగ్గుముఖం పట్టి ప్రస్తుతం 29 శాతానికి చేరుకుంది. అయినా ప్రపంచ సగటు అయిన 24 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువే అంటే ఒక రకంగా మన దేశపు విత్త వ్యవస్థలో పొదుపు పాత్ర క్రమేపీ పెరుగుతూనే ఉందన్నమాట. మరి ఆ పొదుపు కనక సరైన ఉత్పాదక రంగాల్లోకి మదుపుగా మారి ఉంటే బ్యాంకింగ్ రంగానికి ప్రస్తుత దీనావస్థ తప్పేది. నిజానికి జరిగిందేమిటంటే కేవలం కొందరు బడాబాబుల వ్యాపారావసరాల కోసం ఈ నిధులన్నీ మళ్లించడం... తద్వారా మొండి బకాయిలు నెత్తికెత్తుకోవడం మాత్రమే జరిగింది.

బెయిల్ ఇన్ నిబంధన ఏమిటి?

బ్యాంకులు దివాళా తీసే పరిస్థితుల్లో ఉపశమనం కలిగించేందుకు గాను ఎఫ్ఆర్‌డిఐ బిల్లులో సెక్షన్ 52(1) కింద బెయిల్ ఇన్ నిబంధన చేర్చారు. దీని ప్రకారం దివాళా అవస్థలో ఉన్న బ్యాంకులు తమ నష్టాన్ని పూడ్చుకొని నిర్దిష్ట కాలవ్యవధి దాకా లావాదేవీలు సాగించడానికి,

మార్కెట్‌లో తిరిగి విశ్వాసం సంపాదించుకోవడానికి వాటికి కొంత పెట్టుబడిని అందిస్తారు. ఆ పెట్టుబడి బెయిల్ ఇన్ పేరిట ఇస్తారు. అందులోని అంశాల ప్రకారం దివాళా అవస్థలో ఉన్న బ్యాంకుకు గల రుణాలన్నీ రద్దు చేయడానికి లేక రుణాల తరగతిని మార్చడానికి అవకాశం ఇస్తారు. ఆ రుణాల రద్దుకు గాను ఆ బ్యాంకులో ఉన్న ఖాతాదారుల సొమ్మును ఉపయోగించడం, డిపాజిట్ల కాల వ్యవధిని మార్చడం వంటివి చేయవచ్చు.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లు ద్వారా ఏర్పాటైన రిజల్యూషన్ కార్పొరేషన్ దివాళా అవస్థలో ఉన్న బ్యాంకుకు గల అప్పులు, ఆస్తులు తదితరాలన్నింటినీ మరో బలమైన ఆర్థిక సంస్థ లేదా బ్యాంకుకు బదలాయించి ఈ బ్యాంకును అందులో విలీనం చేస్తుంది. అంటే ఇందులోని డిపాజిటర్ల సొమ్ము అంతా వేరే బ్యాంకుకు బదిలీ అవుతుంది. మార్పులు చెందుతుంది. జాతీయ కంపెనీల చట్టం ట్రిబున్యల్ ద్వారా ఈ రద్దు లేదా లిక్విడేషన్ జరుగుతుంది.

అమెరికాలో ఏర్పడిన 2008 నాటి ఆర్థిక సంక్షోభం తర్వాత బెయిల్ ఇన్, బెయిల్ అవుట్ అనే పదాలు ఎక్కువగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఆ సంక్షోభం త్వరలోనే ప్రపంచ వ్యాప్తమైంది. ఆ సమయంలో అమెరికా ప్రభుత్వం బెయిల్ అవుట్ ప్రక్రియ ద్వారా తమ బ్యాంకుల్ని ఆర్థిక ఊబిలోంచి బయటికి తీసుకు వచ్చింది. వీటిని ఉద్దీపనలుగా పేర్కొన్నారు. ప్రభుత్వాలు ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును బ్యాంకుల ఉద్దీపనలకు ఇవ్వడాన్ని ప్రజలు అన్ని దేశాల్లోనూ నిరసించారు. ఎందుకంటే బెయిల్ అవుట్ ప్రక్రియలో బ్యాంకులకు, ఉద్దీపనా కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది. ప్రభుత్వ నిధులు అంటే ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలైన డబ్బే.

బెయిల్ ఇన్‌లో అయితే బ్యాంకుల్లో డిపాజిటర్లు, రుణదాతలు ఉద్దీపనా కార్యక్రమాల్లో ప్రధానపాత్ర పోషిస్తారు. అంటే డిపాజిటర్ల సొమ్మును బ్యాంకులు నష్టాలు పూడ్చుకోవడానికి దివాళా స్థితిలోంచి బయటకు తీసుకురావడానికి ఉపయోగిస్తాయి.

2002లో మనదేశంలో యుటిఐ సంస్థకు ప్రభుత్వం ఇలాగే ఉద్దీపనా కార్యక్రమం అమలు జరిపింది. అందుకోసం రు.14,510 కోట్లు ఇచ్చింది. ఇప్పటి పరిస్థితుల్లో మొండి బకాయిలు లక్షల కోట్లలో ఉండడం వల్ల ప్రస్తుతం బ్యాంకింగ్ రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం వద్ద చాలినన్ని డబ్బులు లేవు. కనుక ఆ భారాన్ని డిపాజిటర్ల మీదకి నెట్టుతుంది. అందుకే బెయిల్ ఇన్ ప్రక్రియ అమలు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసమే ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ప్రతిపాదించింది.

ప్రస్తుతం దేశంలోని ప్రభుత్వ రంగ, ప్రైవేటు, సహకార రంగ బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో దాదాపు 96 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. పొదుపు ఖాతాలు, ఎఫ్‌డి, బాండ్ల రూపంలో ఈ మొత్తం ఉంది. అయితే పలు కార్పొరేట్ సంస్థలతోపాటు బడా బాబులకు రుణాలుగా పెద్ద మొత్తంలో అప్పులుగా ఇవ్వగా వాటిలో తిరిగి చెల్లించకుండా ఉన్న మొండి బకాయిల విలువ రు.10 లక్షల కోట్ల వరకూ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

అయితే కేంద్రం తాజాగా తీసుకొచ్చే ఎఫ్ఆర్‌డిఐ బిల్లుతో ఒకవేళ బ్యాంకు పెద్దమొత్తాలిచ్చి నష్టపోయినట్లయితే బ్యాంకులో ఉన్న డిపాజిట్లు, పొదుపు ఖాతాల్లోని సొమ్మును వాడుకునే అధికారం వస్తుంది. ఈ విషయాన్ని సదరు ఖాతాదారునికి సమాచారం కూడా ఇవ్వాల్సిన పని ఉండదంటున్నారు. ఈ చట్టం వల్ల ప్రజల సొమ్ముకు భద్రత ప్రశ్నార్థకం కాగలదని, ఒక విధంగా దేశంలో ఆర్థిక ఎమర్జెన్సీని విధించినట్లే అవుతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు డిపాజిటర్లకు ఒక లక్ష రూపాయల వరకు 'డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్' (డీఐసీజీసీ) ద్వారా రక్షణ లేదా బీమా లభిస్తోంది. లక్షకు మించిన డిపాజిట్లను రక్షణ లేని (అన్‌సెక్యూర్డ్) డిపాజిట్లుగా పరిగణిస్తారు. బెయిల్ ఇన్‌లో డిపాజిటర్ల సొమ్మును ఉపయోగించాలని ప్రతిపాదిస్తున్నారు. అయితే ప్రజల నుంచి నిరసన, ఆందోళన వ్యక్తమవుతుండడంతో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ డిపాజిటర్ల ప్రయోజనాలు పరిరక్షిస్తామని ప్రకటించాడు. ఖాతాదార్ల (డిపాజిటర్ల) సొమ్ము ఎక్కడికి పోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే, బ్యాంకులు పుంజుకున్నాక మొదట డిపాజిటర్ల సొమ్మును పూడ్చిన తర్వాతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సొమ్మును పూడ్చుతామని చెబుతున్నారు.

ప్రజలు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్, సేవింగ్స్ చేస్తారు. ఈ డబ్బు ఇతరులకు ఇచ్చి బ్యాంకులు వడ్డీ వసూలు చేసుకుంటాయి. ఇతరులకు ఇచ్చే అప్పు పైన వచ్చే వడ్డీ బ్యాంకుకు ఆస్తి. కొన్ని సందర్భాలల్లో కంపెనీల్లో షేర్లు కూడా కొంటాయి. ఆ అప్పు గనక తిరిగి రాకపోతే అది నిరర్థక ఆస్తి అవుతుంది.

అలాంటి ఎన్నో నిరర్థక ఆస్తులు గుదిబండలా మారిన మన బ్యాంకులు ఒకవైపు, వాటినే తమ అప్పులుగా కలిగి ఉన్న రుణగ్రస్థ కంపెనీలు మరొకవైపు, జోడెద్దులా ఈ వ్యవస్థను పతనం వైపు తీసుకెళుతున్నాయి.

గతంలో కూడా బ్యాంకులకు బెయిల్ అవుట్ ద్వారా ప్రభుత్వం సాయం అందించింది. కానీ అప్పుడు డిపాజిటర్ల సొమ్ము భద్రంగా ఉండేది. అందుకే ప్రజలు ప్రభుత్వరంగ బ్యాంకులకే ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. కానీ బెయిల్ ఇన్ వల్ల అందుకు వ్యతిరేకంగా డిపాజిటర్ల సొమ్ము ముందుగా ఉపయోగిస్తారు. అందువల్ల ప్రజల సొమ్ముకు భద్రత లేకుండా పోతుంది. ఈబిల్లులో ఉన్న 'బెయిల్ ఇన్' నిబంధనపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రజల్లో నిరసన, ఆందోళన రేకెత్తింది. బ్యాంకుల పట్ల ప్రజలకు విశ్వాసం పోతోంది.

ఆందోళన ఎందుకు?

ఈ ఎఫ్ఆర్‌డిఐ బిల్లులో 'రిజల్యూషన్ కార్పొరేషన్' అనే వ్యవస్థ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. బ్యాంకులు దివాలా తీసే పరిస్థితి వస్తే అది వెంటనే రంగంలోకి దిగి బ్యాంకును స్వాధీనం చేసుకొని ఏడాదిలోగా సమస్య పరిష్కారానికి ఏర్పాట్లు చేస్తుంది. కానీ ఆ సంస్థ బ్యాంకును దివాళా స్థాయిలో నుంచి పైకి తేవడానికి కృషిచేస్తుంది గానీ డిపాజిటర్ల సొమ్ము రక్షణకు ప్రాధాన్యతనివ్వదని, దివాలా బ్యాంకులకు సహాయ పడడానికి ఈ మొత్తం వ్యవస్థ, చట్టం రూపొందిస్తున్నారని అర్థమవుతుంది. ఈ బిల్లు నిబంధనల ప్రకారం దివాలా బ్యాంకులు తన వద్దనున్న డిపాజిటర్ల సొమ్ముతో నష్టాలు / అప్పులూ తీర్చుకోవచ్చు.

అందుకు రిజల్యూషన్ కార్పొరేషన్ అనుమతి ఇస్తుంది. ఆ కార్పొరేషన్‌కు తిరుగులేని అధికారాలు బిల్లులో ప్రతిపాదించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ కాలవ్యవధిని ఖాతాదారుని అనుమతి లేకుండానే 20 ఏళ్లకు పొడిగించడం వంటి అధికారాలివ్వాలని బిల్లులో ప్రతిపాదించారు. అంటే మన డిపాజిట్ల కాలవ్యవధిని అది మార్చేయగలుగుతుంది. అందుకు డిపాజిటర్ల అనుమతి అవసరంలేదు. అంటే అవసరమున్నా మన సొమ్ము అది ఇచ్చేదాకా తీసుకోలేకపోతాం.

ప్రపంచీకరణ ఆర్థిక విధానాల అమలుతో పరిస్థితి మారింది. ఐడిబిఐ వంటి ప్రత్యేక ఆర్థిక సంస్థలు, వాటి కార్యకలాపాలు బాగా తగ్గిపోయాయి. నిజానికి ఐడిబిఐ కూడా ఒక సాధారణ వాణిజ్య బ్యాంకుగా మారిపోయింది. వాణిజ్య బ్యాంకులు దీర్ఘకాలిక రుణాలను ఇవ్వడం ప్రారంభించాయి. మొండి బకాయిలు పది లక్షల వరకు ఉన్నాయి. ఎఫ్ఆర్‌డిఐ బిల్లులో కంపెనీ ప్రమోటర్లను కూడా బిడ్డింగ్‌కు అనుమతించ డానికి వీలు కల్పిస్తోంది. అంటే సమస్య సృష్టించినవారే తిరిగి తమ ఆస్తులనే తక్కువ ధరకు వేలం పాటలో దక్కించుకొనేందుకు ఈ బిల్లు అవకాశం ఇస్తున్నది.

బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణాలు ఎగవేసినవారికి, అక్రమ మార్గాల్లో ఆస్తులను దాచుకొని దివాలా తీసినట్టుగా నటించేవారికి ఈ బిల్లు వరంగా మారనుంది. ఒకవైపు బ్యాంకుల్లో కష్టపడి దాచుకున్న ప్రజల సొమ్మును రుణంగా తీసుకుని ఎగవేయడమేగాక, మరోవైపు దివాళా తీసినట్టు ప్రకటించిన కంపెనీలను దొడ్డిదారిన తక్కువ మొత్తానికి దక్కించుకునేందుకు ఈ బిల్లు అవకాశం కల్పించనుంది. కాబట్టి ఉద్దేశ పూర్వకంగా బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టేవారిని ఇది కాపాడుతున్నదని స్పష్టమవుతోంది.

మరో నిబంధన ప్రకారం బ్యాంకు డిపాజిటర్ల కిచ్చిన హామీలన్నీ నెరవేర్చక్కర్లేదు కూడా. అంటే రు. 5 లక్షలు పైన దాచుకుంటే దాన్ని ఒక లక్ష రూపాయకు మార్చేయ్యవచ్చు. మిగిలిన దాన్ని తర్వాత ఎప్పుడో ఇవ్వచ్చు లేదా హామీతో సరిపెట్టుకోవచ్చు. ఇందుకు డిపాజిటర్ల అనుమతి అవసరం లేదు.

ప్రస్తుతం దేశంలో డిపాజిటర్ల సగటు డిపాజిట్ మొత్తం రు. 2.51 లక్షలనీ, కరెంట్ ఖాతాల్లో నిల్వలు, ఇతరాలు కూడా కలిపితే అది రు. 58,316 మాత్రమేనని కూడా ఆ పత్రం వెల్లడించింది. రు.15 లక్షల కన్న ఎక్కువ ఎఫ్‌డిలు, వగైరా ఉన్నవారు దేశంలో 1.3 శాతం మందే. మొత్తం డిపాజిట్లలో వీటి విలువ మాత్రం 55 శాతం. బ్యాంకు ఉద్యోగులు, అసోచామ్ వంటి కొన్ని సంస్థలు బెయిల్ ఇన్ నిబంధన తొలగించాలని కోరుతున్నాయి.

1961లో రెండు బ్యాంకులు దివాళా తీసినప్పుడు అప్పటి నెహ్రూ ప్రభుత్వం డిఐసిజిసిని ఏర్పాటు చేసింది. బ్యాంకు దివాళా తీస్తే డిపాజిటర్లకు లక్ష రూపాయల దాకా వారి సొమ్ములు తిరిగి ఇవ్వాలనే నిబంధన పెట్టింది. కొత్త బిల్లులో అది ఉండదు. దాని బదులు మరో నిబంధన పెడతామని ప్రభుత్వం అంటోంది. ఎంత మొత్తం తిరిగి ఇస్తారు అనే దాన్ని ప్రస్తావించడం లేదు. అందుకే ఈ బిల్లులో పలు మార్పులు చెయ్యాలనీ అప్పటిదాకా ఆమోదించడానికి వీలులేదని దేశవ్యాప్తంగా నిరసనలు వెలువడుతున్నాయి.

మన దేశంలో ఇప్పటిదాకా బెయిల్-ఇన్ అనేది లేదు. బ్యాంకు లేదా కంపెనీ దివాళా తీస్తే ప్రభుత్వమో లేక ఆర్‌బిఐ ఆదుకొని నిధులిచ్చి నిలబెట్టేవి. ఇప్పుడు ఆ భారం డిపాజిటర్ల మీద పడుతుంది. డిపాజిటర్ల సొమ్ముకు భద్రత కలిగించలేనప్పుడు దాన్ని బ్యాంకుల్లో పెట్టుకోవడం ఎందుకనీ, ఇళ్లలో ఇనపెట్టెల్లో దాచుకునే కాలానికి మళ్లీ వెనక్కి వెళ్లాల్సి వస్తుందనీ విమర్శలూ రేకెత్తుతున్నాయి.

ముగింపు

బ్యాంకులకు పెట్టుబడులు సమకూర్చాలంటే బడ్జెట్ నుండే నిధులు ఎందుకు మళ్లించాలి? దానికి బదులు ప్రభుత్వం ప్రత్యేక బాండ్లను విడుదల చేసి వాటిని హామీగా రిజర్వుబ్యాంకు దగ్గర ఉంచి రిజర్వు బ్యాంకును అదనపు కరెన్సీని విడుదల చేయమని ఆదేశించవచ్చు.

మరి ప్రభుత్వం ఆ పని ఎందుకు చేయడం లేదు? అంటే, నయా ఉదారవాద విధానాలు ఇటువంటి ప్రభుత్వ చొరవను ప్రతికూల అంశంగా పరిగణిస్తాయి. ఇటువంటి చర్యను ద్రవ్యలోటును పెంచడంగానే భావిస్తాయి. దాంతో భారతదేశ అంతర్జాతీయ పరపతి రేటింగు పడిపోతుంది. అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దృష్టిలో ప్రభుత్వరంగ బ్యాంకుల సొమ్మును కార్పొరేట్లు కొల్లగొట్టడమే సరైన ఆర్థిక విధానం అన్నమాట.

ఈ బెయిల్ ఇన్ పద్ధతిని 2010లో డెన్మార్క్ తర్వాత 2013లో సైప్రస్ దేశాలు ప్రవేశ పెట్టాయి. ఈ దేశాలు డిపాజిట్లలో కొంత మొత్తాన్ని ఈక్విటీగా మార్చి బ్యాంకు నష్టాలను పూడ్చారు. అయినా ఈ రెండు దేశాలు విపరీతమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి విదేశీ ద్రవ్య సంస్థల రుణాలకై ప్రాదేయపడుతున్నాయి.

మొత్తం మీద ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే ప్రజలు బ్యాంకుల్లో సొమ్ము దాచకుండా వెనక్కి తీసుకునే పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. మోడీ ప్రభుత్వం నిత్యం పన్ను ఎగవేతదారుల గురించి, నల్లడబ్బును వెలికి తీయడం గురించి, అవినీతిని అరికట్టడం గురించి మాట్లాడుతూనే ఉంటుంది. ఈ ప్రభుత్వానికి ఏమైనా చిత్తశుద్ధి ఉంటే అది కనీసం మూడు చర్యలు చేపట్టాలి.

మొదటిది అప్పులెగ్గొట్టిన బడాబాబుల పేర్లను బైట పెట్టాలి. రెండోది ఈ బకాయిలు కావాలనే చేసినవా లేక బకాయిదారులు నిజాయితీగా ప్రయత్నించినప్పటికీ బకాయి పడ్డారా అనేది తేల్చడానికి ఒక స్వతంత్ర విచారణ సంఘాన్ని నియమించాలి.

మూడోది బకాయిదారులు వేరే ఏ ఇతర కంపెనీలలోనైనా వాటాలు కలిగి ఉంటే వాటిని బకాయి కింద జమ కట్టుకునే వీలు కల్పించేలా చట్టాలను సవరించాలి. నిరంతరం కార్పొరేట్ల సేవలో మునిగి తరిస్తున్న బిజెపి ప్రభుత్వం నుండి ఇటువంటి చర్యలు ఆశించగలమా? అంటే సందేహమే.

పాలనా వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని రాజకీయాలకు కట్టబెట్టే ప్రజా వ్యతిరేక ఎఫ్ఆర్‌డిఐ బిల్లును చట్టం కాకుండా అడ్డుకోవడానికి, కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం తప్ప మరో మార్గం లేదు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

పద్మావతి సినిమాపై దుమారం

మతోన్మాద శక్తులు భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ అది ప్రకటించే వారిని బెదిరించడం, హత్య చేయడం వరకూ వెళ్తున్నారనీ, ఈ వివాదాలను రాజకీయ నాయకులు కూడా పెంచి పోషిస్తున్నారనీ అంటున్నారు **ఎం.కె. కుమార్**

దీపికా పదుకొనే ముఖ్యపాత్రలో నటించిన పద్మావతి చిత్రంపై బిజెపికి చెందిన రాజకీయ నాయకులు బాహాటంగా విమర్శిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఏకంగా పద్మావతి చిత్రాన్ని నిషేధించారు. పద్మావతి సినిమాపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సెన్సార్ బోర్డు నిర్ణయంపై ప్రభావం చూపింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) తొలుత సినిమా విడుదలను పెండింగ్‌లో పెట్టారు. విదేశాల్లో సైతం సినిమాను విడుదల చేయకుండా ఆపాలని, చిత్ర నిర్మాతలను ఆదేశించాలని సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తన తీర్పును 2017 నవంబర్ 28న విడుదల చేసింది. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఖన్విల్కర్, చంద్రచూడ్‌లు తీర్పిస్తూ తాజా పిటిషన్‌ను కొట్టివేసింది. ఉన్నతస్థాయి పదవుల్లో ఉన్న వ్యక్తులు పద్మావతి చిత్రానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడాన్ని మానుకోవాలని, సమ న్యాయపాలనను వారు అతిక్రమించకూడదని, సెన్సార్‌బోర్డు నిర్ణయంపై ప్రతికూల ప్రభావం చూపే విధంగా వ్యాఖ్యలు ఉంటున్నాయని సుప్రీం కోర్టు అభిప్రాయ పడింది. నిజానికి సిబిఎఫ్‌సి నిర్ణయాలను పర్యవేక్షించాలని న్యాయస్థానాల్లో చాలా సందర్భాల్లో వ్యాజ్యాలు నమోదయ్యాయి. బిజెపి నేతలు చేస్తున్న వ్యాఖ్యలు సిబిఎఫ్‌సి నిష్పాక్షికతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వివాదాల నేపథ్యంలో చిత్రం జనవరి 25న విడుదలైంది.

పద్మావతి దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ, ఇతర వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని, ఆ ప్రకారం సిబిఐని ఆదేశించాలని న్యాయవాది ఎంఎల్ శర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. శర్మ పేర్కొన్న అంశాలపై సుప్రీంకోర్టు ధర్మాసనం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆయన న్యాయస్థానం లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నాడు కాబట్టి, అతనిపై ఎలాంటి జరిమానా విధించడం లేదని చెపుతూనే అతన్ని కోర్టు మందలించింది. చిత్ర యూనిట్ తరుపున హరీశ్ సాల్వే, శ్యామ్ దివాన్‌లు కోర్టులో వాదించారు. తమాషాగా పార్లమెంటరీ కమిటీ ముందర చిత్ర దర్శకుడు హాజరు కావాలని కేంద్ర ప్రభుత్వం నుండి దర్శకుడికి ఆదేశా లందాయి. పార్లమెంటరీ కమిటీ చైర్మన్ అనురాగ్ ఠాకూర్, దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీని, సెన్సార్ బోర్డు చీఫ్ ప్రసూన్ జోషీని హాజరు కావాల్సిందిగా కోరినట్లు ప్రకటించారు. కోర్టు తీర్పులో స్పష్టత లేదని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ స్పష్టం చేశారు. వివాదాల నేపథ్యంలో చిత్రయూనిట్ వివరణ ఇవ్వాల్సిందేనని ఆయన అభిప్రాయ పడ్డారు.

రాజ్‌పుత్ వర్గీయుల వ్యతిరేకతతోనే పద్మావతి సినిమా చిక్కుల్లో ఇరుక్కుంది. సినిమాపై స్టేను సుప్రీంకోర్టు కొట్టేయడంతో రాజ్‌పుత్రులు వీధి పోరాటాలకు దిగి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వారికి ఉన్నత న్యాయస్థానంపై ఉన్న గౌరవం ఏపాటిదో తెలుస్తోంది. సుప్రీంకోర్టు కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైతం మందలించింది. మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు పద్మావతి సినిమాను నిషేధించాయి. రాణిపద్మావతి కథ ఆధారంగా తీసిన సినిమాలో చరిత్రను వక్రీకరించారని, రాణీ పద్మిని, అల్లావుద్దీన్ ఖిల్జీల మధ్య ప్రేమగీతాన్ని చిత్రీకరించడం తమని అవమానించడమేనని కర్ణిసేన నేతృత్వంలో రాజ్‌పుత్‌లు ఆందోళన చేస్తున్నారు. అంతేగాకుండా దర్శకుడు భన్సాలీని, పద్మావతి నాయకి దీపికా పదుకొనేను, ఆమె భర్త రతన్‌సింగ్‌గా నటించిన షాహీద్ కపూర్, అల్లావుద్దీన్ ఖిల్జీగా నటించిన రణ్‌వీర్‌సింగ్‌ను తాము చంపేస్తామని రాజ్‌పుత్రులు బాహాటంగా బెదిరించారు.

పద్మావతి చిత్ర వివాదంపై ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు స్పందించారు. మనుషులను చంపుతామని, చంపిన వారికి రివార్డులు ఇస్తామని ప్రకటించడం ప్రజాస్వామిక వ్యవస్థలో అంగీకరించకూడని అంశాలు. సినిమాను కళలో భాగంగా చూడాలి. కళలు దేశానికి అవసరమైనవి. మనోభావాలు దెబ్బతీశారని కొంతమంది ఆరోపిస్తున్నారు. నిరసలు చేస్తున్నారు. హింసాత్మక ధోరణిలో నిరసనలు ఉండకూడదని చెపుతూ, హరామ్ హవా, కిస్సా కుర్సీకా, ఆనంది చిత్రాల ప్రస్తావనను ఆయన తెచ్చారు. పద్మావతి సినిమాని నిషేధించాలని, లేకపోతే అందులో పాత్రధారుల్ని చంపేస్తామని హెచ్చరించిన కర్ణిసేనకు సవాలు విసురుతూ కొంతమంది జైపూర్ కోట గోడకు ఒక మృతదేహాన్ని వేలాడదీశారని ప్రచారం జరిగింది. మేం దిష్టిబొమ్మల్ని మాత్రమే వేలాడదీయమనే హెచ్చరిక బోర్డును మృతదేహం ప్రక్కన వేలాడదీశారు. నిజానికి పద్మావతి సినిమాతో ఈ మరణానికి సంబంధం లేదని మృతుడి సోదరుడు ప్రకటించాడు. పద్మావతి సినిమా వివాదాన్ని రాజకీయం చేయడమే గాకుండా, తద్వారా దేశంలో విద్వేషాలను రెచ్చగొట్టాలని ఒక వర్గం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కోట రాళ్లపై కఫీర్, అల్లా పదాలు రాయడంతో మత విద్వేషాలు రెచ్చగొట్టడానికే ఈ సంఘటనను ఉపయోగించుకో బోతున్నారని తెలుస్తోంది.

జైపూర్‌లోని సహర్‌గఢ్ కోట ప్రహరీ గోడకు చేతన్ కుమార్ సైనీ మృతదేహాన్ని వేలాడదీశారు. చేతన్ కుమార్ జైపూర్‌లోని శాస్త్రీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు. మృతుని సోదరుడు రామ్‌రతనీ సైనీ సంఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశాడు. దీనిపై రాజ్‌పుత్ కర్ణిసేన స్పందిస్తూ, తమని రెచ్చగొట్టడానికే ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కన్నా ముందే ఢిల్లీ హైకోర్టులో సినిమాను నిషేధించాలనే పిటిషన్ దాఖలైంది. దీన్ని ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది.

పద్మావతి సినిమా వివాదానికి సంబంధించి రెండు వర్గాలు తయారయ్యాయి. సినిమాను వ్యతిరేకించేవారు, మద్దతిచ్చేవారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలు, చిత్రీకరణ బాగాలేదని, స్త్రీని అవమానించే విధంగా ఉన్నాయని, అభ్యంతరకరం చెప్పే ప్రజాస్వామికవాదులు ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చిత్రయూనిట్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సినిమా విడుదలకు ఎటువంటి ఆటంకం కలగకుండా తమ రాష్ట్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. భావప్రకటనా స్వేచ్ఛను హరించడంలో భాగంగానే పద్మావతి సినిమాను నిషేధించాలని కొంతమంది కోరుతున్నారు.

వివాదాల నేపథ్యంలో, చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని ప్రముఖ సినీ నటి, టాక్ షో వ్యాఖ్యాత సిమి గేరేవాల్ మధ్యవర్తిత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్‌లో మహారాణి పద్మినీ దేవితో సిమి సమావేశమైంది. సినిమాలోని ఘూమర్ పాటలో పద్మావతి పాత్రధారి డాన్స్ చేయడాన్ని ఆమె వ్యతిరేకించింది. దీనిపై దర్శకుడు స్పందించాల్సి ఉంది.

సిబిఎఫ్‌సితో పాటు దేశంలో కొన్ని గ్రూపులు సెన్సార్ అంశాలను పరిశీలిస్తున్నాయి. వ్యక్తులు, సమాజం, సినిమాలు ఎలా ఉన్నాయో, ఎలా ఉండాలో వీరే దిశానిర్దేశం చేస్తుంటారు. సృజనాత్మకతను సినిమాలో స్పృశించేందుకు కొన్ని గ్రూపులు పర్మిషన్ అవసరమవడం ప్రజాస్వామ్య దేశంలో ఒక విడ్డూరం.

రాజస్థాన్‌లోని జైపూర్‌లో సినిమా సెట్‌ను, కొన్ని పరికరాలను కొంతమంది ధ్వంసం చేసి, చిత్ర యూనిట్‌పై చేయి చేసుకున్నారు. మూకలకు భయపడి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు షూటింగ్‌ను మార్చారు. అక్కడ సెట్‌కు నిప్పు పెట్టారు. అప్పటికీ దర్శకుడు భన్సాలీ పద్మావతి పాత్రను కించపరచే విధంగా సినిమా తీయలేదని, అల్లావుద్దీన్ ఖిల్జీ, పద్మావతి పాత్రలకు మధ్య అభ్యంతరకర సన్నివేశాలు లేవని మీడియాకు చెప్పారు. హీరోయిన్ పదుకొనే ముక్కుకోసినవారికి, దర్శకుడు భన్సాలీ తలతెచ్చిన వారికి రు.5 కోట్ల నజరానాను ప్రకటించారు.

పద్మావతి గాథ ఒక అభూతకల్పన. 1250లో బెంగాల్‌లోని బీర్‌భూం జిల్లాలో పుట్టి, 1316లో మరణించిన ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ రాజస్థాన్‌లోని చిత్తోర్ రాజ్యంపై దండెత్తాడు. రాణా రతన్‌సింగ్‌ను ఓడించాడు. రాజస్థాన్‌లో ఖిల్జీ రాజ్య పరిపాలన జరిగింది. దీనికి హంగులు, రంగులు అద్ది మాలిక్ మహమ్మద్ జయాసి అనే సూఫీ కవి 1540లో ఒక కావ్యం రాశాడు. ఆయనే పద్మావతి పాత్రను సృష్టించాడు. రాణా రతన్‌సింగ్ భార్య పద్మావతిగా రాసి కొన్ని కథనాలను చేర్చాడు. ఈ కావ్యాన్ని ఉర్దూ, పర్షియన్ భాషల్లో అనువదించారు. చరిత్రలో పద్మావతి పాత్ర లేనేలేదని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

బిజెపి అనుకూల హిందుత్వ శక్తులు రాజ్‌పుత్‌కు చెందిన కర్ణిసేన పద్మావతిని సృష్టించింది ఒక ముస్లిం కవి అనే విషయాన్ని ప్రస్తావించడం లేదు. కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ సైతం పద్మావతి చిత్రం ఆడకూడదని అంటున్నారు. ఇప్పటికే సుప్రీంకోర్టు పలుతీర్పులపై సృజనాత్మకతను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం, సెన్సార్ బోర్డు ఉండకూడదని పేర్కొంటోంది. భావప్రకటనా స్వేచ్ఛలో భాగంగా సినిమాలను చూడాల్సిన అవసరం ఉంది. కళాకారుడు తన కళను తనకు నచ్చిన రీతిలో ప్రదర్శించే వీలుండాలి.

పద్మావతి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిందనే కథనాలు వెలువడ్డాయి. రాజపుత్రులు స్త్రీలపై లైంగిక అణచివేతను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. రాజపుత్రులు స్త్రీల పాతివ్రత్యం, పురుషుడి ఆస్తిగా ఉన్నంతకాలమే ఉంటుందని చెప్పుకుంటారు. సతీసహగమనాన్ని గొప్పగా కీర్తించడం రాజపుత్రుల్లో ఎక్కువ జరిగింది. రాణి పవిత్రతకు భంగం వాటిల్లిందని, ఆ విధంగా పద్మావతిని చిత్రంలో చిత్రీకరించారని వారి ప్రధాన ఆరోపణ. దేశంలో లైంగిక హింస, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోని కర్ణిసేన ఒక అభూత పాత్ర శీలం పద్మావతి చిత్రంలో శంకించబడే విధంగా ఉందని భావించి దేశంలో హింసను రాజేయడానికి పన్నాగాలు చేస్తోంది. సతీసహగమనానికి సాక్షిగా భార్యలు, తమ భర్తల చితిలో కాల్చివేసిన ప్రాంతాల్లో 100కి పైగా ఆలయాలు వెలిశాయి. పద్మావతిని తన పతి చితిలో తోయలేదని కర్ణిసేన బాధపడుతోంది. ఆస్తిపై స్త్రీకి హక్కు లేకుండా చేసి, ముఖ్యంగా భర్త చనిపోయిన తర్వాత, అతని ఆస్తిని భార్యకు దక్కకుండా చేసి ఆమెను చితిలో చంపే ఫ్యూడల్ పైశాచికత్వానికి పరాకాష్టకు రాజ్‌పుత్రుల నిరసన చేరింది. ఆశ్చర్యంగా హిందూ యువతులు అందంగా, ధైర్యంగా ఉంటారని అందుకే వారు పెద్దవాళ్లైతే ముస్లింలు లవ్ జిహాదీ పేరుతో పెళ్లిచేసుకునే ప్రమాదముందని ప్రచారం ఉంది. అందుకే హిందూ మతంలో బాల్య వివాహాలు వచ్చాయనే వదంతులు ఉన్నాయి. ఆ విధంగా ముస్లింలను క్రూరంగా చూపించే ప్రయత్నం జరుగుతోంది.

రామాయణం, భారతాలు అనేకం ఉన్నాయి. అలాగే పద్మావతికి సంబంధించి అనేక కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. బెంగాల్, మయన్మార్‌లలో జానపద గాథలు పద్మావతిపై అనేకం ఉన్నాయి. పద్మావతి రాజ్‌పుత్రి కాదని చెప్పే గాథలు చాలా ఉన్నాయి. పద్మావతి చిత్రం కోసం కాంగ్రెస్ పార్టీలోను చీలికలొచ్చాయి. కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాష్ట్రంలో పద్మావతిని ఆడనిస్తామని చెప్పారు. అదే కాంగ్రెస్ పాలిత పంజాబ్ రాష్ట్రంలో సిఎం అమరీందర్ సింగ్ పద్మావతి సినిమాను ఆడనివ్వబోమని అన్నారు. మరోవైపు పటియాలా రాజ కుటుంబానికి చెందిన అమరీందర్ సింగ్ కర్ణాటక ముఖ్యమంత్రి వాదనను ఖండించారు.

అభివృద్ధిని అడ్డుకునే శక్తులు, ఒక మతాన్ని దాని అన్ని చెడు లక్షణా లతో వ్యాపింపజేసే శక్తులు రాజ్యాధికారాన్ని పొందాయి. వీరి తిరోగమన భావజాలం పద్మావతి సినిమా వివాదంలో ప్రభుత్వం స్పందించిన తీరులో తెలుస్తుంది. సినీ పరిశ్రమను శాసించే విధంగా హిందుత్వ శక్తులు తయారవుతున్నాయి. 180 కోట్లతో నిర్మించిన పద్మావతి పక్తు కమర్షియల్ సినిమా. రతన్‌సింగ్, పద్మావతి ప్రేమగాథను తెరకెక్కించిన భన్సాలీ వివాదాలను ఎదుర్కోవడానికి సిద్ధంగానే ఉన్నాడు. రతన్‌సేన్ మొదట నాగమతిని వివాహం చేసుకున్నాడు. తర్వాత చిత్తూరు (రాజస్థాన్ లోని చితోడ్‌గఢ్ రాజ్యం) రాణి పద్మావతిని పెళ్లిచేసుకున్నాడు. రతన్‌సేన రాజ్యంలోని రాఘవ చేతన్‌ను కొన్ని కారణాల వల్ల రాజ్యం నుండి పంపిస్తారు. ఇతను ఢిల్లీ రాజు ఖిల్జీ పంచన చేరి పద్మావతి మహా అందగత్తె అని ఆశ చూపిస్తాడు. 1303లో ఖిల్జీ రతనసేన్ రాజ్యాన్ని ఓడిస్తాడు. పద్మావతి ఖిల్జీకి లొంగక ప్రాణాలు తీసుకుంటుంది.

రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో పద్మావతికి గుడి కట్టి దేవతగా ఆరాధిస్తారు. సతీసహగమనం చేసిన మహా పతివ్రతగా ఆమెను కీర్తిస్తారు. 'శ్రీరాజపుత్రకర్ణి సేన' పద్మావతి సినిమాపై దాడి ఇందులో భాగంగానే చేసిందని హిందుత్వ నాయకులు పేర్కొంటున్నారు. లోకేంద్ర సింగ్ కర్వాన్

జనగణమన వివాదం

***సినిమా హాళ్లలో జాతీయ గీతాలాపన వివాదం ఇప్పటిది కాదనీ, దేశభక్తి పేరుతో ప్రజలను మతం, జాతిగా విభజించి, ఉద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందడానికి చేసే ప్రయత్నంలో భాగమేననీ అంటున్నారు* అరణ్య**

సినిమా హాళ్లలో జాతీయ గీతాలాపన తప్పనిసరికాదంటూ సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. దేశవ్యాప్తంగా చిత్రప్రదర్శనలకు ముందు జాతీయగీతాన్ని తప్పనిసరిగా వినిపించాల్సిందేనని సినిమా థియేటర్లను 2016 నవంబర్ 30న ఆదేశించిన తీర్పును సుప్రీంకోర్టు పాక్షికంగా వెనక్కి తీసుకుంది. ఏడాదికి పైబడి, ఇంకా చెప్పాలంటే రాజకీయంగా బలపడుతున్న, బలపడ్డ నాటి నుంచీ బిజెపి, సంఘ్‌పరివార్‌లు జనగణమనను అడ్డుపెట్టుకుని చేస్తున్న సాంస్కృతిక, భౌతిక, మానసిక దాడుల నేపథ్యం నేటికి ఉచ్ఛదశకు చేరుకున్నది. ఈ కోర్టు తీర్పు పూర్తిగా కాకున్నా ప్రజలకు కొంతనైనా ఊరట కలిగిస్తుందని కొందరు భావిస్తుండగా సంఘ్‌పరివార్ సంస్థల గురించి తెలిసిన వారు మాత్రం కోర్టు తీర్పుల మీద గౌరవంలేని సంస్థలుగా అవి మరిన్ని దాడులకు పాల్పడే అవకాశమే ఉందని భావిస్తున్నారు.

గత రెండేళ్లనుంచి సినిమా థియేటర్ల కేంద్రంగా వివాదం కొనసాగుతున్నది. కానీ జనగణమన చరిత్రకు సంబంధించి, పాడడానికి సంబంధించిన వివాదాలు, వాటికి కోర్టులు ఇచ్చిన తీర్పుల చరిత్ర కొత్తదేమీ కాదు. ఆ మాటకొస్తే ఈ గీతానికి సంబంధించిన ఇతర వివాదాలు కూడా అనేకం ఉన్నాయి. జాతీయ చిహ్నాలు, ప్రతీకలకు సంబంధించి జనగణమన గీతం మిగతా వాటి కంటే ఎక్కువసార్లు వివాదాలకు గురైంది.

భారత భాగ్య విధాతా అనే శీర్షికతో రవీంద్రనాథ్ ఠాగోర్ 1911లో గాఢ సంస్కృతం కలగలిపిన తత్సమ లేదా సాధు బెంగాలి భాషలో రాసిన ఈ గీతాన్ని అదే సంవత్సరం డిసెంబర్ 27న జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ కలకత్తా వార్షిక సెషన్ సమావేశంలో మొదటిసారి ఆలపించారు. మొత్తం ఐదు చరణాల గీతమిది. తర్వాత బ్రహ్మ సమాజ్ వాళ్ల అధికార పత్రిక తత్వబోధినిలో భారత-విధాత పేరుతో అచ్చయి ప్రజల ముందుకు వచ్చింది. అప్పుడా పత్రికకు ఠాగోరే ఎడిటర్. అప్పుడే మొదటిసారి ఈ గీతంపై వివాదం మొదలైంది. ఈ గీతం బ్రిటిష్ రాజరిక వ్యవస్థను కీర్తిస్తూ రాసిందనే విమర్శ తలెత్తింది.

1905లో బెంగాల్‌ను తూర్పు, పశ్చిమ బెంగాల్‌లుగా విభజిస్తూ కర్జన్ చేసిన పనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వందేమాతర ఉద్యమం ప్రారంభం కాగా వెనక్కి తగ్గిన బ్రిటిష్ ప్రభుత్వం ఆ విభజనను రద్దు పరచి మళ్లీ బెంగాల్‌ను ఒకటిగా చేసేందుకు 5వ జార్జ్ ప్రభువును భారతదేశానికి పంపింది. బెంగాల్‌ను ఒకటిగా చేసే మంచి పనికి వస్తున్నందుకు అతన్ని స్తుతిస్తూ ఠాగోర్ రాసిన గీతమే జనగణమన అనేది ఆ విమర్శలోని ప్రధానాంశం.

ఆ గీతంలోని మొదటి చరణంలోని అధినాయక, భాగ్యవిధాత, తవ శుభ నామే జాగే, తవ ఆశిష మాగే తవ జయగాథా, మంగళధాయక వంటివేకాక తర్వాత చరణాలలోని పదాలన్నీ జార్జ్-5ను గురించి వాడినవేనని విమర్శకుల అభిప్రాయం. జార్జ్-5 భారతదేశానికి వచ్చిన డిసెంబర్ 27 రోజుననే కలకత్తాలో మొదటిసారి ఈ గీతాన్ని పాడడం ఆ విమర్శలను బలపరచింది. పులిన్ బిహారి సేన్‌కు రాసిన లేఖలో ఠాగోర్ ఈ విమర్శలను ఖండించినా దేశ స్వాతంత్ర్యం వరకూ అవి సజీవంగా ఉంటూనే వచ్చాయి. ఈనాటికీ ఈ విషయమై తరచూ వాదోపవాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. బ్రిటిష్ వారిచ్చిన 'సర్' బిరుదునే త్యజించిన ఠాగోర్ ఒక బ్రిటిష్ వ్యక్తిని పొగుడుతూ ఎలా రాస్తాడని ఠాగోర్‌ను సమర్థించేవాళ్లు వాదిస్తూ వచ్చారు.

స్వాతంత్ర్యానంతరం 1950 జనవరి 24న భారత రాజ్యాంగంపై సంతకం చేసే సమయంలో రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

కర్ణిసేనకు వ్యవస్థాపకుడుగా ఉన్నాడు. దీనికి బిజెపి అనుబంధ సంస్థల మద్దతు ఉంది. సినిమాలోని ఒక పాటలో ఖిల్జీ, పద్మావతి మధ్య ప్రేమాయణం జరిగినట్టు పాట ఉందని, దాన్ని మేం ఖండిస్తున్నామని సదరు సేన చెపుతోంది. ఖిల్జీ ముస్లిం పాలకుడని, అతను పద్మావతిని చూడడం, ఆమెను కావాలనుకోవడం తప్పని, పద్మావతి పాటలో ఖిల్జీతో ఉన్న సన్నివేశాలు అభ్యంతరకరంగా ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. బిజెపి హిందుత్వ సంస్థలు చరిత్రను వక్రీకరిస్తాయి. శివాజీ, రాణా ప్రతాప్ గురించి, పటేల్, అంబేద్కర్, గాంధీ గురించి ఇప్పటికే వారు అనేక వక్రీకరణలకు పాల్పడ్డారు. 16 రాష్ట్రాలలో బిజెపి పరిపాలనలో ఉండడం వల్ల హిందుత్వ మత భావజాలాన్ని వ్యాప్తి చేసే పనిలో ఉన్నారు.

భావప్రకటనా స్వేచ్ఛను హరించడానికి బిజెపి కంకణం కట్టుకుంది. గతంలో విశ్వరూపం, హేరామ్, జోధా అక్బర్ లాంటి చిత్రాలపై అనవసర దుమారాన్ని లేపారు. అలాగే హేతువాదాన్ని పాటించే కల్బుర్గి, గౌరీ లంకేశ్‌లను చంపేశారు. స్త్రీ స్వేచ్ఛకు ప్రాధాన్యతనిచ్చిన రచయిత పెరుమాళ్‌ను మానసికంగా చంపుతున్నారు.

సృజనాత్మకతను పెంచే విధంగా కళకు మతం, రంగు, కులం అంటించకూడదు. విమర్శను ఆహ్వానించ వలసిందే. అయితే విమర్శ సృజనాత్మకతను పెంచే విధంగా ఉండాలి కాని, చంపే విధంగా ఉండకూడదు. పద్మావతి సినిమా వ్యతిరేకంగా జరుగుతున్న వివాదాలకు కేంద్ర ప్రభుత్వం ఆజ్యం పోయడం మాని సినిమాను స్వేచ్ఛాయుత వాతావరణంలో ఆడే విధంగా చర్యలు తీసుకోవాలి.

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

జనగణమనను జాతీయగీతంగా, వందేమాతరంను జాతీయగేయంగా అధికారికంగా ప్రకటించాడు. వందేమాతరాన్ని జనగణమనతో సమానం గా గౌరవించాలని, జాతీయగీతంలోని పదాలను అవసరమైతే మార్చుకో వచ్చునేది ఆ ప్రకటనలోని ముఖ్యాంశం. అయితే ఈ మౌఖిక ప్రకటన మినహా భారత రాజ్యాంగంలో జాతీయగీత ప్రస్తావన ఎక్కడాలేదు.

ఆ తర్వాత 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 51 (ఎ) చేర్చబడి, అందులో జాతీయగీతాన్ని గౌరవించాలంటూ ప్రజలకు చేసిన విజ్ఞప్తి కనిపిస్తుంది. 'ప్రతి పౌరుడు రాజ్యాంగానికి కట్టుబడి ఉంటూ జాతీయపతాకం, గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి' అని ఉంది. అయితే ఇది ప్రాథమిక హక్కుల్లో కాకుండా ప్రాథమిక విధుల్లో చేర్చబడింది. అంటే ఈ ప్రాథమిక విధిని ఉల్లంఘించినా కోర్టులలో సవాలు చేసి శిక్ష వేయమని కోరే అవకాశం లేదు. అంతేగాని భారత రాజ్యాంగంలో మాత్రం ఎక్కడా జాతీయగీతం గురించి గానీ, పతాకం గురించి గానీ పేర్కొనలేదు.

అప్పటికి దాదాపు 400 సంవత్సరాలు పరాయి పాలనలో మగ్గిన భారతదేశ ప్రజలకు జాతీయభావ రూపం గురించైనా బహుశా ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని గానీ లేదా అవి దేశప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలు కనుక వాటికి ఒక ప్రత్యేక పద్ధతి, ప్రత్యేక శాసనం వంటివి అవసరం లేదని గానీ లేదా దేశానికి సార్వభౌమత్వం అనే లక్షణం దేశ ప్రజల నుంచి వస్తుంది గానీ ప్రతీకల నుంచి రాదని గానీ లేదా వాటిని సముచితంగా గౌరవించడం, గౌరవించకపోవడం అనేది ప్రజల ఇష్టాఇష్టాలకే వదిలేయాలని, అందుకే రాజ్యాంగంలో ప్రత్యేకంగా పొందుపరచనవసరంలేదని రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయమై ఉండవచ్చు.

ఇక్కడ మరో వివాదమేమిటంటే ఇంత ప్రాముఖ్యతగల జాతీయ గీతం ప్రస్తావన రాజ్యాంగం చేయలేదంటే దానికి రాజ్యాంగబద్ధత లేదని, కాబట్టి దాని విషయమై తప్పనిసరి మార్గదర్శనాలు, నియమాలు రూపొందించడం రాజ్యాంగపరంగా, న్యాయపరంగా వీలుకాదని కొందరంటే, ప్రజలంతా స్వాతంత్ర్య స్ఫూర్తితో ఆ గీతాన్ని గౌరవిస్తారని రాజ్యాంగ నిర్మాతలు భావించి ప్రత్యేకంగా రాజ్యాంగంలో పేర్కొనలేదని, కానీ మారిన పరిస్థితుల దృష్ట్యా కఠిన నిబంధనలు రూపొందించి జాతీయగీతానికి గౌరవం కల్పించేలా చేయాలని కొందరు వాదించారు.

ఇక ఆ తర్వాత జనగణమన జాతీయగీతంగా గుర్తింపు పొందింది. ప్రభుత్వం తరపున హోంశాఖ జాతీయ గీతం నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. దాన్ని సవ్యంగా సక్రమంగా ఆలపించే చర్యలు చేపడుతూ వచ్చింది. తర్వాత 1962లో జరిగిన ఇండో-చైనా యుద్ధంలో మనదేశం ఓడిపోయాక ప్రజలలో దేశభక్తి భావం పెంపొందించేందుకు అధికార వర్గాలచే వివిధ ప్రణాళికలు సూచించబడ్డాయి. చివరకు 1965 ఇండో-పాక్ యుద్ధం తర్వాత దేశవ్యాప్తంగా సినిమా హాళ్లలో సినిమా ముగిసాక జాతీయగీతాన్ని ప్రదర్శించాలనే నిర్ణయాన్ని తీసుకున్నారు. మొదట్లో కలకత్తాలోని గ్రామోఫోన్ ఫ్యాక్టరీలో రికార్డింగ్‌లు ప్రింట్ చేయించి దేశం మొత్తం మీది సినిమాహాళ్ల యాజమాన్యాలకు, ఆపరేటర్లకు పంపేవారు. తర్వాత ఒక నిమిషం నిడివిగల చిత్రాన్ని తయారుచేశారు. జెండాగద్దెపై నిల్చున్న రెపరెపలాడే మూడురంగుల జెండా బ్లాక్ అండ్ వైట్ చిత్రం ప్రదర్శించబడుతూ వెనకనుండి జాతీయగీతం వినిపించేది. మొదట్లో జాతీయగీతం వినిపించగానే ప్రజలు లేచి నిల్చునేవాళ్లు. కానీ తర్వాత రోజుల్లో ప్రజల్లో యుద్ధ ప్రభావ భావన తగ్గిపోవడంతో ప్రేక్షకులు సినిమా ముగిసిన వెంటనే జాతీయగీతం ప్రదర్శించబడుతున్నా బైటకు వెళ్లిపోవడం, ఇంటికి పోయే హడావిడిలో తోసుకుంటూ వెళ్లడం జరుగుతూ వచ్చింది. ఇక్కడే ఈ సందర్భం మరో వివాదానికి కారణమైంది. జాతీయగీతం ప్రదర్శించబడుతున్నపుడు పట్టించుకోకుండా వెళ్లిపోవడం అంటే దేశం పట్ల ప్రేమ, అభిమానం లేనట్లే అని కొందరంటే సినిమా హాళ్లలో జాతీయగీతాన్ని వినక, చూడకపోయినంత మాత్రాన దేశం మీద ప్రేమ లేనట్లేనా? అని కొందరు ప్రశ్నించారు. ఆ సమయంలో వెళ్లిపోవడం అనేది శూన్య సంస్కారస్థాయి అని మొదటివర్గం వాళ్లంటే వ్యక్తి సంస్కార స్థాయిని థియేటర్లలో ప్రవర్తన స్థాయికి కుదించడమేమిటని రెండోవర్గం వాళ్లు అన్నారు. మొత్తంగా ఈ వెళ్లిపోవడం ఎక్కువైన పరిస్థితుల్లో 1975 నుంచి సినిమా హాళ్లలో జాతీయగీత ప్రదర్శనను నిలిపివేశారు.

ఈ మధ్యకాలంలోనే 1968-70 మధ్యలో జాతీయగీతానికి గౌరవం ఇవ్వలేదని పోలీసులు కొందరిని అరెస్టు చేశారు. భీవండి అల్లర్లపై వేసిన జస్టిస్ మాడన్ కమిషన్ ముందు కొందరు సాక్ష్యమిస్తూ ముస్లింలే జాతీయ చిహ్నాల పట్ల అగౌరవం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. దాంతో ప్రభుత్వం పరిస్థితిని చక్కదిద్దేందుకు నిబంధనలు రూపొందించేందుకు, జాతీయ చిహ్నాల గౌరవం కాపాడేందుకు జాతీయ అస్తిత్వ విరోధ నిరోధక చట్టం (ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్ ఆక్ట్) - 1971ని రూపొందించింది (ఆ తర్వాత ఇది 2005లో సవరించబడింది). ఈ చట్టం కూడా జాతీయగీతం ఆలపిస్తున్నపుడు లేదా వినిపిస్తున్నపుడు ఎలా ఉండాలి? ఏం చేయాలి? ఎలా పాడాలి? అనే విషయాలను చర్చించలేదు. అయితే 'జాతీయగీతం ఆలపిస్తున్నపుడు లేదా వినిపిస్తున్నపుడు దాన్ని ఉద్దేశపూర్వకంగా ఆపడానికి ప్రయత్నించినా, ఆ సమయంలో అల్లర్లు, ఆటంకాలు సృష్టించడానికి ప్రయత్నించినా మూడేళ్ల వరకూ శిక్షగానీ, జరిమానా గానీ లేదా రెండు గానీ విధించవచ్చని' ఆ చట్టం చెప్తుంది.

1980లలో దేశంలో ఆర్ఎస్ఎస్, భారతీయ జనతా పార్టీ, వాటి అనుబంధ సంఘాలు వాటి ప్రాబల్యం పెంచుకోవడం కోసం సంకుచిత ప్రమాదకర జాతీయవాదాన్ని, మతవాదాన్ని ప్రోత్సహిస్తూ, పెంచుతూ వచ్చాయి. మతఛాందసవాదంతో దేశ ప్రజలను మతపరంగా విభజిస్తూ ఉన్మాద రాజకీయాలను పెంచాయి. వాటికి బాబ్రి మసీదు విధ్వంసం పరాకాష్ట. అవి వ్యాప్తి చేసిన అబద్ధపు దుర్మార్గ భావజాలంలో ప్రధానమైనది - మతం, జాతీయత వేరుకాదని ప్రచారం చేయడం. భారతదేశంలో జాతీయత అంటే హిందుమతాన్ని అనుసరించడమే. దేశభక్తి అంటే హిందుమత విశ్వాసాల పట్ల భక్తి ఉండడమే. ఎందుకంటే ఈ దేశం హిందువులది. హిందువులు కాని ఇతర మతస్థులెవరికీ దేశభక్తి ఉండదు. కనుక దేశభక్తి అంటే ఏమిటి? ఏ పనులు చేస్తే దేశభక్తి? ఏవి చేస్తే దేశద్రోహం? అనేవి హిందుమత ప్రతినిధిగా ఆర్ఎస్ఎస్ బిజెపిలే నిర్ణయిస్తాయి. - ఇవీ ఆ సంస్థల ఆలోచనలు. వాటిని విస్తృతంగా ప్రచారం చేసి మతపరంగా ప్రజలను రెచ్చగొట్టడం ప్రారంభించాయి.

ఈ క్రమంలో జాతీయతకు ప్రతీకలయిన జాతీయగీతం, పతాకం హిందూ దేశ చిహ్నాలని, వాటిని ముస్లిం దేశమైన పాకిస్తాన్, ఆ దేశం మీద ప్రేమతో ఉండే ముస్లింలు గౌరవించరని, అట్లా నటిస్తుంటారనే ద్వేష బీజాలు నాటాయి. అట్లా ఈ దేశంలో జాతీయగీతం, పతాకాల విషయంలో వాటికి తామే బ్రాండ్ ఐకాన్‌లమని, వాటి విషయంలో తాము చెప్పిందే దేశభక్తి అవుతుందని అవి తమకుతాము ప్రకటించు కున్నాయి. ఆ తర్వాత కాలంలో ఈ మత విషబీజాలు బలపడి దేశంలో హిందూ–ముస్లిం ఘర్షణలకు ఈ జాతిభావనను ఆక్రమించిన మతవాదం కారణమైంది.

1986లో బిజో ఎమాన్యుయల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు ఒక తీర్పు ఇచ్చింది. బిజో, బినుమోల్, బిందు ఎమాన్యుయల్ అనే ముగ్గురు క్రైస్తవ విద్యార్థులు రోజూ పాఠశాలకు వెళ్లి ప్రార్థనలో కూడా పాల్గొంటారు. అయితే ప్రార్థనలో జనగణమన పాడే సమయంలో గౌరవసూచకంగా నిల్చుంటారు కానీ ఆలపించరు. అందులో ఉండే దైవానికి సంబంధించిన వాక్యాలు తమ క్రైస్తవమత సాంప్రదాయానికి వ్యతిరేకం కనుక ఆ అభ్యంతరంతో వాళ్లు ఆలపించకపోయేవాళ్లు. ఆ పాఠశాలలోనే వాళ్ల కంటే ముందు చదివిన వాళ్ల అక్కలు కూడా అలాగే చేసేవాళ్లు. కానీ ఎవరూ గమనించలేదు. 1985 జూలైలో ఒకాయన ఈ విషయాన్ని గుర్తించాడు. ఆ తర్వాత ఆయన ఎం.ఎల్.ఎ. అయ్యాడు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాడు. దాంతో కేరళ ప్రభుత్వం దీనిపై ఒక కమిషన్ వేసింది.

నిజానికి ఈ పిల్లలు జాతీయగీతాన్ని పాడకపోయినా గౌరవసూచకం గా నిలబడేవారు. ఆ సమయంలో ఎలాంటి అల్లరి, చప్పుడు చేయకుండా నిశ్శబ్దంగా ఉండేవాళ్లు. అయినా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈ ముగ్గురిని పాఠశాల నుంచి బహిష్కరించింది. పిల్లల తండ్రి ఎంత వేడుకున్నా లాభం లేకపోయేసరికి వాళ్లు హైకోర్టులో రిట్ వేశారు. హైకోర్టు రెండుసార్లు వాళ్ల అభ్యర్థనను తిరస్కరించింది. దాంతో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు.

ఈ కేసులో తీర్పునిస్తూ సుప్రీంకోర్టు 'జాతీయగీతం వస్తున్నపుడు లేదా ఆలపిస్తున్నపుడు తప్పనిసరిగా లేచినిలబడాలని లేదా కలసి పాడాలని చెప్పడానికి చట్టపరంగా నిబంధనేదీ లేదు. అట్లా చేయకపోయినా జాతీయ గీతాన్ని అగౌరవపరచినట్లేమీ కాదు. దాన్ని గౌరవించడం అనేది స్వచ్ఛందంగా నిర్వర్తించాల్సిన విధి' అని స్పష్టం చేసింది. అదే విధంగా ప్రాథమిక హక్కుల్లోని ఆర్టికల్ 19(1)(ఎ) అయిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛలో నిశ్శబ్దంగా ఉండడం కూడా ఒక భాగమని, అలాగే ఆర్టికల్ 25 ప్రకారం మనసుకు నచ్చింది చేసే హక్కు ఉంది. కనుక ఈ రెండింటిని పరిగణనలోకి తీసుకుంటే ఆ పిల్లలది తప్పుకాదని చెప్పింది. అలాగే గీతాలాపన సమయంలో నిల్చున్నారు కనుక అది గౌరవించడమే అవుతుందని చెప్తూ ఆ పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్చుకోమని ఆదేశించింది. కాబట్టి జాతీయగీతం వినిపిస్తున్నపుడు అల్లర్లు, గందరగోళం సృష్టించకుండా ఇతరుల మనోభావాలను గాయపరచకుండా కేవలం నిలబడకపోవడం, పాడక పోవడం అనే కారణాలరీత్యానే అది నేరంగా, శిక్షార్హంగా పరిగణించ బడదనేది ఈ కేసు తీర్పు ద్వారా తెలుస్తుంది. ఈ కేసుకు ముందు, తర్వాత జాతీయగీతం విషయమై ఎన్నో కేసులు వివిధ కోర్టులలో నడిచిననూ ఈ కేసు చాలా ప్రాధాన్యత గల కేసుగా ఇప్పటికీ ఈ తీర్పు అనేక సందర్భాలలో ఉటంకించబడుతూ వస్తున్నది.

ఇక 1990లలో దేశవ్యాప్తంగా భారీ థియేటర్లు, మల్టిప్లెక్స్‌లు ఏర్పడ్డాయి. ముఖ్యంగా నగరాలలో, పెద్ద పట్టణాలలో వీటి సంఖ్య విపరీతంగా పెరిగింది. ఈ సందర్భంగా ఆ థియేటర్లు, మల్టిప్లెక్స్‌లలో జాతీయగీత ప్రదర్శనను పునరుద్ధరించాలని మరోసారి చర్చ ప్రారంభమైంది. దీనికి కొనసాగింపుగా 2003లో మహారాష్ట్ర డిప్యూటీ సిఎం చగన్‌భుజ్‌బల్ ప్రతిపాదనతో సినిమా హాళ్లలో సినిమా ప్రారంభానికి ముందు జాతీయగీతం ప్రదర్శించాలని మహారాష్ట్ర శాసనసభ నిర్ణయం తీసుకుంది. ఆ సమయంలో ఎవ్వరూ థియేటర్ వదిలి బయటకు వెళ్లరాదని ఆ ప్రభుత్వం ఆదేశాలు జారిచేసింది. అడ్వర్టయిజ్‌మెంట్లు ప్రకటనలు అయ్యాక ప్రేక్షకులు ఓచేత్తో కూల్‌డ్రింక్, మరోచేత్తో తినుబండారాలు పట్టుకుని, చిన్న పిల్లలను ఎత్తుకుని, తింటున్న పదార్థాలను నోట్లో అలాగే కుక్కుకుని చిత్రవిచిత్రమైన అవతారాలతో జాతీయగీతం కోసం నిల్చునేవాళ్లు. ఇక్కడ కూడా జెండా గద్దెపై నిల్చున్న మూడు రంగుల జెండా వీడియోతోపాటు బ్యాక్‌గ్రౌండ్‌గా జనగణమన వినిపించేది.

కానీ తర్వాత ఈ వీడియో ప్రదర్శనలో మార్పులు వచ్చాయి. వేగంగా మారుతున్న సాంకేతికతల కారణంగా జెండా రూపురేఖలే మారి పోయాయి. డిజిటలైజేషన్ ప్రక్రియలో జెండా రంగులే మారిపోయాయి. ఒక నిమిషం వీడియో కాస్త రెండు నిమిషాల వీడియో అయింది. జెండా గద్దె ఎగిరిపోయి కేవలం జెండా మూడురంగులే తెరపైనుంచి కిందిదాకా డిజిటల్ రూపంలో దర్శనమిచ్చింది. ఇదే పద్ధతి పాఠశాలల్లో, కార్యక్రమాల్లో కొనసాగింది. దాదాపు 52 సెకన్లలో పూర్తికావలసిన జాతీయగీతాలాపన సమయం కొత్త సంగీతాలతో, రీమిక్స్‌లతో తగ్గడమో పెరగడమో జరిగేది. ఇట్లా అనేక సందర్భాలలో ఫ్లాగ్‌కోడ్, ఆంథమ్ కోడ్‌లు ఉల్లంఘించబడ్డాయి. 1999లో వాజ్‌పేయి ప్రభుత్వంలోని సాంస్కృతిక శాఖ ఎ.ఆర్. రహమాన్‌తో తీయించిన వందేమాతరం ఆల్బమ్‌లో కూడా కోడ్‌కు వ్యతిరేకంగా జనగణమనను నిదానంగా పాడించారు. ఇట్లా ఫ్లాగ్ కోడ్, ఆంథమ్ కోడ్‌లు ఉల్లంఘించబడిన ప్రతిసారీ బిజెపి రెండునాల్కల ధోరణితో వ్యవహరించేది. ఉల్లంఘించిన వాళ్లు బిజెపి అనుకూలురు కాకపోతే కోడ్ ఉల్లంఘన అంటూ విరుచుకపడేది. తనకు అనుకూలమైతే గొప్ప దేశభక్తి ప్రదర్శనగా కొనియాడేది.

2001లో కభి ఖుషి–కభి గమ్ సినిమా వచ్చింది. ఇందులో ఒక సన్నివేశంలో జాతీయ గీతాలాపన ఉంటుంది. శ్యాంనారాయణ్ చౌస్కి అనే రిటైర్డ్ ఇంజనీర్ మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జ్యోతి థియేటర్‌లో సినిమా చూస్తున్నపుడు ఈ సన్నివేశంలో ప్రేక్షకులెవరూ నిలబడక పోవడాన్ని గమనించాడు. పైగా తాను నిలబడితే సినిమా చూడ్డానికి అడ్డు తగులుతున్నావంటూ కోపానికి వచ్చారు. తర్వాత అతను ఈ విషయమై చీకట్లో ప్రదర్శించబడే ఆ సినిమాలోని జాతీయగీతాలాపన సన్నివేశాన్ని తొలగించాలని, అలాగే జాతీయ గీతాలాపన సమయంలో ప్రేక్షకులు నిలబడేలా ఆదేశించాలంటూ మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్

దాఖలు చేశాడు. అప్పుడు మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జిగా ఉన్న ఇప్పటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా తీర్పునిస్తూ సినిమాలోని జాతీయగీతం సీన్‌ను తీసివేసేంత వరకు సినిమా ప్రదర్శన నిలిపి వేయాలంటూ ఆదేశాలిచ్చాడు. అలాగే బిజో ఎమాన్యుయల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ జాతీయ గీతాలాపన సమయంలో నిలబడడం గౌరవసూచకం కనుక, ప్రేక్షకులు నిలబడాలని తీర్పిచ్చాడు.

దీని మీద ఆ సినిమా నిర్మాత కరణ్‌జోహార్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా వి.ఎన్. ఖారే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 2004లో ఆ హైకోర్టు ఆదేశాలను పక్కన బెట్టింది. జాతీయ గీతాలాపన సమయంలో నిలబడడం తప్పనిసరికాదని చెప్పింది. సినిమా ప్రదర్శనల సమయంలో అట్లా నిలబడడం గందరగోళానికి దారితీస్తుందని చెప్పింది. దీనిమీద చౌక్సి రివ్యూ పిటిషన్ వేశాడు. 2005లో చీఫ్ జస్టిస్ ఆర్.సి. లాహోటి నేతృత్వంలోని బెంచ్ 2004 సుప్రీంకోర్టు ఆదేశాలను వెనక్కు తీసుకుంది. అయితే నవంబర్ 2006లో త్రిసభ్య ధర్మాసనం సినిమాను ఎలాంటి కట్‌లు లేకుండా ప్రదర్శించడానికి అనుమతిచ్చింది.

ఆ తర్వాత చౌక్సి జాతీయగీతాన్ని, పతాకాన్ని, చిహ్నాలను అవమానించిన సంఘటనల వార్తాపత్రిక ప్రతులను, యూటూబ్ వీడియోలను సేకరించి 2016 సెప్టెంబర్‌లో ఆర్టికల్ 32 రాజ్యాంగ పరిహార హక్కు కింద ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశాడు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 (ఎ) ప్రకారం జాతీయ గీతాన్ని, జెండాను గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి అని, దాన్ని ఉల్లంఘించడాన్ని గురించి ప్రస్తావిస్తూ దేశంలోని అన్ని సినిమా హాళ్లలో సినిమా ప్రదర్శనకు ముందు జాతీయ గీతాన్ని ప్రదర్శించాలని, అలాగే దాన్ని ప్రదర్శించడానికి, పాడడానికి రాజ్యాంగపరమైన విధివిధానాలు ప్రకటించాలని ఆ వ్యాజ్యంలో కోరాడు.

దీనిపై సుప్రీంకోర్టు 2016 నవంబర్ 30న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పులో దేశవ్యాప్తంగా చిత్ర ప్రదర్శనలకు ముందు జాతీయగీతాన్ని తప్పనిసరిగా వినిపించాల్సిందేనని కోర్టు థియేటర్లను ఆదేశించింది. ఆ సమయంలో తెరపై జాతీయ పతాకాన్ని ప్రదర్శించాలని, గౌరవసూచకంగా ప్రేక్షకులంతా నిల్చోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారీచేసి అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపాలని జస్టిస్ దీపక్ మిశ్రా, అమితవరాయ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఇంకా ఈ శ్యానారాయణ్ చౌక్సి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2016) కేసు తీర్పులో వెలువరించిన అంశాలు – సినిమా హాళ్లలో జాతీయగీతాన్ని వినిపించేటపుడు ప్రవేశ నిష్క్రమణ మార్గాలన్నీ మూసివేయాలి. జాతీయగీతాన్ని వినోదాత్మక టివిషోలో గానీ, ఇతర వాణిజ్య ప్రదర్శనల్లో గానీ వినిపించడం నిషిద్ధం. ఆలాపన సమయంలో నాటకీయత (డ్రమటైజేషన్) చొప్పించరాదు. గీతాన్ని కుదించి వినిపించరాదు.

ఈ తీర్పుపై దేశవ్యాప్తంగా సంతోషంతో పాటు చాలామంది నిరసనలు కూడా తెలిపారు. దేశభక్తిని ఒక నిర్దిష్ట ప్రదేశంలో నిరూపించుకోవడం ఏంటి? అది ప్రజల మనసులో ఉండాలి గానీ థియేటర్లలో ఉంటుందా? అని, అట్లా గనుక ఉంటే మెట్రో, సబర్బన్ రైళ్లలో, బస్సుల్లో, బిల్డింగ్ లిఫ్టులలో, హోటళ్లలో మాత్రం ఎందుకు ప్రదర్శించగూడదు? అసలు జాతీయ గీతానికి, సినిమాలకు మధ్య సంబంధం (లింక్) ఏమిటి? జాతీయగీతాన్ని, దేశభక్తిని కేవలం సినిమాలకు మాత్రమే పరిమితం చేయడం ఏమిటి? ఇక థియేటర్లలో నిలబడని వాళ్లంతా దేశద్రోహులేనా? నిలబడలేని, శారీరక ఇబ్బందులున్న, దివ్యాంగులైన వాళ్లంతా దేశం మీద ప్రేమలేని వాళ్లేనా? తలుపులు మూసిన సందర్భంలో హాళ్లో అగ్నిప్రమాదం లాంటి ఏదైనా అనుకోని విషాద సంఘటన జరిగితే వాళ్లను బైటకు తేవడం ఎట్లా? 1997లో బోర్డర్ సినిమా ప్రదర్శన సమయంలో ఢిల్లిలో గ్రీన్‌పార్క్‌లోని ఉపహార్ సినిమా అగ్నిప్రమాదంలో 59 మంది మరణించిన ఘటన లాంటిదేదైనా జరిగితే ఎవరు బాధ్యులు? వంటి సహేతుకమైన ప్రశ్నలు ముందుకు వచ్చాయి.

కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో కొడంగలూర్ ఫిలిం సొసైటి 43 సంవత్సరాలుగా నడుస్తున్నది. అందులో 280 మంది సభ్యులున్నారు. వాళ్లు ప్రతి శుక్రవారం సమావేశమై జాతీయ అంతర్జాతీయ చిత్రాలు చూడడంతో పాటు చర్చలు చేస్తారు. ఈ సందర్భంగా శ్యానారాయణ్ చౌక్సి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా – 2016 కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చర్చకు వచ్చింది. తాము ప్రతివారం ఒకేసారి రెండు మూడు సినిమాలు చూసేటపుడు ప్రతిసారి లేచినిల్చోవాల్సి వస్తుందని, పైగా డిసెంబర్, 2016 నుంచి కేరళలో ప్రారంభం కాబోయే అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో 60 చిత్రాలు ఒకేసారి 18 థియేటర్లలో ప్రదర్శించబడేటపుడు ఇది మరింత కష్టమవుతుందని వాళ్లు భావించారు. దాంతో సొసైటీ సుప్రీంకోర్టులో ఆ తీర్పుపై రివ్యూ పిటిషన్ వేసింది. కానీ కోర్టు ఎలాంటి సడలింపు ఇవ్వకుండా, '40 సినిమాలు వేస్తే 40 సార్లు నిలబడండి' అని ఘాటుగా వ్యాఖ్యానించింది.

ఇక ఫిలిం ఫెస్టివల్ నిర్వాహకుడు కమల్‌ను, ఇతరులను పాకిస్తాన్ వెళ్లిపొమ్మంటూ సంఘ్ పరివార్ బెదిరించింది. థియేటర్లకు పోలీసులు వచ్చి, నిలబడని వాళ్లపై కేసులు పెట్టి అరెస్టులు చేయడాన్ని ఆయన అడ్డుకున్నందుకు సంఘ్ పరివార్ నుంచి దాడులను ఎదుర్కొన్నాడు. సొసైటి వాళ్లు టెర్రరిస్టులు, మావోయిస్టులంటూ సంఘ్‌పరివార్ ఫ్లెక్సులు కట్టింది. అట్లాగే దేశంలోని వివిధ ప్రాంతాలలో 2016 నవంబర్ 30 తీర్పు తర్వాత నుంచీ దేశభక్తులమని చెప్పుకునే వాళ్లు కొందరు, బిజెపి ఆరెస్సెస్ అనుయాయులు థియేటర్లలో నిలబడని వాళ్లపై, పాడనివాళ్లపై పెద్దఎత్తున దాడులకు దిగుతూ వచ్చారు.

ఓవైపు దేశవ్యాప్తంగా పలువురి విమర్శలు, నిరసనలు, సందేహాలు, మరోవైపు సంఘ్ పరివార్ దాడులతో దాదాపు ఏడాదికాలం గడిచాక 2017 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు గత సంవత్సరం నవంబర్ 30న తాను వెలువరించిన ఆదేశాల్లో సవరణలు చేసింది. సినిమా హాళ్లలో చిత్ర ప్రదర్శనకు ముందు జాతీయగీతాన్ని వినిపించే సమయంలో దివ్యాంగులు నిలబడనవసరం లేదని వాళ్లకు మినహాయింపునిచ్చింది. ఆ సమయంలో తలుపులు మూసి ఉంచాలి కానీ బోల్టులు (గొళ్లేలు) బిగించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ సందర్భంగా త్రిసభ్య ధర్మాసనంలో ఒకరైన డి.వై. చంద్రచూడ్ ఈ విషయమై చాలా మనస్తాపంతో మాట్లాడాడు. 'దేశభక్తిని ఇలా ప్రదర్శనకు పెట్టి ప్రతివారూ భుజకీర్తులు తగిలించు కోవాల్సిందేనా?' అని ప్రశ్నించాడు.

'అచ్చంగా వినోదం కోసమే జనం సినిమాలకు వెళ్తారు. అక్కడ తమ దేశభక్తిని నిరూపించుకోవాలంటూ మా భుజాలపై తుపాకిపెట్టి మీరు (కేంద్రం) ఒత్తిడి చేయజాలరు. జాతీయగీతం ఆలపిస్తున్న సమయంలో లేచి నిలబడని వారికి దేశభక్తి అసలే లేదనో, తక్కువనో భావించనవసరం లేదు. దీనిని ఇలాగే వదిలేస్తే ఇటువంటి ఆదేశాలిస్తూ పోతుంటే ముమ్ముందు గౌరవప్రదమైన జాతీయగీతాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్లకు ఎవరూ టీషర్టులు, నిక్కర్లు వేసుకుని రాకూడదంటూ, అలా చేస్తే జాతీయగీతాన్ని అవమానించడమే అవుతుందని వేరొకరెవరో కోర్టుకెక్కుతారు. ప్రభుత్వం కూడా ఆదేశించినా ఆదేశించవచ్చు. ఈ మోరల్ పోలీసింగ్‌కు అంతమెక్కడ? సమాజంలో ఎవరిపైనా నైతిక పోలీసింగ్ అక్కర్లేదు.' అన్నాడు. 'జాతీయగీతాన్ని సినిమా హాళ్లలో ఆలపించనట్లయితే మనం దేశభక్తులం కానట్లుగా మనమెందుకు భావించాలి? మీ దేశభక్తిని నిరూపించుకునేందుకు జాతీయగీతాన్ని మీరు ఆలపించాల్సిన పని లేదు. సుప్రీంకోర్టు ద్వారా దేశభక్తిని ప్రజలకు అలవర్చలేం' అన్నాడు.

ఇక ఇప్పుడు అంటే 2018 జనవరి 9న సుప్రీంకోర్టు మొత్తంగా తన గత తీర్పును, అంటే 2016 నవంబర్ 30 తీర్పును వెనక్కి తీసుకుంది. సినిమా ప్రారంభానికి ముందు థియేటర్లలో జనగణమన ఖచ్చితంగా ఆలపించనవసరం లేదని, వినిపించడమా వినిపించక పోవడమా అనేది థియేటర్ల నిర్ణయానికే వదిలేయడం జరుగుతుందని చెప్పింది. ఈ అంశంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలో వివిధ మంత్రిత్వ శాఖలతో నియమించిన 12 మంది సభ్యుల కమిటి నివేదిక ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, ఎ.ఎం. కన్విల్కర్, డి.వై. చంద్రచూడ్‌ల త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. సంఘ్ పరివార్ ప్రేరేపిస్తున్నట్లుగా దేశభక్తి అంటే జనగణమన పాడడమే, లేచి నిల్చోవడమే అలా చేయనివాళ్లంతా దేశద్రోహులేననే ఉన్మాద ప్రేలాపనల నేపథ్యంలో ఈ తీర్పు ఎలాంటి ఫలితాలనిస్తుందో చూడాలి.

నిజానికి సంఘ్ పరివార్ జాతీయగీతంగా జనగణమనపై కూడా ఏనాడూ సదభిప్రాయంతో, సానుకూల భావంతో ప్రవర్తించలేదు. దైవభావన, ఆధ్యాత్మిక భావన అంశాలు అస్పష్టంగా ఉన్న జనగణమన స్థానంలో ఆ భావనలు నేరుగా ఉన్న వందేమాతరాన్ని జాతీయగీతంగా చేయాలని ఆర్ఎస్ఎస్ ఏనాటి నుంచో వాదిస్తున్నది. గతం నుంచీ ఈ వాదన ఉనా ఈమధ్య 2016లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రీచ్‌లో మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి భయ్యాజి జోషి, 'అసలైన జాతీయగీతం జనగణమన కాదని, వందేమాతరమే అసలైన జాతీయ గీతమ'ని, 'సరైన అర్థాన్ని తీసుకుంటే వందేమాతరమే జాతీయగీతం కావాల'ని అన్నాడు. ఆ సరైన అర్థం ఏమిటంటే వందేమాతరంలో భారతమాతకు వందనం ఉంది గానీ జనగణమనలో లేకపోవడమే.

ఆర్ఎస్ఎస్‌యే కాదు, 2006లో దారుల్ ఉలూమ్ ముస్లిం సంస్థ వందేమాతరాన్ని పాడగూడదని ఫత్వా జారీ చేసింది. 2009లో ముస్లిం మతాధికారుల అత్యున్నత సంస్థ జమైత్-ఇ-ఉలేమా హింద్ కూడా వందేమాతరం పాడవద్దని తీర్మానించింది. వాళ్ల అభ్యంతరం కూడా అది భారతమాతకు సంబంధించిన అర్థమున్న గేయం అని. అంటే అటు ముస్లిం అతివాద సంస్థలు, ఇటు హిందూ అతివాద సంస్థలు చెప్తున్న ఒప్పుకుంటున్న విషయమేమిటంటే వందేమాతరం భారతమాతకు మొక్కే గేయం అని. అలాంటి గేయాన్ని ఆర్ఎస్ఎస్ జనగణమన స్థానంలో జాతీయగీతంగా ప్రతిష్ఠించాలని చూస్తున్నది. వాళ్ల దృష్టిలో జనగణమన అనేది అప్రధాన్య గీతమని దీన్నిబట్టి స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. కానీ వాళ్ల స్వప్రయోజనాల కోసం, అవకాశవాద రాజకీయాల కోసం జనగణమన పేరుమీద వీరంగాలు సృష్టిస్తూ వస్తున్నారు.

దేశ వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ నడిపే శిశు మందిరాల వంటి పాఠశాలల్లో ఇప్పటికీ పూర్తిగా హిందూ దేవతల ప్రార్థనలు, మతపరమైన కీర్తనలు ప్రార్థనలో, భోజన సమయంలో, పాఠశాల ముగింపు సమయాలలో చోటుచేసు కుంటున్నాయి. దేశంలో ఈ జాడ్యం ఎంత బలపడిందంటే కేంద్రీయ విద్యాలయాలలో 'అసతోమా సద్గమయా' అనే బృహదారణ్యక ఉపనిషత్తులోని ప్రార్థన ఏళ్ల తరబడిగా నడుస్తున్న విషయాన్ని, ప్రభుత్వం నడిపే పాఠశాలల్లో ఒక ప్రత్యేక మత ప్రార్థన ఉండడాన్ని ప్రశ్నిస్తూ మధ్యప్రదేశ్‌కు చెందిన వినాయక్ షా సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌తో ఇటీవల బైటికొచ్చింది.

ప్రతిష్ఠాత్మకమైన 1125 సెంట్రల్ స్కూళ్లల్లోనూ దేశ వ్యాప్తంగా ఏళ్ల తరబడి ఒకే మత ప్రార్థన కొనసాగిందంటే ఇంతకంటే దారుణం ఇంకేముంటుంది? ఎన్నో పాఠశాలల్లో ఈ హిందుత్వ సంస్కృతి మూలంగా సరస్వతి ప్రార్థనలు, అన్నపూర్ణాష్టకాలు, గణపతి ప్రార్థనలు, చరిత్రల వక్రీకరణలు, హోళీ, వినాయక చవితి లాంటి పండుగల నిర్వహణలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజు కాకుండా వ్యాసుని జయంతి రోజు టీచర్స్‌డేలు నిర్వహించడాలు జరుగుతున్నాయి. వాటిని ప్రశ్నిస్తే ఎదురు దాడులు చేస్తున్నారు.

ఇట్లా ప్రమాదకరమైన దేశ భక్తిని, మితిమీరిన జాతివాదాన్ని పెంచి ప్రజలలో ఉద్వేగాలను రెచ్చగొట్టి విషబీజాలు నాటి రాజకీయంగా లబ్ధి పొందడానికి, ప్రజలను మతం పేరిట, జాతి పేరిట విభజించడానికి దొరికిన ప్రతి అవకాశాన్నీ సంఘ్‌పరివార్ ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రయత్నాలు ఎక్కువై ఓ వైపు దళితులపై, ముస్లింలపై, సామాన్య ప్రజలపై దాడులు పెరిగిపోయాయి. మరోవైపు సాంస్కృతిక రంగంలో కూడా సినిమాలను అడ్డుకోవడం, నటులు, దర్శకులపై దాడులకు దిగడం, ప్రార్థనాలయాలను ధ్వంసం చేయడం కొనసాగుతూ ఇప్పుడు జనగణమన పేరుతో దాడులకు దిగడం జరుగుతున్నది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు సంఘ్‌పరివార్ అతివాద ఆలోచనా విధానాన్ని ఇసుక రేణువంతనైనా నియంత్రించ గలుగుతుందా అనేది మాత్రం సందేహాస్పదమే అనిపిస్తుంది.

'దేశభక్తి అనేది అంతిమ ధార్మిక గమ్యం కాదు. మన గమ్యం మానవత్వం. అది ప్రజల విలువతో గ్లాసెడు నీళ్లు కొనుక్కోవడమే. నేను బతికున్నంత వరకూ మానవత్వాన్ని దేశభక్తి గెలిచే అవకాశం ఇవ్వను'. ఇవ్వాల్టి కోర్టు తీర్పు అంశమైన జనగణమన గీతాన్ని రాసిన రవీంద్రనాథ్ ఠాగూర్ అన్న మాటలివి. జనగణమన పేరుతో వీరంగాలు సృష్టించే సంఘ్‌పరివార్‌కు ఎన్నటికీ ఈ మాటలు అర్థం కావు. గానీ, ప్రజలైనా ఈ మాటలు అర్థం చేసుకొని వాళ్లను తిరస్కరిస్తారేమో వేచిచూడాలి.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

జూట్ మిల్లు కార్మికుల స్థితిగతులు

పారిశ్రామిక విప్లవం వల్ల చేతి వృత్తులు కోల్పోయిన ప్రజలు హుగ్లీ నదీతీర ప్రాంతంలోని జూట్ మిల్లుల్లో శ్రామికులుగా నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న దుర్భర స్థితిగతులను వివరిస్తున్నారు **ప్రకాశ్**

పారిశ్రామిక విప్లవం తర్వాత కొత్త కొత్త యంత్రాలతో అధికోత్పత్తి సాధ్యమైన దశలో ఇంగ్లిష్ వాళ్లు మనదేశంలో వివిధ పరిశ్రమలు నిర్మించారు. ముడిసరుకులు, రవాణా సదుపాయాలతో పాటు తక్కువ జీతాలకే శ్రామికులు దొరికే హుగ్లీ నదీ తీరప్రాంతంలో జూట్ మిల్లులు స్థాపించారు. భారతదేశం మొత్తం మీద 83 జూట్ మిల్లులుంటే, ఒక్క పశ్చిమ బెంగాల్లోనే 59 ఉన్నాయి. 2,70,000 మంది శ్రామికులు ఈ జనపనార మిల్లుల్లో పనిచేసేవారే. అప్పటి బీహార్, ఉత్తరప్రదేశ్, శ్రీకాకుళం, ఒరిస్సాల్లోని వ్యవసాయ కూలీల పరిస్థితులు దినదినం క్షీణించడం, చేతి వృత్తి కార్మికుల బతుకులు యంత్రాల దాడికి బలైపోవడంతో ఈ శ్రామికులు బతుకుబాటలో వలసవస్తూ కలకత్తాకు దగ్గర్లోని జూట్ మిల్లు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నేటికి ఎనభై తొంభై ఏళ్లుగా జూట్ మిల్లులో పనిచేస్తున్న కార్మికుల జీవితాలు పురోగమనానికా, లేక తిరోగమనానికా? ఓసారి సింహావలోకనం చేసుకోవడం అవసరం.

జూట్ మిల్లు శ్రామికుల దుర్భర జీవితాన్ని పరిచయం చేసేవి వారి నివాసస్థలాలే. ఓ చిన్నగదే వారి ఇల్లు. ఆ ఇంటికి కిటికీ ఉన్నా ఊపిరాడని వాతావరణం. ఆ చిన్న గదే వంట గది, అదే స్టడీరూం. మన ఆనందం కోసం దాన్ని డైనింగ్ రూం అని కూడా పిలుచుకోవచ్చు. ఈ గదులు పదేళ్లకొకసారైనా రిపేరయ్యేవి గతంలో. కానీ ప్రస్తుతం అవి కూడా జీర్ణావస్థలో ఉన్నాయి. ఏ క్షణంలోనైనా ప్రమాదం కొనితెచ్చేవిగా ఉన్నాయి. కార్మికుల బస్తీ అంతటికీ ఒకే సామూహిక మరుగుదొడ్డి. ఒక్కసారి పది పన్నెండు మంది మాత్రమే ఒకరికెదురుగా మరొకరు కూర్చునేటట్లు ఏర్పాటు. వారెదురుగానే క్యూలోనివారు నిల్చుని ఉంటారు. దాపరికంగా ఉండాల్సిన కాలకృత్యం ఇలా బహిరంగంగా సాగుతుంది.

అంతే కాకుండా భరించలేని దుర్గంధంతో, అనారోగ్యకరమైన, అపరిశుభ్రతమైన వాతావరణం నిత్యం రాజ్యమేలుతుందక్కడ. ఇటువంటి భయంకరమైన పరిస్థితిలో కూడా కాలకృత్యానికెళ్లిన పాపానికి ప్రాణాలర్పించుకున్నారు కొంతమంది – ఆ పక్కనున్న పాత గోడౌను గోడ పాయిఖానాపై పడిపోవడంతో. (కెల్విన్ లైన్ సంఘటన) మహిళల స్నానాలకు, మూత్ర విసర్జనకు ప్రత్యేక సౌకర్యం లేదు. ఇదిలా ఉంటే చవకబారు సారాయి, గంజాయి దుకాణాలు మాత్రం ఈ ప్రాంతాల్లో పుట్ట గొడుగుల్లా విరాజిల్లుతుంటాయి. చాలీ చాలనీ జీతాలతో జీవించే శ్రామికుల గొంతుపై లాకౌట్ కత్తి సదా వేలాడుతూనే ఉంటుంది. జనపనార కార్మికుల బతుకుల వెతలు కళ్లనీళ్లు తెప్పిస్తాయి.

ఒకప్పుడు ఈ జూట్ మిల్లుల యజమానులు శ్రామికుల అవసరాలు గుర్తించి వాళ్లకి కొంత సదుపాయాలు కల్పించేవారు. పనిదగ్గర విశ్రాంతి గదులు ఉండేవి. చిన్న పిల్లలు చదువుకోవడానికి స్కూల్లు నడిపేవారు. మహిళా శ్రామికుల కోసం ప్రత్యేక గదులు ఉండేవి. రానురాను లాభమే ముఖ్యమై శ్రామికుల సదుపాయాలు తగ్గుతూ, బాధలు పెరుగుతూ వచ్చాయి. జీవితాంతం మిల్లులో శ్రమధారపోసిన కార్మికుడికి ఉద్యోగ విరమణానంతరం ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ కూడా చేతికి అందక వొట్టి చేతులతో బయటకు వచ్చే పరిస్థితులున్నాయి. సరైన జీతాలు లేవు. ఒకే పని చేసే కార్మికుల మధ్య ఎక్కువ తక్కువ జీతాల భేదాలు. కార్మికునికీ కార్మికునికీ పనిదగ్గర పోటీ. శ్రామికుల మధ్య భేదాలు సృష్టించి వాళ్లు సంఘటిత పడకుండా, పెడదోవ పట్టించే వివిధ రకాల కార్యక్రమాలు నేటి యజమాని వర్గం చేపడుతూ ఉంటుంది. ఒక్క జూట్ మిల్లుల కార్మికుల విషయంలోనే కాదు, శ్రామికుల్లో పరస్పర సహకారభావం సహజంగానే ఉంటుందనీ, దాన్తో అద్భుతాలు సాధించగలరనే విషయం యజమానులకు తెలుసు.

చాలీ చాలని జీవనపోరాటం సాగిస్తున్నారు జూట్ మిల్లు కార్మికులు. మారుతున్న కాలంలో సరికొత్త యంత్రాలొస్తున్నాయి. ఉత్పత్తి, పనిభారం పెరుగుతుండగా జీతాలు మాత్రం తగ్గుతున్నాయి. ఒక్క నిమిషం కూడా పనిస్థలంలో విశ్రాంతి ఉండదు. మిల్లులో మిషన్లతో తమ శరీరాన్ని పోటీ పెట్టాలి. 8 గంటల్లో కనీసం 20 నిమిషాల విరామమైనా చేతికి వస్తుందా అన్నది ప్రశ్నార్థకమే. ఎన్నో జూట్ మిల్లులలో ఉత్పత్తి బట్టే జీతం. ఆ రోజు ఉత్పత్తి తగ్గితే జీతంలో కోత పద్ధతి ఉంటుంది. ఇఎస్ఐ శ్రామికుల హక్కు. ప్రావిడెంట్ ఫండ్ వారి కష్టార్జితం. వీటిని కూడా స్వాహా చేస్తున్నారు మిల్లు యజమానులు. ఏళ్ల తరబడి కార్మికుల జీతాల నుండి కోతపెట్టిన 469 కోట్ల 20 లక్షల నిధుల్ని ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) ఖాతాలో జమ చేయకుండా కాజేస్తున్నారు. నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే ఎన్‌జెఎంసి మిల్స్ 72 కోట్ల 38 లక్షలు, కెల్విన్ మిల్లు 5 కోట్ల లక్షలు అలానే మేఘునా, విక్టోరియా, ఎంపైర్, ప్రేమ్‌చంద్, బారానగర్ తదితర అనేక మిల్లులు పిఎఫ్ నిధుల్ని కాజేశాయి. (2004 లెక్కల ప్రకారం) ఓ కార్మికుడికి రిటైర్మెంట్ జరిగిన 45 దినాలలో ప్రావిడెంట్ ఫండ్ దొరకాలి. కానీ ఏళ్ల తరబడి పిఎఫ్ ఇవ్వకుండా కేవలం 220 రూపాయల దినసరి వేతనంతో ఆ కార్మికుడి అనుభవాన్ని పిండేస్తుంటారు. ఇఎస్ఐ స్కీం ప్రకారం మెడికల్ సెలవుల డబ్బు దొరకాలంటే చెప్పులు సగం అరగవలసిందే. సంఘటిత కార్మికుల పరిస్థితే ఇలా ఉంటే ఒక బదిలీ, వౌచర్ శ్రామికుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు.

కొత్త సాంకేతిక మిషన్లు, కొత్తదనం అనే మాటలు వినడానికి చాలా హాయిగా, గొప్పగా ఉంటాయి. కానీ అవే శ్రామికుల జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. మొదట ఒక శ్రామికుడు ఒకే స్పిన్నింగ్ మిషన్

నడిపేవాడు. నేడు కొత్త యంత్రాలు వచ్చాయి. ఒక్కో కార్మికుడు రెండేసి మిషన్లు నడపాల్సి వస్తోంది. మిషన్ల కంటే వేగంగా చేతులు కదలవలసిందే. మొదటి కంటే ఎక్కువ ఉత్పత్తి ఇస్తాయి మిషన్లు. కానీ కార్మికుల సంఖ్యని సగానికే కుదించేస్తాయి. ఎక్కువ ఉత్పత్తి, తక్కువ జీతం అయినప్పటికీ జూట్ మిల్లుల్లో లాభం లేదనీ, జూట్ బ్యాగుకు మార్కెట్‌లో గిరాకీ లేదనీ రకరకాల సాకులు. సగానికి సగం మంది శ్రామికులు రెండు వందల రూపాయల కంటే తక్కువ జీతానికి పనిచేసినా లాభం రావడం లేదట! 'బంద్' అనేది కార్మికుడి అస్త్రంగా ఉండాల్సిన తరుణంలో 'లాకౌట్' అనేది యజమాని బ్రహ్మాస్త్రంగా మారిన వేళ ఎన్నైనా కారణాలు చూపుతారు.

జనపనార పరిశ్రమ సమస్యల్లో ప్రధాన కారణం మిల్లులకు శాశ్వత యజమానులు లేకపోవడం. అధిక శాతం మిల్లులు లీజులపై, సబ్ లీజులపై కొందరు మార్వాడీల చేతుల్లో ఉన్నాయి. వీరికి తాత్కాలిక లాభార్జనే ముఖ్యం. పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన శాశ్వత ప్రణాళికలేవీ ఉండవు. జమిందారుల్లా వ్యవహరించే యజమానుల చేతుల్లో కార్మికులు మరింత నలిగిపోతుంటారు. పేద ప్రజల ఇఎస్ఐ డబ్బును సైతం మింగేయడానికి వీరు వెనుకాడరు – పిఎఫ్, గ్రాట్యుటీల సంగతి సరేసరి. పేదల డబ్బు ఎగ్గొట్టి, 'స్వల్ప ధరలకు శస్త్ర చికిత్స చారిటీ'లు చేస్తున్నామని ఫోజులు కొడుతుంటారు వీరిలో కొంత మంది. కొందరు ట్రేడ్ యూనియన్ నాయకుల్ని తమకనుకూలంగా మలుచుకోవడం చేత, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించదన్న ధీమాచేత వీరి ఆగడాలకు అంతే ఉండదు. త్రైపాక్షిక ఒప్పందాలను కూడా అమలు చేయరు. పెరిగిన డిఎ వాయిదాలు చెల్లించరు. బోనస్ సీలింగు పెంచడం అటుంచి, బోనస్ పేమెంటును కూడా నిరాకరిస్తుంటారు. జూట్‌కు డిమాండ్ ఉన్న రోజుల్లో అతి లాభాలు సాధించడమే కాక, డిమాండ్ తక్కువున్నప్పుడు కూడా కార్మికుడి గతి ఏమౌతుందా అన్నది పట్టించు కోకుండా తమ లాభాలకు ఏమాత్రం ధోకా రాకూడదని, పనిదినాలను తగ్గించడమో, షిఫ్టుల సంఖ్య తగ్గించడమో చేస్తుంటారు. వీరు తమ ఎత్తుగడలతో జనపనార రైతుల పొట్టలు కొడుతుంటారు. ప్రతీసారి ముడి జనపనార అమ్మకానికి సిద్ధమైన సమయంలో జూట్ మిల్లుల్ని మూసేసి, రైతుల ఉత్పత్తికి గిరాకీ లేకుండా చేస్తారు. తుదకు రైతులు తమ సరుకులను నష్టాలకు అమ్ముకుంటారు. ఇటు జూట్ మిల్లు కార్మికులు కూడా తమ జీవనోపాధి కోసం, మూతపడ్డ మిల్లుల్ని తెరిపించుకోవడం కోసం యాజమాన్యం పెట్టే డిమాండ్లకు తలొగ్గుతారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలంటే ఇదే కదా?

ఇన్నిన్ని ఎత్తుల జిత్తులు ఇంతమంది కార్మిక నాయకులుంటుండగా సాధ్యమేనా అని ఎవరికైనా అనుమానం రావచ్చు. సందేహ నివారణ కోసం మనం 2002 సంవత్సరం జనవరి 5న జరిగిన త్రైపాక్షిక ఒప్పందంలోని కొన్ని అంశాలు చూస్తే విషయం స్పష్టమవుతుంది. ఉత్పాదనతో ముడిపడ్డ జీతాల రూపకల్పన ఈ ఒప్పందంలో జరిగింది. 33.3 శాతం జీతం ఉత్పత్తితో ముడిపడి ఉంటుంది కనుక యజమాని సూచించిన ఉత్పాదన జరగనప్పుడు కార్మికుడి జీతం తగ్గుతుంది. అలానే సరికొత్త ఉద్యోగుల జీతాన్ని రోజుకి వంద రూపాయలుగా కూడా నిర్ణయించడం జరిగింది. ఈ ఒప్పందం తర్వాత కార్మికులకు ప్రధాన ట్రేడ్ యూనియన్లపై నమ్మకం పోయింది. కార్మికుల ఆవేశం కట్టలు తెంచుకుంది. గొండల్పరా, బారానగర్ వంటి ప్రాంతాల్లో హింసాత్మక సంఘటనలు కూడా జరిగాయి. ఈ ఒప్పందాన్ని హుటాహుటిన అమలు చేయడానికి జంకుతూ అదను చూసి ఒక్కో అంశాన్ని ప్రవేశపెడుతున్నారు.

'బంగారు నార' పరిశ్రమగా ఒకప్పుడు పేరొందిన జూట్ పరిశ్రమ సమస్యలకు మరో ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలు. కార్మికుల పోరాటం ఫలితంగా 1987లో జూట్ ప్యాకేజింగ్ మెటేరియల్స్ చట్టం తయారైంది. ఈ చట్టం ప్రకారం పంచదారతో సహా బియ్యం, గోదుమ వంటి ఆహార పదార్థాలన్నింటిని జూట్ సంచుల్లోనే తప్పనిసరిగా ప్యాకేజి చేయాలి. ఆరోగ్యరీత్యా, పర్యావరణరీత్యా మేలుచేసే ఈ చట్టం అటు జనపనార రైతులకీ, జనపనార పరిశ్రమకీ వరంగా ఉండేది. కానీ చవగ్గా దొరికే సింథటిక్ బ్యాగుల వాడకం ఎక్కువైంది. ప్రభుత్వం దీన్ని నియంత్రించడం మానేసింది. సింథటిక్ లాబీ ఒత్తిళ్లకు తలొగ్గి సింథటిక్ పరిశ్రమకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ పై చట్టాన్ని తుంగలో తొక్కేస్తోంది. మొన్నటి యుపిఎ దారిలోనే నేటి ఎన్‌డిఎ కూడా నడుస్తోంది.

జనపనార రైతులకు గిట్టుబాటు ధర అందేలా చూడడానికి జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ జూట్ బోర్డ్, కమిషనర్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ వంటి సంస్థలెన్నో ఉన్నాయి. వీటిలో అతి ముఖ్యమైనది జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా. కానీ ఈ సంస్థకు సరైన సిబ్బంది, సౌకర్యాలు అందించకుండా నిర్వీర్యపరుస్తున్నాయి ప్రభుత్వాలు. ఫలితంగా రైతులు మార్కెట్ శక్తుల, జూట్ మిల్లు యజమానుల నాటకాలకు నెగ్గలేక, పంటని చౌకగా లేదా కొన్నిసార్లు నష్టాలకూ అమ్ముకోవాల్సి వస్తోంది. అంతేకాక, జనపనార నీటిపై ఆధారపడే పంట కావడంతో సరైన నీటి సదుపాయం లేకపోవడం వలన కూడా జనపరాన పంటపై ఆసక్తి కోల్పోతున్నారు రైతులు. 2010 – 11లో 9,72,000 హెక్టార్ల భూమిలో జనపనారను పండించగా 2013 – 14 నాటికి 8,67,000 హెక్టార్లలో మాత్రమే పండించారు. ఈ విధంగా జనపనార పండంచే 40 లక్షల మంది రైతుల జీవితాలతో పాటు, రెండున్నర లక్షల మంది కార్మికుల బతుకులు కూడా జూట్ మిల్లులు సక్రమంగా నడపడంపై, వివిధ దేశాలు సరైన ప్యాకేజి విధానాన్ని పాటించడంపై ఆధారపడి ఉన్నాయి. జూట్ వినియోగాలపై ఎన్నో ప్రయోగాలు జరుగుతున్నాయి. కేవలం ప్యాకేజింగ్‌లోనే కాక, కార్పెట్లుగా, హ్యాండు బ్యాగులుగా, బొమ్మలుగా, ఎన్నెన్నో గృహోపకరమైన డిజైనర్ వస్తువులుగా జూట్ వినియోగంపై రీసెర్చి జరుగుతోంది. కాబట్టి జూట్‌కి చరమదశ దాపురించే ప్రసక్తేలేదు. కాకపోతే లాభాల ఫలాలు ఎవరు కొల్లగొడతారా అన్నది చర్చాంశం.

కార్మిక కర్షక ప్రయోజనాలు ఒకేచోట ముడిపడి ఉంటాయని చెప్పడానికి జూట్ కంటే ఛేషైన ఉదాహరణ మరోటి ఉండదు. ఈ ఇరు వర్గాల శ్రేయస్సులోనే ప్రజారోగ్యం, పర్యావరణ భద్రత జతపడి ఉన్నాయి. అయితే స్వంతాస్తి, లాభార్జన అనే ఇంధనాలతో నడిచే పెట్టుబడిదారీ వ్యవస్థ మాత్రం అశేష ప్రజానీకం ప్రయోజనాలకు అడ్డు తగులుతూ సంక్షోభాలకు దారితీస్తుంది. శ్రమజీవులే తమ పోరాటాల ద్వారా సంక్షోభాలకు పరిష్కారం చూపగలరు. అయితే ఈ పోరాటాలు అరాచక సంఘటనలుగా మారకుండా ఉండాలంటే, శ్రామిక దృక్పథం గల నాయకత్వం, కార్మికుల్లో వర్గపోరాట చైతన్యం ఎంతైనా అవసరం.

('ముందడుగు' సౌజన్యంతో)

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

స్వలింగ సంపర్కంపై సుప్రీంకోర్టు తీర్పు

***భారత సమాజంలో ఉన్న సామాజిక అంతరాల వల్ల కులాంతర, మతాంతర వివాహాలనే ఆహ్వానించని సంకుచిత స్థితిలో స్వలింగ సంపర్కుల పట్ల ఎక్కువ వ్యతిరేకత ఉంటుందనీ, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనమనీ అంటున్నారు* **చిమ్మె జాన్ బర్నబాస్**

భారత శిక్షా స్మృతి (ఐపిసి) సెక్షన్ 377 ప్రకారం స్వలింగ సంపర్కం నేరం. 1861లో ఈ శిక్షాస్మృతిని అప్పటి బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టారు. ఈ సెక్షన్‌ను సవాల్ చేస్తూ 2001లో నాజ్ ఫౌండేషన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు ఇద్దరు వయోధికుల మధ్య పరస్పర అంగీకారంతో జరిగే స్వలింగ సంపర్కం నేరం కాదని తీర్పు నిచ్చింది.

భారత రాజ్యాంగంలోని 14,15,21 అధికరణలు పౌరుల ప్రాథమిక హక్కులను తెలియజేస్తుండగా ఐపిసి సెక్షన్ 377 మాత్రం ఉల్లంఘిస్తోందని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పు మళ్లీ ఒకసారి సుప్రీంకోర్టులో సవాలు చేయగా, అప్పీలును స్వీకరించే సమయంలో సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని ఆదేశించింది. 2013 డిసెంబర్ 11న ఢిల్లీ హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ, సుప్రీంకోర్టు ఐపిసి సెక్షన్ 377 రాజ్యాంగ విరుద్ధం కాదని తీర్పునిచ్చింది. అనంతరం తీర్పును సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం 'గే' హక్కుల కార్యకర్తలు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అనంతరం కొంత మంది న్యాయవాదులు 'క్యూరేటిక్' పిటీషన్లను దాఖలు చేయడంతో 2016 ఫిబ్రవరి 2న సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనానికి సిఫారసు చేసింది. దీనిని 2018 జనవరి 8న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఖాన్విల్కర్, జస్టిస్ చంద్రచూడ్‌ల ధర్మాసనం ప్రాథమిక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు – పరస్పర అంగీకారంతో స్వలింగ సంపర్కంలో పాల్గొనే వయోధికుల్ని శిక్షించేందుకు అనుమతిస్తున్న ఐపిసి సెక్షన్ 377ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలంటే మరింత విస్తృతమైన చర్చ – వాదనలు – వివరణలు అవసరమని అభిప్రాయపడుతూ సుప్రీంకోర్టుకు చెందిన ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం దీనిపై పునః పరిశీలిస్తుందని వ్యాఖ్యానించింది.

భారత శిక్షాస్మృతి సెక్షన్ 377 ప్రకారం ప్రకృతికి విరుద్ధంగా పురుషుడు, స్త్రీ లేదా జంతువుతో ఉద్దేశపూర్వకంగా ఎవరైనా లైంగిక చర్యకు పాల్పడితే వారు శిక్షార్హులు. నేరం రుజువైతే వారికి జీవిత ఖైదు, జరిమానాతో పాటుగా అవసరమైతే శిక్షను (మరింత) 10 సంవత్సరాలు పెంచే అవకాశం కల్పించబడింది. 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మళ్లీ పునఃసమీక్షించుకోవడానికి అంగీకరించడం ద్వారా సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నదిగా న్యాయకోవిదులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా వ్యాఖ్యానిస్తూ, 'ప్రకృతి నియమాలు స్థిరంగా ఉండేవి కావు, నిరంతర మార్పే వాటి సహజ స్వభావం. సమాజమైనా అంతే. తమ తమ వ్యక్తిగత లైంగికభావనల కారణంగా ఏ వ్యక్తీ లేదా కొంతమంది వ్యక్తుల సమూహం, వేదింపులు, బెదిరింపులు ఎదుర్కొనకూడదని, భయంతో బతుకీడ్చే పరిస్థితి రాకూడదని స్వలింగ సంపర్కులకు కొంత ధైర్యాన్నిస్తుంది.

వాస్తవానికి గత సంవత్సరం ఆగస్టులో వ్యక్తిగత గోప్యతపై తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులోనే దీనికి సంబంధించిన మూలాలున్నాయి. దేనిని ఎంపిక చేసుకోవాలో దేనికి ప్రాధాన్యతనివ్వాలో నిర్ణయింకునే స్వేచ్ఛ పౌరులకుంటుందని ఆ తీర్పలో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అదే విధంగా ఇప్పుడు ఐపిసిలోని సెక్షన్ 377 పై ఇచ్చిన తీర్పును పునః సమీక్షిస్తామనడం కూడా అందులో భాగమే.

2009లో అప్పటి ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎపిషా, న్యాయమూర్తి జస్టిస్ మురళీధర్‌ల ధర్మాసనం స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించలేమని తీర్పు చెప్పారు. దీనిని నేరంగా పరిగణించే ఐపిసి సెక్షన్ 377, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను అనగా 14,15,21 అధికరణలను ఉల్లంఘిస్తున్నాయని పేర్కొన్నారు. కావున అసహజ నేరాల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో దాఖలైన అప్పీలు పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం సెక్షన్ 377 (ఐపిసి) 'రాజ్యాంగ బద్ధత'ను ధృవీకరణకు నిశ్చయించుకుంది. ఈ చట్టంలో మార్పు అవసరమో కాదో కేవలం 'పార్లమెంట్'కు మాత్రమే అధికారం ఉంది తప్ప, న్యాయ స్థానాలకు కాదని తెలిపింది. కాలచక్రం ఎల్లప్పుడు భవిష్యత్తును మాత్రమే తెలియజేస్తూ ఉంటుంది. అయితే దాన్ని ఆపే ప్రయత్నం కొంత మంది ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు 1861లో ఈ చట్టాన్ని తీసుకొచ్చినప్పటి నుంచి నేటి వరకూ కూడా మత ఛాందసవాద సంస్థలు ఈ సెక్షన్ 377 (ఐపిసి) ఉండాల్సిందేనని గట్టిగా వాదిస్తున్నాయి. ఏ తరహా సమాజంలోనైనా వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, సామాజిక సాంప్రదాయక కట్టుబాట్లకు మధ్య ఇలాంటి వైరుధ్యం ఉంటుంది. అటువంటప్పుడు ప్రభుత్వం లేదా న్యాయ స్థానాలు క్రియాశీలకంగా వ్యవహరించి ఈ వైరుధ్యాన్ని పరిష్కరించాల్సి వస్తుంది.

2000 సంవత్సరంలో జస్టిస్ బిపి. జీవన్‌రెడ్డి నేతృత్వంలోని లా కమిషన్ సిఫారసులలో స్వలింగ సంపర్కం నేరంగా భావించలేమని, భారతీయ శిక్షాస్మృతి నుంచి దీనిని తొలగించాలని కూడా తెలియజేసింది. సెక్షన్ 377 (ఐసిపి)లో ఉన్న ఇతర అసహజ నేరాలను సెక్షన్ 376 ఎఫ్‌గా కూడా చేర్చుకోవచ్చునని పార్లమెంట్‌కు సిఫారసు చేసింది. అయితే

మచ్చ ప్రభాకర్ (1953-2018)



తెలంగాణ నుంచి, ముఖ్యంగా కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాల నుంచి పొట్ట చేతపట్టుకొని ముంబయి వెళ్లి అక్కడ కార్మికులుగా, చిరుద్యోగులుగా బతుకు వెళ్లదీస్తున్న వేలాది మంది తెలుగువారికి నాలుగు దశాబ్దాలుగా పెద్దదిక్కుగా ఉన్న మచ్చ ప్రభాకర్ జనవరి 23 ఉదయం అనుమానాస్పద స్థితిలో మరణించారు. 1953లో సిరిసిల్ల సమీపంలోని పోత్గల్ గ్రామంలో పద్మశాలి కుటుంబంలో పుట్టిన ప్రభాకర్ ముస్తాబాద్, సిద్దిపేట, హైదరాబాద్‌లలో చదువుకొని, ముంబయి వెళ్లి చేనేత కార్మికుడిగా జీవితం ప్రారంభించారు. అక్కడి తెలుగు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరి పాఠశాలలోను, బయటా ఎంతో మందికి చైతన్యమందించారు. కవిగా, అనువాదకుడిగా, ఉపన్యాసకుడిగా, సంఘ నిర్మాతగా ముంబయి తెలుగువారిలోను, ప్రగతిశీల, దళిత, బహుజన, విప్లవ శిబిరాలలోను నాయకుడిగా బహుళ ప్రజాదరణ పొందారు. తెలుగు, మరాఠీ, హిందీ, ఇంగ్లిష్ భాషలలో ప్రావీణ్యంతో ఎన్నో అనువాదాలు చేశారు. మూడు కవితా సంపుటాలు ప్రచురించారు. ‘బొంబాయి నగర నిర్మాణంలో తెలుగువారి పాత్ర’ అనే విస్తృత పరిశోధనాత్మక గ్రంథంతో పాటు అయిదు పుస్తకాలు ప్రచురించారు. ఉపాధ్యాయుడుగా ఉన్నప్పుడూ, పదవీ విరమణ తరువాత కూడా దళిత, బహుజన, విప్లవ సాహిత్య ప్రచారానికి తన పూర్తికాలాన్ని కేటాయించారు. ముంబయిలో ఉన్న తెలంగాణ కార్మికులందరిని ఏకం చేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగం పంచుకున్నారు. అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక ఏర్పడినపుడు దాని మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం గురించి పరిచయం చేస్తూ మరాఠీలో పుస్తకం రాశారు. గత కొద్ది కాలంగా చైనా యాత్రికు ఫాహియాన్ యాత్రా కథనం అధ్యయనం చేస్తూ అందులో తెలంగాణకు సంబంధించిన అంశాలను పుస్తకంగా రాయాలని ప్రయత్నం చేస్తున్నారు. భీమా కోరేగావ్ ఆందోళన నేపథ్యంలో రిలయన్స్ ఎలక్ట్రికల్స్‌లో పని చేస్తున్న కొంతమంది తెలంగాణ కార్మికులను మహారాష్ట్ర ఆంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ జనవరి 12న అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టి, వారిని మావోయిస్టులుగా చూపుతూ సంఘ వ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం కింద కేసు పెట్టింది. ఆ కార్మికులతో పాటు ప్రభాకర్‌ను కూడా అరెస్ట్ చేసి ఉంటారని, చిత్రహింసలకో, అవమానాలకో గురిచేసి ఉంటారని కచ్చితంగా తెలని సమాచారం ఉంది. ఆ కేసులో ఒక నిందితుడిగా ప్రభాకర్ పేరు పెట్టినప్పటికీ ఆయన అరెస్ట్ గురించి, విడుదల గురించి ఎఫ్ఐఆర్‌లో ఏ సమాచారమూ లేదు. అంటే, చిత్రహింసల వల్ల ఆయన మరణించడమో, ఆ అవమానం వల్ల ఆత్మహత్య చేసుకోవడమో జరిగి ఉంటుంది. జనవరి 23 ఉదయం ఆయన తన ఇంట్లోనే ఉరివేసుకొని మరణించారని పత్రికలలో వార్తలు వచ్చాయి. ఒక నెల కిందనే ఆయన సహచరి మరణించడం వల్ల తీవ్రమైన మానసిక ఆందోళనలో ఉన్న ప్రభాకర్ పోలీసు దాడితో మరింత కుంగిపోయి ఉంటారు. నాలుగు దశాబ్దాలు ముంబయి ప్రజాజీవితంలో ప్రముఖుడుగా ఉండిన ఆయన అంత్యక్రియలు సిరిసిల్లలో జరపడం వెనుక కూడా పోలీసు ఒత్తిడి ఉందేమో తెలియదు. వీక్షణం తొలిసంచిక నుంచి వీక్షణం అభిమానిగా, ముంబయిలో ప్రచారకుడిగా, రచయితగా ఉండిన ప్రభాకర్‌కు వీక్షణం నివాళి అర్పిస్తోంది. వీ

జస్టిస్ బిపి. జీవన్‌రెడ్డి కమిషన్ సిఫారసులను ఇంత వరకూ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే వివిధ పార్టీల నాయకులు, అధికార పార్టీ నేతలు వివిధ సందర్భాలలో వివిధ రకాలుగా వ్యాఖ్యానించడం ఈ విషయమై మనం చూస్తూ ఉన్నాం. గతంలో 2009-14 మధ్యలో అధికారంలో ఉన్న యుపిఎ 2 ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న వీరప్పమొయిలీ, అంబుమణి రాందాస్‌లు కూడా ఈ చట్టాన్ని రద్దు పరచాలని కూడా అన్నారు.

పక్కవారికి ఇబ్బంది కలిగించనంతవరకూ స్వలింగ సంపర్కం నేరం కాదని, ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోస్‌బలే మొదట ప్రకటించి, ఆ తర్వాత తన వైఖరి మార్చుకున్నారు. అది సామాజిక అనైతికమని వ్యాఖ్యానించారు. నైతిక విలువల భావనకు, వాస్తవానికి మధ్య వ్యత్యాస భావనలు మనలాంటి భారత సమాజంలో సహజంగానే ఉంటాయి.

పురుషాధిక్య సమాజంలో ఇతర జెండర్లను తక్కువ చేసి చూడడం సహజమే. స్త్రీ, పురుష శృంగారం మాత్రమే సహజమైనదని, పునరుత్పత్తితో ముడిపడని శృంగారం అసహజమైనదని అంటారు. మనుషుల్లో మాత్రమే కాదు, సమస్త జీవుల్లో కూడా ఇందుకు సంబంధించి వైవిధ్యతలున్నాయన్న సంగతిని ఒప్పుకోరు. అంతే కాకుండా, భిన్న లైంగిక భావనలున్న వారిని రోగులుగా పరిగణించడమే కాకుండా, వారికి చికిత్స జరిపిస్తే అందరి లాగానే ఉండగలరనే అభిప్రాయం చాలా మందిలో ఇప్పటికీ ఉంది. ఇద్దరు యువతులు ఇటీవల కలిసి (భార్య భర్తలుగా సహజీవనం) ఉండడానికి పట్టుబట్టడం, అందుకు వారిరువురి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో వివాదం తలెత్తడం అందరికీ తెలిసిన విషయమే. ఇది ఇటీవల మీడియాలో ప్రముఖంగా వార్తల్లోకి ఎక్కిన అంశం.

చివరిగా స్వలింగ సంపర్కులను ఈ చట్టం కింద అరెస్ట్ చేసి, శిక్షించిన సందర్భాలూ ఉన్నాయి. దాని వలన తలెత్తే ఇతర సమస్యలు కూడా తక్కువేం కాదు. సమాజం వెలివేసినట్లు చూడడం, వేధింపులకు దిగడం వలన స్వలింగ సంపర్కులు బాహాటంగా బయటపడరు. ఇది అనేక సమస్యలకు దారితీస్తుంది. అసలు ప్రేమించడమే సామాజిక నియమాల అతిక్రమణగా పరిగణించే మన సమాజంలో కులాంతర, మతాంతర పెళ్లిళ్లను ఆహ్వానించలేని సంకుచిత స్థితి ఉంది. కాబట్టి స్వలింగ సంపర్కం లాంటి లైంగిక భావనల విషయంలో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉంటుందో ఊహించుకోవచ్చు.

భారత రాజ్యాంగం వ్యక్తిగత స్వేచ్ఛకు, సమానత్వ భావనకు, మైనారిటీల హక్కులకు రక్షణ కల్పిస్తున్నది. ఐపిసి సెక్షన్ 377 చెల్లుబాటుపై గతంలో ఇచ్చిన తీర్పును విస్తృత ధర్మాసనం పునః పరిశీలించాలని సుప్రీంకోర్టు నిర్ణయించుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనం, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు కట్టుబడడాన్ని తెలియజేస్తుంది.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

జెరుసలెం, కొరియా - ఐక్యరాజ్య సమితి వైఫల్యం

జెరుసలెం, ఉత్తర కొరియా అంశాలలో ఐక్యరాజ్య సమితి అమెరికా వైఖరికి దాసోహమవుతోందనీ, అది సమతుల్యత సాధించే పాత్ర వహించడం కాకుండా నాయకత్వ స్థాయికి ఎదగాలనే ప్రయత్నం చేస్తోందనీ అంటున్నారు **బైరెడ్డి సతీష్**

చీమల పుట్టలోకి పాములు చొరబడి చీమల్నే పరాయికరించడం, అసలు పుట్టనే పాములు నిర్మించినట్టుగా కనపడే ప్రాకృతిక అంశంలాగా అనిపిస్తుంది పాలస్తీనా ప్రజల దశాబ్దాల ఘోష. తమ కాళ్లకింది నేల తమది కాదన్నట్టుగా ఎవడో పరాయివాడు వచ్చి పుట్ట తనదే అని పాము అనుకున్నట్టుగా అరబ్బు నేలంతా నాదే అంటుంది ఇజ్రాయిల్. తన నేలను తనది అని చెప్పుకోవడానికి తరాలుగా తండ్లాటపడుతున్నది పాలస్తీనా. ఇజ్రాయిల్ చెరబట్టిన నేల విముక్తి కోసం, తన అస్తిత్వాన్ని ఎత్తిపట్టడం కోసం నిత్యం నెత్తురోడుతున్నది పాలస్తీనా ప్రాంతం. జాత్యాహంకారం అర్థబలం, అంగ బలం, అన్ని కలగలిపి పాలస్తీనాను పణంగా పెట్టి ఇజ్రాయిల్ అమెరికా ముద్దుబిడ్డగా నిలబడి ఉన్నది. అరబ్‌లను ఆగం చేసి ఇజ్రాయిల్ అనే విషపు మొక్కను ఇవాళ మహా వృక్షంగా చేయాలని చూస్తున్నాయి అవే ఆధిపత్య దేశాలు.

గత డిసెంబర్ 6న ఇజ్రాయిల్ శాశ్వత రాజధానిగా జెరూసలెంను గుర్తిస్తున్నట్టు, సంవత్సర కాలంలో టెల్ అవీవ్ నుండి అమెరికా రాయబార కార్యాలయాన్ని తరలించనున్నట్టు ఏకపక్షంగా ప్రకటించి మధ్య ప్రాశ్చ్యంలో మళ్లీ మంటల్ని రాజేశాడు ట్రంప్. చరిత్రలో చెట్టుకొకరు, పుట్టకొకరు అయిన యూదులంతా బ్రిటిష్ సామ్రాజ్యవాదం అండతో అరబ్బుల నేలపై అడుగుపెట్టి, అరబ్బులనే నేల లేనివాళ్లుగా మార్చివేశారు. యూరప్‌లో నాజీ భావజాలంతో వేధించబడిన యూదులంతా పాలస్తీనాలో పాగా వేసి అసలు భూమి పుత్రులకు భూమి లేకుండా చేశారు. అమెరికా అండదండలతో పాలస్తీనా ప్రజలపై నిత్యం హింసను అమలుపరుస్తూ ప్రాంతీయ ఆధిపత్యాన్ని, సామ్రాజ్యవాదాన్ని అమలుపరుస్తున్నది ఇజ్రాయిల్.

600 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఒట్టోమాన్ సామ్రాజ్యం మొదటి ప్రపంచ యుద్ధానంతరం కుప్పకూలిపోవడంతో బ్రిటిష్ సామ్రాజ్యం పాలస్తీనాను తన ఆధీనంలోకి తెచ్చుకున్నది. సరిగ్గా శతాబ్దం క్రితం 1917లో బెల్‌ఫోర్ డిక్లరేషన్ పేరుతో పాలస్తీనా ప్రాంతంలోకి ప్రపంచ నలుమూలల నుండి ప్రత్యేకించి యూరప్ నుండి యూదుల వలసను ప్రోత్సహించింది బ్రిటిష్ ప్రభుత్వం. వలసయే కాకుండా పాలస్తీనా భూభాగంలో యూదు రాజ్య స్థాపనకై ఇజ్రాయిల్ ఏర్పర్చాలన్న ప్రతిపాదనను 1922లోనే నానాజాతి సమితి గుర్తించడం కూడా జరిగిపోయింది. పరాయిజాతికి తమ గడ్డపై రాజ్య రూపమివ్వడం సహజంగానే అరబ్బులకు ఆగ్రహాన్ని కలిగించడమే కాకుండా తీవ్రమైన ఘర్షణా రూపాన్ని కూడా తీసుకున్నది. ఈ ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో బ్రిటిష్ ప్రభుత్వం రాయల్ కమిషన్, పీల్ కమిషన్‌ను ఏర్పర్చింది. ఈ కమిషన్ పాలస్తీనాను అరబ్బులు, యూదుల మధ్య విభజించాలని ప్రతిపాదించడం అరబ్బులను మరింతగా రెచ్చగొట్టింది.

ఈ పరిస్థితుల దృష్ట్యా బ్రిటిష్ ప్రభుత్వం యూదుల వలసను నియంత్రించాల్సిన పరిస్థితి ఒకవైపు, యూరప్‌లో 1933 నుండి 1945 మధ్యకాలంలో చారిత్రకంగా హొలోకాస్ట్‌గా పిలువబడుతున్న యూదుల ఊచకోత ఫలితంగా యూదుల వలస మరింత పెరిగిపోవడంతో చేతులెత్తేసిన బ్రిటన్ ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించింది.

1947 నవంబర్ 29 న ఐక్యరాజ్య సమితి అరబ్బు యూదు రెండు రాజ్యాల ప్రతిపాదనను మరింతగా ముందుకు తీసుకెళ్లింది. కాని ఈ మధ్య కాలంలో పూర్తి స్థాయి రాజ్య నిర్మాణానికి అవసరమైన రాజకీయ వ్యవస్థలను యూదులు అభివృద్ధిపర్చుకున్నారు. ఇంతలో బ్రిటన్ అధికారం ఆ ప్రాంతంపై అంతమవ్వడంతో 1948 మే 14న యూదు నాయకుడైన డేవిడ్ బెన్ గురియన్ ఏకంగా ఇజ్రాయిల్ రాజ్య ఆవిర్భావాన్నే ప్రకటించాడు. ఆయనే ఇజ్రాయిల్ మొదటి ప్రధాని కూడా.

1948 మే 15న అమెరికా ఇజ్రాయిల్‌ను గుర్తించింది. యూదుల వలస ఎలాగూ కొనసాగుతూనే ఉంది. సరిగ్గా ఈ కాలంలోనే యూదులు అరబ్బుల మధ్య దాడులు తీవ్రమైనాయి. నిజానికి బ్రిటిష్ పాలనాకాలంలో కూడా ఈ తీవ్రత కనిపిస్తుంది. పూర్తిస్థాయి రాజ్యరూపు తీసుకున్న ఇజ్రాయిల్ 1948లో జరిగిన అరబ్ ఇజ్రాయిల్ యుద్ధంలో పశ్చిమ జెరూసలెంను ఆక్రమించింది. చారిత్రకంగా ఆరు రోజుల యుద్ధంగా పిలువబడిన 1967 కాలంనాటి ఇజ్రాయిల్ యుద్ధంలో తూర్పు జెరూసలెంతో పాటు ఈజిప్టు నుండి గాజా, జోర్డాన్ నుండి గోలాన్‌హైట్స్‌ను ఆక్రమించుకొని జెరూసలెంను ఇజ్రాయిల్‌కు శాశ్వత రాజధానిగా ప్రకటించుకున్నది. ఐక్యరాజ్య సమితి ఈ చర్యను మిలిటరి దురాక్రమణగా అభివర్ణించింది.

నిజానికి 1947లో ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఇజ్రాయిల్ రాజకీయ చిత్రపటంలో జెరూసలెంను చేర్చలేదు. పైగా 1947 అక్టోబర్ 29 ఐక్యరాజ్య సమితి తీర్మాణం ప్రకారం జెరూసలెం ఒక ప్రత్యేక నగరం (కార్పస్ సపరేటమ్) గా ప్రకటించి అంతర్జాతీయ ట్రస్టీషిప్‌కిందికి చేర్చడం జరిగింది. 1967 ఆరు రోజుల యుద్ధం తరువాత తూర్పు జెరూసలెంను స్వాధీనం చేసుకోవడాన్ని మిలిటరి దురాక్రమణ చర్యగా 267 తీర్మానంలో జులై 3, 1969 న విస్పష్టంగా ప్రకటించింది. ఈ తీర్మానాన్ని అనుసరించి ఇప్పటివరకు ఇజ్రాయిల్‌ను అధికారికంగా గుర్తించిన 88 దేశాల రాయబార కార్యాలయాలు ఇజ్రాయిల్ ఆర్థిక రాజధాని అయిన టెల్‌అవీవ్ నగరంలోనే కొలువైనాయి.

1949లో ఐక్యరాజ్య సమితి నియమించిన ఆర్మిస్టిస్ కమీషన్ సైతం జెరూసలెంను తూర్పు, పశ్చిమ ప్రాంతాలుగా స్పష్టంగా విభజించింది. ఏ అంతర్జాతీయ సంస్థలు కూడా జెరూసలెంలో తమ కార్యాలయాలను నెలకొల్పలేదు.

క్రీస్తు శకం 637 నుండి బ్రిటిష్ వాళ్లు ఒట్టోమాన్ సామ్రాజ్యాన్ని 1917లో కూల్చేవరకు జెరూసలెం నగర సంస్కృతి స్వభావం మొత్తం ఇస్లాంతో ముడిపడినదే. దాని ఆధునిక చరిత్ర ఆసాంతం ముస్లిం ప్రజలతో మమేకమైనదే. అసలు ఐక్యరాజ్య సమితి తీర్మానం అనుగుణంగానైనా రెండు రాజ్యాల ఏర్పాటు పరిష్కార ప్రతిపాదనలో కూడా పశ్చిమ జెరూసలెం ఇజ్రాయిల్‌కు తూర్పు జెరూసలెం పాలస్తీనాకు రాజధానులుగా ఉంటాయనేదే స్థూలంగా ప్రపంచ దేశాల అభిప్రాయం. ఐక్యరాజ్య సమితి తీర్మాణానికిగానీ, మెజారిటి దేశాల అభిప్రాయాలకు గానీ ఏ మాత్రం విలువ ఇవ్వని ఇజ్రాయిల్ అన్ని ప్రజాస్వామిక సూత్రాలను గాలికి వదిలేసి జెరూసలెంను శాశ్వత, అవిభాజ్య రాజధానిగా చేసుకొనే ఇజ్రాయిల్ బేసిక్ జెరూసలెం చట్టం అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధమని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.

1980 లోనే జెరూసలెంను రాజధానిగా చేసుకోవడం పరిపూర్ణమైనట్టుగా తన శాసనసభ అయిన నెసెట్‌లో తీర్మానం చేసింది. అసలు జెరూసలెం అంశమే అంతర్జాతీయమైనది కాదని అది తమ అంతర్గత వ్యవహారమనే రీతిలో ప్రవర్తించడం మొదలుపెట్టింది. 1993 ఇజ్రాయిల్ పాలస్తీనా శాంతి ఒప్పందం కూడా జెరూసలెం అంశాన్ని భవిష్యత్తు చర్చలకు వదిలివేసింది.

1995లో జెరూసలెం ఎంబసీ యాక్ట్ ఆఫ్ 1995ని అమెరికా చట్టసభలైన కాంగ్రెస్ సెనెట్‌లు ఆమోదించాయి. కానీ ఆ తరువాత ఏ అధ్యక్షుడు కూడా కనీసం రిపబ్లికన్ అధ్యక్షుడు కూడా దీన్ని అమలు పర్చే సాహసం చేయలేకపోయాడు. ఇజ్రాయిల్ పూర్వపు ప్రధాని ఏరియల్ షరోన్ అల్-అక్సద్ మజీద్ ప్రాంతాన్ని సందర్శించడంతో మరో 'ఇంటిఫాదా' మొదలైంది. ఇంతటి సంక్లిష్టమైన అంశంలో ట్రంప్ ఎందుకీ దుస్సాహసానికి ఒడిగట్టినట్టు? పిచ్చివాని చేతిలో రాయిలా ట్రంప్ చేతిలో అధికారం ఉన్నది. ట్రంప్ వాగాఢంబరంతో అందరిని భయపెడుతున్నా డనుకుంటే ఈ చర్యతో 'చేతాఢంబరం'తో కూడా భయపెట్టడం మొదలయ్యింది.

అయితే దీనికి నేపథ్యమూ లేకపోలేదు. ఇజ్రాయిల్ దేశంలో ఉన్న యూదులకన్నా అమెరికాలో ఉన్న యూదుల సంఖ్య అధికం. అత్యంత సంపన్నవంతమైన సమూహమే కాకుండా అమెరికా సామాజిక రాజకీయ రంగాన్నే శాసించే స్థాయిలో యూదులు ఉన్నారు. అమెరికా అన్ని జీవన రంగాల్లో కూడా వారి పాత్ర, ప్రభావం ఇతర సమూహాలకంటే ఎంతో ఎక్కువ. ట్రంప్ ఎన్నికల నిధులల్లో అధిక భాగం యూదు సంపన్నులు సమకూర్చినవే. అమెరికన్ సమాజంలో యూదు లాబి ఉన్నంత ప్రభావ వర్గంగా మరే సమూహమూ లేదంటే అతిశయోక్తి కాదు. ఆయుధాల ఉత్పత్తి, అమ్మకం, వ్యాపారం నుండి ఇతర పారిశ్రామిక రంగాల్లో వారి పట్టుతో సహజంగానే అమెరికా రాజకీయ విధానాలు ప్రభావితమౌతాయి.

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఒబామా అమెరికా అధ్యక్షుడుగా ఉన్న కాలంలో ఆయన్నే లెక్కచేయకుండా ఏకంగా కాంగ్రెస్‌లోనే యూదు లాబి ప్రాబల్యంతో ప్రసంగించాడు. దీనికి తోడు ఇజ్రాయిల్‌నే అన్నివిధాల సమర్థించే క్రైస్తవ మత ఛాందస సంస్థలు దీని వెనకాల బలంగా ఉన్నాయి. ప్రధానంగా మెజారిటి శ్వేతవర్ణ క్రైస్తవ మతస్తులు ట్రంప్ గెలుపులో కీలకపాత్ర వహించారు. యూదులు జెరూసలెంకు రావడాన్ని క్రీస్తు ద్వితీయ ఆగమనమని ప్రగాఢంగా విశ్వసించే అమెరికా క్రైస్తవ సమూహం కోరికను ట్రంప్ ఇలా తీర్చుకున్నాడు.

అమెరికా యూదు మతవాదుల కంటే క్రైస్తవ మతవాదుల్లోనే ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చేవాళ్లు ఎక్కువున్నారు. 82 శాతం అమెరికా శ్వేతవర్ణ క్రైస్తవులు ఇజ్రాయిల్‌ను క్రీస్తు యూదులకి ఇచ్చాడని విశ్వసిస్తున్నారు. అమెరికా ప్రయోజనాలకు విరుద్ధమైనా సరే జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించాలనే అమెరికా క్రైస్తవ మతవాదుల సంఖ్య 66 శాతంగా ఉంది. వీరంతా ట్రంప్‌కే ఓటు వేసారు. ట్రంప్ ఎన్నికల హామీల్లో ఈ సమూహాలను సంతృప్తిపర్చేవి చాలానే ఉన్నాయి. అమెరికన్ ఇజ్రాయిల్ పబ్లిక్ ఎఫైర్స్ కమిటి (ఎఐపిఎసి) చాలా బలంగా ఈ చర్యకై యంత్రాంగాన్ని నడిపింది. ది రిపబ్లికన్ జూయిష్ కొయిలేషన్ అనే యూదు సంస్థ న్యూయార్క్ టైమ్స్‌లో సాహసోపేతమైన శాశ్వత చర్యగా ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ పెద్ద ప్రకటననే జారీచేసింది.

నిజానికి జెరూసలెం అబ్రహామిక్ విశ్వాసాలైన యూదు, క్రైస్తవ, ఇస్లాంలకు 'పవిత్ర' స్థలంగా గుర్తించబడింది. కేవలం యూదుల ఆకాంక్షనే గుర్తించడమంటే పాలస్తీనీయుల మత స్వేచ్ఛను ఉల్లంఘించడమే. మక్కా, మదీనా తరువాత అల్ అక్సా మాస్క్ ముస్లింలకు మూడవ పవిత్ర స్థలం. జెరూసలెం మొత్తం జనాభాలో 64 శాతం యూదులు

34 శాతం ముస్లింలు, 2 శాతం క్రైస్తవులు ఉన్నారు. ఈస్ట్ జెరూసలెంను ఇజ్రాయిల్ ఆక్రమించుకున్న తరువాత 566 అక్రమ నిర్మాణాలను చేపట్టి మొత్తం భూభాగంలో అరబ్బులకు కేవలం 13 శాతం మాత్రమే మిగిల్చింది. 34 శాతం జనాభాకి సంబంధించిన అంశాన్ని ఉద్దేశ్యపూర్వకంగా, అహంకారపూరిత వైఖరితో విస్మరించి యూదులను క్రైస్తవ మత వాదులను సంతృప్తి పర్చేలా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇజ్రాయిల్‌కి పాలస్తీనాకి మధ్యవర్తిలా, 'పెద్దన్న'లా వ్యవహరిస్తున్నట్టు కనిపించినా అమెరికా ఏనాడూ తటస్థంగానో, పెద్దరికంగానో వ్యవహరించలేదు. పచ్చిగా, ఫక్తుగా ఇజ్రాయిల్ పక్షాన్నే నిలిచింది. ఈ నిర్ణయంతో అదీ కాస్తా బట్టబయలైంది.

ఐక్యరాజ్య సమితిలో ఎక్కువ సార్లు అమెరికా తన వీటో అధికారాన్ని ఇజ్రాయిల్ ప్రయోజనాల పరిరక్షణకే వినియోగించుకున్నదంటేనే అది ఎటువైపున్నదో తేల్చుకోవచ్చు. పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ వ్యాఖ్యానించినట్టు ఈ చర్యతో అమెరికా ముసుగు తొలగిపోయింది. 'మధ్యవర్తిత్వం', పెద్దరికం చేసే అర్హతను సంపూర్ణంగా కోల్పోయింది.

ఇక ఇపుడు ఇజ్రాయిల్ మరింత దూకుడుగా వ్యవహరించి పాలస్తీనీయులపైన మరింత హింసను ప్రయోగించే ప్రమాదం ఉన్నది. అన్ని సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా పాలస్తీనా న్యాయబద్ధమైన ఏ చిన్న కోరికనైనా అంతర్జాతీయ సమాజం గుర్తిస్తే గగ్గోలు పెట్టే ఇజ్రాయిల్ అన్ని న్యాయసూత్రాలను ఉల్లంఘించి జెరూసలెంను ఇజ్రాయిల్ శాశ్వత రాజధానిగా అమెరికా గుర్తించడాన్ని గంతులేస్తూ స్వాగతిస్తూ, అది ఆ ప్రాంతంలో శాంతిని నెలకొల్పుతుందనే అమెరికా సన్నాయి నొక్కులను సమర్థిస్తున్నది. మరోవైపు ఇస్లామిక్ దేశాలు ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు కనపించినా వాటి మధ్య ఐక్యత లేకపోవడం ఇజ్రాయిల్‌కు కలిసి వస్తున్నది.

ఈజిప్టు, సౌదీ అరేబియాలు బయటికి అమెరికా నిర్ణయాన్ని వ్యతిరేకించినా ఆ ప్రభుత్వాలు రెండూ అమెరికా కనుసన్నల్లో నడుస్తున్నవే! పైగా సున్నీ ఆధిపత్య సౌదీకి, షియా ఆధిపత్య ఇరాన్‌కి మధ్య ప్రాంతీయ ఆధిపత్య పోరు తీవ్రమౌతున్న నేపథ్యంలో అమెరికా నిర్ణయం వెలువడడం గమనించదగింది.

ఇస్లామిక్ దేశాలు ఐక్యతను సాధించకుండా వాటి మధ్య

శ్రామిక అర్థశాస్త్రం ప్రథమ పాఠాలు

***కారల్ మార్క్స్ రచన 'కాపిటల్'కు 150 ఏళ్లు నిండిన సందర్భంగా, 2018 చార్వాక కేలండర్ కోసం ఆ గ్రంథాన్ని సరళంగా వివరించారు* డా. ఆర్‌కె**

అర్థశాస్త్రమనేది అర్థం కానిదనీ, యూనివర్శిటీలకి, థీసిస్‌లకి పరిమితమైనదనీ అనుకోవడం పొరపాటు. అది మన మధ్య, మనందరి కోసం పుట్టిన శాస్త్రం. కూలి పని – పెట్టుబడి, అమ్మకం –కొనుగోలు, లాభం – నష్టం ఇత్యాది ఆర్థిక సంబంధాలు నిజ జీవితంలో నిత్యకృత్యాలు. అయితే మన కళ్ల ముందున్న నిజాల్ని కప్పిపుచ్చి మసిపూసి మారేడుకాయ జేసినట్టు, కొందరు మేధావులు అర్థశాస్త్రాన్ని ఆగర్భవంతుల శాస్త్రంగా మార్చేశారు. సప్లయి, డిమాండ్‌లను బట్టి మాత్రమే ధర, లాభం ఉంటుందన్నారు. కొబ్బరికాయలో నీరు ఊరినట్లు కొద్ది కొద్ది లాభాలను జాగ్రత్తగా కూడబెట్టుకొంటే అదే పెట్టుబడి అవుతుందన్నారు. పెట్టుబడులతో ఫ్యాక్టరీలను పెట్టి 'శ్రమకు తగ్గ కూలి' ఇవ్వడంలో ఎంతో 'న్యాయం' ఉందన్నారు. మేలిమిగా కనపడే పెట్టుబడిదారీ సమాజం అనే మేడిపండును విప్పి దానిలో దాగిన పురుగులను బహిర్గతం చేసినవాడు కార్ల్‌మార్క్స్. 150 ఏళ్ల క్రితం 'కేపిటల్' గ్రంథాన్ని రచించి ఆర్థిక దోపిడీలోని అసలు సత్యాన్ని ఆవిష్కరించాడు.

శ్రమ అంటే ఏమిటి? ప్రకృతిని మానవుడు తన అవసరాల కనుగుణంగా మార్చుకోవడమే శ్రమ. నదిలో నీటిని నిలువజేసి విద్యుత్తును వెలికితీయడంలో శ్రమ ఉంది. గనుల నుండి బొగ్గు, ఇనుము, పెట్రోలు, బంగారం తవ్వి తీయడంలో శ్రమ ఉంది. యంత్రాలను కదలించడంలో, భవనాలను నిర్మించడంలో, భూమిని సాగు చేయడంలో శ్రమ ఉంది. ఈ విశ్వంలో శ్రమ సౌందర్యం కనపడేది భూగ్రహంలోనే.

శ్రమ మానవుడి సొంతం. శ్రమ ద్వారానే మానవుడు తన జీవితావసరాలను ఉత్పత్తి చేసుకుంటున్నాడు. అవసరాలే పనిముట్లను సృష్టించుకుంటాయి. పనిముట్లను మానవుడు నిత్యం మెరుగు పరుచుకుంటాడు. దాని ప్రకారం ఉత్పత్తి విధానం, సామాజిక జీవితం మారుతూ ఉంటుంది.

మాతృస్వామిక గణ వ్యవస్థ మానవ సమాజపు తొలి దశ. ఆ దశలో పనిముట్లు అతిహీన స్థాయిలో ఉండేవి. ఎవరి పనిముట్లు వారివే. అందరూ శ్రమించేవారే. శ్రమ ఫలితాలను సమానంగా అనుభవించే వారు. మిగులు ఉండేదికాదు.

వ్యవసాయం, పశుపోషణ, చేతిపనులు అభివృద్ధి చెందడంతో మిగులు, మారకం అమలులోకి వచ్చాయి. స్థిరనివాసం, పితృస్వామ్యం, సొంత ఆస్తి ఏర్పడ్డాయి. ఆర్థిక వనరులు పెరిగాయి. తెగల మధ్య

చిచ్చుపెట్టడం, ఆయుధాలు అందించడం ద్వారా అమెరికా తన సామ్రాజ్యవాద ఎజెండాను మరింత నగ్నంగా ముందుకు తీసుకెళ్తున్నది. యెమెన్, సిరియా, ఆఫ్ఘన్‌లలో అది పోషిస్తున్న విధ్వంసక పాత్రే వర్తమాన సాక్ష్యం. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల పేరుతో ఆ దేశంలో గందరగోళం సృష్టించి ఇజ్రాయిల్ పాలస్తీనా అంశంపై దృష్టి నిలపనీయకుండా చేయడమే కాకుండా సౌదీ అరేబియా ఆధిపత్యాన్ని మరింత పెంచేలా వ్యూహం పన్నుతున్నది అమెరికా. విభజించి పాలించు అనే కుటిల నీతిని బాగానే అమలు జరుపుతున్నది.

అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు, ఐక్యరాజ్య సమితి తీర్మాణాలకు విరుద్ధమైన అమెరికా నిర్ణయాన్ని ఐక్యరాజ్య సమితితో పాటు ప్రపంచ దేశాలు 'తీవ్రంగా'నే వ్యతిరేకించాయి. ఈ చర్యను వ్యతిరేకిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ప్రవేశపెట్టబడిన తీర్మాణానికి అనుకూలంగా 128 దేశాలు, వ్యతిరేకంగా 9 దేశాలు 13 దేశాలు తటస్థంగా ఉండిపోయినవి. ఏదో తీర్మాణాలకు మాత్రమే పరిమితమైన ఐక్యరాజ్య సమితి చర్యకి ప్రతిచర్య అన్నట్టుగా అమెరికా ఐక్యరాజ్య సమితికి అందించే ఆర్థిక వనరులలో భారీగా కోతపెట్టనున్నట్టు ప్రకటించింది. లాంఛనప్రాయ ప్రక్రియకే పరిమితమయ్యే చర్యలకు కూడా ఉపక్రమించే వీలు లేదని, తనను వ్యతిరేకించే ఏ వ్యవహారాన్ని తను సహించనని అమెరికా స్పష్టమైన సంకేతాన్నిచ్చింది. భారత దేశానికి సంబంధించినంత వరకు మొసాద్ (ఇజ్రాయిల్ ఇంటలిజెన్స్ సంస్థ) అంటే పడిచచ్చే ఆర్‌ఎస్‌ఎస్ నడిపిస్తున్న ప్రధాని మోడి గారు ఇజ్రాయిల్ సందర్శించిన తొలి భారత ప్రధాని అయ్యారు.

జెరూసలెం విషయంలో ఐక్యరాజ్య సమితిలో అమెరికాకు వ్యతిరేక ఓటు చేసినప్పటికీ ఇప్పటివరకు సమతుల్యతను సాధించే పాత్రను పోషించే స్థాయి నుండి అంతర్జాతీయ వ్యవహారాల్లో 'నాయకత్వ' స్థానానికి ఎగబాకాలన్న ధోరణియే ఎక్కువగా కనిపిస్తున్నది. ఐక్యరాజ్య సమితి ఉత్తర కొరియా విషయంలో అమెరికా ఆంక్షలను పూర్తిగా సమర్థిస్తూ ఎందుకు తీర్మాణం చేసింది? ఆ తీర్మాణానికి భారత్ ఎందుకు మద్దతు పల్కింది? భారత్ కూడా అణ్వాయుధ దేశమే కదా! ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నదనేది స్పష్టం.

ఏది ఏమైనా జెరూసలెంను ఇజ్రాయిల్ శాశ్వత రాజధానిగా గుర్తిస్తున్నట్టుగా అమెరికా ప్రకటించడం, పాలస్తీనాను మరింత సంక్షోభంలోకి నెట్టివేయడమే కాకుండా జెరూసలెంపై తన హక్కుకోసం చేసే న్యాయబద్ధమైన పోరాటాన్ని కూడా ఇజ్రాయిల్ అమెరికా అండతో అణిచి వేసే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ సమాజం ప్రత్యేకించి ఇస్లామిక్ ప్రపంచం ఐక్యంగా, ఆయా దేశాల్లోని ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు ప్రజా ఉద్యమాలతో ఆయా ప్రభుత్వాలు పాలస్తీనాకు అండగా నిలిచే కార్యాచరణ రూపొందించేలా ఒత్తిడి తెచ్చే చారిత్రక బాధ్యతను భుజాన వేసుకోవాలి.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

యుద్ధాలలో ఓడిన వారిని, అప్పుల పాలైన రైతులను బానిసలుగా మార్చారు. దానితో పాలకులు, పాలితులుగా వర్గసమాజం ఏర్పడింది.

వ్యవసాయం నుండి చేతి పనులు విడిపోవడంతో వస్తు మార్పిడి విస్తృతమైంది. మొదట ఒక వస్తువునిచ్చి మరొక వస్తువును తెచ్చుకొనేవారు. ఇది సహజ ఉత్పత్తి విధానం. మానవులు తమ అవసరాల కోసమే ఉత్పత్తి చేసుకొనేవారు. ఉపయోగపు విలువే ఈ ఉత్పత్తికి కీలకం. ఉదాహరణకు, 1 జత చెప్పులు=10 శేర్లు ధాన్యం. తర్వాత ఒక వస్తువును ప్రామాణికంగా తీసుకొని దానికి సమానమైన ఇతర వస్తువులను మార్చుకొనేవారు. పశువులు, ఉప్పు, తోలు, నూలు మొదలైనవి ప్రామాణిక వస్తువులు.

ఉదాహరణకు

ఎద్దు
- 5 బస్తాల ధాన్యం
- 20 గజాల వస్త్రం
- 1 పడవ
- 2 నాగళ్లు

బానిస సమాజంలో జీవితావసరాలు పెరిగాయి. తాను ఉత్పత్తి చేసిన వస్తువులను ఇతరులు ఉత్పత్తి చేసిన వస్తువులతో మారకం చేసుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. దీనిని 'సామాన్య సరుకుల ఉత్పత్తి విధానం' అంటారు.

మానవులు తమ అవసరాల కోసమే ఉత్పత్తి చేసుకొంటే అది 'వస్తువు' అవుతుంది. ఏ వస్తువుకైనా 'ఉపయోగపు విలువ' ఉంటుంది. మార్పిడి కోసమే వస్తువును తయారుచేసి దానికి బదులుగా తనకు కావాల్సిన వస్తువును తీసుకొంటే అది 'సరుకు' అవుతుంది.

ఫ్యూడల్ రాజుల కాలం నాటికి రాగి, వెండి, బంగారం మారకంలో ప్రముఖ పాత్ర వహించాయి. చారిత్రక క్రమంలో అన్నింటికీ సరిపోయే ఒక సార్వత్రిక సమమగు వస్తువు (యూనివర్సల్ ఈక్వివాలెంట్)గా బంగారం స్థిరపడింది. బంగారం మన్నికైన ఖనిజం. కాలగమనంలో విలువ కోల్పోనిది. రవాణాకి సులువైనది. ఎన్ని చిన్న నాణేలుగానైనా విభజింప దగినది. బంగారు నాణేలపైన ఫ్యూడల్ కాలంలో రాజముద్రికలు వేసి అధికారికంగా చలామణి చేశారు. పెట్టుబడిదారి యుగంలో బంగారం స్థానే కరెన్సీ నోట్లు వచ్చాయి.

15, 16 శతాబ్దాలలో కార్ఖానాలు వచ్చాయి. సైన్సులో కొత్త ఆవిష్కరణలు జరిగాయి. సముద్ర వ్యాపారం పెరిగింది. పెట్టుబడిదారులు, కార్మికులు అనే కొత్త వర్గాలు పుట్టాయి. పారిశ్రామిక విప్లవాలతో పాత ఫ్యూడల్ రాజరికాలు కూలిపోయి పెట్టుబడిదారీవర్గం అధికారంలోకి వచ్చింది.

విలువలు మారాయి. మనిషి డబ్బును సృష్టించాడు. డబ్బు మనిషిని శాసించింది. ఇంతవరకు వస్తువు కోసమే మారకం జరిగింది. ఇపుడు వస్తువు స్థానంలో డబ్బు చేరింది. ఫార్ములా మారింది.

సరుకు – డబ్బు – సరుకు → డబ్బు – సరుకు – డబ్బు
C M C M C M

పెట్టుబడి పెట్టి లాభాల కోసం సరుకును ఉత్పత్తి చేసే పెట్టుబడిదారీ సరుకుల ఉత్పత్తి విధానం అమలులోకి వచ్చింది.

శ్రమ విలువ: పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో అమితంగా పోగుపడే సరుకుల సముదాయమే ఆ సమాజపు సంపద అన్నాడు మార్క్స్. బెల్లం చుట్టూ ఈగలు తిరిగినట్టు, సరుకు అనే ఇరుసు చుట్టూ పెట్టుబడి చక్రం తిరుగుతుంది. ఈ సమాజంలో ప్రతిదీ సరుకే, కుటుంబ సంబంధాలతో సహా.

సరుకు అంటే సొంత అవసరాల కోసం మాత్రమే కాదు. ఇతరుల అవసరాలు, కోరికలు తీర్చడం కోసం కూడా. పొట్టకూటి కోసమైనా, విలాసాల కోసమైనా ఈ సరుకు మారకం లేదా అమ్మకం కోసం మాత్రమే కానీ ఉచితంగా కాదు. అంటే ప్రతి సరుకుకు రెండు విలువలు ఉపయోగపు విలువ, మారకం విలువ ఉంటాయి.

మార్కెట్‌కెళితే కళ్లు చెదిరేట్లు ఎన్నో వస్తువులు కనబడతాయి. ప్రతిదానికి ఒక స్థిరమైన రేటు. పావుకిలో ఉప్పు రు.5, కెజి బియ్యం రు. 50, వెండి వేలల్లో, బంగారం లక్షల్లో ఉంటుంది. సరుకుకు ఈ విలువ ఎలా ఏర్పడుతుంది? ఈ సరుకుల మధ్య ధరలలో ఇంతటి వ్యత్యాసం ఎలా వచ్చింది?

ఈ విలువ ఉపయోగం బట్టి కాదు. నిత్యావసరాలైన పప్పు, ఉప్పు, బియ్యం కంటే విలాస వస్తువులైన వెండి, బంగారం, వజ్రాలకు విలువ ఎక్కువ. తూకం బట్టి కాదు. టన్ను ఇనుము కంటే పది కిలోల బంగారం ఖరీదు ఎక్కువ. వస్తువులెన్ని ఉన్నా, ఎంతటి వైవిధ్యం ఉన్నా, ఏ వస్తువూ శూన్యం నుండి సృష్టింపబడదు. ఒక వస్తువును తయారు చేయాలంటే యంత్రం, పనిముట్లు ఉంటే సరిపోదు. దానికి శ్రమను జోడించాలి. శ్రమ లేకుండా ఏ వస్తువూ లేదు. సరుకులన్నింటిలోనూ ఉన్న ఒకే ఒక ఉమ్మడి అంశం శ్రమ.

శ్రమకు కొలమానం ఏమిటి ? గడియారమే, అంటే కాలమే. ఒక వస్తువును తయారు చేయడానికి ఎంతకాలం పట్టిందనేది శ్రమకు కొలబద్ద. గంటలు, రోజులు, వారాలు, నెలలు... దీనిని 'శ్రమకాలం' అంటారు. వస్తువు తయారీలో ఇమిడి ఉన్న శ్రమ కాలమే ఆ వస్తువు విలువను నిర్ణయిస్తుంది. శ్రమ కాలం ఎక్కువగా ఉంటే, ఆ వస్తువుల విలువ ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు, వెండి, బంగారం మొదలైనవి. శ్రమకాలం తక్కువగా ఉంటే ఆ వస్తువు విలువ తక్కువ ఉంటుంది. ఉదాహరణకు, ఉప్పు, చింతపండు మొదలైనవి.

శ్రమ ఒకే రకంగా ఉండదు. బద్ధకస్తుడు నెమ్మదిగా, చురుకైనవాడు త్వరితంగా పని పూర్తిచేస్తాడు. పూర్వం చేతి పనిముట్లతో గంటల తరబడి చేసే పనిని, ఇపుడు యంత్రాలపై నిముషాలలో చేయగల్గుతున్నారు. నిత్యం పనిముట్లను మెరుగు పరుచుకొనే మానవుల ఉత్పత్తి సామర్థ్యం నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ఉత్పత్తి సామర్థ్యం పని కాలాన్ని ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు, మగ్గంపై 10 గజాల వస్త్రం నేతకు 10 గంటల కాలం పడితే, యంత్రంపై అదే వస్త్రం 10 నిమిషాలలో తయారవుతుంది.

అందువల్ల ఒక వస్తువులోని శ్రమ మొత్తం విలువను పరిగణనలోకి తీసుకొనేటప్పుడు వ్యక్తుల్ని గాక, ఆయా కాలాలలోని పని పద్ధతులు, సాంకేతిక నిపుణత, అందరూ పనిచేసే సగటు శ్రమ కాలాన్ని మదింపు చేయాలి. అలాగే మేధోశక్తిని సమకూర్చుకోవడానికి ఎక్కువ కాలం పడుతుంది గనుక శారీరక శ్రమ కంటే మేధోశ్రమకి ఎక్కువ విలువ ఉంటుంది.

శ్రమ అంటే సగటు సామాజిక శ్రమ లేదా సామాజిక శ్రమకాలం. అదే సరుకుల మారకం విలువ. మారకం అంటే సరుకుకు సరుకుకు మధ్య కాదు. ఆయా సరుకుల తయారీకి వినియోగింపబడిన సగటు సామాజిక శ్రమ కాలాల మధ్య విలువ.

ఉదాహరణకు, ఒక జత చెప్పులు విలువ, 10 గంటల వస్త్రం విలువ సమానం అంటే అర్థం ఆ రెండు సరుకుల తయారీ శ్రమ కాలం ఒకటేనని అర్థం.

శ్రమశక్తి – అదనపు విలువ : సొంత పనిముట్లతో, సొంత అవసరాల కోసం వస్తువులను తయారు చేసుకొనే సామాన్య ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ వ్యవస్థలో భూస్థాపితం చేయబడింది. శ్రమ తన సహజ స్వభావాన్ని కోల్పోయింది. ఈ సమాజంలో భూమి, భవనాలు, యంత్రాలు, పనిముట్లు పెట్టుబడిదారులవి. కార్మికుడికున్న ఒకే ఒక ఆస్తి శ్రమ శక్తి. అది శరీరం, మేధస్సు కలగలిసిన మహాశక్తి. పనిచేయగల సామర్థ్యం. ఆ శక్తిని కొనుగోలు చేయడం ద్వారానే పెట్టుబడిదారుడు ఉత్పత్తి క్రమాన్ని పరిపూర్తి చేయగలడు.

కార్మికుడు చట్టరీత్యా స్వతంత్ర పౌరుడు. ఇష్టమైతేనే పనిలోకి వెళతాడు. యజమానిని ఎంచుకొనే స్వేచ్ఛ ఉంది. కాని అతడు పనిలోకి వెళ్లక తప్పదు. బతకాలంటే అదొక్కటే మార్గం. కార్మికుడు తమ శ్రమశక్తిని నిర్ణీత కాలానికి మార్కెట్‌లో వేలం పెడతాడు. ఇక్కడ శ్రమశక్తి అమ్మకానికి రెడీగా ఉంది గనుక అది సరుకు అవుతుంది. ఉత్పత్తి క్రమంలో యంత్రం, ముడి పదార్థాలు, పనిముట్ల సరసన కార్మికుడి శ్రమశక్తి కూడా పెట్టుబడిలో ఒక భాగమవుతుంది. అయితే ఉత్పత్తిలో అతనికి వాటా ఏ మాత్రం ఉండదు.

కార్మికుడు తన శ్రమశక్తిని కూలి లేదా జీతానికి అమ్ముకుంటాడు. ఆ జీతం లేదా కూలి అతడు, అతని కుటుంబం ఉండడానికి, తినడానికి ఆనాటి సామాజిక జీవితంలో కనీస కోర్కెలు తీర్చుకోడానికి ఇస్తారు. మరునాడు కార్మికుడు పనికి రావాలంటే ఈ అవసరాలు తప్పనిసరి.

దోపిడీ అంటే ఏమిటి? అదెక్కడుంది? చట్టరీత్యా స్వేచ్ఛగా కార్మికుడు నియమిత కాలం పనిచేస్తున్నాడు. అతని శ్రమకు తగ్గ ఫలితాన్ని ఇస్తున్నాం గదా అంటారు పెట్టుబడిదారులు.

ఇక్కడే మార్క్స్ ప్రవేశించాడు.

శ్రమ వేరు. శ్రమశక్తి వేరు అన్నాడు. పని చేయడానికి కార్మికుడిలో ఇమిడి ఉన్న శారీరక, మానసిక సామర్థ్యం – శ్రమశక్తి. ఆ శ్రమశక్తిని నిర్ణీత కాలం ఫ్యాక్టరీలో వినియోగించి పనిచేయడం – శ్రమ. కార్మికుల కిచ్చేది శ్రమశక్తి విలువ అంటే కనీస జీవితావసరాల విలువ మాత్రమే. శ్రమ విలువకాదు. అంటే నిర్ణీత కాలం చేసిన పని మొత్తం విలువ కాదు.

ఉదాహరణకు, ఒక చెప్పుల ఫ్యాక్టరీలో గంటకి 20 రూపాయల పనికి ఒక కార్మికుడు చేరాడు. ప్రతి 15 నిమిషాలకి 30 రూపాయల విలువ గల సరుకు తయారు చేశాడు. అంటే గంటకి రు. 120 సృష్టించాడు. ఒప్పందం ప్రకారం కార్మికుడికి రు. 20 ఇచ్చేశారు. మిగిలిన సరుకు రు. 100 యంత్రం తరుగుదలకి, తోలు తదితర ఖర్చులకి రు. 80 పక్కన పెట్టాడు. పెట్టుబడి ఖర్చులు, కార్మికుడి కూలి పోను రు. 20 కొత్త విలువ సరుకు చేరింది. ఈ విలువ సరుకు మార్కెట్‌కు వెళ్లకుండానే, అమ్మకం కాకుండానే, ఫ్యాక్టరీ ఆవరణలోనే సమకూడింది. ఇది అదనపు విలువ. దోచుకున్న కార్మికుడి అదనపు శ్రమ. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుడి శ్రమదోపిడీని మానవాళి చరిత్రలో తొలిసారి బహిర్గతం చేసినవాడు కార్ల్‌మార్క్స్.

వర్గరహిత సమాజంలో మనిషి తన కోసం తాను పని చేసేవాడు. దోపిడీ వర్గ సమాజంలో పని కాలం రెండుగా విభజితమైంది. ఒకటి, తన పొట్ట కోసం, రెండు, యజమాని కోసం.

రోమ్ సామ్రాజ్యంలో, పెద్ద పెద్ద ఎస్టేట్స్‌లో, బానిసలు వారానికి ఒక రోజు తన కోసం, మిగిలిన రోజులు యజమాని కోసం పనిచేశారు. ఫ్యూడల్ సమాజంలో రైతులు వారానికి మూడు రోజులు కుటుంబ అవసరాల కోసం కౌలు భూమిలో, మరో మూడు రోజులు భూస్వామి సొంత భూమిలో బలవంతపు వెట్టి చాకిరీ చేశారు. అదనపు విలువ కూడా ఇలాంటిదే అయినా నిత్యం కళ్లముందే కదలాడే ఈ రహస్య దోపిడీని పెట్టుబడిదారీ సమాజంలో దాచేశారు.

8 గంటల పనిదినంలో మొదటి 4 గంటలు శ్రమ విలువ యజమానియిచ్చే కూలి లేదా జీతానికి సరిపోతుంది. మిగిలిన కాలం ఉత్తి చాకిరీయే. యజమాని పెట్టుబడి విలువను పెంచే గాడిద చాకిరీయే. ఇదిగాక ఏదో రకంగా పనికాలాన్ని పెంచటమో, కూలి నాలి తగ్గించడమో యజమాని నైజంగా ఉంటుంది. కార్మికుడు పని గంటలు తగ్గింపు కోసం, జీతాల పెంపు కోసం నిరంతరం పోరాడతాడు. ఒకనాడు 18 గంటల పనిదినం ఉండేది. 1885 మే1న అమెరికాలోని చికాగో వీధుల్లో కార్మిక వీరులు చిందించిన రక్తంతో 8 గంటలుగా అమలు చేయబడింది. శ్రమకాలానికి అంతటి మహత్తర శక్తిఉంది.

ద్రవ్యం, ధర, లాభం, ద్రవ్యోల్బణం

డబ్బు అంటే, సరుకే అయినా అది అన్ని సరుకుల లాంటిది కాదు. డబ్బును సార్వత్రిక సమమగు వస్తువు అంటారు. అదే బంగారం. దానితో ఏ వస్తువునైనా మారకం వేయవచ్చు.

అన్ని వస్తువులు లాగానే బంగారం ఉత్పత్తి చేయటానికి పట్టే సగటు శ్రమ కాలమే దాని విలువ. ఇతర సరుకులు లాగానే దాని విలువలో ఎగుడు, దిగుడులుంటాయి. ఇవి ఇతర సరుకుల మారకం విలువలో ప్రతిబింబిస్తాయి.

ఉదాహరణకు,

20 గ్రా. బంగారం తయారీకి – 40 గం. శ్రమకాలం
10 గ్రా. బంగారం తయారీకి – 20 గం. శ్రమకాలం
5 గ్రా. బంగారం తయారీకి – 10 గం. శ్రమకాలం

అలాగే 40 గం. శ్రమకాలం పట్టే ఏ సరుకైనా 20 గ్రా. బంగారంతో సమమవుతుంది. ఉదాహరణకు, వెండి బిందె 40 గం. శ్రమ కాలం = 20 గ్రా. బంగారం. గడియారం 20 గం = 10 గ్రా. బంగారం, కుర్చీ 10 గం. = 5 గ్రా. బంగారం. ఆధునిక యుగంలో అధికార ముద్రతో కాగితం రూపంలో డబ్బు వచ్చింది. ఇది బంగారం ప్రాతిపదికపైనే ఉంటుంది.

సరుకు విలువను డబ్బు రూపంలో చెప్పాలంటే 'ధర' అంటాం. సూత్రరీత్యా విలువే ధర. అయితే ధరలలో ఊగిసలాటలుంటాయి. మార్కెట్‌లో ధరలను ప్రభావితం చేసే ముఖ్య శక్తులలో ఒకటి సరుకుపై గుత్తాధిపత్యం. ప్రభుత్వ సబ్సిడీలు కొంత మేరకు కొన్ని ధరలను తగ్గిస్తాయి. సప్లయి, డిమాండ్‌లు, మధ్య దళారీల పాత్ర కూడ ధరలపై గణనీయంగా ఉంటుంది. అయితే కొందరు ఆర్థికవేత్తలు సప్లయి, డిమాండ్‌లే ధరలను నిర్ణయించుతాయని అంటారు. అది సరికాదు. ధరలు ఎప్పుడూ ఒక నిర్ణీతరేఖకు అటు, ఇటుగా ఉంటాయి. ఆ రేఖను నిర్ణయించేది సరుకు

విలువ. కారు ధర లక్షలలో ఉంటుంది. ప్లాస్టిక్ బకెట్ ధర పదులలో ఉంటుంది. ఎట్టి పరిస్థితులలోను వీటి విలువలు తారుమారు అవవు.

లాభం అంటే ఏమిటి ? తక్కువ రేటుకి కొని ఎక్కువ రేటుకి అమ్మితే అదే 'లాభం' అంటారు కొందరు తెలివిగలవాళ్లు. ఈ లాజిక్ ప్రకారం ఎప్పుడూ కొనేది తక్కువ, అమ్మేది ఎక్కువగా ఉండాలి. ఎక్కడా అందరూ అమ్మేవాళ్లు, అందరూ కొనేవాళ్లు ఉండరు. అమ్మేవాళ్లు, కొనేవాళ్లవుతారు. కొనేవాళ్లు అమ్మేవాళ్లవుతారు. ఉత్పత్తిదారులు వినియోగదారులవుతారు. వినియోగదారులు ఉత్పత్తిదారులవుతారు. ఒక లాభం మరో నష్టంతో సమానం. అంతిమంగా లాభనష్టాలే ఉండవు.

లాభం అందరికీ తెలిసిన పదం. లాభాన్ని చూపి అదనపు విలువకి ముసుగేశారు. కార్మికుడు ఎలాంటి ప్రతిఫలం లేకుండా చేసిన అదనపు శ్రమకు అదనపు విలువ ఏర్పడుతుంది. ఆ సరుకును అమ్మకానికి మార్కెట్‌కి చేర్చినపుడు రవాణా ఖర్చులు మినహా ఏ కొత్త విలువ దాని దరిజేరదు. కనుక సరుకులోని అదనపు విలువ అంటే కార్మికుడి అదనపు శ్రమే. అదే పెట్టుబడిదారుడి సగటు లాభం. సప్లయి, డిమాండ్‌లను బట్టి గుత్తాధిపత్యం, ప్రభుత్వ పాలసీలు, కార్మికుల పోరాటాల వల్ల ఈ సగటు లాభం ఎక్కువ తక్కువలు ఉండొచ్చు.

ద్రవ్యోల్బణమనేది, ఆర్థికపరంగా అందరికీ తెలిసినదే. పూర్వం రోజుల్లో జేబులో డబ్బులేసుకొని, సంచిలో సరుకులు తెచ్చుకొనేవాళ్లం. ఇపుడు సంచిలో డబ్బులేసుకొని జేబులో సరుకులు తెచ్చుకొంటున్నాం. అదే వస్తువు, నిన్నటి రేటు నేడు డబుల్ అయింది. ఈ వ్యాఖ్యలు ఈనాడు తరచు వింటాం. అదే ద్రవ్యోల్బణం.

కాగితం నోటుపై ప్రభుత్వం ముద్ర ఉన్నా దానికి బంగారం వెన్నుదన్ను ఉంటేనే విలువ. సరుకుల ఉత్పత్తి, ఎగుమతి, దిగుమతులు, సేవలపై కూడా కరెన్సీ విలువ ఆధారపడి ఉంటుంది. చెలామణిలో ఉన్న కరెన్సీ బంగారం కంటే ఎక్కువగా ఉంటే, దాని విలువ తగ్గుతుంది. అన్ని సరుకుల ధరలు జనరల్‌గా పెరుగుతాయి.

ఆర్థిక సంక్షోభం : 2007-08లో అమెరికా కేంద్రంగా ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభం సుదీర్ఘకాలంగా కొనసాగుతోంది. అమెరికాలోని పెద్ద పెద్ద పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు మూతపడ్డాయి. ధరలు పెరిగాయి. జీతాలలో కోత విధించారు. నిరుద్యోగం పెనుభూతమై వెన్నాడుతోంది. ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాడారు. మేం '90 శాతం' ఉద్యమం కదను తొక్కింది. ఈ సంక్షోభం ప్రపంచమంతటా పాకింది. అన్ని రంగాలలోను తీవ్ర మాంద్యం ఏర్పడింది. చైనాతో సహా అన్ని దేశాల మార్కెట్లు బేల చూపులు చూశాయి.

1930 'మహా మాంద్యం' జ్ఞాపకాలు ఇంకా సమసిపోలేదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అధికారికంగా 7 సార్లు మాంద్యాలు ఏర్పడినా కొద్దికాలమే ఉన్నాయి. ఇపుడు మాత్రం ఎలా బయటపడాలో తెలియని అయోమయ పరిస్థితి అలముకుంది. దిక్కుతోచని మేధావులకి అపుడు గుర్తుకొచ్చింది కార్ల్‌మార్క్స్ 'కేపిటల్'. 1860లోనే ఆయన తన గ్రంథంలో పెట్టుబడిదారీ సమాజం అభివృద్ధిని, అనివార్యంగా వచ్చే ఆర్థిక సంక్షోభాల్ని, అంతిమంగా దాని వినాశనాన్ని శాస్త్రీయంగా వివరించాడు. పోప్‌తో సహా అందరూ కేపిటల్ పేజీలను తిరగేశారు.

'పెట్టుబడిదారీ ఉత్పత్తికి నిజమైన అడ్డంకి పెట్టుబడే' అన్నాడు మార్క్స్. పెట్టుబడికి మూలం శ్రమదోపిడీ. కార్మికుడి అదనపు విలువను దోచుకోవడం ద్వారానే పెట్టుబడిదారుడు లాభం పొందుతున్నాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో యజమానికి మరో ధ్యాసలేదు. లాభాలు, లాభాలు తప్ప, లాభాల కోసం ఎంతటి హీనస్థాయికైనా అతడు దిగజారతాడు.

లాభాల వేటలో అతనికి మొదట ఎదురయ్యేది వ్యాపార పోటీ. ఈ పోటీలో నిలదొక్కుకోవడానికి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తాడు. ఏది లాభంగా ఉంటే అందులో వేలు పెడతాడు. కొత్త కొత్త టెక్నాలజీని ప్రవేశపెడతాడు. దీనికో ప్లాను ఉండదు. ఒకరితో ఒకరికి పోటీ. పోటీ కోసం ఎంతటికైనా తెగింపు.

వ్యాపార పోటీలో చిన్న, మధ్యతరగతి పెట్టుబడిదారులు చితికి పోతారు. పెద్ద చేపలు, చిన్న చేపల్ని మింగినట్లు, వారి ఆస్తులను బడా పెట్టుబడిదారులు లాగేసుకుంటారు. చివరికి కొద్ది కుటుంబాలే మార్కెట్‌పై గుత్తాధిపత్యం చలాయిస్తాయి. ఆహారరంగంలో నెస్లే, కోకాకోలా, పెప్సికోలా, యూనిలివర్; ఐ.టి. రంగంలో మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్; ఆటోమోటివ్‌లో జనరల్ మోటార్స్, ఫోర్డ్స్, సుజుకి మొదలైనవి ఇందుకు ఉదాహరణలు.

ఒక రిపోర్టు (జిసి ఫామా) ప్రకారం గత 2 దశాబ్దాలలో ప్రపంచంలో 1 శాతం వారికి ఆదాయం 60 శాతం పెరిగింది. ఇదో విచిత్ర పరిస్థితి ఒక వైపు మార్కెట్‌లో ఇబ్బడిముబ్బడిగా సరుకు, మరో వైపు 90 శాతంగా ఉన్న పేద, మధ్య తరగతి వర్గాల ఆదాయంలో ఎదుగుబొదుగు లేక వారి కొనుగోలుశక్తి పడిపోవడం. పెట్టుబడిదారీ వ్యవస్థ గడ్డికుక్క లాంటిది. తాను తినదు ఇతరులను తిననివ్వదు. అమెరికాలో గోధుమ పంట దిగుబడి పుష్కలంగా ఉంటే, మార్కెట్ ధర కోసం సముద్రంలో పారబోసేవారుగాని, తక్కువ ధరకు పేద దేశాలకు సరఫరా చేయరు. 2007-08 సంక్షోభంలో అమెరికాలో ఒకవైపు ఖాళీగా వేలాది గృహాలు, మరోవైపు ఇళ్లు లేక వీధులపాలైన జనం. ఆయుధ పరిశ్రమలో మాంద్యం ఏర్పడితే ఇతర దేశాల మధ్య చిచ్చుపెట్టి, యుద్ధాలను సృష్టించి ఆయుధాలను అమ్ముకొనే దుర్మార్గానికి కూడా అమెరికా పెట్టుబడిదారులు ఒడిగడతారు.

ముడిసరుకు కోసం, మార్కెట్ కోసం ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని బడుగుదేశాలపై దండెత్తి, వలసలను స్థాపించారు. పెట్టుబడిదారీవిధానం సామ్రాజ్యవాదంగా ఎదిగింది. ప్రపంచాన్ని పంచుకోవడంలో అగ్రరాజ్యాల మధ్య పోటీ మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలకు దారి తీసింది. ఆ యుద్ధాలలో జర్మనీ, జపాన్ ఫాసిజం ఓడింపబడింది. సామ్రాజ్యవాదం బలహీనపడింది. సోషలిస్టు విప్లవాలు, జాతీయ విముక్తి ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. మార్క్స్ భావాలు, శ్రామిక, పీడితవర్గాల గుండెల్లో పదిలంగా గూడుకట్టుకున్నాయి.

'కేపిటల్' రచన మార్క్స్ చివరి జీవితాశయం. ఆ రచనా కాలానికి ఆయన ఆరోగ్యం బాగుండలేదు. చనిపోయేలోపు ఆ గ్రంథాన్ని పూర్తి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేశాడు. 1వ సంపుటం పూర్తి చేశాడు. మిగిలిన 3 సంపుటాలకు నోట్సు రాసి ఉంచుకున్నాడు. మార్క్స్ మరణానంతరం ఆ గ్రంథాల్ని ఆయన సన్నిహితుడు ఏంగెల్స్ పూర్తి చేశాడు.

శ్రమ దోపిడీని కళ్లకు కట్టినట్లు చూపిన 'అదనపు విలువ సిద్ధాంతం' 'కేపిటల్' గ్రంథానికి న్యూక్లియస్ లాంటిది. కార్మికవర్గానికి అది మార్క్స్ అందించిన మహత్తర ఆయుధం.

('చార్వాక' కేలండర్ సౌజన్యంతో)

(రచయిత వైద్యుడు, సామాన్య శాస్త్ర రచయిత) వీ

మహబూబ్‌నగర్‌లో విరసం మహాసభలు

విప్లవ రచయితల సంఘం 26వ మహాసభలు మహబూబ్‌నగర్ జిల్లాలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జనవరి 13,14 తేదీల్లో జరిగాయి. ఈ సభల్లో ప్రొ. ఆనంద్‌తేల్‌తుంబ్డే ప్రారంభోపన్యాసం చేయగా ప్రొ. హరగోపాల్ ఆహ్వానోపన్యాసం చేశారు. కార్యదర్శి వరలక్ష్మి నివేదిక సమర్పించారు. పాణి కీనోట్ ప్రవేశపెట్టారు. వక్తల హిందుత్వ శక్తులు విశ్వవిద్యాలయాలు, కళాశాలలే కేంద్రాలుగా కార్యాచరణ మొదలుపెట్టాయన్నారు. హిందుత్వ దాడులను ఎండగడుతూ సమాజానికి నిజాలు చెబుతున్న గౌరీ లంకేశ్, రోహిత్ వేములను హత్యచేశారన్నారు. మార్కెట్‌లోకి 100 శాతం విదేశీ పెట్టుబడులు వచ్చాయని, దీంతో లక్షల మంది ఉపాధి కోల్పోయారని ఆందోళన వ్యక్తంచేశారు. నూతన కార్యదర్శిగా పాణిని ఎన్నుకున్నారు. ఈ సభల్లో ప్రజాకళామండలి, అరుణోదయ, విరసం కళాకారులు, దప్పు రమేశ్ బృందం పాటలు, నాటికల ద్వారా తమ కళలను ప్రదర్శించారు.

వరంగల్ డిక్లరేషన్ సభ

వరంగల్ జిల్లా అర్బన్ జిల్లా హన్మకొండలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టిపిఎఫ్) ఆధ్వర్యంలో జనవరి 21న సభ నిర్వహించింది. మొదట అమరవీరుల స్థూపం నుంచి ర్యాలీగా వస్తున్న టిపిఎఫ్ నాయకులను, కార్యకర్తలపై పోలీసులు లాఠీ చార్జీ చేసి మహిళా కార్యకర్తలను విచక్షణారహితంగా ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. లాఠీచార్జీలో పలువురికి తీవ్ర గాయలయ్యాయి. పోలీసులు ర్యాలీని అడ్డున్నప్పటికి ఎన్నో ఆటంకాల మధ్య సభ నిర్వహించారు. సభలో వక్తలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల హక్కుల పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. కనీసం సభలు, సమావేశాలు జరుపుకోకుండా పోలీసులతో అణచివేస్తుందన్నారు. టిఆర్ఎస్ ప్రభుతంలో రాజ్యాంగం కల్పించిన హక్కులు కూడా అమలు కావడంలేదన్నారు. పోలవరం నిర్మాణంతో 3 లక్షల మంది ఆదివాసులు నిర్వాసితులయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు ప్రజాస్వామిక తెలంగాణను కోరుకుంటున్నారని, తెలంగాణ వచ్చాక ఉద్యమాలు వద్దనడం హేయమయిన చర్యన్నారు. ఈ సభలో వరంగల్ డిక్లరేషన్ 2018ను వరవరరావు ఆవిష్కరించారు.

ఉక్కు పరిశ్రమ డిమాండ్ - కడప బంద్

విభజన చట్టంలో హామీ ఇచ్చినట్లుగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలంటూ జనవరి 25న అఖిలపక్షం బంద్‌కు పిలుపునిచ్చింది. 'కడప హక్కు.. సీమ హక్కు' నినాదంతో విద్యార్థులు, యువత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ కోసం ఎప్పటి నుండో జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాయలసీమ పట్ల, కడప జిల్లా పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి చూపిస్తోందని, దీనికి నిరసనగా కడప జిల్లా బందుకు అఖిలపక్షం పిలుపునిచ్చింది. బందును విఫలం చేయడానికి అఖిలపక్ష నాయకులను, వివిధ పార్టీల, ప్రజా సంఘాల ప్రతినిధులను పోలీసులు ముందుగానే అరెస్టు చేశారు. ఆర్.టి.సి డిపోల ముందు నిరసనకారులు ఆందోళన చేసి బస్సులను అడ్డుకున్నారు.

దళితుల గ్రామ బహిష్కరణ

శవాన్ని ఖననం చేసే గుంత తవ్వలేదన్న కారణంతో దళితులను అగ్రవర్ణాల వారు గ్రామ బహిష్కరణ చేశారు. ఈ సంఘటన కర్నూలు జిల్లా, రుద్రవరం మండలం, నక్కలదిన్నె గ్రామంలో డిసెంబర్ 31న జరిగింది. ఈ గ్రామంలో దాదాపు 20 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయి. వారిలో నాలుగు కుటుంబాలు ఎత్తి (మనిషిని ఖననం చేసే గుంత తవ్వడం) పనులు చేసేవారు. అక్షరాస్యులుగా మారి ఎత్తి పని మానేసి గ్రామంలో కూలీ పనులు చేస్తుండడంతో అగ్రవర్ణ పెత్తందార్లు ఆగ్రహించి వారిని గ్రామం నుంచి బహిష్కరించారు. వారికి తాగునీరు, విద్యుత్, నిత్యావసర సరుకులను కూడా నిలిపివేశారు.

ఇసుక మాఫియా దారుణం

అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అడ్డుకున్నందకు నిజామాబాద్ జిల్లా, పిట్లం మండలం కారెగాం గ్రామానికి చెందిన బోయిని సాయిలు అనే విఆర్ఎను ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో చంపేసింది. ఈ ఘటన జనవరి 4న జరిగింది. కంబాపూర్ గ్రామ శివారులో కాకివాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందుకుని ఇసుక తరలింపును అడ్డుకోవడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇసుక వ్యాపారులకు, విఆర్ఎకు వాగ్వాదం జరిగడంతో అతన్ని పక్కుకు తోసేసి అతనిపై నుంచి ట్రాక్టర్‌ను ఎక్కించి హత్య చేశారు. అయితే ఇసుక మాఫీయాతో కుమ్మక్కయిన పోలీసులు ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా నమోదు చేశారు.

మేధావులపై కాషాయమూకల దాడి

హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవరి 13న మేధావులపై కాషాయమూకల దాడి అనే అంశంపై ప్రొఫెసర్ తిరుమలి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు దేశంలో విద్యను కాశాయీకరించడంలో భాగంగానే మేధావుల, వేధ్యావేత్తలపై ఆర్.ఎస్.ఎస్ దాడులు చేస్తుందన్నారు. ఇటీవల శాతావాహన యూనివర్సిటీలో ప్రొఫెసర్ సూరేపల్లి సూజాతపై దాడిచేశారని, తాజాగా ఎచ్‌సియు ప్రొఫెసర్ కె. లక్ష్మినారాయణ పై సోషల్ మీడియా వేదికగా ఎబివిపి విద్యార్థులు దాడులు చేస్తున్నారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఈ దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వీటిని ప్రజాస్వామిక వాదులు అడ్డుకోవాలని అన్నారు.

పెదగొట్టిపాడు దళితులకు న్యాయం చేయాలి

గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో డిసెంబర్ 31న ఇద్దరు దళిత యువకులు బైక్ పై వస్తూ చాకలివాళ్ల ఇంటి ముందు ముగ్గుపై జారిపడ్డారు. అక్కడి మహిళలు వారిని తిట్టి పంపగా అక్కడి కమ్మ పురుషులు వారిని తిట్టి, కొట్టారు. దళితుల్లో వస్తున్న మార్పును తట్టుకోని కమ్మ కులస్తులు అంతటితో ఆగకుండా ఆ రాత్రి ట్రాక్టర్‌లో ఆయుధాలేసుకొని వెళ్లి చర్చిలో ప్రార్థనలు చేసుకుంటున్న దళితులపై దాడిచేశారు. ఈ దాడిలో నలుగురు దళితులు గాయపడ్డారు. ఈ దాడిని ఖండిస్తూ దళిత సంఘాలు, వామపక్షాలు, ప్రజా సంఘాలతో 'పెదగొట్టిపాడు దళిత న్యాయపోరాట కమిటీ'గా ఏర్పడి జనవరి 25న చలో పెదగొట్టిపాడుకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం పోలీసులను దింపి ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించింది. కార్యక్రమానికి ఒక రోజు ముందే ప్రజా సంఘాల నాయకులను కార్యకర్తలను పోలీసుల అరెస్ట్ చేశారు.

ఇసుక క్వారీ లారీలను తగులబెట్టిన మావోయిస్టులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం భూపతిరావుపేట సమీపంలో గోదావరి ఒడ్డున గిరిజన సొసైటీ పేరుతో ఇసుక క్వారీ నడుస్తున్నది. జనవరి 26న మావోయిస్టులు ఈ క్వారీపై దాడిచేసి నాలుగు లారీలు, మూడు జెసిబిలు, ఒక దోజర్, ఒక ట్రాక్టర్‌ను తగులబెట్టారు. అనంతరం సందరయ్యనగర్‌కు చెందిన మడివి రమేష్, జోగయ్యలను పోలీస్ ఇన్‌ఫార్మర్‌లుగా పనిచేస్తున్నారని వారిపై కాల్పులు జరిపారు. జోగయ్యను గొడ్డలితో నరికి చంపారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నందునే వారిని శిక్షించామని అక్కడ వదిలిన కరపత్రంలో పేర్కొన్నారు. వీ

భీమా కోరేగావ్‌లో దళితులపై దాడి

భీమా కోరేగావ్‌లో పీష్వా బాజీరావ్ సైన్యం పై బ్రిటిష్ సైన్యంలో ఉండి ఆ పోరాటంలో మరణించిన సైనికుల స్మృతి చిహ్నంగా నిర్మించిన స్థూపం వద్ద ఆ వీరులను డిసెంబర్ 31న స్మరించుకుంటారు. ఆ పోరాట విజయంలో మహర్‌లు ప్రధాన పాత్ర నిర్వహించడంవల్ల ఆ విజయాన్ని దళితులు ఆ ప్రదేశంలో విజయోత్సవాలు, ఆ సమరంలో ప్రాణాలర్పించిన దళితుల సంస్మరణ సభ జరిపారు. కోరేగావ్ పోరాటానికి 200 ఏళ్లు అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు వెళ్తున్న దళితులపై ఆర్‌ఎస్‌ఎస్, ఇతర హిందూ సంస్థలు రాళ్లు రువ్వారు. వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడికి నిరసనగా డిసెంబర్ 31న ముంబైలో బంద్ నిర్వహించారు. వేలాదిమంది దళితులు, వారికి మద్దతుగా వివిధ ప్రజాస్వామిక, హక్కుల సంఘాలు ముంబై వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు.

జమ్మూకశ్మీర్‌లో ఆగని ఎన్‌కౌంటర్లు

జమ్మూకశ్మీర్ పుల్వామా జిల్లాలోని సిఆర్‌పిఎఫ్ శిబిరంపై డిసెంబర్ 31న మిలిటెంట్లు దాడి చేశారు. ముగ్గురు మిలిటెంట్లు 185వ శిబిరంలోకి ప్రవేశించి జరిపిన దాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా ముగ్గురు గాయపడ్డారు. జవాన్లు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు మృతిచెందారు. జనవరి 5న బారాముల్లా జిల్లాలో మిలిటెంట్లు సోపోర్‌లో శక్తిమంతమైన ఐఇడి పేలుడుకు పాల్పడ్డారు. ఈ ఘటనలో నలుగురు పోలీసులు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయా లయ్యాయి. సోపోర్‌లోని గోల్ మార్కెట్ ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. అనంత్‌నాగ్ జిల్లా లర్‌నూ ప్రాంతంలో జనవరి 9న భద్రతా బలగాలకు మిలిటెంట్లకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు మృతి చెందారు.

లాలూప్రసాద్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

పశు దాణా కుంభకోణంలో దోషులకు జనవరి 5న రాంచీ సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం శిక్షలు ఖరారు చేసింది. ఈ కేసులో లాలూ సహా మరో ఏడుగురికి మూడున్నరేళ్ల జైలు శిక్ష, ఐదు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. 1991–94 మధ్య దేవ్‌గఢ్ ఖజానా నుంచి రు. 89.27 లక్షల మొత్తాన్ని తప్పుడు వివరాలతో కాజేయడానికి సంబంధించిన కేసులో ఈ తీర్పును సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి శివపాల్ సింగ్ ప్రకటించారు. చాయ్ బాసా ట్రెజరీ నుంచి రు. 37.62 కోట్లు అక్రమంగా డ్రాచేశారన్న ఆరోపణలపై రాంచి సిబిఐ కోర్టు న్యాయమూర్తి ఎస్.ఎస్. ప్రసాద్ లాలూ ప్రసాద్ యాదవ్‌ను దోషిగా నిర్ధారించి జనవరి 24న ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రు. 10 లక్షల జరిమానా విధించారు. ఇదే కేసులో మరో మాజీ సి.ఎం. జగన్నాథ్ మిశ్రాతో సహా 50 మందిని దోషులుగా తేల్చారు.

యువ హుంకార్ ర్యాలీ

దళిత సంస్థ భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 9న విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో 'యువ హుంకార్ ర్యాలీ' నిర్వహించారు. ఉనా, సహరాన్‌పూర్, భీమా–కోరేగావ్ లాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో చెప్పాలని ర్యాలీలో పాల్గొన్న వక్తలు అన్నారు. మధ్యప్రదేశ్ రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో చెప్పాలన్నారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఎందుకు జరిగింది? నజీబ్ అహ్మద్ ఆచూకీ ఏమైందని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ ప్రమాదంలో పడిందని రాజ్యాంగమో, మనుస్మృతో తేల్చుకోవాలని అన్నారు. భీమ్ ఆర్మీ ఫౌండర్ చంద్రశేఖర్ ఆజాద్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సినిమాహాల్‌లో జాతీయ గీతం తప్పనిసరి కాదు

సినిమాహాల్‌లో జాతీయ గీతం తప్పనిసరి కాదని సుప్రీం కోర్టు జనవరి 9న స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన తీర్పును సవరిస్తూ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జడ్జీలు డి.వై. చంద్రచూడ్, ఎ.ఎం. ఖాన్‌విల్కర్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. కేంద్రం నియమించిన 12 మందితో కూడిన అంతర్గత మంత్రిత్వ కమిటీ తుది నిర్ణయాన్ని ప్రకటిస్తుందని ధర్మాసనం తెలిపింది. కమిటీ తుది నిర్ణయం ప్రకటించే వరకు గతంలో సూచించిన విధంగానే జాతీయగీతం ఆలపిస్తున్నప్పుడు వికలాంగులు నిలబడాల్సిన అవసరంలేదని స్పష్టం చేసింది.

ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు

ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏ.కె. జ్యోతి జనవరి 18న ప్రకటించారు. త్రిపురలో ఫిబ్రవరి 18న, మేఘాలయలో ఫిబ్రవరి 27న, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27న ఎన్నికలు జరుగనున్నాయి. మూడు రాష్ట్రాలకు ఓట్ల లెక్కింపు మార్చ్ 3న నిర్వహిస్తారన్నారు.

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా రావత్

కేంద్ర ఎన్నికల సంఘానికి నూతన ప్రధాన కమిషనర్ (సిఇసి)గా ఓంప్రకాశ్ రావత్‌ను నియమించారు. ప్రస్తుత కమిషనర్ అచల్‌కుమార్ జ్యోతి జనవరి 22న పదవీ విరమణ చేయనున్నందున ఎన్నికల కమిషనర్‌గా ఉన్న రావత్‌కు పదోన్నతి లభించింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ జనవరి 21న ఉత్తర్వులు జారీచేసింది.

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంఎల్‌ఎల సస్పెన్షన్

లాభదాయక పదవులు అనుభవిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కి చెందిన ఇరవై మంది ఎంఎల్‌ఎల శాసనసభ సభ్యత్వాన్ని రాష్ట్రపతి అనర్హత వేటువేశారు. వీరిని శాసనసభ సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్ (ఇసి) చేసిన సిఫారసును జనవరి 21న రాష్ట్రపతి ఆమోదించారు. ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వీరిని అసెంబ్లీలో పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించారు. దీనికి వ్యతిరేకంగా ఎన్నికల సంఘం రాష్ట్రపతికి సిఫారసు చేసింది. జనవరి 20న ఈ సిఫారసుపై రాష్ట్రపతి సంతకం చేసినట్లు న్యాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ చర్య రాజ్యాంగ విరుద్ధమనీ, ప్రజాస్వామ్యానికి హానికరమనీ ఆప్ సీనియర్ నేత అశుతోష్ పేర్కొన్నారు.

2017లో 11 మంది జర్నలిస్టుల హత్య

2017లో దేశవ్యాప్తంగా పదకొండు మంది జర్నలిస్టులు హత్యకు గురి కాగా, మరో 46 మందిపై దాడులు జరిగాయని ఇండియా ఫ్రీడం రిపోర్ట్: మీడియా ఫ్రీడం అండ్ ఫ్రీడం ఆఫ్ ఎక్స్‌ప్రెషన్' పేరుతో 'ద హూట్ జర్నలిస్టులపై దాడులకు సంబంధించి విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని తెలుపుతున్నాయి. ఈ దాడులకు సంబంధించిన 26 కేసుల్లో పోలీసులు అరెస్టులు, కేసులు దాఖలు చేశారు. పాత్రికేయులు అత్యధికంగా పోలీసులు, రాజకీయ నాయకుల నుంచి ఎదుర్కొన్న దాడులే అత్యధికంగా ఉన్నాయి.

ప్రజలకు భద్రతలేని యోగి పాలన

ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ పది నెలల పాలనలో ఇప్పటి వరకు అండర్‌వరల్డ్, బలవంతపు వసూళ్లు, భూకబ్జాలు, అపహరణలు, ఎన్‌కౌంటర్లు, బెదిరింపులు పెరిగిపోయాయి. శాంతిభద్రతల పరిస్థితులు అదుపు తప్పాయని పోలీసులు ఇచ్చిన వార్షిక నివేదికలో వెల్లడైంది. దాదాపు వెయ్యి ఎన్‌కౌంటర్లు జరగగా, అందులో ఒక్క మీరట్‌లోనే 358 ఎన్‌కౌంటర్ హత్యలు జరిగాయి. వీ

పెరూలో ఆందోళనలు

పెరూలో మాజీ అధ్యక్షుడు అల్బర్టో పుజిమోరికి క్షమాభిక్ష ప్రసాదిస్తున్న ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శలు చేశారు. ప్రస్తుత దేశాధ్యక్షుడు పెడ్రో పాబ్లో కుజిన్స్కీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అల్బర్టోపై మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డాడన్న ఆరోపణతో న్యాయస్థానం 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 2007లో అధికార దుర్వినియోగం, అవినీతి కేసుల్లో అల్బర్టోను అరెస్టు చేశారు. గత కొంత కాలంగా అల్బర్టో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నందున ఆయనకు క్షమాభిక్ష ప్రసాదిస్తున్నట్లు అధ్యక్షుడు పాబ్లో కుజిన్స్కీ నిర్ణయించారు. ఈ మేరకు డిసెంబర్ 26న ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.

ఇరాన్‌లో నిరసనలు

ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు భారీ నిరసన ప్రదర్శలు చేశారు. ఒకపక్క నిత్యావసర ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోగా మరోపక్క, ఆర్థిక వ్యవస్థను దిగజారుస్తూ ఉగ్రవాద సంస్థలకు నిధులు అందజేస్తున్నారంటూ ప్రభుత్వంపై ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్లకార్డులు, బ్యానుర్లు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు నిలువరించడానికి ప్రయత్నించాయి. ఈ ఘర్షణలో పన్నెండు మంది పౌరులు మరణించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా అనేక ప్రాంతాల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతమయ్యాయి.

రెండు కొరియాల మధ్య చర్చలు

ఉత్తర, దక్షిణ కొరియా దేశాల మధ్య జనవరి 9న జరిగిన చర్చలు సఫలమయ్యాయి. దక్షిణ కొరియాలోని పన్మున్‌జమ్ నగరంలో జరిగిన భేటీకి ఇరుదేశాలకు చెందిన ఇరవై మంది ప్రతినిధులు పాల్గొన్నారు. దక్షిణ కొరియాలో జరుగనున్న పియాంగ్‌ఛాంగ్ వింటర్ ఒలింపిక్స్‌కు క్రీడాకారులను, టేక్వాండో బృందాన్ని పంపేందుకు ఉత్తర కొరియా అంగీకరించింది. ఇరు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలు తగ్గించుకునేందుకు సరిహద్దుల్లో ఉన్న మిలిటరీ హాట్‌లైన్‌ను పునరుద్ధరించుకోవాలని ఇరు దేశాలు అంగీకరించాయని నార్త్ కమిటీ ఫర్ పీస్‌ఫుల్ రికన్సిలేషన్ (ఎన్‌సిఆర్ఆర్) ఛైర్మన్ రీసన్ గ్వాస్ తెలిపారు.

జర్మనీలో కార్మికుల సమ్మె

జర్మనీలో యాజమాన్యాలు తక్షణమే తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మె బాట పట్టారు. జనవరి 9న జరిగిన సమ్మెలో వేలాదిగా కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మెకు స్థానిక ఐజి మెటల్ యూనియన్ నేతృత్వం వహిస్తోంది. యాజమాన్యాలు చెల్లిస్తున్న చాలీచాలని జీతాలతో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయినప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదనీ, దీనివల్ల దేశవ్యాప్తంగా 3.9 మిలియన్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ నిరసన వ్యక్తం చేశారు. మెటల్ ఇంజనీరింగ్ కంపెనీల యాజమాన్యం కార్మికుల వేతనాలను 6 శాతం పెంచాలని డిమాండ్ చేశారు.

గ్రీస్‌లో సమ్మెపై ఆంక్షలు

గ్రీస్‌లో సమ్మె చేసే హక్కుపై ఆంక్షలు విధించడంతో సహా కొత్త ఆంక్షలు విధించడానికి ప్రభుత్వం సంస్కరణలు చేపడుతోంది. ఈ సంస్కరణలను నిరసిస్తూ జనవరి 12న గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో వేలాది మంది నిరసన ప్రదర్శలు చేపట్టారు. బెయిలవుట్ నిధులు తీసుకున్నందుకు బదులుగా పార్లమెంట్ ఈ సంస్కరణల బిల్లును ఆమోదించాల్సి ఉంది. పారిశ్రామిక తిరుగుబాటు సందర్భంగా ఏథెన్స్ మెట్రోను మూసివేశారు. రోజూ దాదాపు పదిలక్షల మంది ప్రజలు ఉపయోగించే ఈ మెట్రో మూతపడడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నావికులు, డాక్టర్లు కూడా సమ్మెలో పాల్గొన్నారు.

ట్యునీషియాలో నిరసనలు

ట్యునీషియాలో ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శలు జరిపారు. దేశంలో నెలకొన్న నిరుద్యోగం, అధిక ధరలు, దిగజారిన ఆర్థిక పరిస్థితులపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. దేశవ్యాప్తంగా రాజధాని టునిస్‌తో సహా అనేక నగరాల్లో లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. ఏడేళ్ల క్రితం అప్పటి అధ్యక్షుడు అబెదిన్ బెన్ అలీని గద్దె నుంచి దించడంతో ట్యునీషియా అంతర్యుద్ధంలోకి వెళ్లిపోయింది. రాజకీయ అస్థిరత, హింస దేశ ఆర్థిక పరిస్థితిని మరింత కృంగదీసింది. బెన్ అలీని గద్దెదించి ఏడేండ్లయిన సందర్భంగా జనవరి 14న ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఎనిమిది వందల మంది నిరసనకారులను అరెస్టు చేసింది.

మయన్మార్‌లో మళ్లీ అల్లర్లు

మయన్మార్‌లోని రఖైన్ ప్రాంతంలో అల్లర్లు చెలరేగాయి. అరాకన్ సామ్రాజ్య పతనం సంస్మరణార్థం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుమతించాలని బౌద్ధులు డిమాండ్ చేయడంతో ఈ అల్లర్లు మొదలయ్యాయి. చారిత్రక ప్రాంతమైన రౌకుయూ వద్ద దాదాపు నాలుగు వేల మంది బౌద్ధులు నిరసన ప్రదర్శలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన విరమింపచేయడానికి పోలీసులు ప్రయత్నించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు కాల్పులు జరపడంతో ఏడుగురు మరణించారు. పన్నెండు మంది గాయపడ్డారు.

అమెరికా షట్‌డౌన్

అమెరికా బడ్జెట్ నిధుల విడుదలకు ఎగువసభ సెనేట్ అంగీకరించక పోవడంతో జనవరి 19 నుంచి అత్యవసరం తప్ప అన్ని సర్వీసులు ఆగిపోయాయి. అత్యవసర సేవలు చేసేవారు కూడా ఆదాయం లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి. ఒబామా ప్రవేశపెట్టిన డ్రీమర్స్ బిల్లును ట్రంప్ ప్రభుత్వం తొలగించడానికి నిరసనగా బడ్జెట్‌ను ప్రతిపక్షం స్తంభింప జేసింది.

ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మహిళలు నిరసన ప్రదర్శలు చేశారు. జనవరి 20న వాషింగ్టన్, న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, చికాగోతో సహా దాదాపు 250 పైగా నగరాల్లో ఈ ప్రదర్శలు జరిగాయి. లక్షలాదిగా మహిళలు ఇందులో పాల్గొన్నారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మహిళలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, రాజకీయాల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

కాబూల్‌లో నరమేధం

అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో జనవరి 20న తాలిబన్ తీవ్రవాదులు ఒక హోటల్‌పై దాడిచేశారు. ఈ దాడిలో 35 మంది మరణించారు. కాబూల్‌లోని విదేశీయులు ఎక్కువగా ఉండే కాంటినెంటల్ లగ్జరీ హోటల్‌లోకి నలుగురు సాయుధులు ప్రవేశించి అత్యాధునిక ఆయుధాలతో పాటు, రాకెట్ గ్రానేడ్లతో దాడి చేశారు. విచ్చలవిడిగా కాల్పులు జరుపుతూ నిప్పు పెట్టారు. మరోసారి జనవరి 26న భారత రాయబార కార్యాలయం సమీపంలో అంబులెన్స్‌లో పేలుడు పదార్థాలతో వచ్చి పేల్చివేశారు. ఈ దాడిలో 95 మరణించగా, 150 మందికి పైగా గాయపడ్డారు. వీ


అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(డిసెంబర్ 1 నుండి డిసెంబర్ 31, 2017 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (842), ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో (737) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1579)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు వ్యవసాయ రంగం	ఆత్మహత్యలు చేనేత రంగం	ఆత్మహత్యలు ఇతరాలు స్త్రీ	ఆత్మహత్యలు ఇతరాలు పు.	చికిత్స అందక, అనారోగ్యం స్త్రీ	చికిత్స అందక, అనారోగ్యం పు.	చికిత్స అందక, అనారోగ్యం పి.	గుర్తు తెలియని స్త్రీ	గుర్తు తెలియని పు.	హత్యలు స్త్రీ	హత్యలు పు.	ప్రమాదాలు పనిచేసే స్థలంలో	ప్రమాదాలు కరెంట్	ప్రమాదాలు రహదారి	ప్రమాదాలు ఇతరాలు	పోలీసు కాల్పుల్లో ఉద్యమ కారులు	పోలీసు కాల్పుల్లో ఇతరులు	పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	2	-	18	21	2	4	3	2	2	2	3	1	2	26	32	-	-	-	3	-
హైదరాబాద్	-	-	-	11	9	2	2	1	-	3	1	5	4	2	16	12	-	-	-	-	-
కరీంనగర్	-	1	-	9	8	4	3	1	-	-	-	2	1	2	16	9	-	-	-	-	-
ఖమ్మం	-	3	-	6	11	2	2	4	1	-	1	-	-	1	33	13	9	-	-	-	1
మహబూబ్‌నగర్	-	-	-	3	6	4	6	7	4	4	4	2	4	13	35	2	-	-	-	-	-
మెదక్	2	19	5	8	4	3	9	1	2	4	5	9	6	20	22	14	-	-	-	4	1
నల్గొండ	-	10	-	11	10	2	3	-	1	2	-	3	-	3	24	11	-	-	-	-	-
నిజామాబాద్	-	-	-	4	4	2	3	1	-	-	1	2	-	1	14	9	-	-	-	-	-
వరంగల్	1	14	1	9	4	5	6	3	1	6	9	4	5	12	29	14	-	-	-	2	1
వికారాబాద్	-	2	-	4	2	-	1	-	-	-	-	1	2	1	9	6	-	-	-	-	-
తెలంగాణ	**4**	**51**	**6**	**83**	**79**	**26**	**39**	**21**	**11**	**21**	**23**	**31**	**23**	**57**	**244**	**122**	**9**	**-**	**-**	**9**	**3**
అనంతపురం	-	1	-	15	27	5	6	-	7	-	-	4	8	8	52	-	-	-	-	-	-
చిత్తూరు	-	1	-	7	4	9	6	-	2	1	4	2	6	-	13	-	-	-	-	-	-
కడప	-	-	-	3	3	-	-	-	1	-	-	1	-	2	6	5	-	-	-	-	-
గుంటూరు	-	2	-	5	4	-	6	2	1	-	-	1	1	3	32	14	-	-	-	-	-
కృష్ణా	-	-	-	2	5	2	1	1	-	-	1	2	1	-	19	8	-	-	-	-	-
కర్నూలు	వివరాలు అందలేదు																				
తూర్పు గోదావరి	-	1	-	-	2	-	-	2	1	8	2	1	1	-	44	13	-	-	-	2	-
ప్రకాశం	-	-	-	5	9	-	1	-	-	2	1	1	2	3	16	10	-	-	-	1	-
శ్రీకాకుళం	-	-	-	8	11	7	11	-	-	3	2	3	3	3	23	11	-	-	-	-	-
పశ్చిమ గోదావరి	-	-	-	5	3	2	5	1	-	1	-	-	-	-	18	9	-	-	-	-	-
నెల్లూరు	-	-	-	2	3	1	2	-	1	-	-	3	1	7	14	13	-	-	-	-	-
విజయనగరం	-	-	-	6	10	3	4	1	1	1	-	-	3	-	18	12	-	-	-	-	-
విశాఖపట్నం	-	-	-	7	6	1	5	-	-	2	-	4	1	1	11	11	-	-	-	3	-
ఆంధ్రప్రదేశ్	**-**	**5**	**-**	**65**	**87**	**30**	**47**	**7**	**14**	**18**	**10**	**22**	**27**	**27**	**266**	**106**	**-**	**-**	**-**	**6**	**-**



ఎర్రమందారాలు

లోకువాంగ్‌పిన్, యానిగ్ యూయెన్

స్వేచ్ఛానువాదం : డా. టి. నళిని

విరసం ప్రచురణ

పేజీలు: 438 వెల: రు. 270

ప్రతులకు: డి.వి. రామకృష్ణారావు
ఎంఐజి-14, ఎపిఐఐసి కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040
ఫోన్ :99891 89250



కొలిమి రవ్వలు

గౌరి లంకేశ్


రచనలు

తెలుగు : వేమన వసంతలక్ష్మి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ

పేజీలు: 232 వెల: రు. 150

ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్
ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్,
హైదరాబాద్-500006; ఫోన్: 23521849
www.hyderabadbooktrust.blogspot.com



ప్రవహిస్తున్న జ్ఞాపకం

శ్రీకాకుళం కమ్యూనిస్టు ఉద్యమ తొలితరం నాయకుడు
గంటి రాజేశ్వరరావు జీవితం

కె. ముత్యం

దృష్టి ప్రచురణ

పేజీలు: 184 వెల: రు. 150

ప్రతులకు: కె. స్వయంప్రకాష్
సంపాదకుడు, అగ్నిపూలు (పక్షపత్రిక)
6-19-58, ఆదర్శనగర్, నిజామాబాద్ - 503 002



అసలు దారి

మరికొన్ని కథలు

వీరబ్రహ్మాచారి


విరసం ప్రచురణ

పేజీలు: 160 వెల: రు. 120

ప్రతులకు: డి.వి. రామకృష్ణారావు
ఎంఐజి-14, ఎపిఐఐసి కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040
ఫోన్ :99891 89250

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 199 - February 2018 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/1/2018 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2017-19

Date of Posting : 29th, 30th



ఉదయగీతిక

యాంగ్ మో


అనువాదం: ఎన్. వేణుగోపాల్

విరసం ప్రచురణ

పేజీలు: 312 వెల: రు. 180

ప్రతులకు: **డి.వి. రామకృష్ణారావు**

ఎంఐజి-14, ఎపిఐఐసి కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040
ఫోన్ :99891 89250



యుద్ధకాలంలో స్వప్నాలు

బాల్య జ్ఞాపకాలు


గుగి వా థియాంగో

అనువాదం: జి.ఎన్. సాయిబాబా

మలుపు ప్రచురణ

పేజీలు: 264 వెల: రు. 180

ప్రతులకు: 2-1-1/5, నల్లకుంట,
హైదరాబాద్ - 500 044



జయకాంతన్

కథలు


అనువాదం: జిల్లేళ్ల బాలాజీ

హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ

పేజీలు: 218 వెల: రు. 150

ప్రతులకు: **హైదరాబాద్ బుక్ ట్రస్ట్**

ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్,
హైదరాబాద్-500006; ఫోన్: 23521849
www.hyderabadbooktrust.blogspot.com



నేను గౌరిని

(ప్రేమను, ప్రతిఘటనను పంచిన మనిషి)

ఉదయమిత్ర

(నాటకాలు)

పాలమూరు అధ్యయన వేదిక ప్రచురణ

పేజీలు: 144 వెల: రు. 100

ప్రతులకు: **ఉదయమిత్ర**

ఇ.నెం. 9-24, చైతన్య నగర్, జడ్చర్ల - 509 301.
మహబూబ్‌నగర్ జిల్లా. ఫోన్: 9985203376

Advt.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao